భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

జనవరి 1978

సంపుటము : 55 సంచిక : 1

విడిప్రతిక వెల రూపాయి న్నర

ధైర్యంగా ఎదుర్కొందాం

అన్నపూర్ణంగా అందరి పొగడ్తలూ అందుకున్న ఆంధ్రప్రదేశ్ నేడు ఆపదలో ఉండి ఆర్తనాదం చేస్తోంది తుఫానుకు గురియైన ప్రాంతాలలో అన్ని పంటలకు అపారమైన నష్టం కలిగింది. అందువల్ల భూమిశిస్తు మాఫీ, వ్యవసాయ పరికరాల సరఫరా భూమి బాగుసేతకు సహాయం చేయడంద్వారా రైతులకు చేయూత నివ్వడం యిప్పటి తక్షణావసరం. ఈ ప్రాంతాలలో రూ. 10 65 కోట్లమేరకు భూమిశిస్తు మాఫీని ప్రభుత్వం అప్పుడే ప్రకటించింది.

దానికితోడు దిగువ విషయాలలో కూడా ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది

[అ] ప్రాణనష్టం : మరణించినవారి సమీప బంధువులకు రు. 1,000/-ల చొప్పున పరిహారం

[ఆ] ఇండ్లనష్టం : నివాస గృహం కోల్పోయిన ప్రతి వ్యక్తికి రు. 150/-ల చొప్పున పరిహారం

[ఇ] పాత్రసామాగ్రి నష్టం : రు. 50/-ల చొప్పున పరిహారం

తుఫానుకు గురైన చేనేత పనివారలు, మత్స్య పారిశ్రామికులు, వృత్తి పనివారలకు కూడా పెద్ద ఎత్తున పునరావాసం కల్పించడంలో తోడ్పడుతున్నారు. పునరావాసం నిమిత్తం చేనేత పనివారలకు రు 1.62 కోట్లు, మత్స్య పారిశ్రామికులకు రు. 1.28 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. పునరావాస కల్పన బృహత్తరమైన సమస్య. పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొందాం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధాలశాఖ డైరెక్టరుచే ప్రకటితము



కీ॥ శే॥ నవలంక సంఘం ప్రసాదుగారు

సంపాదకులు 1938-72

స్వ విషయం

1977 లో భారతదేశంలో ఎటువంటి ముఖ్యమయిన మార్పులు వచ్చాయో అందరికీ తెలుసు.

వ్యక్తి స్వాతంత్ర్యాల విలువమీద నమ్మకంఉన్నవారు దేశంలో కొంతకాలంపాటు ఆవరించిన చీకటి తొలగిపోవటం మొదలు పెట్టిందని అనుకుంటున్నారు. ఇటువంటి స్వాతంత్ర్యాల విలువని గుర్తించేవారుగా పరిగణింపబడనివారుకూడా అత్యవసర పరిస్థితి రద్దు అయినందుకు తమ సంతోషాన్ని తెలుపుతున్నారు. అత్యవసరపరిస్థితి కాలంలో జరిగిన కొన్ని అత్యాచారాల వివరాలు విచారణలవలన బయటపడుతున్నాయి. సర్వజ్ఞతకల కొందరికి ఇతరులమీద సర్వాధికారాలూ ఉంటాయని నమ్మేవారిని మినహాయించినట్లయితే నిర్బంధాలు లేని అభిప్రాయ ప్రకటనల ద్వారా, చర్చలద్వారా ఎన్నో పెద్ద సమస్యలకి పరిష్కారాలు కల్పించుకొనటానికి వీళ్లు ఉంటాయని మొత్తంమీద చాలామందే ఒప్పుకుంటారు, ప్రజాస్వామ్య వ్యవస్థని ఈవిధంగా నిలుపుకోవచ్చుననీ అనుకుంటున్నారు. ఇంతకిముందే ఎన్నోసారులు అన్నట్లు తెలుగువారి సంస్కృతికి అన్నివిధాలుగా ప్రతిబింబంగా ఉండటమే ''భారతి'' ధ్యేయం. ''భారతి''కి రాసేవారు అన్ని విధాలుగానూ ఈ ధ్యేయం నెరవేరటానికి తోడు పడగలరని ఆశిస్తూ ఉంటాము. 1977 నవంబరులో ఆంధ్రదేశానికి చెప్పలేనంత పెద్దదెబ్బ తగిలింది తుఫాను, ఉప్పెన బీభత్సాల స్మృతులు ఇంకా భయంకరంగానే ఉంటున్నాయి. ప్రపంచంలో అన్ని మూలలనుంచీ సహాయం అందుతోంది. త్వరలోనే గాలివాన, ఉప్పెనల అఘాతాలకి గురి అయిన ప్రాంతాలలో పరిస్థితులు బాగుపడి ప్రజలు యధావిధిగా తమ జీవితాలని కొనసాగించగలరని కోరుకొననివారు ఉండరు.

(*)

విషయానుక్రమణిక

జనవరి 1978

మనసు గతి

శ్రీ గడియారం శేషఫణిశర్మ

నా చుట్టూ పరుచుకున్న
ఈ శూన్యానికి దూరంగా,
రుచిర రోచిః పారావారంగా,
అక్కడ నీ హృదయం!
ప్రణయ దీధితులు ప్రసరిస్తూ!!

ఇక్కడ
అంతర్ముఖమై,
ఆత్మావలోకనం చేసుకుంటూ,
సంతత కాంతి తరంగాల యెదుట
నా అంతరంగం!

మనసు నీ వైపు మరలినప్పుడు,
చీకటి తొలగి,
వేయిరేకలతో వేకువ వెలిగి,
హృదయమంతా ఉదయకాంతి!
అచ్చమైన వెచ్చని వెలుగు!!

పరాకు చిత్తగించి,
మనసు నీకు పరాఙ్ముఖమైనప్పుడు,
మలిన తమఃపుంజమై,
మదినిండా మలిసంజ!

నీకు చేరువైతే,
మనసంతా నిత్యవసంతం!
దూరమైతే,
యెదద గడగడలాడించే
నిబిడ హేమంతం!

ఆశల అగ్నివలయాలమధ్య
నీ కోసం జ్వలిస్తే,
మనసంతా శరత్తులు!

నిట్టూర్పు పెనుగాడ్పుల్లో
నీ కోసం చలిస్తే,
యెదనిండా నిదాఘాలు!

మనసు కరగితే,
హర్షాశ్రుమాలలతో
వర్షావేళలు!
మనసు విరిగితే,
నిశిత నిశ్వసనాలతో
విషమ శిశిరాలు!!

గతాన్ని స్మరిస్తూ
నీ చుట్టూ భ్రమిస్తున్న
మనసు గతిలో,
అనుదినమూ
ఆరు ఋతువులు!
ప్రతి క్షణమూ
ఉభయ సంధ్యలు!!

మౌనగీతి

శ్రీ గడియారం శేషఫణిశర్మ

సీ॥ ఈ మౌనగీతి నిన్నేరీతి పిలుచు!
కన్నీటి సరులివి ఏ పాటి నీకు!
ఏ రీతి నిను దల్తునే!
భగ్నహృదయుండ
ఏ రీతి నిను పిల్తునే!

బ్రతుకిది విరహాశ్రు
భరమయ్యె చిరము
ఇందాక శైశిర
గీతికను పోలి
శిథిల రాగముంతో

సఖీ !
అసంపూర్ణమ్మై, శీర్ణమ్మై !
ఈవేళ నీవు
నేడింత వెన్నెలలు
పరువగా హరువుగా
తిరమ్ముగా నిచట

బ్రతుకిది రసమయమ్మై
చంద్రికా విలాస
భాసురమయ్యే
శోభాసురు చిరహాసమ్మై
యెద నీ సుమ శ్వాసలలర!!

కాంతిపుంజం

శ్రీ తిరునగరి

తమస్సులు చీల్చుకొని
ఉషస్సులు సృష్టించుకొని
ఉజ్వలిస్తూ ఉద్యమిస్తున్న కిరణాన్ని నేను
ప్రజ్వలిస్తూ ప్రయాణిస్తున్న కాంతిపుంజాన్ని నేను

నేను ముడుచుకున్న పద్మం ముఖం కడిగి కిలకిలా
నవ్విస్తాను
నేను జడత్వంనుంచి మేల్కొనే లోకం పెదవులకు
చైతన్యం అందిస్తాను
నేను విను వీధిలో ఎగిరే విహాయసం రెక్కలకు బల
మిస్తాను
నేను జగమంతానిండి గుండె గుండెలోనుండి నవ
గీతం విన్పిస్తాను
నేను కాలంతోపాటు మానవుణ్ణి కదలి పొమ్మంటూ
పొడుస్తాను

నేను కర్తవ్య పథంలో, కష్టాలలో, నైరాశ్యంలో
ఆశారేఖనై ముందుకు కదలిస్తాను
నేను గతాన్ని రికార్డుచేస్తూ వర్తమానంనుంచి
లోకాన్ని భవిష్యత్తుకు నడిపిస్తాను
నేను అనునిత్యం నవ్య కాంతిర్లతపై పూవునై
తలెత్తి పరిమళిస్తాను.

నేను కిరణాన్ని
వెలుగడం, వెలిగించడం నా పని
తమస్సులు చీల్చుకొని
ఉషస్సులు సృష్టించుకొని
ఉజ్వలిస్తూ ఉద్యమిస్తున్న కిరణాన్ని నేను
ప్రజ్వలిస్తూ ప్రయాణిస్తున్న కాంతిపుంజాన్నినేను.



రసవాదం

కేఎస్వీ

హృదయానికి రెక్కలున్నప్పుడు ఉదయాల రంగుల్ని
గుండెకద్దుకుని సంచరిస్తాను లోకమంతటా
నక్షత్రధూళి వెదజల్లుతాను చీకటి సిరాతో వెన్నెల
కాగితాల మీద సుఖదుఃఖాతీతా నందానుభూతి కల్గించే
తేటపాటలు రాస్తాను తేనె ఊటలు పోస్తాను మీ
ఆత్మల్లోకి
తీగలు నరాలుగా మీటి నేను మేనంతా వీణనై
పలుకుతాను కవ్విస్తాను దేవుణ్ణి విదూషకుణ్ణి
చేసి సర్కస్‌లో హాస్యం వెదజల్లమంటాను

కోర్టుల గోడల్ని కూల్చేసి తటాకాలు తవ్విస్తాను
బిందెలు మోసుకొచ్చే జవ్వనుల నడుము మీద
మెరుస్తాను ఆర్నెల్ల పసిపాపనోట బోటనవ్రేలుగా
చీకబడతాను పండబారిన జుట్టుగల ముసలవ్వ
పల్వరుసలో బోసినై జీవితరహస్యం గొణుక్కుంటాను
(వింటే బాగుపడుతావు)
నేను వ్యాకరణాన్ని కానేకాను
అంతకన్నా వామాక్షి (మెల్లకంటి) చూపునై
అందగిస్తాను

బ్లూ

కేఎస్వీ

సెరాయన్ * కవిత్వాత్మలా కమ్ముకుంటావు
మధుర స్మృతిలా కౌగిలించి
మరపురాకుండా ముద్దెట్టుకుంటావు
అనంతానివీ నువ్వే
అగాధానివీ నువ్వే
ఆలోచనవీ అనుభూతివీ ఆనందానివీ
నువ్వే !

రెటీనా నిండా
మనసు ఎరీనా నిండా
నీలిమా ! నా నీలిమా ! —నువ్వే సుమా !
యుగయుగాలుగా నువ్వు గడ్డగడుతూ వచ్చి
ఇప్పుడు ఈ నేను !
ఈ నేనూ మబ్బులా చెదిరి మంచులా కరిగితే
మళ్ళీ నువ్వే !!

* WILLIAAM SAROYAN

'కాలహేల'

శ్రీ బండి రాధాక్రిష్ణ

గడియారం గుండె చప్పుడు
కాలం శ్వాసక్రమంలా...,
గది బయట గాలి ఊగిసలాడుతోంది
కాలజవ్వని కనుబొమలపై
ఆడే ముంగురుల్లాగా.
నేనొక్కడినేనా,
కాలానికి వారసుడిని ?!
ఎక్కడో దూరంగా బస్సుల రొద
సిమెంటురాళ్ళను యంత్రం
కలుపుతున్న ధ్వని అంతర్లయగా,
పిచ్చుకల కిచకిచలు
ప్రకృతికి జీవంపోస్తున్న తాళంగా,
మధురమైన సంగీత సభ జరుగుతోంది
శ్రోతల్లారా రండి!
భ్రాతల్లారా బ్రతుకు బరువు దింపుకోండి.
క్రాంతికారుల్లారా!
శాంతిజోల వినండి
ఆకలి కేకలతో అలిసిన అన్నల్లారా!
అదిగో, అమృతం ఆస్వాదించండి.
శోకకీలల్ని చల్లార్చండి.
కాలహేలను పూలమాలగా ధరించండి.

వ్యక్తావ్యక్తాల్లో....

'సత్యప్రభ'

నేను ఊహలమీద ఆనందంగా మత్తుతో పడుకొని వున్నాను. ఓ తుమ్మెద నా గుండె లోపలి తలుపుల్ని తట్టి లేపింది. సూర్యోదయమయ్యిందని చెప్తే ఉత్సాహంతో లేచి నా గది కిటికీ తలుపుల్ని తెరచాను – కిరణాలు నా గదిలోకి మాత్రం ప్రసరించలేదు. అప్పుడు గుర్తొచ్చింది — నా గది కుంది పశ్చిమ గవాక్షం అని.

నిన్నటిరోజున అందంగా నవ్వుతూఉండే గులాబీపువ్వు ఈవేళ తొడిమకు దూరమై నేలమీదపడి నిట్టూరుస్తుంది. అది కిటికీలోంచి కన్పించిన దృశ్యం. నా గొంతు మీద ఓ పెద్ద బండరాయి పడింది—ఎన్ని తంత్రులు తెగాయో!?

వర్షమొస్తే బావుణ్ణని అనుకొన్నాను. అప్పుడు నీలాకాశంలో ఓ తటిల్లత మెరుస్తుంది. ఓ జలదం తన ఉరుముల్తో రాగాల్ని కూర్చుతుంది. అప్పుడు వీచే గాలులికి ఓ కడిమిచెట్టు పులకరించి మొగ్గల్ని తొడుగుతుంది—సీతాకోక చిలుక పూరేకుల తీగెల్ని సరిచేసి వీణ మీటుతుంది.

మళ్లీ నా ఎండిన పెదవుల మీదుగా గానామృతం జాలువారి వర్షపునీటిలో కలిసి కొంతదూరం ప్రవహిస్తుంది. వాటితో సముద్రం ఉప్పొంగితే — అందులో నా ముత్యాల నౌకలో పూలదీవులవైపు విహరిస్తూ—నే నమరుణ్ణవుతాను.

శ్రీ వి. సుందరరామ శాస్త్రి

విష్ణుకుండినుల రాజధాని-ఒక పరిశీలన

ప్రాచీనాంధ్ర వంశీయులలో ప్రముఖులైన విష్ణుకుండినుల చరిత్ర చాల సంశయాలతోను, వివాదాలతోను కూడినట్టిది. వారి రాజధానీ నగరమేదన్నది అట్టి వివాదాలలో ఒకటి. ఈ విషయమై నేటివరకు లభిస్తున్న విష్ణుకుండిన శాసనాలేవీ ఇదమిత్థమని చెప్పకపోవడంతో [1] ఇంతవరకు అనేక చరిత్రకారులు తర్జన భర్జనలు పడినా ఫలితం లేకపోయింది. అందుచేత జూన్ నెల 'భారతి'లో' శ్రీ కె. రామమోహనరావుగారు "విష్ణుకుండినుల రాజధాని"ని గూర్చి చర్చించడం చరిత్ర పరిశోధకులకు ఆసక్తి కల్గించింది. ప్రస్తుతము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురావస్తు శాఖ వారు హైదరాబాదు సమీపమున గల కీసరగుట్ట వద్ద జరుపుతున్న త్రవ్వకాలలో తెలియవచ్చిన విశేషాంశాలతో ఆ వ్యాసం గత సంవత్సరం మే నెలలో గుంటూరులోని ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోత్తర కేంద్రం "ప్రాచీనాంధ్రదేశ సాంఘిక ఆర్థిక స్థితిగతుల" పై నిర్వహించిన సభలలో, ఆంధ్ర ప్రభుత్వ పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ వి. వి కృష్ణశాస్త్రి చదివిన ఆంగ్ల వ్యాసానికి అనువాద ప్రాయం.

రామమోహనరావుగారు ప్రస్తావించి సమర్థింప జూచిన అంశాలలో ముఖ్యమైనవి :

1) విష్ణుకుండినులే సాతవాహనులనంతరం తెలంగాణాలో స్వతంత్రించిన రాజవంశము. తుమ్మలగూడెము మొదటి తామ్రశాసనంలో పేర్కొనబడిన ఇంద్రవర్మ, మొదటి మాధవ వర్మ, గోవింద వర్మల పరిపాలన తెలంగాణాకు మాత్రమే పరిమితమై, రెండవ శాసనంలో తిరిగి గోవిందవర్మతో ప్రారంభమైన అయిదుగురు రాజులతోకూడిన వంశానుక్రమం కూడ ఆ ప్రాంతాన్ని పరిపాలించి ఉండవచ్చును. పొలమూరు శాసనంలోని "దశ శత సకల ధరణీతల నరపతి" అనే బిరుదం వలన, ప్రథమంగా వేంగీ మండలాన్ని (తెలంగాణా నుండి) జయించిన విష్ణుకుండినరాజు రెండవ మాధవవర్మ. కనుక వీరి తొలి రాజధాని తెలంగాణాప్రాంతంలోనిదై ఉండవలసిందే.

2) విష్ణుకుండినులు వీరశైవులు. వీరి ఆరాధ్య దైవమైన శ్రీ పర్వతస్వామిని విజయపురిలోని కార్తికేయుడో, లేక నాగార్జునకొండపై గల బుద్ధభగవానుడో యనుట పొసగదు. కీసర ప్రాచీన శైవక్షేత్రము, ప్రస్తుతము అచ్చట జరుగుతున్న త్రవ్వకాలలో అనేక శివలింగముల వరుసలు బయటపడినాయి, దుర్గ ప్రాకార శిథిలాలు, రాజప్రాసాద శిథిలాలు లభ్యమైనాయి. అవి 18 x 10 x 3 పరిమాణముగల ఇటుకలతో నిర్మింపబడి ఉన్నాయి. కనుక అవి విష్ణుకుండినులనాటివే. కీసర విష్ణుకుండినుల రాజధాని.

3) విష్ణుకుండినుల రాజధానిగా కన్పిస్తున్న 'అమరపుర' స్థల నిర్దేశాన్ని గూర్చి పలు వివాదాలున్నాయి. "అమరపుర తెలంగాణాలో బహుశ తుమ్మలగూడెం ప్రాంతమున నుండెడిది. ఇదియే 'ఇందుపుర' అని, 'ఇందుపురాల' అని పదకొండు, పన్నెండు, పదమూడు శతాబ్దులనాటి శాసనములలో పేర్కొనబడినది." అనగా నేటి తుమ్మలగూడెం ప్రాంతంలో ఆనాడు ఉన్నట్లుగా కన్పిస్తున్న ఇందుపురము, లేక ఇంద్రపాలపురమే విష్ణుకుండినుల అమరపురము, అని ధ్వనించేటట్లు వ్రాసి "కీసరగుట్ట"యే విష్ణుకుండినుల రాజధానియైన 'అమరపుర'మని నిస్సంశయముగా చెప్పవచ్చును" అంటూ వ్యాసాన్ని ముగించారు.

ఈ వాదాలు విచారణీయాలు. మొదట విష్ణుకుండినుల పరిపాలనా ప్రారంభకాలము, స్వస్థలములను గూర్చిన వాదాన్ని పరిశీలించడానికి వారి పరిపాలనా కాల నిర్ణయం అవసరం. కాని, వారి వంశ, కాలానుక్రమణికలు వివాదగ్రస్తాలు. ప్రస్తుతము వారి వంశానుక్రమణికకై తుమ్మలగూడెం రెండు శాసనాలను చేర్చినట్లైతే సంతృప్తికరమైన, సమగ్రమైన వంశవృక్షము ఏర్పడుతుందని భావించబడుతున్నది. దాని స్వరూపం క్రిందయియ్యబడింది.

తుమ్మలగూడెం రెండవ తామ్రశాసనము, తత్ప్రదాతయగు రెండవ విక్రమేంద్రుని పదునొకండవ రాజ్య సంవత్సరాన, సరియగు విగత శక వత్సరము 488లో వ్రాయబడింది. అనగా క్రీ. శ. 566 ఆ శాసన కాలము. దానినిబట్టి రెండవ విక్రమేంద్రుని రాజ్యాభిషేక సంవత్సరము, అతని తండ్రియగు ఇంద్రభట్టారకుని పరిపాలనాంత సంవత్సరము క్రీ. శ. 555. ఇంద్రభట్టారకవర్మ తన 27వ రాజ్య సంవత్సరాన రామతీర్థం శాసన మీయడాన అతని పరిపాలన సుమారు 30 సంవత్సరములు జరిగి ఉంటుందని భావించవచ్చు. అనగా అతని రాజ్యాభిషేక సంవత్సరము క్రీ. శ. 525. అతని తండ్రియైన మొదటి విక్రమేంద్రుడు "విష్ణుకుండి—

ఈ వ్యాసరచనకు ప్రోత్సహించి, మార్గదర్శకులుగా, సహాయ సహకారాలతో నన్ను నడిపించిన శ్రీ డా. బి. ఆర్. సుబ్రహ్మణ్యం, రీడర్, నాగార్జున విశ్వ విద్యాలయము, డా. బి. యస్. యల్. హనుమంతరావుగార్లకు నా కృతజ్ఞత.

వాకాటక వంశధ్వయాలంకార యశోభూత జన్మ్మడు.'' తుమ్మల గూడెం (II), తుండి తామ్రశాసనాలు అతన్ని 'మహారాజ' బిరుదంతో సంభావిస్తున్నాయి[4] కనుక అతనికి ఒక పురుషాంతర రాజ్య కాలాన్ని, అనగా, 25 సంవత్సరములు పరిగణించవచ్చును. అతని రాజ్యాభిషేక సంవత్సరము క్రీ. శ. 500. మొదటి విక్రమేంద్రుని తండ్రి విష్ణుకుండిన వంశశ్రేష్ఠుడైన రెండవమాధవవర్మ. అతని పొలమూరు శాసనం అతని 48వ రాజ్య సంవత్సరంనాటిదైనందున,[5] అతని పరిపాలన సుమారు 50 సంవత్సరాలుగా పరిగణించవచ్చును. కనుక, అతని రాజ్యాభిషేక సంవత్సరము క్రీ. శ. 450. అతని తండ్రియైన గోవిందవర్మ ఇచ్చిన తుమ్మలగూడెం తామ్రశాసనం, అతని 37వ రాజ్య సంవత్సరమునాటిది.[6] అతని రాజ్య కాలాన్ని సుమారు 40 సంవత్సరాలుగా భావించి, క్రీ. శ. 410లో అతడు రాజ్యాభిషిక్తుడైనట్లు నిర్ణయింపవచ్చును. గోవిందవర్మతాత, తండ్రులైన మొదటి ఇంద్రవర్మ, మొదటి మాధవవర్మలు తుమ్మలగూడెం (I) తామ్రశాసనంలో 'మహారాజ' బిరుదంతో పేర్కొనబడినారు.[7] కనుక వారికి చెరియొక పురుషాంతర రాజ్యకాలాన్ని పరిగణించవచ్చును. అప్పుడు విష్ణుకుండిన వంశీయులపాలన క్రీ. శ. 360లో ప్రారంభమై ఈ క్రింది పట్టికలో సూచించినట్లు వంశ, కాలానుక్రమం జరిగినట్లు గ్రహించవచ్చు.

మహారాజ ఇంద్రవర్మ (సుమారు క్రీ. శ. 360)
|
మహారాజ (మొదటి) మాధవవర్మ
(సుమారు క్రీ. శ. 385)
|
మహారాజ గోవిందవర్మ
(సుమారు క్రీ. శ. 410-450)
|
మహారాజ (రెండవ) మాధవవర్మ
(సుమారు క్రీ. శ. 450–500)
|

- మహారాజ (మొదటి) విక్రమేంద్రవర్మ (సుమారు క్రీ. శ. 500 – 525)
  - మహారాజ ఇంద్రభట్టారకవర్మ (సుమారు క్రీ. శ. 525–555)
  - మహారాజ (రెండవ) విక్రమేంద్ర భట్టారకవర్మ సుమారు (క్రీ. శ. 555...)
- దేవవర్మ
  - మూడవ మాధవవర్మ (సుమారు క్రీ. శ. 480–520)
- మంచన్న భట్టారకుడు

ఈ పట్టిక ననుసరించి విష్ణుకుండినుల పరిపాలనా కాలము సుమారు క్రీ. శ. 360 అని తెలుస్తున్నది. సాతవాహనుల పరిపాలన క్రీ.శ. 225లోనే అంతమైంది.[8] కనుక విష్ణుకుండినులు సాతవాహనులకు అనుగామికులు కాజాలరు. ఆ మధ్యకాలంలో ఆంధ్ర తీర ప్రాంతాన్ని ఇక్ష్వాకు, సాలంకాయన, బృహత్ఫలాయన, ఆనంద గోత్రీయులు పరిపాలించారు. ఆ తర్వాతనే వేంగిలో విష్ణుకుండినుల పరిపాలన నెలకొన్నది. పొలమూరు శాసనంలోని ''దశ శత సకల ధరణీ తల నరపతి'' అనే బిరుదం వలన వేంగీ మండలాన్ని రెండవ మాధవవర్మ జయించినాడనడం సమర్ధనీయమే.[9] కాని, సుమారు ఒకటిన్నర శతాబ్దుల సాలంకాయన పరిపాలన తర్వాత అతని వేంగీ విజయం జరిగిందని మాత్రం మరచిపోరాదు. రెండవ మాధవవర్మ వేంగిని సుమారు క్రీ. శ. 460 ప్రాంతంలో జయించి ఉంటాడు. ఆంధ్ర ప్రాంతాన్ని పరిపాలించిన పై రాజవంశీయు లెవ్వరూ తమ శాసనాలలో తెలంగాణాను జయించి పరిపాలించినట్లు చెప్పనిమాట నిజమే. కాని, విష్ణుకుండినుల శాసనాలు సైతం ఈ విషయంలో మౌనంగానే ఉన్నందున వీరిని సాతవాహనుల అనుగామికులనడం కేవలం ఊహమాత్రమే.

సాతవాహనుల అనంతరం తీరాంధ్రంలో ఇక్ష్వాకులు, విదర్భలో వాకాటకులు స్వతంత్రించారు. ఇక్ష్వాకుల పరిపాలన కృష్ణకు దక్షిణంగా నేటి ప్రకాశం, గుంటూరు జిల్లాలు, ఉత్తరంగా నల్గొండ, కృష్ణాజిల్లాలలో కొన్ని భాగాలు మాత్రమే చేరి ఉండవచ్చును. తక్కిన తెలంగాణా, ఆంధ్రప్రాంతాలలో వారి పరిపాలన ఉండేదని చెప్పడానికి ఎట్టి ఆధారము లేదు. వాకాటకులలో మొదటి ప్రవరసేనుడు 'సమ్రాట్' బిరుదం వహించి, చతుశ్వమేధ యాజిగా ప్రసిద్ధికెక్కినట్లువాకాటకశాసనాలు తెలుపుతున్నాయి.[10] అతని తర్వాత జరిగిన సామ్రాజ్య విభజనానంతరం 'వత్సగుల్మ' రాజధానిగా ఒక శాఖ పరిపాలించింది. వారి రాజ్యంలో పూర్వపు హైదరాబాద్ రాష్ట్ర భాగాలు చాలవరకు చేరి ఉండేవి ఈ వాకాటక శాఖ కుంతల (నేటి దక్షిణమహారాష్ట్ర, ఉత్తరకర్నాటక) దేశాన్ని జయించింది.[11] అతిసమీపాన గల ఆంధ్రదేశభాగాన్ని వారు, తమ రాజ్యంలో చేర్చుకొనలేకపోయారని భావించరాదు. అయితే వాకాటక శాసనాలు ఆంధ్ర దేశాన్ని జయించి, తమ సామ్రాజ్యంలో కలుపుకొన్నట్లు ప్రస్తావించడంలేదు. బహుశ, ఆంధ్రదేశ భాగాలను వాకాటకులు మొదటి ప్రవరసేనుని కాలంలోనే జయించి, వంశ పారం పర్యంగా పరిపాలిస్తూ ఉండడం కారణం కావచ్చు. వాకాటకులు ఆంధ్రులే, లేదా, ఆంధ్రుల కత్యంత సన్నిహితులు. ఒకానొక అమరావతి శాసనంలోని 'వాకాటక' నామ ప్రస్తావనచేత ఆల్టేకర్ ప్రభృతులు వాకాటకుల జన్మస్థలం ఆంధ్రదేశమేనని అభిప్రాయ పడినారు.[12] అందుచేత తెలంగాణా ప్రాంతం వాకాటక సామ్రాజ్యాంతర్భాగమై, వత్సగుల్మ శాఖీయుల పరమైందని తోస్తుంది.

విష్ణుకుండిన రాజులలోని గోవిందవర్మను గూర్చి తుమ్మల గూడెం (II) తామ్ర శాసనం ''శ్రీ పార్వతేయ పూర్వాపర క్షితిపతి పరంపరా హార మధ్య నిరుపమ విరాజితయా కౌస్తుభాయ మాన

యశో జన్మ'' [13] డని ప్రశంసిస్తున్నది. కనుక గోవిందవర్మ, అతని పూర్వీకులు పాలించిన దేశము శ్రీ పర్వతమునకు తూర్పున, పడమట గల రాజ్యాలలో ప్రధానమైనది; అనగా, శ్రీపర్వత ప్రాంతమునందే ఉన్నదనీ స్పష్టపడుతున్నది. తుమ్మలగూడెం (I) తామ్రశాసనం తప్ప తక్కిన విష్ణుకుండిన శాసనాలన్నీ శ్రీపర్వత స్వామి నామస్మరణతో ప్రారంభమవుతున్నాయి. శ్రీపర్వతస్వామి విష్ణుకుండినుల ఇలవేలుపు, వారు ''భగవచ్ఛ్రీ పర్వతస్వామి పాదానుధ్యానావాప్త ప్రజా పరిపాలనాధి కారాణాం'' [1] అని కూడ చెప్పుకున్నారు. ఈ విధమైన కులదైవ స్మరణ వీరి తొలి రాజ్యం శ్రీపర్వత ప్రాంతంలోనిదేనన్న వాదాన్ని మరింతగా బలపరుస్తున్నది. శ్రీపర్వత స్వామి అనగా శ్రీ పర్వతంపై అధివసించిన స్వామి అనే అర్థం. [15] కనుక శ్రీపర్వతాన్ని, శ్రీపర్వత స్వామిని సరిగా గుర్తింపగల్గితే విష్ణుకుండినుల తొలి రాజ్యాన్ని, రాజధానిని గుర్తించవచ్చు.

చిక్కుళ్ళ తామ్రశాసనాన్ని ప్రకటిస్తూ కీల్‌హారన్ పండితుడు ''విష్ణుకుండిన'' పదం 'వినుకొండ'కు సంస్కృతీకరణం కావచ్చునని, వినుకొండయే విష్ణుకుండినుల తొలి రాజధాని కావచ్చునని ఊహిస్తూ, శ్రీపర్వతస్వామిని కర్నూలు జిల్లాలోని శ్రీశైల శిఖరస్థుడైన మల్లికార్జునునిగా భావించాడు. ఆ శాసన ప్రదాతలయిన రెండవ విక్రమేంద్రవర్మ, అతని తండ్రియైన ఇంద్రభట్టారకవర్మ అందు పరమ మాహేశ్వరులుగా పేర్కొనబడినారు. ఆ శాసన విషయం కూడ సోమగిరీశ్వర నాథుడని ప్రసిద్ధికెక్కిన శివుని ఆలయానికి చేసిన భూదాన సంబంధము. [16] ఆ నాటికింకా శ్రీపర్వత నామంతో నాగార్జునకొండ, అచటి బౌద్ధక్షేత్రము వెలుగులోనికి రాలేదు. పైగా, శ్రీశైలంకూడ ప్రాచీన వాఙ్మయంలో 'శ్రీపర్వత'మని వ్యవహరింపబడిన ఆధారాలున్నాయి. [17] కనుక కీల్ హారన్ పండితుని వాదం తిరుగులేనిదిగా, తర్వాత చరిత్రకారులకు ఆమోద యోగ్యమైంది.

కాని, నాగార్జునకొండ శిధిలాలు వెలుగులోనికి వచ్చి, అచ్చట లభించిన ఇక్ష్వాకు శాసనాల వలన ఆ పర్వతం శ్రీపర్వత మనేపేర వ్యవహృతమౌతున్నట్లు స్పష్టంగా తెలియవస్తోంది. ఆ తర్వాత విష్ణుకుండినులను గూర్చి వ్రాసిన కీ. శే. భావరాజు కృష్ణారావుగారు శ్రీపర్వత—నాగార్జునకొండ బౌద్ధక్షేత్రం కావడాన, విష్ణుకుండినులను శైవులనే నమ్మకంతో — వారి శ్రీపర్వతం నాగార్జునకొండ కాజాలదని త్రోసిపుచ్చారు: [17A] శ్రీపర్వతస్వామి శ్రీ శైలమల్లికార్జునుడేనన్న కీల్‌హారన్ పండితుని వాదాన్నే బలపరచారు. అదే అభిప్రాయాన్ని గ్రహించి కీ. శే. కొమర్రాజు లక్ష్మణ రావుగారు వీరి రాజధానిగా తాము భావించిన 'అమరపురము'ను ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతిగా భావించారు. [18] ఇటీవలి కాలంలో విష్ణుకుండినులను గూర్చి వ్రాసిన కీ. శే. నేలటూరి వెంకటరమణయ్యగారు కూడ ఈ అభిప్రాయాలనే ఆమోదించి, విష్ణుకుండినులను శైవులని, వారి రాజధాని అయిన అమరపురము అమరావతియేనని వ్రాసినారు. [19] ఇక, ఈ వాదాన్ని గ్రహించి, డా. (కీ. శే.) మీనాక్షి విష్ణుకుండినుల పురుషమేధాధ్వర నిర్వహణను కాపాలిక శైవుల 'మహావ్రతం'తో పోల్చి, మరింత అయోమయాన్ని సృష్టించింది. [20]

డా. గోపాలాచారి, [21] డా. డి. సి. సర్కారుగార్లు ఈ అభిప్రాయాలను అంగీకరించక, విష్ణుకుండినులు వైష్ణవులని అభిప్రాయపడినా, వాదాలను చరిత్రకారులు బహుళంగా అంగీకరించ లేదు. కాని, విష్ణుకుండినుల శాసనాలను, నాణాలను సూక్ష్మంగా పరిశీలిస్తే వారు శైవులుకారని, వైష్ణవంవైపు మొగ్గచూపిన వైదిక మతానుయాయులని, నిస్సంశయంగా చెప్పవచ్చు. గోవింద వర్మ ఇచ్చిన తుమ్మలగూడెం తామ్రశాసనం ''జితం భగవతా'' అని, మానవకోటికి నిర్వాణ పథాన్ని ప్రదర్శించిన బుద్ధభగవానుని స్తుతితో ఆరంభమైంది. మహాభారతాంతర్గతమైన 'నారాయణీయ' విభాగాన్నిబట్టి, 'జితం' అని భగవంతుని వ్యవహరించడం వైష్ణవ సంప్రదాయమని తెలుస్తుంది. [23] కదంబ, పశ్చిమగంగ వాకాటక శాసనాలనేకం వైష్ణవభక్తితో 'జితం భగవతా' అని స్తుతిస్తూ ప్రారంభం కావడం కద్దు. [24] తుమ్మలగూడెం రెండవ శాసనం గోవిందవర్మను ''గుణరూప సంపద్భిరనుగత గోవిందస్య'' [25] అని పోల్చి వర్ణించింది. అతని రాజ్యాన్ని, వ్యక్తిత్వాన్ని ''శ్రీ పార్వతీయ పూర్వాపర క్షితిపతి పరంపరాహార మధ్య నిరుపమ విరాజితయా కౌస్తుభాయమాన యశో జన్మనః''[26] అని వివరిస్తుంది. అతని అగ్రమహిషి అయిన పరమ భట్టారికా మహాదేవిని ''శ్రియేవ సాగర మలంకృతవత్యా''[27] అని పృథ్వీమూల రాజ వంశంలో జన్మించినట్లు ప్రశంసించింది. ఇలా వైష్ణవపరమైన పోలికలు వారికిగల వైష్ణవాభిమానాన్ని సూచిస్తాయి. విష్ణుకుండినుల వంశనామమే విష్ణుపరమై, వారు ''విష్ణువిక్రమనయ సంపదాం'' అని అభివర్ణించుకొనడం, వారు వైష్ణవాభిమానులనే సూచిస్తుంది. వారి వ్యక్తినామాలుసైతం గోవింద, మాధవ, మొదలైన వైష్ణవ నామధేయాలో, లేక ఇంద్ర, విక్రమేంద్ర వంటి వైదికపరమైన నామధేయాలో కన్పిస్తాయి కాని, శివ పరంగా కన్పించవు. పొలమూరు శాసనంలో మాధవవర్మను ''సత్త్వం కైశవం'' అంటూ వివరించడం జరిగింది. [29]

విష్ణుకుండినులనాణాలపైన కుడివైపునకుతిరిగి విపులమైన కరాళంతో పంజా తెరచి లంఘించబోయే సింహచిహ్నం ఒకవంక, శంఖుచిహ్నం మరొకవంక కన్పిస్తాయి [30] శాసన ముద్రికలపై కూడ అట్టి సింహచిహ్నం బహుళంగా కన్పిస్తుంది. సింహము నరసింహస్వామిని సూచిస్తుంది. [31] ఆ కాలంలో నరసింహునిపై భక్తి విస్తృతమవుతున్నట్లు, అది వైష్ణవమతంతో అనుబంధమవుతున్నట్లు గుంటూరు జిల్లాలో కొండమోటువద్ద ఇటీవలికాలంలో లభించిన, వెలుగులోనికి వచ్చిన ఒక శిల్పఫలకం సూచిస్తుంది. [32] శిల్పశైలిలో అది పెదముడియంవద్ద లభ్యమైన శిల్పఫలకాన్నిపోలి, క్రీ. శ. 5వ శతాబ్దినాటిదిగా భావించదగినట్లున్నది ఈ సింహ చిహ్నము ఉండవల్లి గుహాలయంలో కూడ కన్పిస్తుంది. ఉండవల్లి గుహలను విష్ణుకుండిన రాజుల సృష్టిగా నేడు పలువురు చరిత్ర

కారులు అభిప్రాయపడుతున్నారు.[33] ఆ గుహలందు దశావతార శిల్పములు, గర్భాలయంలో అనంతపద్మనాభుని రూపంలో శ్రీ మహావిష్ణువు కన్పిస్తారు. అందుచేత ఆ గుహలు వైష్ణవ సంప్రదాయానికి చెందినవి. ఈ ఆధారాలన్నిటినిబట్టి, 'విష్ణుకుండినులు వీరశైవులనడం చారిత్రక సత్యమని' వ్యాసకర్త అభిప్రాయపడడం ఎంతవరకు సమంజసము?

విష్ణుకుండిన రాజుల్లో చివరివారు, ఇంద్రభట్టారక, రెండవ విక్రమేంద్రభట్టారకవర్మలు పరమ మాహేశ్వరులమని చెప్పుకొన్నమాట వాస్తవమే. విష్ణుకుండిన నాణాలలో నందిచిహ్నం గలవి[34] ఈ రాజుల నాటివని భావించవచ్చును. అంతమాత్రాన, ఈ వంశీయులందరు శైవులని భావించడంలో సామంజస్యంలేదు. అంతేకాక విష్ణుకుండినులు వీరశైవులనడం చారిత్రక సత్యంకాకపోగా ప్రమాదం కూడ. వీరశైవం క్రీ. శ. పదునొకండవ శతాబ్ది నాడు కర్ణాటకంలో బసవారాధ్యుడు, ఆంధ్రదేశంలో పండితత్రయం చేత ప్రచారం చేయబడిన శైవమత సంప్రదాయం. పరమమాహేశ్వర శబ్దాన్ని వీరశైవానికి పర్యాయపదంగా భావించి వ్యాసకర్త చరిత్రకు విరుద్ధమైన ఊహలు చేశారని చెప్పడానికి విచారించవలసి వస్తున్నది.

కీసరవద్ద గల కొండల నడుమ పర్వతాపురమనే గ్రామం ఉండడంచేత, కీసర గుట్టతో సహా ఈ ప్రాంతమంతా శ్రీపర్వతమని పిలువబడుతూండేదని వ్యాసకర్త భావించడం, కన్పించే నిజాన్ని కాలదన్నడమే. శ్రీ పర్వత నామంతో ప్రసిద్ధంగా, చారిత్రక ప్రాముఖ్యత గల నాగార్జున కొండను కాదని, అప్రశస్తమైన గుట్టలకు శ్రీపర్వత నామం కట్టబెట్టడం యుక్తియుక్తంకాదు. సాతవాహన యుగాంతం నుండే విశేష ప్రాధాన్యత గల్గిన శ్రీపర్వత ప్రాంతంలో తర్వాతి కాలంలో విష్ణుకుండినులుకూడ పరిపాలకులైనారని భావించడం సహేతుకంగా ఉంటుంది. శ్రీపర్వత — నాగార్జున కొండ వద్ద గల మహా స్తూప విహార శిథిలాలు, శిల్ప ఖండాలు విష్ణుకుండినుల నాటివి కాకపోవచ్చు; వారి రాజధాని విజయపురి కాకపోవచ్చు; కాని ఆ ప్రాంతం వారి పాలనకు పట్టుగొమ్మ అనుకోవడం అసంబద్ధమేమీకాదు. వారు తమ రాజ్యాన్ని శ్రీపర్వత ప్రాంతంగా ప్రశంసించినారంటే, ఆ పర్వతము ప్రసిద్ధము,మహత్త్వపూర్ణము అని స్పష్టపడుతున్నది. అంతేకాని, తమ ఊరికి ప్రక్కనున్న ఏదో ఒక గుట్టకు ముచ్చటైన పేరు పెట్టుకొని మురిసిపోయినారని భావించరాదు. అలాగే, వారి శాసనాలు 'విష్ణుకుండిన' నామాన్ని తమ గోత్రంగాను, కులంగాను (అనగా పారంపర్య సూచకంగాను) వివరిస్తున్నాయి. అందుచేత ఏ కుండం నుండి వీరికీపేరు వచ్చిందో వెతకడం అనవసరం. కీసరవద్ద మంచినీటికొరకు ఎత్తుగా కట్టలు కట్టిన నీటి గుంటలు ఉండి, అందులో ఒకదానికి పేరు ఉండి ఉండడం, అది వీరి వంశ నామంగా పరిణమించడం ఎంత ఒప్పుగా ఉంటుంది ? కోటల చుట్టు కందకాలు, మంచినీటికి కొలనులు, సర్వసామాన్యాలే. అవి ఆ రాజుల వంశనామాలుగా పరిణమించడం మాత్రం అపూర్వము, అసంభావ్యము.

శ్రీ పర్వత నాగార్జున కొండనే విష్ణుకుండిన రాజుల శ్రీపర్వత స్వామికి నెలవుగా భావించడం అనుచితం కాదు. క్రీ.శ. నాలుగు, అయిదు శతాబ్దుల నాటికి బౌద్ధమతం భక్తిపూరితమై పౌరాణిక హిందూ మతానికి అతి చేరువ అయింది. బుద్ధుడు ఒక చారిత్రక వ్యక్తిగా, విశిష్ట మత ప్రవక్తగాకాక, లోకోత్తరునిగ భగవంతునిగా భావించబడడం ఇక్ష్వాకుల నాటికే ఉంది. ఒకానొక ఇక్ష్వాకులనాటి శాసనం బుద్ధుని "స్వమతస్య దేవః"[34a] అంటూ పేర్కొన్నది. బుద్ధుని ప్రతిమలను పూజించడం సర్వసాధారణమైంది. అంతేకాక ప్రతిమలను (బుద్ధుని) వీధుల్లో ఊరేగించే 'దేవద్రోణమ' నే ఉత్సవాన్ని నాగార్జునాచార్యుని రత్నావళి వివరిస్తుంది.[35] గోవిందవర్మ తన తుమ్మలగూడెం తామ్రశాసనంలో కూడ బుద్ధునికి దీప, ధూప, పుష్ప, గంధాదులతో అర్చనలుజరిగే నిమిత్తం మహాదేవి విహారానికి 'పేణ్కపఱ' గ్రామం దానం చేసినట్లు తెలుపబడింది.[36] క్రీ. శ. రెండు మూడు శతాబ్దులకు చెందిన 'లలిత విస్తరం' బుద్ధుని 'నారాయణుడ'ని, 'మహా నారాయణుడ'ని వ్యవహరించింది.[37] 'కారండ వ్యూహ' మనే మరొక మహాయానగ్రంథం భగవద్గీతలోని విశ్వరూప సందర్శనయోగంలోని శ్రీ మహావిష్ణుని విరాట్స్వరూపంవలె బోధిసత్త్వుని విరాట్పురుషునిగా వర్ణించింది.[38] దీనినిబట్టి బౌద్ధ వైష్ణవాలమధ్య తాత్త్వి కాచార విషయాలలో పరస్పరానుకరణము, సన్నిహితత్వము వృద్ధి అవుతున్నాయని గ్రహించవచ్చు. క్రీస్తు శకారంభంనాటికే వైదిక, భాగవత (వైష్ణవం యొక్క పూర్వ రూపము) మతాల మధ్య సంపూర్ణ సంలీనత జరిగింది. నారాయణుని పరతత్త్వంగాను యజ్ఞ ధర్మ సంరక్షకునిగాను వైదికులు అంగీకరించారు. పౌరాణిక వాఙ్మయం శ్రీ మహావిష్ణుని అవతార గాథలు, మహత్త్వాలను వివరిస్తూ, ఈ సంలీనతను విశదంచేస్తూ భక్తి, ఆరాధనలను ప్రచారం చేయసాగింది. క్రొత్తగా వైష్ణవ — బౌద్ధాల మధ్య ఏర్పడుతున్న అవగాహన, సంలీనతలను కూడ క్రమంగా పౌరాణిక వాఙ్మయం గుర్తించి, ఆమోదించింది. వరాహ, భాగవత పురాణాలు (క్రీ.శ. 500) ఈ సంలీనతలను అంగీకరించి, బుద్ధుని శ్రీమహావిష్ణువు అవతారంగా పేర్కొన్నాయి.[39] ఇంచుమించు అదే కాలానికి చెందిన 'బృహత్సంహిత' సైతం బుద్ధుని జగత్పితయైన పరమేష్ఠి వలెనే పద్మోపవిష్టునిగా రూపొందించ వలెనని[40] చెప్పడం గమనించదగింది. ఈ పరిణామాలన్నీ విష్ణుకుండిన — వాకాటక — గుప్త యుగంలో జరిగినవే.

విష్ణుకుండినులు వైష్ణవ ప్రాముఖ్యత కల్గిన వైదిక మతాన్ని అనుసరించినట్లును, బౌద్ధ మతంలోని ప్రధానాంశాలు నాటికి హిందూ మతంలోనే చేరిపోయినట్లును స్పష్టపడుతున్నది. కనుక విష్ణుకుండినుల శ్రీపర్వత స్వామిని బుద్ధుడేనని, శ్రీపర్వతం నాగార్జున కొండయేనని భావించడం సహేతుకమే. వీరి తొలి రాజధాని సైతం శ్రీ పర్వత ప్రాంతంలోనే ఉండి ఉండాలి. కాని విష్ణుకుండినులు తమ రాజధాని యేదో స్పష్టంగా చెప్పలేదు. వారి శాసనాలు ఒక్కొక్కటి ఒక్కొక్క చోటునుండి యియ్యబడి

నాయి. కాని, 'అమరపురము' ఎందుచేతనో పరిశోధకారుల దృష్టిలో వారి రాజధానిగా ఏర్పడిపోయింది. అందుచేత ఆ పట్టణాన్ని గుర్తించడం కొరకు పరిశోధకారులు చాల ప్రయాస చెందుతున్నారు. కొమర్రాజు లక్ష్మణరావుగారు విష్ణుకుండినులను శైవులుగా భావించి ఆ పట్టణాన్ని 'అమరావతి' గా గుర్తించారు. కాని రామమోహనరావుగారు పేర్కొన్నట్లు విష్ణుకుండినుల నాటికి ఆ పట్టణము ధాన్యకటకంగానే వ్యవహరింపబడుతున్నది. క్రీ. శ. ఏడవ శతాబ్ది ప్రథమార్ధంలో ఆ పట్టణాన్నిసందర్శించిన చీనాయాత్రికుడు హుయాన్సాంగ్ ఆ పట్టణాన్ని ధాన్యకటకమనే పేర్కొన్నాడు.[41] తూర్పు చాళుక్య రెండవ అమ్మరాజు నాటి తాడికొండ తామ్రశాసనం (క్రీ. శ. 10 వ శతాబ్ది) మొదటిసారిగా ఆ పట్టణాన్ని అమరావతిగా పేర్కొన్నది.[42]

కాని, అమరపుర ఇంద్రపాలనగరం ప్రాంతంలో ఉన్నట్లు వ్యాసకర్త ఎలా అభిప్రాయపడినారో తెలియదు. పన్నెండు, పదమూడు శతాబ్దులవరకు 'ఇందుపుర' లేక 'ఇందుపురాల' అని వ్యవహరింపబడిన నగరమే 'అమరపురం'గా ఎట్లా అవుతుందో, దానిని ప్రత్యేకంగా అలా ఎందుకు పిలవవలసి వచ్చిందో ఆయన సూచించలేదు. గోవిందవర్మ పరమ భట్టారికా విహారానికి చేసిన దానం ఇంద్రపురంలో చేయబడిందని, ఆయన ఆ శాసనాన్ని దాదాపు సంపూర్తిగా ఉదాహరించారు కాని, ఆ శాసనంలో ఆ పేరెక్కడాలేదు. పోతే, తుమ్మలగూడెం రెండవ శాసనంలో ఉత్తమాశ్రయుడు (అనగా రెండవ విక్రమేంద్రవర్మ) పల్లవులనోడించి తిరిగివస్తూ మొదట "శక్రాభిధానపురము"నకు అనగా ఇంద్రపురమునకువచ్చి, [అచ్చటగల పరమ భట్టారికా మహావిహారానికి భూదానం చేస్తూ) శాసన ప్రదానం చేసినట్లు చెప్పబడింది.'[3] ఇంద్రుడు 'అమరుల ప్రభువు' కాబట్టి ఇంద్రపురాన్ని అమరపురం అనవచ్చునా? అయినా, ఇంద్రపురం విష్ణుకుండినుల రాజధానియేనా? యుద్ధంనుండి తిరిగి వచ్చేరాజు మొదట విడిసింది రాజధాని అవుతుందా?

అమరపురము రెండవ మాధవవర్మ మనుమడు, దేవవర్మ కుమారుడుఅయిన మూడవ మాధవవర్మ తన ఈపూరు శాసనమును ప్రదానముచేసిన స్థలము. దేవవర్మ, అతనికుమారుడు విష్ణుకుండినుల ఉపశాఖకు చెంది త్రికూటమలయ ప్రాంతమును పాలించినవారు. త్రికూట పర్వతము నేటి గుంటూరు జిల్లాలోని కోటప్పకొండగా కీ. శే. భావరాజు కృష్ణారావుగారు అభిప్రాయపడినారు. త్రికూట పర్వతప్రాంతము ఆనంద గోత్రీయుల పాలనము నందుండి,[44] వారి అనంతరం విష్ణుకుండినుల వశమై, విష్ణుకుండిన పల్లవరాజుల మధ్య సంఘర్షణలకు కారణమైనది. కనుక, ఆ ప్రాంతాన్ని తమ అధీనంలో కాపాడుకొనగలందులకు విష్ణుకుండినులు, తమ ఉపశాఖ నొకదానిని ప్రాతినిధ్య ప్రభుత్వస్థానముగా ఆ ప్రాంతమున నిలిపిరని భావించవచ్చును. అట్టి ప్రాతినిధ్య ప్రభుత్వస్థానమే అమరపురము.

కృష్ణానది దక్షిణ తీరాన గొప్ప చారిత్రక ప్రశస్తిగల ప్రదేశాలలో తగినంతగా చరిత్రకారుల దృష్టికెక్కనిది వేల్పూరు.[45] ఇది గుంటూరు జిల్లాలో సత్తెనపల్లి తాలూకాలో కృష్ణానదికి దక్షిణంగా సుమారు 8 మైళ్ళ దూరంలో సత్తెనపల్లి—అచ్చెంపేట రోడ్డుమీద ఉంది. అచ్చట పొలాలలో పురాతన అవశేషాలు అనేకం లభ్యమైనాయి. ప్రభుత్వాధికారుల అశ్రద్ధవలన అవి నేడు కన్పించడం లేదు. వేల్పూరు గ్రామానికి వాయవ్యంగా ఒక మిట్ట మీద రామలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. ఆ మిట్టను పరిశీలించి చూస్తే మట్టితో కప్పబడిపోయిన ఒక భవనంగా కన్పిస్తుంది. అక్కడక్కడ, మట్టిలేచి పోయినచోట్ల ఇటుకలు బయటపడి కన్పిస్తాయి. వాటికొలత సుమారుగా 18"×10"×3". మిట్టమీది ఆలయంలో ఇక్ష్వాకులనాటి లిపితో చలువరాతి స్తంభాలున్నాయి. ఆవరణలో బౌద్ధ చైత్యాలయానికి సంబంధించిన ఆయకస్తంభ శకలాలు నిలబెట్టబడి ఉన్నాయి. అవి వేల్పూరు ప్రాచీనతకు నిదర్శనాలు అచ్చట ఇక్ష్వాకుల నాటికన్న పూర్వపు లిపిలోగల మహారాజ ''అయిర మాన[స]ద'' భూతగ్రాహకస్వామి ఆలయానికి చేసిన దానాన్ని నివరిస్తూ ఒక ప్రాచీన శాసనం[46] లభ్యమైంది. ఈ శాసనంవలన అతిప్రాచీన కాలంనుండి, వేల్పూరు రాజకీయ ప్రాధాన్యతగల నగరంగా తెలియవస్తున్నది. 'వేల్పూరు' అన్న తెలుగు పదమే సంస్కృతీకరింపబడి 'అమరపుర'గా వ్యవహరింపబడి ఉండవచ్చును. (వేల్పు=అమర; ఊరు=పురము) గోవిందవర్మ వరకుగల విష్ణుకుండిన రాజులకు ఇది రాజధానియై, రాజ్యవిస్తరణ తర్వాత ప్రాతినిధ్య ప్రభుత్వస్థానంగా పరిణమించిందని తోస్తుంది. వేల్పూరు వద్ద త్రవ్వకాలు జరిపితే అనేక రహస్యాలు తెలియరావచ్చును. కీసర గుట్ట వద్ద లభించిన ''తొలుచువాన్రు'' అనే శాసనంవలన అది విష్ణుకుండిన రాజధాని కావడం ఎంతవరకు సాధ్యమోకాని, వేల్పూరువద్ద లభించిన రెండవ మాధవవర్మ శాసనం, అందు ప్రస్తావించబడిన పల్లవులతో పోరాటం నిస్సంశయంగా విష్ణుకుండినుల నాడు వేల్పూరుకుగల ప్రాముఖ్యతను స్పష్టంగా తెలియజేస్తాయి

పై చర్చవలన తేలిన విషయమేమంటే, 1) విష్ణుకుండినులు సాతవాహనుల అనుగామికులు కాజాలరు. సాతవాహన రాజ్యాంతానికి, విష్ణుకుండిన రాజ్యారంభానికి, మధ్య సుమారొక శతాబ్దిపైనే వ్యవధి ఉన్నది. సాతవాహనుల అనంతరం తెలంగాణా ప్రాంతాన్ని పాలించినవారు వాకాటకులే. 2) విష్ణుకుండినులు మొదట రాజ్యపాలన ప్రారంభించింది శ్రీపర్వత ప్రాంతంలో; అది నేటి నాగార్జున కొండయే. శ్రీపర్వత స్వామి నాగార్జున కొండపైగల బుద్ధభగవానుడే. 3) విష్ణుకుండినులందరు శైవులుకారు. (వీరశైవులు అసలు కాజాలరు), వారు ప్రధానంగా వైష్ణవంవైపు మొగ్గిన వైదికులు. ఆనాడు వైదిక, బౌద్ధాలకు మధ్యవర్తిగా నిల్చి వైష్ణవం మతసమైక్య ధోరణులను నిర్వహించింది. 4) అమరపురం విష్ణుకుండినుల తొలి రాజధాని, తర్వాతికాలంలో ఉపశాఖకు మాత్రమే. అది ముఖ్య పట్టణము. అది ఇంద్రపాలపురం కాని, దానికి సమీపానగాని లేదు. అది నేడు గుంటూరు జిల్లాలో, సత్తెనపల్లి తాలూకాలో గ వేల్పూరు.

ఇక కీసర విష్ణుకుండినుల రాజధాని అవునా ? అన్న ప్రశ్న మిగిలింది. వ్యాసకర్త విష్ణుకుండినుల రాజధానిగా భావించి 'అమరపుర' ఇంద్రపాల పురానికి సమీపాన ఉండి ఉంటుందంటూ 'కీసరయే అమరపురమని' తీర్మానించినారు. కీసర ఇంద్రపాలపురాని సుమారు నూరు కిలోమీటర్లకు పైబడిన దూరంలో ఉంది !

కీసరకు సమీపానగల ఘటకేసర్ వద్ద విష్ణుకుండినుల స్థాపించినట్లు చెప్పుకొన్న ఘటికాస్థానం ఉండవచ్చును. ఇంద్ర భట్టారక వర్మ ''యథావిధి వినిర్యాపిత ఘటికా వాప్త పుణ్య సంచయుడే.'' కాని ఆ ఘటికాస్థానం రాజధాని సమీపంలోనే ఉండ వలసిన పనిలేదు. తూర్పు చాళుక్యుల కాలంలో అశనపురంలో ఒ ఘటికాస్థానం ఉండేది.[47] కాని అశనపురం వారి రాజధాని కాదు.

కీసర గుట్టవద్ద బయటపడిన భవన శిథిలాలు, శివలింగాలు విష్ణుకుండిన నాణాలు మొదలయినవి విష్ణుకుండినుల కాలంలో అది ఒక ప్రధాన పట్టణం కావచ్చునని సూచిస్తున్నాయి. కాని పీఠభూమిపై, వర్షచ్ఛాయా ప్రదేశంలో, నీటి పారుదల వసతులు లేని ప్రాంతంలో రాజధాని నగరం ఏర్పడుతుందని భావించలేము. వ్యవసాయావకాశాలుగల్గి, జన సాంద్రతగల గ్రామాలు పరివేష్టించి ఉండగా నడుమ రాజధాని నగరం ఉండడం సాధ్యమవుతుంది. ప్రాచీనకాలంలో రాజధానీ నగరాలు ఈ విధంగా నదీ మైదానాలపై నుండి, రాజకీయ, సాంస్కృతిక కేంద్రాలుగా విలసిల్లడంచూస్తే, కీసరకు అట్టి అవకాశాలు లేవని తోస్తుంది. ఆంధ్రదేశంలో ధాన్య కటకము, వేంగి, రాజమహేంద్రవరము, మొదలయినవి; తమిళ దేశంలో కంచి, తంజావూరు, మదురై మొదలైనవి; ఉత్తర హిందూస్థానంలో పాటలీపుత్రము, కన్యాకుబ్జము, ఢిల్లీ, స్థానేశ్వరము ఇలా ఉదాహరణలుగా చూపవచ్చును. ఒక్క ప్రతిష్ఠాన పురం మాత్రం ఇట్టి సూత్రానికి వ్యతిరేకంగా పీఠభూమి పైనే ఉన్నది. అయితే, అది భరుకచ్ఛ, సొపార మొదలగు పశ్చిమ తీర వ్యాపార కేంద్రాలకు సమీపంగాను, ఆ నగరాల నుండి తూర్పుతీరాన ప్రసిద్ధి కెక్కిన వ్యాపార ప్రాంతమయిన మైసోలియాకు మధ్యగల మార్గంపైన ఉన్నది. అందుచేత పరిసరాలు అనువైనవి కాక పోయినా, ఆ నగరం రాజకీయ, వ్యాపార ప్రాధాన్యతలను పొందింది—సాతవాహనుల రాజధాని కాగలిగింది. అట్టి అవకాశం కూడ కీసర గుట్ట ప్రాంతానికి ఉన్నట్టు కన్పించదు. విష్ణుకుండినుల నాటికి ఐరోపాలో రోమన్ సామ్రాజ్యం పతనోన్ముఖం కావడం, భారతదేశ వ్యాపారం ఆగిపోవడం — జరిగింది.

కనుక, ప్రస్తుతం ఉపలభ్యమవుతున్న ఆధారాలనుబట్టి, కీసర విష్ణుకుండినులనాడు ఒకఘటికాస్థానమై, శైవక్షేత్రమై, ప్రాముఖ్యతగల పట్టణాలలో ఒకటిగా ఉండేదని భావించవచ్చును. అంతేకాని, అది అమరపురమని, విష్ణుకుండినుల రాజధాని అని, నిర్ణయించడానికి వీలులేదు.

అధోజ్ఞాపికలు, వివరణలు

1 విష్ణుకుండిన శాసనాలు ఒక స్థానం నుండి ఈయబడినవి కావు. గోవిందవర్మ తుమ్మలగూడెం (I) శాసనం ఎచ్చటి నుండి ఈయబడిందో అందు సూచించబడలేదు. దేవవర్మ కుమారుడైన మాధవవర్మ ఈపూరు శాసనము అమర పురం నుండి; రెండవ ఇంద్రవర్మ రామతీర్థం శాసనము పురనిసంగమము నుండి; రెండవ విక్రమేంద్రవర్మ చిక్కుళ్ళ శాసనం లెందులూర నుండి, ఆతని తుమ్మలగూడెం (II) శాసనము ఇంద్రపురము నుండి ఈయబడినాయి. అతనిదే అయిన తుండి శాసనము ఆ గ్రామస్థుల నుద్దేశించి పలికి నది కనుక అచ్చటి నుండే ఈయబడి ఉంటుంది. రెండవ మాధవవర్మ ఈపూరు శాసనము గుద్దాది విషయములోని విజయస్కంధా వారము నుండి ఈయబడింది. పొలమూరు శాసనము ఎచ్చటి నుండి ఈయబడిందో అందు సూచించ బడలేదు.

2 "సాష్టాశీతి చతుః శతే శకపతే సంవత్సరాణాం గతే" తుమ్మలగూడెం(II) తామ్రశాసనము. పంక్తులు43–44.

3 శాసన పాఠము. పంక్తులు 15–16.

4 తుమ్మలగూడెం (II) తామ్ర శాసన పాఠం పదవ పంక్తి; తుండి తామ్ర శాసన పాఠం పంక్తులు 12–13. రెండవ ఇంద్రవర్మఇచ్చిన రామతీర్థం శాసనంకూడ 'విక్రమేంద్రాఖ్య రాజా' అని చెపుతోంది. (పంక్తి 5).

5 శాసన పాఠము – పంక్తి 41.

6 పంక్తి 13.

7 పంక్తి 4.

8 డా. బి. యస్. యల్. హనుమంతరావుగారు. 'The Age of Satavahana's. (World Telugu Conference Publication).

9 మల్లంపల్లి సోమశేఖర శర్మగారు: 'భారతి', సంపుటము 7. పుటలు 475 – 76, అధోజ్ఞాపిక నెం. . 6

10 రెండవ ప్రవరసేనుని శాసనాలు. ఉదా:- జాంబ్, చమ్మక్, సివానీ, రూదియా, మొ|| తామ్రశాసనాలు, రెండవ వింధ్యశక్తి బాసింతామ్రశాసనం.Corpus Inscriptionum, Indicarum, Vol. V. Nos. 3, 6, 8, 10 మరియు 23.

11 వరాహదేవుని అజంతా శాసనము. శ్లోక సంఖ్య 18. CH. Vol. V. No. 25.

12. Early History of the Deccan, ed. G. Yazdani, P. 154, 55. ... గామే వాథవస గహపతిస వాకాటకస' Epigraphia Indica, X V, P. 267.

13 తుమ్మలగూడెం (II) తామ్రశాసనం పంక్తి 26–27.

14 డిటో. పంక్తి 3.

15 హులంపురస్వామి, Epigraphia, Indica, XXVI, P. 123 125. విష్ణుకుండిన శాసనంలోనే సోమగిరీశ్వర నాథుడని శివుడు స్థావరాన్నిబట్టి పేర్కొనబడినాడు — రెండవ విక్రమేంద్రుని చిక్కుళ్ళ శాసనం, పంక్తి. 23.

16 Epigraphia Indica, Vol, IV. P. 195.

17 Early Dynasties of Andhra desa, P. 425.427.

18 లక్ష్మణరాయ వ్యాసావళి,

19 A. P. G. A. S., P. 30.

20 Administration and Social life under the Pallavas, P. 180, Fn. 46.

21 Early History of the Andhra Country, P. 201.

22 History and Culture of the Indian people, Vol, III. Classical Age. (Published by Bharatiya Vidya Bhavanam) P. 206.

23 R. D. భండార్కర్ Vaishnavism, Saivism or Minor Religions, P. 6.

24 హరి హర, బెంగుళూరు మ్యూజియం తామ్రశాసనాలు (Indian Antiquary, VII, P. 168-176), మాధవ వర్మ పెనుగొండ తామ్రశాసనము (Epigraphia Indica XIV. No. 24, PP. 331-336) సాసన్‌కోట తామ్రశాసనం Epigraphia Indica PP. 234-239), కదంబ విష్ణువర్మ హెబ్బట తామ్రశాసనం, Select Inscriptions, Vol I, ed. D. C. Circar. P. 480, ప్రభావతీ గుప్త ఇచ్చిన పూనా, ఋద్ధాపూర్ తామ్రశాసనాలు. C. H. Vol V Nos. 2, 8, మొదలైనవి.

25 శాసనపాఠం పంక్తులు 27–28.

26 –డిటో–పంక్తులు 26–27.

27 –డిటో– పంక్తులు 23–24.

28 –డిటో– పంక్తి 3.

29 నియమాగన సంపత్వం కైశవం కాన్తి మైందలీం।
ఉద్వహన్నురుభాః భాతి విక్రమాదాప్త భూరిభూః॥
శాసన పంక్తులు 14–16.

30 A. P. G. A. S., No 10. 49, 55 సంఖ్యగల నాణెపు వెనుకవైపు చిత్రాలు స్పష్టంగా శంఖుచిహ్నం కన్పరస్తు న్నాయి. మారేమండ రామారావుగారు వాటిని కూడ పూర్ణ కుంభంగానే భావించి వర్ణించారు.

31 డా. బి. యస్. యల్. హనుమంతరావుగారు, Religion in Andhra, P. 249-50

32 A. P. G. A. S; No 16; డా, బి. యస్. యల్. హనుమంతరావుగారు, Religion in Andhra. P. 252.

33 కె. వి. సౌందరరాజన్, A. P. G. A. S. No. 12, P. 20,

34 డా. రాయప్రోలు సుబ్రహ్మణ్యంగారు. A. P. G. A. S. No. 8; Appendix IV, Plate V.

35 ధర్మాధికారయే చాన్యే పూర్వరాజ ప్రవర్తితః
దేవద్రోణ్యాదయేస్త్వేపి ప్రవర్త్యమ్త్యం యథాస్థితిః,
Journal of Royal Ariatic Society, 1934, PP 308-325.

36 శాసన పాఠము, పంక్తులు 22–23.

37 అధ్యాయములు XV 229, 262; XXI 229. లలిత విస్తర కాల నిర్ణయం గూర్చి A. B. Keith History of Sanskrit literature, P. 493.

38 డా. బి. యస్. యల్. హనుమంతరావుగారు. Religion in Andhra, P. 128-9.

39 డా. సువీరా జయస్వాల్, Origin and Development of VaishnavisimP.130

40 సద్మోపవిష్టః పితేవ జగతో భవతి బుద్ధః–బృహత్సంగిత, (ప్రతిమాలక్షణమ్), శ్లోక సంఖ్య 44,

41 థామస్ వాటర్స్. On yuwan chwang's Travels in India, II, P. 247.

42 Epigraphia Indica, XXIII, P. 161.

43 శాసన పాఠము. పంక్తులు41–42.

44 చేజెర్ల శిలాశాసనం. అందు కందరరాజు "త్రికూట పర్వత పతే గ్గోరలాలగూల విజయ కేతనస్య...... కన్దర పురవర జనపద ద్వితయాదిపతేః" అని చెపుతుంది. South Indian Inscriptions, Vol. VI, No. 594. పంక్తులు 9–12. ఆనంద గోత్రీయులు కృష్ణకు దక్షిణంగా జనపద ద్వితీయాన్ని పాలించినవారు. అందు త్రికూట పర్వతం చేరి ఉన్నది. ఆనంద గోత్రీయులనుండి త్రికూట పర్వత ప్రాంతమును విష్ణుకుండినులు వశం చేసుకొన్నట్లే వారి 'త్రికూట పర్వతపతేః' అన్న బిరుదాన్ని కూడ సంగ్రహించి ఉంటారు.

45 వేల్పూరును గూర్చిన పురాతత్త్వ ప్రాముఖ్యతకై Journal of Andhra History and Culture Vol. I P.

46 Epigraphia. Indica Vol. XXXII, PP. 82-87.

47 మొదటి జయసింహవల్లభుని విడమ్రఱు శాసనమం,'భారతి' క్రోధన, వైశాఖమాసము, పంక్తి–12.

పరిణామ రాత్రులు

శ్రీ ప్రియముగంటి ప్రభాకర్

మొన్నటి రాత్రి............
కార్చే కన్నీటి బొట్లలో
ఘోషించాయి – సప్త సముద్రాలు.

నిన్నటి రాత్రి............
ఉబికివచ్చే ఊహల్లో
నర్తించాయి—పిచ్చిగీతలు.

ఈ రాత్రి............
ఆలోచనల రాపిలో
ఆవిర్భవిస్తున్నై...లెక్కలేనన్ని కాంతికణాలు
నీపై నిండుగా కురిపించమని;
నిన్ను నిలువునా వెలిగించమని.

కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావు

కాటమరాజు కథలు

తెలుగువారి జానపద సాహిత్యమునకు సంబంధించిన ప్రాచీన వీర గాథలలో ప్రసిద్ధములైనవి రెండు.

1. పలనాటి వీరచరిత్ర. 2. కాటమరాజు కథ. వీనిలో రెండవదియగు కాటమరాజు కథకు సంబంధించినదే ఈ గ్రంథము. ''కాటమరాజు కథలు'' అను పేరుతోనున్న యిందు 1. ఆవుల వలురాజుకథ. 2. పంపాద్రి కథ 3. పెద్దిరాజుకథ. 4. పోలురాజు కథ. 5. బల్లికురువ పోట్లాట 6. కాటమరాజుకు పట్టం కట్టిన కథ. 7. కరియావులరాజు కథ. 8. పాపమాక కథ అను ఎనిమిది కథలు గలవు. ఇది మొదటి సంపుటము. ఇందలి కథలన్నియు మంజరీ ద్విపదచ్ఛందస్సులో నున్నవి. ఇవియన్నియు తాళపత్ర గ్రంథములనుండి సేకరింపబడి యిందు సంధానింపబడినవి. పై వానిలో నేడవదియగు 'కరియావుల రాజుకథ'కు ప్రత్యంతరము లభించుటచేత, ఆ ప్రత్యంతరము అనుబంధముగా నీయబడినది.

ఈ గ్రంథమునకు 290 పుటల పీఠిక గలదు. అందు 1. జానపదవిజ్ఞానము—వీరగాథలు 2. కాటమరాజు కథాచక్రము. 3. తాళపత్రగ్రంథ వివరణ అను మూడు భాగములు గలవు. ఈ పీఠికలో 'జానపద విజ్ఞానము— వీరగాథలు' అను శీర్షికలో 62 పుటలే యుండుటచేత, తక్కిన 228 పుటలు కాటమరాజు కథలకు సంబంధించినవేయని తెలియనగును. పీఠికగాక, ఇందు 16 పుటలు ఛాయా చిత్రములు, 22 పుటలు విషయసూచిక, మూలగ్రంథమున 776 పుటలు గలవు. ఇందువలన నిది 1104 పుటలుగల మహాగ్రంథముగా నున్నది. గ్రంథ సంపాదకుడు, పీఠికా కర్త డాక్టరు తంగిరాల వెంకటసుబ్బారావు. సహాయకుడు డాక్టరు చన్నాప్రగడ తిరుపతిరావు.

ఈ గ్రంథము గ్రంథసంపాదకుడు, పీఠికా కర్తయైన తంగిరాల వెంకటసుబ్బారావు తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయమున ''వీరగాథలు''పై పరిశోధనచేసి పట్టము పడసిన గ్రంథము. ఈ గ్రంథము ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ ప్రచురణము.

తెలుగున జానపద సాహిత్యమున వీరగాథలను గూర్చి ప్రత్యేకముగా విశ్వవిద్యాలయములలో పరిశోధన జరుగుచుండుట ముదావహము. ఈ వీరగాథలలో ప్రాథమికము ప్రశస్తమునునగు పల్నాటి వీరచరిత్రను గూర్చి యింతవఱకు విశ్వవిద్యాలయస్థాయిలో నొక ప్రత్యేక సిద్ధాంత గ్రంథము వెలువడనేలేదు.

తెలుగు సాహిత్యమున ప్రథమముగా వీరగాథలను గూర్చి పరిశోధనచేసి పట్టము బడసిన కీర్తి ప్రస్తుత గ్రంథ సంపాదకుడైన డాక్టరు తంగిరాల వెంకటసుబ్బారావుకే చెందుచున్నది. ఈ విషయమున నాతడు కావించిన కృషియు యభినందనీయమైనది.

పలనాటి వీరచరిత్రను గూర్చి తెలిసినంతగా కాటమరాజు కథలను గూర్చి మనకు తెలియనే లేదని చెప్పవచ్చును. ఈ కథలలో నింతవఱకు ఎనిమిది కథలు మాత్రమే ముద్రితమైనవి. అవియైనను సాహిత్య లోకమున వ్యాప్తిలోలేవు. మంజరీ ద్విపదచ్ఛందస్సులోనున్న యీ కథలు ముఖస్థములు సుద్దుల గొల్లలను సంచార గాయకులు వీనిని నేటికిని పాడి సజీవముగా వీనిని నిలుపుచున్నారు. కాని వీరు పాడెడు కథలకు మూలములైన గ్రంథములు లేకపోలేదు. అవి కొన్ని మాత్రమే సేకరింపబడినవి. పైని ముద్రితములైన కాటమరాజు కథలివియే. వీనివలన మనము కాటమరాజు కథలు ఎనిమిది మాత్రమే యనుకొనుచున్నాము గాని, ప్రస్తుత గ్రంథకర్త నిర్నిద్ర పరిశోధన వలన ''కాటమరాజు కథాచక్రము''న 32 కథలున్నట్లు మనకు వ్యక్తమైనది. గ్రంథకర్త పలు ప్రదేశములను పర్యటించి వృద్ధులైన సుద్దుల గొల్లల మూలమున ముప్పదియారు తాళపత్ర గ్రంథములను సంపాదించి తెలుగున వీరగాథలలో నింతకన్న పెద్ద కథాచక్రము లేదని నిర్వివాదముగా నిరూపించినాడు. ఈ గ్రంథమున నెనిమిది కథలను ఈ తాళపత్రములలోనివే ఇంతవఱకును ముద్రిత గ్రంథములను గూర్చియే, విశ్వవిద్యాలయములలో ప్రాయికముగా పరిశోధన జరుగుచున్నది కాని కేవలము తాళపత్ర ప్రతులే ఆధారముగా పరిశోధన జరిగినట్లులేదు. తాళపత్రప్రతు లాధారముగా గవేషణ జరుపుటయే గాక, వాని ముద్రణకు సంపాదకత్వ భారము గ్రంథకర్త వహించుట మిక్కిలి ప్రశంసనీయము.

విపులమగు నీ గ్రంథపీఠికయందు నిదివరకు లభ్యముగాని కాటమరాజు కథలు ఇరువది యారింటి వివరములు నీయబడినవి. ప్రస్తుతము ముద్రింపబడిన కథలు పాటలుగానే పాడుచుండుట వలన నవి మంజరీ ద్విపదచ్ఛందస్సులో నున్నను, లాక్షణికులు చెప్పిన లక్షణములకు అవి లొంగవు. ఆ గ్రంథకర్తలును పాడుకొనుటకు ననువగు రీతినే వీనిని రచించిరి. గ్రంథకర్త యీ వివరము లన్నింటిని లక్ష్య లక్షణ సహితముగా నిరూపించియున్నాడు. దీనితోపాటు జానపద వాఙ్మయము ఉత్పత్తి వికాసములు, వర్గీకరణము— ప్రసక్తాను ప్రసక్తముగా పలనాటి వీరచరిత్ర కథాచక్రము సవిస్తరముగా నీయబడినది. దీనినిబట్టి పలనాటి వీరచరిత్రకు నొక సంశోధిత ముద్రణము అత్యావశ్యకమని మనము నిర్ణయింపవచ్చును. ప్రస్తుతము ముద్రితమైన పలనాటి వీరచరిత్ర అసమగ్రముగా నున్నట్లు కన్పట్టుచున్నది.

కాటమరాజుకథ - వ్యాప్తి

కాటమరాజు కథల ప్రచారమునుగూర్చి అయ్యలరాజు నారాయణామాత్యుడు తన హంస వింశతిలో నిట్లు తెలిపినాడు :

ఉ ''కొమ్ములు పీరణాలు జగిగులెక్కడు వ్రాతల కృష్ణలీలలం
గ్రమ్మ గుడార్లు వీరుఁడగు కాటమరాజు కథానులాపముల్
బమ్మని పుస్తకాలు ముఖపట్టిడి కట్టురుమాలలున్నెరా
సొమ్ములు నామముల్ వెలయ సుద్దుల గొల్లలు-వచ్చి
రెంతయున్'' (2-88)

ఇంతవఱకు పై పద్యము నొక్కదానినే పరిశోధకు లుదాహరించిరి. కాని ఆ గ్రంథమునందే ఆ పై పద్యమునకు రెండు పద్యములు వెనుక—

''కొలిచెన్ కాటమ రాజులన్ వతులఁ జేకూర్చెన్
మహావీర్లకునే'' (2-91)

అని కాటమరాజును గూర్చిన ప్రసక్తి గలదు.

కాటమరాజు కథ - దక్షిణాంధ్ర వాఙ్మయము

కాటమరాజు కథ దక్షిణాంధ్ర వాఙ్మయమున ప్రచారము బడసినవి. తంజావూరి విజయరాఘవ నాయకుని కాలమున (1633 – 1674) అతని అస్థాన కవి కామరసు వెంకటపతి సోమయాజి తన విజయ రాఘవ కల్యాణమున కాటమరాజు పదము నుదాహరించి యున్నాడు.

కాటమరాజు పదము

1 కుంభములో పుట్టినట్టి కుంభకర్ణుని కొడుకువై
కుంభముల్లో దింటివి గదరా, ఓ కాటమరాజ
కూర నార వెతకవుగా ఓ కాటమ రాజ.

2 అంబాలిక సాహసాన అంబోధి దాటువేళ
పంబలు వాయింపుచును — ఓ కాటమరాజ
కంబళి నాచుకొంటివిగా ఓ కాటమరాజ.

3 సుప్పనాతి ముక్కుపోయి నొప్పిచేత మూలుగంగ
ఇప్పుడూ దండవేసి — ఓ కాటమరాజ
అప్పుడే కూడిలి గదర ఓ కాటమరాజ.

(దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము – పుట 126)

జానపద సేకరణ-ప్రథమ ప్రవర్తకులు

ఈ సిద్ధాంత గ్రంథము జానపద సాహిత్యమునకు సంబంధించినది గాన — ఆ వాఙ్మయమును గూర్చి తొలుత పరిశ్రమచేసిన మొదటి వారలను తెలిపి, వారిని స్మరించి తరువాత తక్కిన వారిని గూర్చి తెలుపవలసి యుండెను. గాని గ్రంథకర్త యట్లుచేయలేదు. తెలుగున జానపద సాహిత్యమున పరిశ్రమచేసిన ప్రథమ ప్రవర్తకులు ముగ్గురు. వారు—

1) నేదునూరి గంగాధరము
2) అక్కిరాజు ఉమాకాంతము
3) వేటూరి ప్రభాకరశాస్త్రి

పై ముగ్గురిలో

నేదునూరి గంగాధరముగారు జానపదసేకరణలో ప్రథములు (1910).

అక్కిరాజు ఉమాకాంతముగారు ప్రథమముగా పల్నాటి వీర చరిత్రను పరిచయము చేసినవారు. (1911)

వేటూరి ప్రభాకర శాస్త్రిగారు మొదటిసారిగా కాటమరాజు కథను పరిచయము చేసినవారు. (1923)

చారిత్రకముగా వీరు ముగ్గురు ప్రథమ ప్రవర్తకులైనను గ్రంథకర్త కీ విషయము తెలియక పోవుటచే కాబోలు వీరిలో నిరువురును నీ తరువాత నేటివఱకు పరిశ్రమ చేసినవారితో కలిపి పేర్కొన్నాడు. చూడుడు —

''19వ శతాబ్ది ఉత్తరార్ధమునుండ వీరగాథలు ముద్రింప బడుట ప్రారంభమైనది. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, మల్లంపల్లి సోమశేఖర శర్మగారు, నేదునూరి గంగాధరంగారు, శ్రీపాద గోపాల కృష్ణమూర్తిగారు, టేకుమళ్ల కామేశ్వరరావుగారు, హరి ఆదిశేషువుగారు, ఆచార్య బి. రామరాజుగారు, ఆచార్యతిమ్మావఝ్ఝల కోదండ రామయ్యగారు, ఆచార్య తూమాటి దోణప్పగారు, డా. నాయని కృష్ణకుమారిగారు తెలుగు వీర గాథలను గూర్చి ప్రశస్త మగు కృషిని సల్పియున్నారు''. (పుట 12).

పై వానిలో అక్కిరాజు ఉమాకాంతముగారి పేరులేదు. అది — పల్నాటి వీరచరిత్ర కథానుక్రమము సందర్భమున పేర్కొన బడినది. (పుట 28).

పై ఉదాహృతి వలన—మనకు ప్రథమముగా పరిశ్రమ చేసిన వారెవరో, ఆ విషయము విస్మృతమైనది. ఇది సరియగు పద్ధతి కాదు. పరిశోధనయందు, పరిశోధనా విషయమును గూర్చి తొలుత కృషి చేసిన వారిని గూర్చి తెలుపకపోయినచో ఆ పరిశోధన యందు విపర్యాసములు కలుగును. ప్రస్తుత గ్రంథకర్త దీనిని పాటింపక పోవుటచే నెట్టి ప్రమాదములకు లోనైనది నిరూపించుచున్నాను.

సేకరణ పరిరక్షణ

నేదునూరి గంగాధరము ''భారతదేశములో వివిధ ప్రాంతముల జానపద సాహిత్యము నుద్ధరించుటలో శ్రీరామ నరేశ త్రిపాఠీ గారును, తెలుగు జానపద గేయములను సేకరించుటలో ఆచార్య

బి. రామరాజుగారును ఎన్ని కష్టములకు లోనైరో నేను అనుభవ పూర్వకముగా తెలిసికొంటిని." (పుట 60).

నిఖిలాంధ్ర దేశమున నేదునూరి గంగాధరముగారు జానపద గేయ సేకరణలో ప్రథములు, ప్రధానులు కాగా, ఆ కీర్తిని బి. రామరాజుగారి కంటగట్టినాడు గ్రంథకర్త. ఈ సందర్భమున నాతడు రామరాజుగారే గంగాధరముగారినిగూర్చి ఏమి వ్రాసియున్నారో చూడలేదనుట స్పష్టము. దానిని తొలుత తెలుపుచున్నాను. "జానపద గేయముల నత్యధికముగా సేకరించినవారు, ఆ యాత్రలో తమ జీవితము గడపుచున్నవారు రాజమండ్రి వాస్తవ్యులు శ్రీ నేదునూరి గంగాధరముగారు. వారు మొత్తం మూరువేల జానపదములే గాక, (సంప్రదాయిక విజ్ఞానము Folklore కూడ) అధికముగా సేకరించినారు."

తెనుగు జానపద గేయ సాహిత్యము, పుట–56 (1956)

ఇట్లు రామరాజుగారే గంగాధరముగారిని గూర్చి 1956 లో వ్రాయగా గ్రంథకర్త పై రీతిని వ్రాయుట దురూహ్యముగానున్నది. రామరాజుగారి గ్రంథము చూడకపోవుటయేగాదు, గ్రంథకర్త గంగాధరము గారినిగూర్చి తెలుసుకొనుటకే ప్రయత్నమును చేసినట్లు కానరాదు. 1940లో తొలిసారిగా నేదునూరి గంగాధరముగారిని గూర్చి "ఆంధ్ర సర్వస్వము" అను విజ్ఞాన కోశమున గలదు.

1946 లో దేవేంద్ర సత్యార్థి– గంగాధరముగారు నాలుగు వేల జానపద గేయములను సంపాదించినారని తెలిపి, ఆయనను గూర్చి, ఆంగ్ల భాషలో వ్రాసి, ఆయనను యావద్భారత వర్షమునకు పరిచయము చేసినాడు.[1] రామరాజుగారు నేటివరకు గంగాధరము గారినిగూర్చి పరిశోధన చేయుచున్నారు. వారు "గంగాధరముగారు పదివేల పైచిలుకు జానపద గేయములను సేకరించినా"రని తెలిపినారు.[2] ఇటీవల శ్రీ ఘట్టమరాజు అశ్వత్థ నారాయణగారు. గంగాధరముగారు తెలుగు జానపద వాఙ్మయమునకు చేసిన అఖండ సేవనుగూర్చి విశేషముగా కీర్తించినారు.[3] గంగాధరముగారి జానపద సంకలన గ్రంథాలు ఏడు ముద్రితమై సాహిత్య లోకమునకు పరిచితమై యున్నవి. ఇట్టి గంగాధరముగారిని గూర్చి యిందు ప్రత్యేకముగ లేకపోవుట కరము విచారకరము.

వేటూరి ప్రభాకరశాస్త్రి

గంగాధరముగారవలెనే వేటూరి ప్రభాకరశాస్త్రిగారిని గూర్చి ప్రత్యేకముగా నొక్క వాక్యమైనను లేదు. ప్రస్తుత గ్రంథము కాటమరాజు కథలు. ఇట్టి సందర్భమున కాటమరాజు కథనుగూర్చి తొలిసారిగా పరిచయము చేసిన ప్రభాకరశాస్త్రిగారిని గూర్చి గ్రంథకర్త ప్రత్యేకముగా తెలుపవలసి యుండెను. కాని యట్లు చేయలేదు. ఈనాడు గ్రంథకర్త తాను కాటమరాజు కథలలో మొట్టమొదట ఎన్నో క్రొత్తకథలున్నట్లు పరిశోధనచేసి కనుగొన్న విషయమును నిప్పటి కేబది నాల్గేండ్లక్రిందటనే ప్రభాకరశాస్త్రిగారు కనుగొని లోకమునకు వెల్లడించినారు.

1923లో తమ శృంగార శ్రీనాథమున ప్రభాకరశాస్త్రిగారు కాటమరాజు కథను గూర్చి యిట్లు వ్రాసినారు:

"గొల్లసుద్దులలో ప్రధానమైనది కాటమరాజు కథ".

(పుట 251)

మూడవ తెలుగు కథలు, యాదవ రాజుల కథలు ఎఱ్ఱ గొల్లలు మొదలగు వాండ్రీ కథలను జెప్పుదురు. ఈ తెగ కాచార్య పురుషులు కలరో లేరో తెలిసినదికాదు. కాటమరాజు కథ, కరి యావులరాజు కథ, పోలురాజుకథ, వల్లురాజుకథ మొదలగునవి వీండ్ర గ్రంథములు. ఇవియు ద్విపద మంజర్యాది దేశిచ్ఛందో నిబద్ధములే యాదవ రాజుల కథలనేకములు గలవట. "యాదవ శాస్త్రం ఎద్దుమోత ప్రమాణ"మని చెప్పుదురు. పయివానిలో గొన్నింట చరిత్రోప యోగములగు విషయము లున్నవి. ఒంగోలు, వినుకొండ, పల్నాడు, నరసారావుపేట తాలూకాలలో ఈ గ్రంథాధ్యేతలు పెక్కురున్నారు. ఆ గ్రంథములన్నియు బరిశీలింపదగినవి. బహు యత్నమున నేను వానిలో గొన్నింటిని జూడగల్గినాడను. ఇప్పుడిక్కడ మనకు ప్రసక్తము "కాటమరాజు కథ."

(పుటలు 253–254)

పై యుదాహృతినిబట్టి మొట్టమొదట ప్రభాకరశాస్త్రిగా కాటమరాజుకథ ఒక్కటి కాదనియు, నందు పెక్కు కథలు గల వనియు గుర్తించిరని మనకు విశదమగుచున్నది. అందులక "యాదవశాస్త్రం ఎద్దుమోత ప్రమాణం" అని వారుదాహరించి వాక్యమే ప్రమాణము. ఇంతేకాక కాటమరాజు కథాసంగ్రహముతో పిన ఎల్లయ రచించిన ద్విపద కాటమరాజు కథను గూర్చియు, భక్త వత్సలకవి రచించిన కాటమరాజు కథ పద్యప్రబంధమును గూర్చి మొదట తెలిపినవారు వారే. (పుటలు 255–56)

ఇట్లు వ్యక్తిగతముగానే కాక, ప్రభుత్వ పక్షమున కాటమరాజు కథను గూర్చి వివరములిచ్చినవారు వారే. మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారము వారి ద్విపద కావ్యములను గుఱించిన విశేష వివరణ గ్రంథములో (డిస్క్రిప్టివ్ క్యాటలాగు ద్విపద కావ్యములు–సం–5) కాటమరాజు కథను గూర్చి తొలిసారిగా స్థానిక సంపుటములోగల కథావివరణమునంతయు నిచ్చియున్నారు. ముద్రితమైన కాటమరాజు కథలలోని నాలుగు కథలే గాక "అగుమంచి" కథనువారే మొదట పరిష్కరించినారు.[4] కాటమరాజు కథలనుగూర్చి తొలిసారిగా నింత పరిశ్రమచేసిన ప్రభాకరశాస్త్రిగారిని గ్రంథకర్త ప్రత్యేకముగా పేర్కొనకపోవుట సిద్ధాంత గ్రంథ పరిశోధనా పద్ధతికి విరుద్ధము.

కాటమరాజుకథ – శ్రీనాథుని కర్తృత్వము

కాటమరాజు కథను శ్రీనాథుడు రచించినట్లు గంగుల పన యెల్లయ్యయు, గుఱ్ఱము కొండభక్తవత్సల కవియు, తమ గ్రంథములలో స్పష్టముగా నిట్లు చెప్పినారు.:

"వలనొప్పు శ్రీనాథ వచన పద్ధతిని"
"శ్రీనాథుడను కవిశ్రేష్ఠుండు ద్విపదగా
రచియించె కాటమరాజు చరిత".

పై రీతిని శ్రీనాథకృతమని యున్నను గ్రంథకర్త దీని నంగీకరింపలేదు. ఆతడిట్లు వ్రాసియున్నాడు:

"శ్రీనాథుడు రచించిన కాటమరాజు కథలలో నొక్కటి గూడ నేడు లభించుటలేదు. అయినను కొన్ని కథలు రచనా విధానమును బట్టి శ్రీనాథకృతములై యుండునని యూహింపబడుచున్నవి. వీనియందు కవినామము చెప్పబడలేదు. (పల్నాటి కథలలో నిట్లుగాక శ్రీనాథకృతములని స్పష్టముగా అవతారికలోగల వీరగాథలు లభ్యమగుచున్నవి) అట్టి వానిలో ఎఱ్ఱగడ్డపాటి పోట్లాట వేటూరి పరిష్కృత కాటమరాజు కథలోనిది అనుబంధముగా నీయబడినది. (కాటమరాజు కథ అను పేరుతో ప్రధాన కథగా ముద్రింపబడినది—గంగుల పినయెల్లయ రచించిన ఎఱ్ఱగడ్డపాటి పోట్లాట) దీనిని గురించి తిమ్మావఝ్ఝలవారు ఇట్లూహించినారు: "కవిత్వము రసవంతముగానుండి రచన మేలైనదిగా నుండుటచే నిది శ్రీనాథ రచనయేమో యనికూడ ననుమానింప వీలగియున్నది. ఇందలి రచనము పల్నాటి వీరచరిత్ర రచనమున కనేక విధములు బోలియుండుటయే యీ యనుమానమునకు గారణము." ఇట్లూహించునట్టి కథలేకాని పల్నాటి కథలలోవలె శ్రీనాథ కృతములని ప్రత్యక్షముగా కనబడునట్టివి కాటమరాజు కథలలోలేవు—(పుట 101)

పై వాక్యములు విమర్శనీయములు.

రచనా విధానము-శ్రీనాథ కృతి

ప్రస్తుతము ముద్రితమైన కాటమరాజు కథ (ఎఱ్ఱగడ్డపాటి పోట్లాట)యందు శ్రీనాథుని రచనా విధానము ప్రత్యక్షముగా కానవచ్చుటచేతనే ప్రభాకరశాస్త్రిగారు దీనిని పరిష్కరించిరి. వారే ఈ గ్రంథముద్రణ కాలమునాటికి జీవించియున్న పీఠికలో నీ విషయము అనగా నిది శ్రీనాథకృతమని సోపపత్తికముగా నిర్ణయించి యుందురు. కాని యట్లు జరుగలేదు.[5] ఇది శ్రీనాథ కృతమని సాంకర్యమును బొరసినదని క్రీ. శ. 1923 లోనే యిట్లు వ్రాసినారు:

"స్వల్పమగు నీ చరిత్ర విషయమును శ్రీనాథుడు తన కవితాధార పాఱించి కబ్బము కట్టినాడు. దీనిలో గూడ పల్నాటి వీరచరిత్రము తీరున ప్రకరణ భేదములున్నవి. శ్రీనాథుని గ్రంథము సాంకర్యమును బొరసినట్లున్నది."

(శృంగార శ్రీనాథము, పుట 255)

ఇచట శ్రీనాథుని గ్రంథము సాంకర్యము బొరసినది యనగా నందు పిన యెల్లయ రచనతో కూడ కలిసి, ఏక గ్రంథముగా రూపొందినదియని యర్థము. శ్రీనాథకవి రచనా విధానమును జీర్ణించుకొన్నవారు శ్రీనాథకవి రచనను స్పష్టముగా గుర్తింపగలుగుదురు. ఈ సందర్భమున నింకొక విషయము గ్రంథకర్త దృష్టికి తెచ్చుట యావశ్యకము.

తెలుగు వీరగాథలు-మార్గకవిత

తెలుగున ప్రాచీన వీరగాథలు పల్నాటి వీరచరిత్ర, కాటమరాజు కథ రెండును మొదట మార్గ కవితలయందే యవతరించినవి గాని జానపద సాహిత్యమున నుత్పన్నము కాలేదు. శ్రీనాథ మహాకవి ఈ రెండింటిని సలక్షణమైన ద్విపదలలోనే రచించినాడు.

కాని, ఆ కథలు ప్రజాసామాన్యములో ప్రచారములో నుండుటచేతను, ప్రజలకుప్రౌఢమైన శ్రీనాథుని రచన అవగాహనకాక పోవుటచేతను—జానపద కవులు తిరిగి ఆ కథలను ద్విపద ఛ్ఛందస్సునే గేయరూపముగా మార్చి రచించి వ్యాప్తిచేసిరి. శ్రీనాథుడు పల్నాటి వీరచరిత్రను మల్లయ, కొండయ్య అను కవులిట్లే వ్రాసిరి. కాటమరాజు కథను గంగుల పినయెల్లయ్య వ్రాసెను. వీరు మువ్వురును శ్రీనాథునివలె ద్విపదలో వ్రాయుటచేత వ్రాయసకాండ్రు రెండు రచనలు జోడించి వ్రాసిరి. శ్రీనాథుని ద్విపద రచనలు కావ్యమువలె నాతని కాలమునాడే గ్రంథస్థములైనచో, నాతని గ్రంథము ఎట్టి వైలక్ష్యణమును పొందియుండవు. అవి ప్రజాసామాన్యమున, గేయరూపమున ముఖస్థములై యుండుటచేతనే యిట్టి సాంకర్యమును బొరసినవి. పై విషయమును ప్రస్తుత గ్రంథకర్త గుర్తింపలేదు.

ఇదివరలో ముద్రితమైన కాటమరాజు కథనుండి అది శ్రీనాథ కృతమని నిరూపించుచున్నాను.

ద్విపదలు-సలక్షణములు

"ఏకాదశియు నేడు నిచ్చోటజేసి
వేకువనే దండు వేగంబె కదలి
ఉదయాన బారును నొక కొంతయేరి
కదిసి గోసంగులల్లుగా జంపి
మఱిపోయి గొల్లరాజు మందచుట్టుకొని
తఱిమి యా యాదవుల తలలు ఖండించి
పశువుల చెఱలను బాగుగా బట్టి
యెసగంగ నెల్లూరి కేగుదమనిన
గోపాగ్ని కన్నుల గురియుచు రాజు
ఆ ప్రొద్దు దళమంత నచ్చోటనుంచె" (పుట 78)

ప్రాస యతి

ద్విపదలలో ప్రాసయతి పాల్కురికి సోమనాథుడు ఒక్కడే. శ్రీనాథుడు సోమనాథుని పండితారాధ్య చరిత్ర పద్య కావ్యముగా రచించినాడు. గాన యిందు ద్విపదలలో ప్రాసయతి పాటించినాడు. ఇది తరువాత కవులలో లేదు.

"పగయన్న నెల్లూరు పొగలు మున్నది యొ (పుట 15)
నెత్తుటి వ్రఱులో దుత్తుని యలుగు. (,, 29)
రెండు చేతులం బొడ్డు దండిమ గుండు (,, 43)
క్రిక్కిఱి సుండియు యుక్కుపొడి రాల (,, 49)
కాపాడు చుండెడు గోపాలకుండు (,, 65)
తురితు జమీలను ద్వరితముగ బిలిచి (,, 70)
నేడు మా యుద్ధంబు వాడి కనుమయ్య (,, 75)
ఆదోని రాజులకు మోదంబు గూర్చి (,, 175)
లక్కముద్రలు వేసి గ్రక్కున నపుడు (,, 193)

యతులు

స్నానంబుచేసి యుండగ సంధ్య వార్చి (పుట 221)
స్నాన బు గావించి ధవళ వస్త్రములు (పుట 224)

ఇందు 'స్నా — త' యతి పాటింపబడినది. శ్రీనాథుడిట్టి యతిని హరవిలాసమున వాడినాడు.

"ధీని ధినం బిసెట్టి తన దేహర మింటి విభూతి మంగళ
స్నాన మొనర్చి ధౌత పంధానము గట్టి. (హర 2–26)

పదప్రయోగము

ఆలజాలము (పుట 14) నాచన సోముడుత్తరావారి వంశమున ప్రయోగించినది (3–26) శ్రీనాథుడిందు వాడినాడు. బసపరి (పుట 82) శివతత్త్వసారమున ప్రయోగము కట్ట్రగము [పుట 12] బసవ పురాణమున ప్రయోగము శ్రీనాథుడు శివకవి కృతులతో పరిచయమున్నవాడు గావున పై పదములను ప్రయోగించినాడు.

గన్నెరాకమ్మ (75) — గన్నెరాకమ్మ తొడిగి
[నైష 5–63.]

స్థాలీపులాకన్యాయమున కొన్నిమాత్రమే చూపితిని. గ్రంథము కూలంకషముగా పరిశీలించిన నింకను లభింపగలవు.

గంగుల పిన యెల్లయ కవిత అపశబ్దములు

పిన యెల్లయ, 'భోంచేసి', 'అయితె', 'వస్తె' మొదలగు, అపశబ్దములేగాక యతి స్థానములందు పెక్కు అపశబ్దములనువాడినాడు. చూడుడు.

వలలన్ని చాలుగా వడ్డుడీ చక్క—ఒడ్డుడీ (పుట 44)
యనుటకు
చలరేగి మ్రోగంగ చౌకళింపుచును — (,, 53)
చెలరేగి యనుటకు
వైకుంఠమున కయి వఱిగి రావేళ — (,, 94)
ఒఱిగి యనుటకు
అవుదాలపై నిల్చి యా సిద్ధిరాజు — (,, 104)
ఔదాలు అనుటకు
వైనముగ పోట్లాడి వఱిగి రావేళ — (,, 118)
ఒఱిగి అనుటకు
వళ్లన్నె జాలు వడివడి నాటె — ఒళ్లు (,, 119)
ఒడలు సరియగు రూపము
వక ఘటం బేనుగులు వడి మావటేలు — (,, 133)
ఒక — అనుటకు
చలగుచు నేతేర సమరంబు మెఱసి (,, 144)
చెలగుచు అనుటకు
వాలేటి పీనుగులే వఱలు లొటిపిటలు (,, 150)
ఒఱలు అనుటకు

కొన్ని పాదములు ద్విపదకు లొంగవు.

పంక్తి కూళ్లిమన్నెవారు పరగనాయకులు (,, 50)
పంచాక్షరి చర్మము పఱుపుగా బఱిచి (,, 79)

మచ్చునకు చూపితిని. పరిశీలించిన నిట్టివి హెచ్చుగాగలవు. పిన యెల్లయ కవితచే సాంకర్యమును బొరసినను, శ్రీనాథుని కవితాముద్ర యీ గ్రంథమున నుండుటచే నిది శ్రీనాథకృతము. గ్రంథ విస్తర భీతిచే విపులముగా తెలుపలేదు.

ప్రస్తుత గ్రంథకర్తయు తాను సంపాదించి ప్రకటించిన కథలలో ద్విపద ఛందస్సు సరిగా లేదనియు, నది గేయ రూపముగా నుండుటచే — కవులు వాని నట్లే పాడుటకు ద్విపద గణములను దూర్చిరనియు, నిందు యతిప్రాసలు ఐచ్ఛికములేగాని నియతములు కావనియు వ్యావహారిక భాషా పదములు, అపశబ్దములు చాలా ఉన్న వని గుర్తించి యుండుటేగాక, వీనిని గూర్చి విపులముగా చర్చించినాడు. (పుట. 238 మొదలు 270). కొన్నికథలలో ద్విపదలు సలక్షణముగా యతి ప్రాసలతో నున్నట్లు అతడే గుర్తించినాడు. (పుట 259).

ఈ విషయమై విశేషముగా వివరించుటకు వీలులేదు. గ్రంథకర్తయు, సలక్షణములగు ద్విపదలు, విలక్షణములగు ద్విపదలు — సాంకర్యము పొందినవని నిరూపించుటచేత, ప్రస్తుతము ముద్రిత గ్రంథముననే గాక, తక్కిన కాటమరాజు కథలయందును, శ్రీనాథ కవి రచన యున్నట్లు మనము నిశ్చయింపవచ్చును.

గ్రంథకర్త — తాళపత్ర ప్రతులను పరిశోధించి, శ్రీనాథ కృత రచనలను వేఱుగాను, ఇతర కవి రచనలు వేఱుగాను ముద్రించిన యెడల నీగ్రంథ సంపాదన మింకను గణనీయమైయుండెడిది.

''కాటమరాజు కథలు—శ్రీనాథ రచనము'' అను విషయముపై ప్రత్యేక పరిశోధన యావశ్యకము.

కాటమరాజు యుద్ధకాలము ఖడ్గతిక్కన కాలము

కాటమరాజు కథకును, ఖడ్గతిక్కనకును నవినాభావ సంబంధమున్నట్లు జనశ్రుతియేగాక చారిత్రకులందఱును నేకగ్రీవముగా నంగీకరించిన విషయము. ప్రస్తుత గ్రంథకర్తయు నీ విషయము నిట్లు నిర్ధారణగా వ్రాసియున్నాడు.

చల్లవారి జగడము ఖడ్గతిక్కన కథ

ఇది ఖడ్గతిక్కన చూపిన మహాశౌర్యమును ప్రదర్శించు కథ యగుటచే దీనిని ''తిక్కనామాత్యుని కథ'' అనియు పిలుతురు.

కాటమరాజు కథా చక్రములో ఖడ్గతిక్కన కథకున్న లోక వ్యాప్తి మఱి యే కథకు లేదు. (పుట 194)

కాటమరాజు కథలో నింత ప్రముఖపాత్ర వహించిన ఖడ్గతిక్కన కాలమునుగూర్చి గ్రంథకర్త యిట్లు తెలిపినాడు: ఈ కాల నిర్ణయమున కాధారము కీ. శే. దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారి వ్యాసము. ఆయన వాక్యము లివి:

''ఖడ్గతిక్కన తండ్రియగు సిద్దన చోడతిక్క నృపాలుని ప్రధానమంత్రి. నెల్లూరి రాజ్యముపై సేవణ సైన్యము దండెత్తి వచ్చినపుడు ఖడ్గతిక్కనకు తమ్ముడును, సిద్దన ద్వితీయ పుత్రుడును అగు ''బాచడు'' అను భాస్కరమంత్రి ఎదుర్కొని యుద్ధము చేసి ఆ సైన్యమును సంహరించెనని కేతన దశకుమార చరిత్రలోని పద్యమువలన తెలియుచున్నది. ఈ సేవణ దేశాధీశ్వరుడగు సింఘణ దేవుని పరిపాలనాకాలము క్రీ.శ. 1210–1247.కావున ఖడ్గతిక్కనయు ఈ కాలమువాడు.'' పుట (88)

పై వాక్యములను పురస్కరించుకొని గ్రంథకర్త తన యభిప్రాయమునిట్లు వ్యక్తపఱచియున్నాడు:

''సిద్దన కొలిచిన చోడతిక్కరాజు శాసనములు క్రీ. శ. 1209–10 నుండి కానవచ్చుచున్నవి. చోడతిక్కరాజు కుమారుడగు మనుమసిద్ధి శాసనములు క్రీ. శ. 1249–50నుండి లభించుచున్నవి. కాబట్టి చోడ తిక్కరాజు కాలము క్రీ. శ. 1209–1249 అని చెప్పవచ్చును. ఇదియే సిద్దన కాలము. కావున సిద్దన కుమారుడగు ఖడ్గతిక్కన 13వ శతాబ్దమువాడని నిస్సంశయముగా చెప్పవచ్చును.'' [పుట 90]

దీనినిబట్టి ఖడ్గతిక్కన 13వ శతాబ్దమువాడని గ్రంథకర్త నిశ్చయించెను. కాని యట్లు నిర్ణయించుట సరియైన చారిత్రక పద్ధతికాదు ఖడ్గతిక్కన తండ్రికాలము క్రీ. శ. 1209–1249 అనియు, ఖడ్గతిక్కనయు నా కాలమువాడే యనియు దేవరపల్లివారు నిర్ణయింపగా, వారిరువురు అనగా—తండ్రి కొడుకు లిద్దరు—సమ కాలమువారు కారనియు, వారికి నడుమ నొక తరము 25 సంవత్సరము లెడముండుననియు నూహచేగాబోలు గ్రంథకర్త ఖడ్గతిక్కన కాలము క్రీ. శ. 1249+25=1274–80 అని స్థూలముగా నిర్ణయించి, 13వ శతాబ్దము అని నిర్ణయించినాడు.

ఈ సందర్భమున గ్రంథకర్త దేవరపల్లివారి వాక్యములు తానుదాహరించియు వానిని గ్రహింపలేకపోవుట దురూహ్యముగా నున్నది. ''ఖడ్గతిక్కన తమ్ముడును, సిద్దన ద్వితీయ పుత్రుడును'' అని స్పష్టముగా చెప్పుటయేగాక, ఆ చారిత్రకాంశము క్రీ. శ. 1210–47 మధ్య అని విశదము చెప్పుటచేత అప్పటికి భాస్కర మంత్రి అనగా తండ్రి సిద్దనతో సమకాలికుడని తేటతెల్లము. ఖడ్గతిక్కన అతనికంటె పెద్దవాడు గావున నాతడు తండ్రి సమకాలికుడు. ఇందువలన క్రీ. శ. 1249 నాటికి ఖడ్గతిక్కన పెద్దవాడై యున్నాడనియు, అదియే ఆతని కాలమని మనము నిశ్చితముగా చెప్పవచ్చును.

ఖడ్గతిక్కన వయస్సు

గ్రంథకర్త క్రీ. శ. 1249 నాటికి ఖడ్గతిక్కన వయః పరిణామము నిర్ణయించుటకు ప్రయత్నింపలేదు. కాని, ఇది కాటమ రాజు యద్ధకాలమును నిర్ణయించు సందర్భమున చాలా ముఖ్యమైనది. దీనికి మొదట మనము భాస్కరమంత్రి వయస్సు కనుగొనవలెను. క్రీ.శ. 1210–1247 మధ్య, సేవుణ రాజును

సింఘణ క్రీ.శ. 1240 ప్రాంతమున చోడతిక్కని రాజ్యముపై దండెత్తి వచ్చెనని మనము భావించినచో, ఆ నాటికి భాస్కర మంత్రికి కనీసపక్షము 35–40 సంవత్సరములైనయుండవలెను. అప్పుడాతని జననకాలము క్రీ.శ. 1200–1205 మధ్య ప్రాంత మగును. ఖడ్గతిక్కన భాస్కరమంత్రి కన్న పెద్ద కావున అతని జననకాలము క్రీ.శ. 1200 ప్రాంతమగును ఆతని వయస్సు 40 ఏండ్లకు పైబడి యుండును. కాని ఇంతకంటెను సూక్ష్మముగా ఖడ్గతిక్కన వయస్సు నిర్ణయించుటకు మఱియొక మార్గము కలదు. దానిని వివరించుచున్నాను.

భాస్కరమంత్రి దేవరపల్లివారి పొరపాటు

దేవరపల్లివారు భాస్కరమంత్రి సిద్ధన ద్వితీయ పుత్రునిగా చెప్పుట పొరపాటు. ''దశకుమార చరిత్ర'' చూచినచో, సిద్ధనకు భాస్కరమంత్రి 6వ కుమారుడు గాని రెండవ కుమారుడు గాదు. [6]

దశకుమార చరిత్ర-ప్రథమాశ్వాసము

''సిద్ధి సేనాపతి చోడతిక్క జననాథశిఖామణికాప్తమంత్రి''

ఆతని భార్య పోలాంబిక— 62 ప.
వారి సంతానము— 63 ప.

సీ. విపుల నిర్మల యశో విసర గర్భీకృత
దిక్కుండు నాదగు తిక్కనయును
దర్పిత క్రూర శాత్రవ సముత్కరతమో
భాస్కరుం డనదగు భాస్కరుండు
అప్రతి మానరూపా ధరీకృత మీన
కేతనుం డనదగు కేతనయును
నిజ భుజాబల గర్వ నిర్జితోగ్ర ప్రతి
మల్లుండు నా దగు మల్లనయును –
గీ. శ్రీయుతుండు దోహత్త నారాయణుండు
మల్లనయు నీతి విక్రమ మండనుండు
పిన్న భాస్కరుండును బుద్ధ పీఠికరుడు
పెమ్మనయు నుదయించిరి పెంపుమీఱ– (64ప)

పాఠకులకు సుగమముగా నుండుటకై వంశవృక్షము నిచ్చుచున్నాను.

సిద్దన - పోలమ్మ

తిక్కన	భాస్కరుడు	కేతన	మల్లన	మల్లన	పిన్న భాస్కరుడు	పెమ్మన
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)

ఆ వెనుక 'దశ కుమార చరిత్ర'లో పై పద్యము తరువాత సిద్ధన కుమారులు క్రమముగా వర్ణింపబడిరి.

1) తిక్కన – ఇతడే ఖడ్గతిక్కన [ప. 66]
2) భాస్కరుడు— ఈతని గూర్చి చారిత్రక విశేషములు లేవు. [ప. 75]
3) కేతన – [ప. 76]
4) మల్లన – [ప. 77]
5) మల్లన – [ప. 78]
6) పినభాస్కరుడు బాచన

చ. ఉరవడి నుగ్రసేవణ పయాదధిబాడ బవహ్ని చాడ్పునే
దరి కొని కుంభజున్మ క్రియుద్రాగి రఘుక్షితునాథుమాడ్కి న
చ్చెరువుగ నింక జేసెనని చెప్ప జనప్రకరంబు విక్రమా
భరణుని సిద్ధనార్య సుతు బాచని నన్నగంధ వారణునే—
[ప. 79]

7) పెమ్మన [ప. 80]

పై వివరమువలన సిద్ధన పుత్రులలో రెండవవాడైన భాస్కరమంత్రి సేవుణ రాజును జయించలేదనియు, నాతని జయించిన వాడు అతని ఆఱవ తమ్ముడగు పిన భాస్కరుడనియు స్పష్టమగుచున్నది. 'బాచన' అనునది పినభాస్కరునికి తప్ప రెండవ వాడైన భాస్కరునికి లేదు. కావున పినభాస్కరుడే సేవుణరాజును జయించెను.

ఖడ్గతిక్కన సిద్ధన ఏడుగురు కొడుకులలో మొదటివాడు. అతనికి, సింఘణను జయించిన బాచన సోదరునికి మధ్య 5గురు గలరు. ఒక్కొక్కరిమధ్య 2 ఏండ్లు ఎడమున్నను ఖడ్గతిక్కన వయస్సు 1240 నాటికి 40 ఏండ్లుకాక 50 యేండ్లు కాం మగును. అప్పుడాతని జనన కాలము క్రీ.శ. 1190 ప్రాంతమగును.

ఖడ్గతిక్కన క్రీ. శ. 1249 నాటికి ఏబది ఏండ్లకు పైబడిన వాడని నిర్ణయించుటకు 'దశకుమార చరిత్రను'ననే నొక యాధారము గలదు.

'దశకుమార చరిత్ర' రచనా కాలము క్రీ.శ. 1249–50. ఆనాటికి ఖడ్గతిక్కనకు నలుగురు పుత్రులుండినట్లును, వారు వర్ధమానులై యున్నట్లును అందే కలదు

సిద్ధయ తిక్కన (ఖడ్గతిక్కన) చానమాంబను వివాహము చేసికొనెను. [ప. 67]

వారికి పుత్రులు
1) సిద్ధన [70 ప]
2) కొమ్మన [71 ప]
3) ఇమ్మడి [72 ప]
4) సుమ్మడి [73 ప]

స్పష్టతకై వంశవృక్షము నిచ్చుచున్నాడను.

ఖడ్గతిక్కన — చానమ

సిద్దన | కొమ్మన | ఇమ్మడి | ముమ్మడి

పై దానినిబట్టి ఖడ్గతిక్కన క్రీ. శ. 1250 నాటికి ఏబది, అరువదేండ్ల మధ్యవయస్సు వాడని మనము నిర్ణయింప వచ్చును. ఖడ్గతిక్కన తిక్కన సోమయాజి పెదతండ్రి కొమారుడు. సిద్దన సోదరుడు కొమ్మన. కొమ్మన కుమారుడు తిక్కన.

తిక్కన మనుమసిద్ధి రాజునకు నాతడు క్రీ. శ. 1249లో రాజ్యమునకురాగానే మంత్రియయ్యెను. కేతన 'దశకుమార చరిత్ర'లో నప్పటకి తిక్కన కౌమార వయస్సులో ననగా 30–35 ఏండ్లున్నట్లుగా తెలిపినాడు. అందువలన ఖడ్గతిక్కన కవితిక్కనకన్న ఇరువదేండ్లు పెద్ద.

తండ్రి సిద్దన తిక్కరాజునకు మంత్రియైనను ఆతని కొడుకు ఖడ్గతిక్కన—తిక్కరాజు కొడుకగు మనుమసిద్ధికి మంత్రి కాలేదు కవి తిక్కనయే మంత్రియైనాడు. ఇది కవి తిక్కన లోకోత్తర ప్రతిభకు నిదర్శనము.

ఖడ్గతిక్కన క్రీ. శ. 1250 నాటికి 50 ఏండ్లకు పైబడిన వాడని పై హేతువులచే నిర్ణయము చేయవచ్చును.

కాటమరాజు యుద్ధము - ఖడ్గ తిక్కన

ఖడ్గ తిక్కన కాలము క్రీ. శ. 1200–1250 కావుననే చారిత్రకులు కాటమరాజుతో నాతడు యుద్ధముచేసి మరణించిన సంవత్సరము క్రీ. శ. 1259 అని నిర్ణయించిరి. అది కాకతీయ గణపతి చక్రవర్తి కాలములో జరిగినదనియు తెల్పిరి. పైని నిరూపించిన ఖడ్గ తిక్కన వయస్సునుబట్టి క్రీ. శ. 1259 కాటమ రాజు యుద్ధకాలమని నిశ్చితమగుచున్నది.

కాని ప్రస్తుత గ్రంథకర్త పైకాల నిర్ణయము అంగీకరింప లేదు. తనకు నూతనముగా లభ్యములైన కాటమరాజు కథలలో కొన్నింటి రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు వీరి ప్రశంస లుండుట చేత నీ యుద్ధ కాలమును గూర్చి యిట్లు వ్రాసినారు:

"ఈ యుద్ధము క్రీ. శ. 1290–97 ప్రాంతముల జరిగి యుండునని చెప్పవలెను."

"ఈ యెఱ్ఱగడ్డపాటి పోట్లాట క్రీ. శ. 1280–1297 మధ్య కాలము (అనగా రుద్రమదేవి చివరకాలము ప్రతాపరుద్రుని యౌవరాజ్య కాలము) లో జరిగెననుట నిస్సంశయము. చిత్రభాను సంవత్సరమునకు క్రీ. శ. 1282 సరిపోవుటవలన అదియే యుద్ధ కాలము కావచ్చును." (పుట 108)

ఒక్క పుటలోనే ఒక వాక్యములో నీ యుద్ధము క్రీ. శ. 1290–97 ప్రాంతమని, ఆ వెనుకనే తిరిగి క్రీ. శ. 1280–1297 అని చెప్పుట పరస్పర విరుద్ధము. అంతేకాక, "క్రీ. శ. 1282 యుద్ధకాలమని చెప్పవచ్చును" అని చెప్పుటచేత గ్రంథ కర్తకే యీ కాలనిర్ణయముపై నిశ్చితాభిప్రాయము లేనట్లు నిశ్చిత మగుచున్నది.

ఈ యుద్ధ కాలము గ్రంథకర్త యభిప్రాయము ననుసరించి క్రీ. శ. 1282 అయిన యెడల అప్పటికి ఖడ్గతిక్కన 1200–1250 మధ్యవాడు గావున అతని వయస్సు 82 ఏండ్లు. క్రీ. శ. 1290 అయిన 90 ఏండ్లు. అట్టి పండు ముసలి వయస్సులో యుద్ధము చేయుట సుతరాము అసంభవము గదా!

ఖడ్గతిక్కననుగూర్చి లోకములో ప్రచారములోనున్నకథను పురస్కరించుకొనినను నీ కాలము క్రీ. శ. 1282 అసంభావ్యమే యగుచున్నది. ఆ వయస్సులో భార్య హేళనచేయుట, తల్లి హేళన చేయుట మొదలగునవి ఎంతమాత్రమును జరుగనేరవని లోక వృత్తమువలన విశదము. కాబట్టి చారిత్రకముగానే గాక, జనశ్రుతిని బట్టి ప్రస్తుత గ్రంథకర్త కాలనిర్ణయము పూర్తిగా నిరాకరణీయము.

ఈ సందర్భమున గ్రంథకర్త చరిత్ర యననేమో తెలియక, కేవలము ప్రజాసామాన్యములో ప్రచారములలోనున్న కథాంశములను గ్రంథస్థముచేసిన జానపద కవుల రచనలకు ప్రామాణ్యము సంగీకరించుట చారిత్రక పరిశోధనా పద్ధతులకు విరుద్ధము. తనకు క్రొత్తగా లభించిన యాధారము లున్నప్పుడు ఆ యాధారములు, తనకు ముందున్న చరిత్రకారులు వ్రాసిన వ్రాతలతో నెంతవఱకు సమన్వయము చెందుచున్నవి అన్న విషయము గ్రంథకర్త చర్చింపనే లేదు. ముఖ్యముగా ఖడ్గతిక్కన కాలమునుగూర్చి చర్చింపనందు వలనను, నెల్లూరి తెలుగు చోడరాజులగు మనుమసిద్ధి, నల్లసిద్ధి వీరల సమకాలికత్వము సమన్వయము చేయనందువలనను, నీయుద్ధకాల నిర్ణయము విషయమున ఒకటిగాదు, రెండుకావు, 36 పుటలు వ్యర్థములైనవి. విశ్వవిద్యాలయ పరిశోధనా గ్రంథమున నిట్టి విపర్యాసము లుండరాదు.

నల్లసిద్ధి - ఖడ్గతిక్కన

గ్రంథకర్త కాటమరాజు కథకు సంబంధించిన చారిత్ర కాంశము లన్నింటిని సామూలాగ్రముగ పరిశీలించినాడనుటలోనే సందేహములేదు. కాని ఆతడు సేకరించిన చారిత్రకాంశములను సమన్వయింపలేదు. క్రీ. శ .1250–60 ప్రాంతమున నిరువురు నల్లసిద్ధులు గలరు.

నల్లసిద్ధి I (చోడుడు)

చోడతిక్కరాజు మనుమడు. ఇతడు మనుమసిద్ధి కొడుకు. ఈతడు 1270–75 ప్రాంతమువాడు. ఖడ్గతిక్కన తండ్రియైన

సిద్దన క్రీ.శ.1210–47 మధ్య పాలించిన తిక్కరాజు మంత్రి యగుటచేత ఖడ్గతిక్కన తండ్రికాలముననే పెద్దవాడగుట చేతనుని నల్లసిద్ది కాలమున నాతడుండుట అసంభవము. (చూడుడు: మల్లంపల్లి సోమ శేఖరశర్మగారి పీఠిక. కాటమరాజు కథ పుట–28).

నల్లసిద్ధి II (పల్లవుడు)

క్రీ. శ. 1250లో కాంచీపురమును పల్లవరాజైన నల్లసిద్ధిరాజు పాలించుచుండెను. ఈతడు చోళరాజైన మనుమసిద్ధికి సామంతుడై యుండెను. పట్టపురావి కైఫీయతులో "కాంచీ పురాధీశ్వరుడైన నల్లసిద్ధదేవరాజు, నెల్లూరి సింహాసనస్థుడు" అని కలదు. ఇతనియొద్ద ఖడ్గతిక్కన దండనాయకుడై యున్నట్లు పై కైఫీయతు తెలుపుచున్నది

(చూ. పై పీఠిక, పుట 18)

కాటమరాజు కథలో నల్లసిద్ధి పల్లవరాజని యున్నది. కాబట్టి కాంచీపురాధీశ్వరుడై, మనుమసిద్ధికి సామంతుడై నెల్లూరి ప్రాంతమున కొంతభాగము పాలించుచున్న నల్లసిద్ధియే రెండవ నల్లసిద్ధియని మనము నిర్ణయింపవచ్చును.

కీ. శే. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు పూర్వోక్త పీఠికలో కాంచీపురాధీశ్వరుడు నల్లసిద్ధి నెల్లూరి కధిపతియగుట సంభవింపనేరదని యిట్లు వ్రాసినారు: "ఈతని శాసనములన్నియు కాంచీపుర సమీప ప్రాంతముననే కానవచ్చుటచేత నితడా ప్రాంతమునే పాలించుచుండినటుల చెప్పవచ్చును. ఇతడు కూడ క్రీ. శ పదమూడవ శతాబ్దిలోనే యుండినను నెల్లూరి కధిపతి కానందున ఇతడు మన కాటమరాజు కథలోని నల్లసిద్ధి కానేరడు."

(పుట 29)

కాని, ఆ కాలమున కంచి, నెల్లూరు ఒకే భూభాగము ప్రాంతముగా నుండినట్లు క్రీ. శ. 1250 ప్రాంతమువాడగు కేతన తన ఆంధ్రభాషా భూషణమున నిట్లు చెప్పినాడు:

"కంచి నెల్లూరు మఱి యోరుగల్లవంతి
యను పురంబులపై గంగ కరుగునట్లు"

[1–13]

దీనినిబట్టి కంచి నెల్లూరి రాజ్యమునకు దక్షిణపు సరిహద్దు. కంచి నెల్లూరు ప్రాంతము ఒకే భూభాగమని శ్రీనాధుని హరవిలాసము నుండి తెలియవచ్చుచున్నది. చోడరాజు మనుమసిద్ధి కాలమున నెల్లూరుకు దక్షిణ ప్రాంతము కాంచి రాజధానిగా నల్లసిద్ధి మనుమసిద్ధికి మాండలికుడై పాలించుచుండెను. ఇందువలన కాంచీపురాధీశ్వరుడగు నల్లసిద్ధిని, నెల్లూరు అధిపతిగా కైఫీయతులు పేర్కొన్నవి. ఇతనికి, కాటమరాజుకు యుద్ధముజరిగినది. కథలలో నిట్లే యున్నది కాని, నల్లసిద్ధి మాండలికుడగుటచేతను, నెల్లూరు రాజ్యమునకు నేకముగా మనుమసిద్ధి రాజగుటచేతను కథలలో మాండలికుడైన నల్లసిద్ధి పేరుండగా రాజ్యమున కంతటికి సర్వాధికారియైన మనుమసిద్ధి పేరు లోకవ్యవహారము నీ కథకు సంబంధించినదైనది. కథలో నల్లసిద్ధియని, లోకములో మనుమసిద్ధియని ఏర్పడుటకు కారణము పై రాజకీయ పరిస్థితియేయని తెలియవలెను.

తిక్కన సోమయాజి మనుమసిద్ధివద్ద మంత్రి దండనాయక పదవి వహించిన తరువాత, ఖడ్గతిక్కన నల్లసిద్ధియొద్ద మంత్రి దండనాయక పదవి వహించెను. పట్టపురావి కైఫీయతును, స్థానిక సంపుటము 18లోనున్న కాటమరాజు కథయు నీ విషయము నిర్ధారించుచున్నవి. ఖడ్గతిక్కన నల్లసిద్ధి దండనాయకుడైనను నతడు కాంచీపురమున గాక నెల్లూరునందే నివసించుచుండెను. కాటమరాజు యుద్ధ సందర్భము దీనిని స్థిరపఱుచుచున్నది.

నల్లసిద్ధి, మనుమసిద్ధి యిద్దఱును క్రీ. శ. 1262 ప్రాంతములకు పైగా జీవించియున్నారు. కావున కాటమరాజు యుద్ధము క్రీ శ. 1259వ సంవత్సరమున జరిగినదని మనము నిశ్చయింపవచ్చును.

ఖడ్గతిక్కన కథతో సంబంధించిన కాటమరాజు కథలేదు. కావున పై కాల నిర్ణయము సర్వాంగీకృతము కావచ్చును. అప్పడది కాకతి గణపతిదేవుని కాలముననే జరిగినది. ద్వితీయ ప్రతాపరుద్రుని కాలము క్రీ. శ. 1295–1323న జరుగలేదని స్పష్టమగుచున్నది. ఖడ్గతిక్కన కాలము నిందులకు తోడ్పడుచున్నది.

గ్రంథపీఠిక-సాంఘిక వ్యవస్థ

తెలుగున పల్నాటి వీరచరిత్రము, ఆంధ్రుల పండ్రెండవ శతాబ్ది సాంఘిక వ్యవస్థయు, కాటమరాజుకథ పదమూడవ శతాబ్ది సాంఘిక వ్యవస్థయు దెలుపును. అట్లయ్యును, నీ గ్రంథపీఠికలో ప్రత్యేకముగా సాంఘిక వ్యవస్థ అను శీర్షికయేలేదు. చారిత్రక సాహిత్య విషయముల చర్చ తగ్గించి, గ్రంథకర్త ఈ గ్రంథము నుండి విశేషముగా మనకు తెలియుచున్న సాంఘిక విషయములను నిరూపించవలసియుండెను. కాని యట్లు జరుగలేదు. ఈ సమీక్ష యందా విషయము లన్నింటిని తెలుపుటకు వీలులేదు కాన రెండింటిని మాత్రమే తెలుపుచున్నాను.

వీరశైవమత వ్యాప్తి

బసవన ప్రతిపాదించిన వీరశైవమతము ఆ కాలమున విశేష వ్యాప్తిలో నుండెను. పంపాద్రి కథలో పెద్దమ్మ బసవని నోము నోచును జంగములు పంక్తి భోజనమునకు వత్తురు. పెద్దిరాజు సభచేసి బసవపురాణమును వినగోరును. కాని బ్రాహ్మణులు బసవపురాణము సంతానహీనులు వినగూడదని పెద్దిరాజుతో చెప్పుదురు. రాజు సభ చాలించును. (పుట 131–132) బసవపురాణ ప్రసక్తి ఈ గ్రంథమున వచ్చుట చాలా ముఖ్యమైనది. ఇచట బసవపురాణ మనగా పాల్కురికిసోమనాథుడు రచించిన ద్విపద బసవపురాణము.[7]

బసవపురాణము

ఇందు వైదికమతము, వైదిక కర్మలు గర్హింపబడి ఖండితములైనవి. అందుచేత బ్రాహ్మణులందఱు దీనిని నిరాకరింతురు. ఇట్లే కాకతి ప్రతాపరుద్రుని కాలమున నాతడు బసవ పురాణము వినకోరగా బ్రాహ్మణులు దానిని వినగూడదని చెప్పుదురు. దీనివలన కాటమరాజు కథాకాలమునాటికి తెలుగు బసవపురాణము ప్రచారములో నున్నట్లు మనము నిశ్చయింపవచ్చును.

శ్రీశైల దేవాలయ నిర్మాణము

పోలురాజు కథలో "చంద్రగుప్తుని చాటువ" కలదు (పుట 300–308). ఇందు శ్రీశైల దేవాలయ నిర్మాణకథ పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రమున చెప్పిన దానికన్న భిన్నముగ నున్నది. అందు చంద్రగుప్తుడను రాజు శ్రీశైల యాత్రకు తన కుమార్తె అయిన చంద్రవతీకన్యతో వచ్చినట్లును, ఆమె శ్రీశైలమున లింగమును ప్రతిదినము మల్లికాపుష్పములచే పూజింపగా, శివుడు ప్రత్యక్షమై వరమడుగుమనిన ఆమె, లతడు మల్లికార్జునుడను నామముతో వెలయవలయునని కోరినట్లును, శివుడంగీకరించెననియు నావెనుక–బల్లహుడను రాజు శ్రీశైల దేవాలయము నిర్మాణము చేసినట్లును చెప్పబడినది.[8]

ప్రస్తుత గ్రంథమున కథయిది

చంద్రగిరియను పట్టణమేలెడు చంద్రగుప్తుడను రాజునకు మల్లికాదేవియను కుమార్తెగలదు. చంద్రగుప్తునకు ఆవులమందలు చాలాగలవు. అందొక ఆవు పాలియ్యలేదు. ఆ యావు ప్రతిదినము ఒక పుట్టపై పాలు గ్రవించుటచూచి–రాజు ఆపుట్ట త్రవ్వించెను. వెంటనే, ఆతడు, అతని సైన్యము మూర్ఛిల్లినవి. ఆ పుట్టలో శివుడున్నాడని వారలకు తెలియదు. మల్లికాదేవి కావిషయము తెలిసి, శివుని ప్రార్థించెను. శివుడామె భక్తికిమెచ్చి ప్రత్యక్ష మయ్యెను. చంద్రగుప్తుడు శ్రీశైలమున మల్లికార్జునునకు దేవాలయ నిర్మాణము గావించెను.

ఈ కథ క్రొత్తదిగానున్నది. ఇంతవఱకు శ్రీశైల చరిత్ర కెక్కలేదు. చంద్రగుప్తుడు – కుమార్తె చంద్రవతి లేక మల్లిక నామములు సమానముగానున్నను శివుడు ప్రత్యక్షమగుట వేఱు విధముగానున్నది. అది ఆవుతో సంబంధించినది. కాటమరాజునకు పశుగణము విస్తారము గావున – శ్రీశైల దేవాలయ నిర్మాణము దానితో సంబంధింపజేయబడినది. ఇది పరిశోధింపదగిన విషయము. ఇంకను పాలికేతరాజు, మండెముకోట, సాగుమానము, నందికేశ్వరుని నోము మున్నగు వానినిగూర్చి తెలియదగిన విషయములున్నవి. ఇవి యన్నియు పీఠికలో లోపించినవి. ద్వితీయముద్రణమున గ్రంథకర్త చేర్చునుగాక.

అ ధో జ్ఞా పి క లు

1 దేవేంద్ర సత్యార్థి – **Meet my people, Sangam Publications** – 1946. పుట 181.

2 జానపదకవి గంగాధరం సప్తమ వర్ధంతిసభ. (13–3–77).

3 'అనాదృత వాఙ్మయ భిక్షువు' నేదునూరి గంగాధరంగారు– 'భారతి' అక్టోబరు–1977. పుటలు 48–50.


4 "అగుమంచి కథను వేటూరి ఆనందమూర్తిగారు పరిష్కరించిరి" అనునది పొరపాటు (పుట 70).

5 కీ. శే. మల్లంపల్లి సోమశేఖరశర్మగారి పీఠికలో కవితా రచనా విమర్శనమే లేదు.

6 కీ. శే. మల్లంపల్లి సోమశేఖరశర్మగారును దేవరపల్లివారి ననుసరించి భాస్కరమంత్రి రెండవ కుమారుడని వ్రాసినారు. కాటమరాజు చరిత్ర, పీఠిక. పుట. 26.

7 పాల్కురికి సోమన బసవ పురాణము – ఆంధ్రగ్రంథమాలలో నేడు ప్రస్తుత వ్యాసకర్త పీఠికతో పునర్ముద్రణమంది ప్రచారమున నున్నది.

8 పండితారాధ్యచరిత్ర పర్వత ప్రకరణము. ఇది ఆంధ్రగ్రంథ మాల వారిచే ముద్రితమైనది.



డాక్టర్ బి. ఆర్. కె. రావు

గాల్ బ్రెయిత్ ఆర్థిక ఆలోచన

జీవితం : రచనలు

భారతదేశంలోని విద్యావంతుల్లో సాధారణంగా జాన్ కెన్నెత్ గాల్ బ్రెయిత్ పేరు తెలియని వారుండరు. మన దేశంలో ఆయన అమెరికా రాయబారిగా పని చేసారు. 'నేషన్ బిల్డింగ్' అనే విషయంలో పండితుడైన చెస్టర్ బౌల్స్‌వలె గాల్ బ్రెయిత్ కూడా భారతదేశానికి అత్యంత ప్రీతిపాత్రుడైన మిత్రుడుగా పని చేసాడు. చెస్టర్ బౌల్స్‌వలె భారతదేశ అవసరాలను అమెరికా ముందుంచి మన ప్రయోజనాలను చాలవరకు సాధించి ఇచ్చేవాడు. నిజానికి వీరిద్దర్ని అమెరికాలోని ఇండియా రాయబారులని గౌరవం కొద్దీ చెప్పేవారు. గాల్ బ్రెయిత్ అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో చాల గొప్ప విశ్వ విద్యాలయంగా పేరు పొందిన హార్వర్డ్ విశ్వ విద్యాలయంలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. కెన్నెడీ ఆది గొప్ప డెమోక్రాటిక్ నాయకులు, అమెరికన్ విశ్వవిద్యాలయాల్లోని గొప్ప ప్రొఫెసర్లను, తమ దేశసేవకు తగినంత గొప్పగా ఉపయోగించుకుని, లాభం పొందడం గమనార్హతగల ప్రముఖ విషయం. గాల్ బ్రెయిత్ అమెరికా దేశంలోని ప్రముఖ ఉదారవాద ఆర్థిక ఆలోచకుల్లో ఒక గొప్ప మేధావి అని చెప్పవలసి ఉన్నది. అమెరికా, కెనడాల్లో మితవాద సోషలిస్టు డెమోక్రాట్లను 'లిబరల్స్' అని పిలుస్తారు. ప్రొఫెసర్ గాల్ బ్రెయిత్ వ్రాసిన ముఖ్య గ్రంథా లిచ్చట చూద్దాము : (1) మోడరన్ కాంపెటిషన్ అండ్ బిజినెస్ పాలసీ (1938); (2) ది ఎకనామిక్ ఎఫెక్ట్స్ ఆఫ్ ది ఫెడరల్ పబ్లిక్ వర్క్స్ ఎక్స్‌పెండిచర్స్ (1940); (3) ది అమెరికన్ కేపిటలిజమ్ (1952); (4) ది ఎఫ్లూయెంట్ సొసైటీ (1958); (5) ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఇన్ పర్‌స్పెక్టివ్ (1963). ఇందులోని చివరి మూడు పుస్తకాల్లో అతని ముఖ్యమైన అభిప్రాయాలు విశదీకరింపబడినవి.

ఆర్థిక ఆలోచన

ఆర్థిక పురోగమనం ఉద్దేశ్యం

ఆర్థికాభివృద్ధి పురోగమనంవల్ల కొన్ని నష్టాలు కల్గుతున్నాయని గాల్ బ్రెయిత్ బాధపడ్డారు. హద్దులు లేకుండా ఆర్థికపురోగమనం సాగటంవల్ల జాతి కంతటికి అపకారం జరుగవచ్చు. దారిద్ర్యం జాతికి అవమానకరమైన విషయమైనట్లు, అవధులు లేని ఆర్థిక పురోగమనం కూడ ప్రమాదకరం కావచ్చు. అపరిమిత ఆర్థిక పురోగమనం ప్రపంచాన్ని (1) కొరత (2) అత్యధిక భాగ్యంగల భాగాలుగా విభజిస్తుంది అని 'ఎఫ్లూయెంట్ సొసైటీ' (పే. 226) అనే గ్రంథంలో వ్రాసాడు. ఈ రెండు భాగాలమధ్య నున్న వ్యత్యాసాన్ని తొలగించాలి. అయితే గాల్ బ్రెయిత్‌కు ఆర్థిక పురోగమనం అంటే భయంలేదు. ఆర్థిక పురోగమనం దానంతటి కది చెడుది కాదు. నిజంగా ప్రతి మానవ కార్యకలాపం కూడా ఆర్థిక పురోగమనాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలి. అయితే ఆర్థిక పురోగమనానికొక ఉద్దేశ్యం అంటూ తప్పకుండా ఉండటమేగాక, అది మంచి లక్ష్యమై ఉండాలి. ఏ మాత్రం కూడా సమర్థించడానికి వీలులేని హెచ్చు కోర్కెల్ని, వాటిని తీర్చే హెచ్చు వస్తువుల్ని సృష్టించడానికి పనిచేసే ఉన్మాదభరిత ఆర్థిక పురోగమనం ప్రమాదకారి. (గాంధిజీ కూడా యిలాగే అభిప్రాయ పడ్డారు). భౌతిక పురోగమనం కొరకు పోటీపడే అత్యధిక భాగ్యవంతులు తమ కార్యకలాపాల వత్తిడి క్రిందపడి నలిగిపోవచ్చు. 'సౌభాగ్యం హెచ్చిన కొద్దీ, మురికి గాఢంగా పేరుకుంటుంది'.

బీదవాడికి తన సమస్య లేమిటో సరిగ్గా తెలుసు. వాటి పరిష్కారమార్గాలు కూడా అతనికి తెలుసు. అతనికున్న వస్తువులు కొద్ది కావడంవల్ల, యింకా కొద్దిగా వస్తువుల్ని కోరడము అతనికి పరిష్కార జ్ఞానాన్ని ఇస్తున్నది. భాగ్యవంతుడికి తన కార్యకలాపాల వల్ల వచ్చే నష్టాలు తెలుసునని 'ది ఎఫ్లూయెంట్ సొసైటీ' అనే గ్రంథంలో వ్రాసాడు. భాగ్యవంతుని వద్ద వస్తువులు హెచ్చుగా ఉంటాయి. 'వాటిని మంచి ఉద్దేశ్యంలేని పనులకు ఉపయోగించాలని లేదా బుద్ధిహీనుడుగా పరిగణించబడతానని అనుకుని పనిచేసే ప్రవృత్తి భాగ్యవంతునిలో బాగా కన్పిస్తుంది' అని కూడా గాల్ బ్రెయిత్ వ్రాసాడు. క్రమబద్ధమైన తీరులేకుండా ఆర్థిక పురోగమనం జరగరాదని గాల్ బ్రెయిత్ గట్టిగా అభిప్రాయపడుతున్నారు. ఆర్థికాభివృద్ధి పొందిన దేశాలు ఉత్పత్తిని పెంచడాన్ని, ప్రజల ఉత్పాదన శక్తిని పెంచడాన్ని తమ ఆర్థిక పురోగమనానికి లక్ష్యాలుగా పెట్టుకున్నవి. ఆర్థిక సారస్వతంలో కూడా ఉత్పత్తిని విస్తృతం చెయ్యడం మీదనే జోరుగా నొక్కిపెట్ట బడటము ఆశ్చర్యకరమైన విషయము. ఉత్పత్తి చేయబడిన వస్తువులు ఏ పనులకు ఉపయోగించబడాలో చెప్పే 'ఆచరణ యుక్తమైన వినియోగ సిద్ధాంతం' లేకపోవడం విచారకరం. ఇటువంటి సిద్ధాంతమే గనుక తయారు చేయబడక పోయినట్లయితే అభివృద్ధిచెందిన దేశాల వినియోగ పద్ధతులు, అలవాట్లు దారితప్పి పరుగులు తీయవచ్చు. అందువల్ల ఆర్థిక వ్యవస్థను గురించి ఆలోచించేటప్పుడు వినియోగానికి సమధిక ప్రాధాన్యం యివ్వవలెను. ''సామాన్య

లేకుండా శూన్యంగా ఉన్న గదిలో సామాన్లు ఉండడం ఒకరకమైన విషయం. పునాదులు కదిలిపోయేవరకు ఆ గది నిండా సామాన్లు కుక్కుతూ ఉండటం మరొక రకమైన విషయం. వస్తూత్పత్తి సమస్యను పరిష్కరించడంలో విఫలమైతే మానవాళి పాత బ్రతుకులోను, దైన్యయుక్తమైన దురదృష్టంలోను కొట్టుకులాడుతూనే ఉంటుంది. అయితే ఆ సమస్యను పరిష్కరించామని తెలుసుకోవడంలోను, తరువాత తీసుకోవలసిన యుక్త చర్యను తీసుకోవడంలోను అపజయం పొందితే పై జరిగినంత విషాదాంతకంగాను ఉంటుంది'' అని గాల్ బ్రెయిత్ 'ది ఎఫ్లూఎంట్ సొసైటీ'అనే తన గ్రంథంలో వ్రాసారు.

పారిశ్రామిక సమాజాలు మరింతగా భాగ్యవంతమైన కొద్దీ, ముఖ్యంగా ప్రయివేటు ఉత్పత్తి కార్యక్రమాలు, ఉత్పాదనకు కావలసిన ప్రోత్సాహకాలు లభ్యంకాక కుదించుకుపోతాయి. భాగ్యవంతమైన సమాజాల్లో చాల మందికి ప్రాణులుకోరే కనిష్ట గ్రాస, వాస, వస్త్రాది అత్యవసరాలు తీరడమే ఇందుకు కారణమని, అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆర్థిక పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని గాల్ బ్రెయిత్ వ్రాసాడు.

సమానీకరణార్థ ప్రతిశక్తి భావన

(The Concept of Countervailing Power)

తన ''అమెరికన్ కేపిటలిజమ్''అనే గ్రంథంలో ఈ 'సమానీకరణార్థ ప్రతి శక్తి భావన'ను గాల్ బ్రెయిత్ వివరించాడు. 'డార్వినియ నిజం', 'కేపిటలిజం' లకు వ్యాపార పోటీ ప్రాణము. ఆ పోటీని అంతు లేనంతగా కొనసాగిస్తే పెట్టుబడిదారీ విధానం (కేపిటలిజం) పునాదులు కదలిపోయి పెట్టుబడిదారీ విధానం వల్ల వచ్చే చెడులను ఎదుర్కొనే శక్తి పోటీ విధాన తీవ్రతకు సమానమైన స్థాయిలో ఏర్పడి పని చేస్తుంది. పెట్టుబడిదారీ విధానంలోని విపణి వీధి (మార్కెట్)లో సిండికేట్లు, ట్రస్టులు, శ్రామిక యూనియన్లు మొదలైన యజమానుల; కార్మికుల సంఘాలు ఏర్పడినట్లయితే అదే విపణి వీధిలో వాటి ప్రతిగా పనిచేసే సమాన బలం గల సంఘాలు ఏర్పడి పని చేస్తాయి. ఆ స్థితిలో **మొదట** ఏర్పడ్డ సంఘటిత శక్తిని, తద్విరుద్ధంగా ఏర్పడ్డ సంఘటితశక్తి క్రియాశీల రహితం చేస్తుంది. ఒక పరిశ్రమలో ఒక వ్యాపార సంస్థకు దక్కే లాభాలపై అదే పరిశ్రమలోని యితర వ్యాపార సంస్థలు దెబ్బ తీయకపోవచ్చు. కాని చిల్లర వ్యాపారులు, శ్రామికులు, వినియోగదార్లు మొదలైనవారు, ప్రభుత్వము విపరీత లాభాల నార్జిస్తున్న పెద్ద సంఘటిత పారిశ్రామిక సంస్థా సముదాయాల లాభార్జనాశక్తిని అదుపులో పెట్టవచ్చునని గాల్ బ్రెయిత్ 'ది అమెరికన్ కేపిటలిజం' అనే గ్రంథంలో వ్రాసాడు. ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం ఆర్థిక కార్యకలాపాల మీద హెచ్చుగా ఖర్చుచేయడానికి గాల్ బ్రెయిత్ అనుకూలుడు.

గాల్ బ్రెయిత్ పెట్టుబడిదారీ విధానానికి అనుకూలుడు కాదు. ఆర్థిక పురోగమనం దానంతటకది తప్పని చెప్పడు. అయితే అది సమాన పంపిణీకి, సద్వినియోగానికి, ప్రజాసంక్షేమాభివృద్ధికి తోడ్పడాలంటాడు. అల్పాభివృద్ధి దేశాలు అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి రావాలంటాడు. వెనుకబడిన దేశాల కాయన మిత్రుడు. ఈ దేశాల్లో ప్రజాస్వామ్యం వర్ధిల్లడానికి వినియోగాన్ని పెంచే ప్రణాళికా రచన కావాలంటాడు. ఈ భారతదేశ మిత్రుడు గొప్ప ఆర్థిక శాస్త్రవేత్తేగాక రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమానత్వాల సమ్మిళితమైన ప్రజాస్వామ్యం కావాలని గాఢంగా కోరుతున్నారు.

'హృదయులయ'

శ్రీ నందిని సిధారెడ్డి

అయి వుండాలి!
ఆకాశానికి హృదయం,
మేఘమే అయి వుండాలి!!
ఎందుకంటే—
మేఘమే......
తడిసి ముద్దయి పోతుంది;
గుండెపగిలి వర్షిస్తోంది;
ఒకోసారి నిప్పుల్నీ చిమ్ముతోంది;

ఈ లక్షణాలన్నీ ఉంటేనే కదా,
దాన్ని హృదయమంటాం!


క్రొత్తది!
అమృతాంజన్
లిమిటెడ్‌వారి
విశిష్ఠమైన
ఆముదము
శుద్ధిచేసినది.
వాసనలేనిది.
AMRUTANJAN
LTD'S
SPECIAL GRADE
CASTOR
OIL
SUPERIOR
PURE REFINED
AND ODOURLESS
NET CONT. 200 ML LOT No.
Manufactured by
AMRUTANJAN LTD.
UPPAL — HYDERABAD
MADE IN INDIA
మూడు
సైజులలో
లభిస్తూంది:
50 మిలి
100 మిలి
200 మిలి
OBM 3270 TG

శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

జీవితం

మెట్లెక్కి నేను లోపలికి ప్రవేశిస్తూండగానే నన్నుచూసి కంపౌండరు చిరునవ్వు నవ్వి చేతితో ఓ మూలగది—అదే—డాక్టరు తాలూకు పర్సనల్ రూమువేపు చూపించాడు. ఔను. నేను అతనికి కూడా సుపరిచితుడినే. పేషంటుని కాకపోయినా రెండు రోజులకో, మూడురోజులకో ఒకసారి డాక్టర్ని చూడకుండా ఉండలేను. స్నేహం. ఎవరో 'ప్రేమకూడా వ్యాధే' అన్నట్లు గుర్తు. స్నేహం కూడా జబ్బేనా? ఐతే ఏం? తీయని వ్యాధి.

డాక్టర్ని చూసి నాలుగైదురోజులు దాటిపోతోంది. వర్షమూ, ముసురూ. రోడ్లన్నీ బురద బురద. మన యిళ్లలాగే రోడ్లుకూడా ఎండకేతప్ప వానకి పనికిరావు.

స్వింగ్‌డోర్స్ తెరవబోతూ ఒక్కసారి సందేహించాను. కన్సల్టింగ్ టైములో డాక్టరు పర్సనల్ రూములో ఎందుకున్నాడు?

అతనికీ నాకూ మధ్య అరమరికలులేవు. నాకు ప్రవేశంలేదనే స్థలమూ లేదక్కడ.

తలుపులు తోశాను. సిగరెట్‌పొగ గుప్పుమంది.

మబ్బుపట్టిన ఆకాశంలా ఉంది సిగరెట్ పొగ ఆవరించిన ఆ గది.

''శేఖరం!...చంద్రశేఖరం...''

రెండో పిలుపుకి కాని నా రాకను గమనించలేదతను. గమనించాక మాత్రం ఉత్సాహంగా ఆహ్వానించాడా అంటే అదీలేదు!

ఏదోలోకంలోంచి మల్లె నీరసంగా, నిర్లిప్తంగా విధిలేనట్లు ''రా. కూర్చో.'' అన్నాడు.

అవమానం అనిపించలేదు కానీ నా మనసు బాధపడింది. క్షమించేశాను.

అతను ఆలోచనల లోకంలోంచి దిగి రాదల్చుకోనట్లున్నాడు.

అతన్నంత వేధిస్తున్న సమస్యేమిటి?

''చెప్పవయ్యా. ఏం జరిగింది? ఈ మౌనమూ, ఆలోచనలూ ఏమిటి?'' అడిగాను. చంద్రశేఖరం నావేపు ఒకసారి చూశాడు. అతని కళ్లు చూశాక నాకు భయం వేసింది. నిశ్చయంగా ఆతని కళ్లలోని కాంతిక్షీణతకు కారణం సిగరెట్ పొగ ఎంతమాత్రమూ కాదు. కొమ్మలు ఎండిపోడానికి కారణం చెట్టు వేళ్లలో ఉండేటట్లే, చంద్రశేఖరం కళ్లల్లోని నిర్లిప్తతకూ, నిరుత్సాహానికి హేతువు — అతని మనసులో ఉండి ఉండాలి. అది ఏమిటి?

''ఏమీలేదు...'' విషయం మార్చడానికి ప్రయత్నించాడు. నవ్వాడు.

అతను—ఏమీలేదనడంవల్ల నిశ్చయంగా ఏదో ఉండి ఉంటుందనిపించింది నాకు.

అపనమ్మకం కూడా మనిషి నైజంలో ఉంటుందేమో!

''ఈ వయసులో ... మన స్నేహంలో — దాచుకోవలసిన రహస్యాలుంటాయనుకోలేదు—'' అస్త్రం ఉపయోగిస్తేతప్ప అతను లొంగలేదు.

*　　　*　　　*

భోరున వర్షంకురుస్తూంది—కొన్ని గంటలనుంచీ అదేపనిగా. ఆకాశం కనిపించనంత దట్టంగా పడుతూంది వర్షం. రాత్రి తొమ్మిది దాటుతోంది. నిద్రపోదామా అనుకుంటున్నాడు.

తలుపు తట్టిన శబ్దమూ — డాక్టరుగారూ అన్న పిలుపూ. లేచాడు. ఐదారుమైళ్ళదూరంలో ఉన్న పల్లెటూరులో ఓ పేషంట్ అటా యిటా అన్నట్లున్నాడట. అతనివాళ్ళువచ్చి రమ్మంటున్నారు. రెండోమాట అనకుండా బయలుదేరాడు. కొంతదూరం వెళ్లాక జ్ఞాపకం వచ్చింది టార్చి తెచ్చుకోలేదని. ఫరవాలేదని సరిపెట్టుకున్నాడు.

కరెంటులేని పల్లెటూరేమో చీకటి ముద్దలాఉంది అదంతా. జట్కా ఆగింది. ఆ యింటి లోపల దీపాలు వెలుగుతున్నాయి. ఎవరో దారిచూపగా పేషంటున్న గదిలోకి నడిచాడు. అక్కడ కాంతివంతంగా వెలుగుతూంది దీపం—టేబుల్‌లాంప్.

పేషంట్‌ని పరీక్షించసాగాడు చంద్రశేఖరం. ఐదునిముషాలలో అతను నిర్ధారించుకున్నాడు. కేసు మరీ సీరియస్ ఏమీ కాదు. ప్రాణాపాయంలేదు. పేషంట్ తెలివిగానే ఉన్నాడు. సిరంజ్‌లోకి మందు ఎక్కించాడు. పేషంట్ చూస్తున్నాడు—కళ్లల్లో భయంతో. అవతల వర్షం కురుస్తూనేఉంది. గాలిరేగుతూనేఉంది.

సరిగ్గా ప్రిక్ చేయబోతున్నంతలో ...

పెనుగాలి...దీపం ఆరిపోయింది.

గొల్లుమని ఏడ్పు. పేషంట్ తల్లికాబోలు— ''మమ్మల్ని అన్యాయం చేసిపోయావా నాయనా...'' అంటూ రాగానికి లంకించుకుంది.

దీపం తేడానికి ఎవరో వెళ్లారు

అవతల వర్షం. గదిలో దుఃఖం

డాక్టరుకి కోపమే వచ్చింది— ''ఫరవాలేదని చెప్పానుగా. ఎందు కనవసరంగా ఏడుస్తారు ? మీ రాగాలూ శోకాలూ పూర్తిగా అనవసరం—''

ఎవరో అన్నారు గుమ్మందగ్గరనుంచి — ''అన్ని దీపాలూ ఆరిపోయాయి—''

ముసలి గొంతుకలో శోకం పెరిగిపోయింది. ''మీకు తెలీదు డాక్టరుబాబూ ! నాకొడుకు ... నా కళ్ల వెలుగు ... మాయింటి దీపం—ఆరిపోయింది—''

అసంభవం— చీకట్లో నవ్వుకుంది వైద్యశాస్త్రం. ఆతన్ని అసహాయకత్వానికి జాలిపడింది. దీపం వెలిగించి తెచ్చారు. ఒకటి... రెండు...మూడు... ఒకదానివెంట ఒకటిగా ఆ గదిలోకి దీపాలు ... కాంతిని పెంచుతున్నాయి.

ఇప్పుడాగది—సత్యంలా అతి ప్రకాశవంతంగాఉంది. సిరంజ్ తీసుకుని—నరంకోసం పేషంట్ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. అంతే.

* * *

''ఇన్నాళ్లూ తెలుసుకున్న శాస్త్రం అలా అయింది. ఆ ముసిలమ్మకు తన కొడుకు పోయాడని ఎలా తెలిసింది ? అసలు — ఆ కొడుకు ఎందుకు చనిపోయాడు ? శాస్త్రరీత్యా అతను చని పోవడానికి ఏకారణమూ కనిపించదు. పొరపాటు ఎక్కడ జరిగింది? నాలోనా, నా శాస్త్రంలోనా ?''

అర్థమయింది—అతని ఆవేదన.

ఔను. ఏభయ్యేళ్ల వయసులో — అతనికీ బాధ సహజమే. ఇన్నాళ్లూ తానెంతో నమ్మిన విద్య ఒక్కసారి ఓడిపోతే... బాధగానే ఉంటుంది.

మెల్లగా అన్నాను— ''పొరపాటు నీదికాదు, నీ వైద్యశాస్త్రా నిదీకాదు—''

ప్రశ్నార్థకంగాచూశాడు చంద్రశేఖరం నావేపు. ''ఆ గాలిది... సుడిగాలిది...ఆ దీపానిది...ఆ చీకటిది—'' కచ్చితంగా అన్నాను.

అతను నన్ను వెర్రివాడిని మల్లె చూశాడు. నేను చెప్ప సాగాను నా ధోరణిలో. ''పేషంట్ చావ సిద్ధంగా లేకపోయినా కొంత బలహీనంగాఉండి ఉంటాడు—''

''ఔను.''

''కాంతి...వెలుగు — ధైర్యాన్నిస్తుంది. ఆ వెలుగులో తన వారినీ, డాక్టరునీ చూస్తూ అతను ధైర్యంగానూ, ఆశగానూ ఉండ గలిగాడు. కాని—ఒక్కసారి చీకటి ఆవరించేసరికి--షాక్ తగిలినట్లయి ఆ బలహీనుడు కళ్లు తేలవేసేశాడు.''

''బాగానేఉంది· మరి—యిలా జరుగుతుందని -- జరిగిందని ఆ ముసిలమ్మకెలా తెలిసింది ?''

ఈ డాక్టర్లతో వచ్చిన చిక్కేదే. అన్నిటికీ శాస్త్రీయమయిన ఆధారాయి వెతుకుతారు. జీవితం — శాస్త్రానికి అతీతంగాకూడా కొంత ఉంటుందంటే అంగీకరించరు.

డాక్టరు చంద్రశేఖరం బాధ నాకు పూర్తిగా అర్థమయింది. ''మూడేళ్లూ సాముచేసి మూలనున్న ముసలిముండను కొట్టా డన్నట్లు'' యిన్నాళ్ల శాస్త్రాభ్యాసమూ ఓ చదువురాని ముసలిదాని ముందు తోకముడిచేసిందే అని అతని చిన్నతనం. ఇప్పుడు నేను దానికే మాటలమందు వేయాలి. అతని మానసిక రుగ్మత నివారించాలి.

''చదువు వేరు, జ్ఞానం వేరు. అక్షరాలకంటె అనుభవం ఎక్కువ శక్తికలది. ఆపైన సిక్స్త్ సెన్స్. ఇవన్నీ వదిలేసినా... గుడ్డి గుర్రపు తాపు ఉండనే ఉందిగా ? వైద్యశాస్త్రం గురించి తెలీని, నమ్మకం చాలని ఆ ముసిలమ్మ అంతరాంతరాలలో కొడుకు చనిపోతాడేమో అనే భయపడుతోంది. దుఃఖాన్ని బలహీనపు గుండెలలో అదుముకుంటూంది. దీపాలు ఆరిపోయి— చీకటి ఉరికే సరికి -- ఆమెకు షాక్ తగిలి... దుఃఖానికి చిల్లుపడి — శోకంలా వొలికింది. మిడతంభొట్లు శకునంలా ఆమెనోట నిజం పలికింది. అంతే.''

డాక్టరు ముఖం వికసించింది, తన శాస్త్రం ఓడిపోలేదని వినేసరికి. ఈ చిత్రమయిన పరిస్థితిలో ఆ ముసిలమ్మ గెలిచిందే తప్ప డాక్టరు ఓడిపోలేదు! ఔను. మాటలు మసిపూయకుండానే మారేడుకాయలు చేయగలవు.

కాని—

నా నమ్మకమూ అనుభవమూ ఏమిటంటే—

జ్ఞానం ఎంత వికసించినా యింతో అంతో అజ్ఞానం మిగిలే ఉంటుంది.

కాంతితోపాటు క్రీనీడలూ మిగిలి ఉంటాయి.

సత్యంతోపాటు అసత్యమూ ఉంటుంది.

ఈ స్తంభాలాటలో వెదుకులాడుకోడమే కాదూ జీవితం?

అందుకేకాదూ మానవ జీవితంలో యింత ఆకర్షణా, యింత వైవిధ్యమూ?

ఎన్ని కళ్లతో చూస్తే—

ఎన్ని మెదళ్లతో ఆలోచిస్తే—

జీవితం అందుతుంది?

“పిరాట్ల”

‘సోషలిష్టు వాస్తవికత’

సాహిత్యంలో వాస్తవికతయొక్క ఆవశ్యకతను గురించి ఎవ్వరికీ భిన్నదృక్పథా లుండటానికి వీలులేదు. సాహితీవేత్త కేవలం ఊహాలోకంలోనే విహరించడానికి ఎంతమాత్రం తావులేదు. సాహితీవేత్త దృష్టిలో ‘వాస్తవికత’ అంటే కేవలం కనబడినదానిని చిత్రించడమే కాకుండా, పరిష్కారం చూపే బాధ్యతకూడా స్వీకరించగలిగితే సంతోషం. అయితే బాధంతా ఇక్కడే ఉంది. ఈనాటి సమాజంలోని రుగ్మతలకు ఎవరు చూపే పరిష్కారమైనా అధిక భాగం రాజకీయపరంగానే ఉంటుంది. దానితో ఆ సాహితీవేత్తకు ఆ రాజకీయరంగును పులమటం జరుగుతుంది కాని దీనివలన నిజమైన సాహితీవేత్త బాధపడవలసినదేమీలేదు.

దీనిలో ఇంకొక దురదృష్టముంది. సాహితీవేత్త పూర్తి రాజకీయవేత్త కాదు. పరిష్కారమార్గాలు కూడా ఒకే రంగానికి పరిమితమై ఉండవు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలన్నీ ఆ పరిష్కారంలో మిళితమై ఉంటాయి.

‘సమాజంలో ఒకవర్గమే సుఖంగా ఉండాలనే శ్రమదోపిడీ దుర్మార్గంనుండి బయటపడి, సమాజంలో అన్నివర్గాలూ బాగుపడాలి. వర్గాలు నశించాలి...’’. దీనినే నేటి సాహిత్యానికి కావలసిన విషయంగా, ‘సోషలిస్టు వాస్తవికత’గా పరిచయం చేశారు శ్రీజ్వాలాముఖి. (‘భారతి’ 1977 నవంబరు సంచికలో)

శ్రీ జ్వాలాముఖి బాధ్యత కలిగిన రచయిత, కవి. ఇప్పుడేమోగాని ఒకప్పుడు విప్లవ రచయిత సంఘంలో కార్యవర్గ సభ్యుడు. 1971 సెప్టెంబరులో వారు తమ ప్రణాళికను విడుదలచేశారు. “మార్క్సియన్ సోషలిజమే మనందరి ధ్యేయం.” “ఏ రూపంలో జరుగుతున్నా ప్రజల వర్గపోరాటాల నన్నిటినీ మనం సమర్థిస్తాం” అన్నారు. “విప్లవ రచయితలమైన మనం విప్లవాన్ని కోరుతున్నాం. ఎందుకోసం? ఒక నూతన సమాజాన్ని, సమతా సమాజాన్ని, వర్గరహిత సమాజాన్ని, నూతన ప్రజాస్వామ్య సమాజాన్ని స్థాపించటంకోసం. ఇది రచయితలు ఒంటరిగాచేసే పనికాదు. ఈ పని చేయటంలో ముందున్నవాళ్ళు రాజకీయ నాయకులు. వాళ్ళ లక్ష్యాల్లోని మంచికి సాహిత్యరూపం ఇచ్చి స్వాగతం చెప్పే నైతికబలం ఇవ్వటం రచయితల బాధ్యత. రాజకీయ సిద్ధాంతం అనే స్టీరింగువీలు రాజకీయ నాయకుల చేతుల్లోనే ఎప్పుడూ ఉంటుంది. ఆ యంత్రం నడవటానికి కావలసిన ఇంధనం రచయితలు సప్లై చేయాలి.” “దేశాభిమానం పేరుతో ప్రతీకారశక్తులు (రియాక్షనరీస్) మావో ఆలోచనా విధానం అంటే చైనాపట్ల విధేయతగా వ్యాఖ్యానించటం, దేశాన్ని ఎవరికో ధారాదత్తం చేస్తున్నారన్న భావాన్ని ప్రచారం చేయడం చూస్తున్నాం. ఈ గుడ్డివాదనను గట్టిగా ఎదుర్కోవాలి”. (విప్లవ సాహిత్య దృక్పథం—శ్రీపతి) “మహోన్నతమైన సోషలిస్టు మానవతావాద వైఖరిని అవలంబించి, మార్క్సియన్ సోషలిజాన్ని శాస్త్రంగానేకాక శస్త్రంగా కూడా ఆమోదిస్తూ రాజకీయ మహోద్యమానికి చేదోడు వాదోడు కావాలి”. (ప్రణాళికలోని లక్ష్యాలు—కర్తవ్యాలలో అయిదవది) “ప్రజల మహావిప్లవానికి అనుకూలపడే వర్గపోరాటాలను సాహిత్యంద్వారా బలపరచడం”. (ఆశయాలలో రెండవది) (విప్లవ రచయితలసంఘం మహాసభల ప్రత్యేక సంచిక-సెప్టెంబరు 1971)

“మాది ప్రధానంగా సాహిత్యసంస్థ. ఇది రచయితల కూటమి. అయితే ఇది రాజకీయాన్ని కంటగించుకోదు. సరిగదా, జాతి జీవితంలో ప్రముఖాంశమని భావిస్తుంది. ఈ దేశంలో ఈ ప్రజల నిత్యకల్యాణాన్ని, పచ్చతోరణాన్ని అంతిమ సాంఘిక లక్ష్యంగా పెట్టుకోబట్టే, మార్క్సిస్టు లోకదర్శనాన్ని ధ్యేయంగా ఎంచుకుంది. సంస్కరణలు సమస్యలను నిర్మూలించవు కాబట్టే విప్లవ మార్గం శరణ్యమయింది ఇది ప్రజలు నిర్వహించవలసిన దీర్ఘకాలికమైన సాయుధరూపం ధరింపక తప్పనిమార్గం అని వి.ర.సం. భావిస్తున్నది. పోరాటరూపం గురించీ, స్వభావం గురించీ నిర్ణయించుకోవలసింది పీడితప్రజలే. పౌరబాధ్యతలను ఇతరులకంటె ఎక్కువ చైతన్యంతో గుర్తించి స్వీకరించే వి. ర. సం. సమసమాజ నిర్మాణానికి అభిముఖంగా ప్రజలు జరిపే వివిధపోరాటాలకూ సాహిత్యరూపకమైన దోహదం చేస్తుంది. ఏ రాజకీయపక్షానికీ ఇది తోకకాదు. సభ్యుల రాజకీయాభిప్రాయాలన్నీ ఒకే మూసలో పోసితీయాలనే నిబంధనలేదు. రాజకీయపార్టీలు అవసరం చొప్పున తిరిగే సందుగొందులన్నీ, తొక్కే తోవలన్నీ వి. ర. సం. తిరిగి తొక్కవలసిన అవసరంలేదు. రాజకీయాలతో దానికి ప్రత్యక్ష సంబంధం ఏమీలేదు. అయితే ఇది జీవిత ప్రవాహ నిమగ్నమేకాని తటస్థంకాదు. ప్రజలకు కావలసిందేదీ వి.ర.సానికి వికటించదు...”. (అదే సంచికలో సంపాదకుడు)

రచయిత రాజకీయనాయకుడు కాదు కాబట్టి, రాజకీయ సిద్ధాంతం అనే స్టీరింగు వీలు రచయిత చేతుల్లోకిరాదు కాబట్టి, కేవలం ఇంధనం సప్లైదార్లమే కాబట్టి, ఏ రాజకీయపక్షానికీ తోకలంకాదు కాబట్టి, వాళ్ళ అవసరంకొద్దీ వాళ్ళు తిరిగే సందుగొందులన్నీ మనం తిరగనవసరంలేదు కాబట్టి, వాళ్ళ కేకల్లో, నాగ్గింటిని మనంకూడా అందుకొని, వాళ్ళ ప్రయాణంలో నాల్గడు

గులు కలిపివేయడమే రచయిత కర్తవ్యమా ? రాజకీయనాయకుల లక్ష్యాలలోని మంచికి రూపమివ్వటం, మంచిదే. కాని లక్ష్యాలలోని అవకతవకలకు, ఆచరణలోని చెడుకూ బాధ్యులెవరు? వాళ్లమంచి పొగిడి, భుజం తట్టి, వాళ్ల చెడుపట్ల కళ్ళుమూసుకుని, వాళ్లలో దుర్భ్రమ కలిగించటమేనా రచయిత బాధ్యత? మార్క్సియన్ సోషలిజం పేరుతో, సోషలిస్టు వాస్తవికత పేరుతో జరిగినదిదే. ఇది చారిత్రక వాస్తవికత. మరి ఇది పై రెంటిలో ఇముడ్తుందో లేదో !

మార్క్సిజం నేడొక బ్రహ్మపదార్థంలాంటిది. దాని కనేక భాష్యాలు, ఆచరణలో అనేక మార్గాలు. ప్రతివారికీ రెండవవారి భాష్యం వక్రం, మార్గం దుర్మార్గం "రివిజనిజమ్". అంతర్జాతీయ రంగంలో రష్యన్ మార్క్సిజం, మావో మార్క్సిజం ప్రచ్ఛన్నంగా, బహిరంగంగా యుద్ధం చేసుకుంటుంటే—మన దేశంలో సిపిఐ, సిపిఐ(యమ్), సిపిఐ (యమ్‌యల్) ఇంకా అనేకానేక వర్గాలు అంతా మార్క్సిజంకోసమే తంటాలు పడుతున్నారు. ఇది కేవలం శాస్త్రచర్చకే పరిమితమయితే ఫరవాలేదు, శస్త్రంగా వాడ దలుచుకున్నప్పుడే వస్తుంది ఇబ్బందంతా. వీటన్నిటికీ వాస్తవికవాది కళ్లు మూసుకోలేడుగదా !

1971 సెప్టెంబరుదాకా జరిగిన వాస్తవ చరిత్ర, పోరాటాలు ఈ విషయాలనే సూచిస్తాయి. నాటికి సిపిఐ(యమ్‌యల్) జన్మించి సంవత్సరమై, ప్రథమ మహాసభలు 1970 మేలో జరుపుకుంది. అప్పుడే లుకలుకలు ప్రారంభమయ్యాయి. జాదవపూర్ విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుడు డాక్టర్. గోపాలచంద్రసేన్ హత్య చేయబడ్డాడు, కాదు "ఖతం" చేయబడ్డాడు. 1969 మేలో జన్మదిన బహిరంగసభకు అధ్యక్షత వహించిన అసిత్‌సేన్, చారూముజుందార్‌ను కాదని ఎదురు తిరిగి వైతొలగాడు. జాతీయ నాయకుల విగ్రహాలను ధ్వంసంచేయడం, విద్యార్థుల యువశక్తిని వృధాచేయడమేనని చారూ ప్రియతమ అనుచరుడు సుషీతలరేకాదరి ఎదిరించి, అజ్ఞాతంగా గుండెజబ్బుతో 1971 మార్చిలో మరణించాడు. గోపీవల్లభపూర్‌లో ఉద్యమాలను నడిపిన ఆషీమ్ ఛటర్జీ, 120 "ఖతం" కార్యక్రమాలను జరిపినా ఏమీ సాధించలేక పోతున్నానని వాపోయాడు. బీహార్ నాయకుడు సత్యనారాయణసింగ్ 'pseudo political criminals'తో చేతులు కలపటం ఒక తప్పంటూ ఆత్మవిమర్శ ('లిబరేషన్' 1969 నవంబరు) చేసుకోవటమే కాకుండా, ముజుందార్‌కు ఎదురుతిరిగి బీహార్ కమిటీచేత ఒక తీర్మానాన్ని ఆమోదింపచేశాడు. ముజుందార్‌ను 'ధృతరాష్ట్రు'డని వర్ణించాడు. ఇదీ 1970 సెప్టెంబరులోనే జరిగింది

పోరాటాలు సాగించటానికి ముఖ్యకారణం మనం విశ్లేషించుకున్న జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు. మన దృష్టిలో గాంధీ, నెహ్రూలు బ్రిటిష్ ఇంపీరియలిజం తొత్తులు. ఈనాటి చరిత్ర అంతా ఏదేదో మాత్రమే. ఎప్పుడో 1969 నవంబరు 'లిబరేషన్' పత్రికలోనే "China's Chairman is our Chairman: China's path is our path" అని వ్రాసుకున్నాం. 'ఇదితప్పు' అనే దమ్ము సంవత్సరందాకా మనలో ఎవరికీ లేకపోయింది. చివరికి శౌరీన్‌బోస్, ఆయన నాయకత్వాన రాయబారవర్గమో లేక ఆయన ఒక్కడేనో, చైనా పోయివచ్చి 1970 అక్టోబరు 29 తేదితో నివేదిక సమర్పిస్తేనే, మనది తప్పని తెలిసింది. చౌ ఎన్ లాయ్, కాంగ్‌షెంగ్‌లు మీ ఈ నినాదం తప్పన్నారు. మీ 'ఖతం' కార్యక్రమాలు తప్పన్నారు. మా దీర్ఘపోరాట కాలంలో మే మెప్పుడూ రష్యా నాయకులు మా నాయకులు అని అనలేదన్నారు. మీ సాయుధ గెరిల్లా పోరాటం తప్పన్నారు.[1] ఈ మాటలను అంతవరకూ ఎంతమంది దేశవాళీ నాయకులు చెప్పినా ముజుందార్‌కు నచ్చలేదు ఈ నివేదికను కూడా అనుచరులకు పంచలేదనీ, విమర్శకు అవకాశ మివ్వలేదనీ ఆషీమ్ ఛటర్జీ ఆరోపించాడు. చివరకు అతనూ, సత్యనారాయణసింగ్ కలసి ముజుందార్‌నే పార్టీనుంచి వెళ్లగొట్టామని ప్రకటించారు. ఇవి పార్టీ గత వ్యవహారాలు.

ఇక మిగతా వ్యవహారాలు. "మావో ఆలోచనా విధానమంటే, చైనాపట్ల విధేయతగా వ్యాఖ్యానించటం, దేశాన్ని ఎవరికో ధారాదత్తం చేస్తున్నారన్న భావాన్ని ప్రచారం చెయ్యటాన్ని" ఎదుర్కోవాలి బాగుంది కాని మనం చైనా మానసిక పుత్రులం కాకపోతే కదా బాధ. చైనా తాన అంటే మనం తందాన అన్నాం. ఉదాహరణకు 1967 ఎన్నికలకు ముందు శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారి నాయకత్వాన, గోరక్షా మహాభియాన్ అధ్వర్యాన జరిగిన ఉద్యమ సందర్భంగా ఢిల్లీలో జరిగిన దౌర్జన్యాలకు విశేష ప్రచారమిచ్చి, దానిని భారత ప్రభుత్వంపై తిరుగుబాటుగా చైనా వర్ణించింది. కాబట్టి మనం సూత్రీకరణ చేసుకున్నాం. ఏమని?

"All the revolts directed against the government are a part of the revolutionary-struggle అనీ, మరియు a detailed analysis of the role of leadership, instead of helping this task, strengthens the hands of reaction." (Liberation, Jan 1969.)

కాబట్టే డాక్టరు చెన్నారెడ్డి నాయకత్వాన జరిగిన తెలంగాణా ఉద్యమాన్ని బలపరిచారు. (లిబరేషను, 1969 మే.)

చైనాలో వర్షంకురిస్తే మనం గొడుగులు పడదామన్నాం. లబద్ధమా ?

చైనాను ఎవ్వరో ముట్టడించే ప్రమాద ముందంటూ ముజుందార్ 'లిబరేషన్' 1970 డిసెంబరులోనే వ్రాశాడు. "There is a strong possibility that Chairman's China might be attacked by 1971." ఇది న్యూక్లియర్ యుద్ధానికి దారితీయవచ్చనీ, కాబట్టి దేశం దానికి తయారు కావాలన్నాడు, మనంనూ తయారు కమ్మన్నాడు. రైతులకీనాటి నుంచే కందకాల ఆవశ్యకతను బోధించాలనీ, దాని ప్రాధాన్యతనూ లప్పుడే వారు గ్రహించారనీ, దానిని వాళ్లకు వివరించాలనీ, ఆ మన్నుతో పంటలకు నీటి సరఫరా సమస్యను పరిష్కరించేందుకు డాములు కట్టవచ్చనీ వ్రాశాడు.[2]

ఇంకొక గుండె పగిలే వాస్తవం: నక్సలైట్ల ప్రథమ కాంగ్రెసు ముగిసిన 1970 మే 20వ తేదీనే, కాంబోడియాలో, వియత్నాంలో అమెరికన్ చర్యలను గర్హిస్తూ, ప్రపంచానికి మూడవ ప్రపంచయుద్ధ భయం పోలేదని ప్రకటనచేసి, తద్వారా సి పి ఐ (యమ్‌యల్) పార్టీలో అనేక అంతర్యుద్ధాలకు కారణభూతుడైన మావో ఏం చేశాడు? అదే సంవత్సరంలో 13 అమ్మోనియా, యూరియా ఫాక్టరీల నిర్మాణంకోసం విదేశీసంస్థలతో ఒప్పందం చేసుకున్నాడు. సాంకేతిక పరిజ్ఞానం అమెరికా, డచ్, డెన్మార్కు లకు చెందినదయితే, నిర్మాణ పర్యవేక్షణ భారం అమెరికా, ఫ్రెంచి, జపాన్, డచ్ కంపెనీలది. మనమో ఆయన మాటలు నమ్మి కందకాలు త్రవ్వుకోమన్నాం.

లక్షలాది ప్రజల మారణహోమం మనదృష్టిలో నేరంకాదు. మనతో ఏకీభవించని వారి పోరాటం పోరాటమేకాదు. కాబట్టే బంగ్లాదేశ్ అవతరణ సందర్భంగా జరిగినదంతా ఆషిష్ ఛటర్జీ దృష్టిలో చైనాకు వ్యతిరేకంగా అమెరికన్ 'ఇంపీరియలిష్టులు', సోవియట్ 'రివిజనిష్టులు', ఇండియన్ 'రియాక్షనరీ'ల కుట్ర మాత్రమే. 1971 ఏప్రిల్ 11 నాటి వ్యాసంలో చైనావారు యాహ్యాను బలపరిచారు,కాబట్టి మనమూ వారినే బలపరచాలన్నాడు ఆషిష్ ఛటర్జీ. దానిమీద ముజుందార్‌తో అభిప్రాయభేదాలువచ్చి బయటికి నడిచాడు. ఇంతకూ ముజుందారూ ముజీబ్‌ను గౌర వించలా. ముజుందార్ దృష్టిలోకూడా ముజీబుర్‌రహమాన్ **running dog of U. S. Imperialism, the Soviet Social Imperialists, the Indian reactionaries and East Bengal's feudal oppressors and comprador bourgeoisie. ('People of East Bengal will smash the Counter Revolutionary Plot'** వ్యాసం లిబరేషన్ 1971 జనవరి–మార్చి సంచిక)

మరి ఇదంతా ప్రతి సంఘటననూ, ప్రతి విషయాన్ని – అది మన దేశానికి సంబంధించినా లేక విదేశాలకు సంబంధించినా చైనా అద్దాలతో చూడటం కాదా!

విప్లవ రచయితలసంఘం మహాసభల నాటికే జరిగిన సంఘటనలు, వాస్తవాలు ఇవ్వన్నీ.

*   *   *

అయితే పాఠకులు ఇదంతా సాహిత్యంకాదు, రాజకీయాలు అన్నీ విమర్శించవచ్చు. నిజమే. సోషలిజం అనేది రాజకీయపర మైంది. దానిని సాహిత్యానికి అన్వయించుకొని సాహిత్యంలో సోషలిష్టు వాస్తవికత కావాలన్నప్పుడు, నిర్వచించేటప్పుడు మరి రాజకీయాలు రాక తప్పుతాయా?

ఇక జ్వాలాముఖిగారి సూత్రీకరణలు కేవలం ఊహారంగానికే పరిమిత మనిపిస్తాయి. "భావవిప్లవం" ... "మార్పుకు సంబంధించిన సామాజిక విప్లవానికి నాందిలా దోహదపడుతుంది. రాజకీయ విప్లవానికి ఇరుసులా పనిచేస్తుంది. అయితే ఆలోచనే సర్వస్వమూ కాదు. ఆచరణే నిర్ణాయకశక్తి. ఆలోచన, ఆచరణ విప్లవానికి రెండు చక్రాల్లాంటివి. వాటి ఇరుసులు సాహిత్యం, కళలు. నడిపే శక్తి జనశక్తి." ఇంకొకచోట ఇలా అన్నారు: "వాస్తవికతకు సంబంధించిన అవగాహన సరిగాలేకపోవడంవల్ల, పరిష్కారంచూపే బాధ్యత తమది కాదనుకోవడంవల్ల, రచయితపాత్ర భూతభవిష్యత్ వర్తమాన కాలాలలో ఏదో ఒక కాలానికే నిలిచిపోవడం జరుగు తున్నది. రచయిత త్రికాలవేది, క్రాంతదర్శి. జరిగిన అనర్థాన్ని శాస్త్రీయంగా వివేచించడం, నడుస్తున్న చరిత్రను హేతుబద్ధంగా తిప్పడం, రాబోయే సమాజాన్ని జనపథంగా అక్షరీకరించడం, రచయిత, కవి చేయార్సిన వైతాళికధర్మం."

అయితే చరిత్ర వేరువిధంగాఉంది. రాజకీయ విప్లవానంతరం ఫలితమనేబంతి భావవిప్లవాన్ని సృష్టించిన రచయిత, కవిచేతుల్లో ఉండదు. అతనినిదాటి రాజకీయ నాయకుని చేతిలో ఆడడం మొదలుపెడుతుంది. ఆ బంతినికూడా 'కంట్రోలు' చేయాలంటే రచయిత కేవలం రచయితగా కూర్చుంటే పనికిరాదు, రాజకీయ నాయకుడు కూడా కావాలి. ఆలోచన, ఆచరణలకు కూడా ఇరుసులు కేవలం సాహిత్యం, కళలు కాలేవు. రాజకీయసిద్ధాంతమే అవుతుంది. సాహిత్యం, కళలు దోహదకారులే అవుతాయి, అయ్యాయి. ఏ త్రికాల వేది అయిన రచయితా, క్రాంతదర్శి అయిన రచయితా జరిగిన అనర్థాన్ని శాస్త్రీయంగా వివేచించడం జరపలేదు, అథవా జరిపినా చరిత్రను హేతుబద్ధంగా తిప్పడం జరగనే జరగదు. రాజకీయ విప్లవాలను రచయితలు బలపరిచారు, తాళంవేశారే కాని ఏ విప్లవమూ కేవలం రచయిత మార్గదర్శనంలోనే జరగలేదు భావ విప్లవంవేరు, దాని ఫలితంగా వచ్చిన రాజకీయ విప్లవంవేరు. మొదటిదాని నాయకులే రెండవదానికీ నాయకులుకారు, కాలేదు.

ఇంకా వాస్తవంలోకి వద్దాం. శ్రీకాకుళం పోరాటం చారూ ముజుందార్ మార్గదర్శకత్వంలో జరిగింది. కలకత్తా నగర 'సాంస్కృతిక విప్లవమూ' ఆయన మార్గదర్శకత్వంలోనే జరిగింది. రానురాను మార్గదర్శకత్వమే లుప్తమయింది. ఆలోచనకన్నా ఆచరణే అతి ముఖ్యమయింది. చివరిదశలో ఆలోచనే లుప్తమయింది. 'ఖతం' కార్యక్రమంలో, ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుమాని ఉద్యమంలో చేరిన విద్యార్థికన్నా, 'ఖతంలు' జరపగలిగినవాడు పెద్ద విప్లవకారుడయ్యాడు. 'లింపెన్ ఎలిమెంటు' ముందు ఎవ్వరూ పనికిరాలేదు. దీనినికూడా సాయుధ విప్లవమన్నారు. కాని రాను రాను ఇది వెర్రితలలు వేయనారంభించింది. దక్షిణ కలకత్తా, తిలజలా ఏరియా కమిటీల కార్యదర్శులను మీటింగుకు రమ్మనమని సాటి కార్యకర్తలే 'ఖతం' చేశారు. కారణం వీళ్ళకు పోలీసులతో సంబంధముందని అనుమానం. అంతే కాదు. 1967 నక్సల్‌బరీ ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించిన 'క' చతుష్టయం – కానూ సన్యాల్, ఖోకన్‌ముజుందార్, కదంమాలిక్, కామాక్ష్యబెనర్జీ–లలో చివరివాడైన కామాక్ష్యబెనర్జీనే సి పి ఐ (ఎమ్)లో చేరినందుకు గాను 'ఖతం' చేశారు.

సాయుధ విప్లవాన్ని సపోర్టుచేసిన ఏ రచయితా ఈ ధోరణిని అరికట్ట లేకపోయాడు. ఈ అనర్థాన్ని ''శాస్త్రీయంగా నివేదించ'' లేకపోయాడు, తరువాతి చరిత్రను ''హేతుబద్ధంగా'' తిప్పలేకపోయాడు.

ఇంకాఇలా అంటారు జ్వాలాముఖి: ''సాహిత్యానికి వాస్తవికత ఉండాలనేది తప్పనిసరి. అది జీవితానికి దగ్గరగా ఉండాలి. ఆ జీవితంకూడా సమాజ జీవితానికి భాష్యకారునిలా, ద్వంద్వాలమధ్య రాజీలేని పోరాట వీరునిలా ప్రతిబింబించాలి. చాలాకాలంనుండీ వస్తున్న శీలం, స్నేహం, ఔదార్యం, దానం, సహజీవనం, త్యాగం, సాహసం మున్నగు మానవతాగుణ శీలాలను కొత్తకోణంనుండి చూపే సోషలిష్టు వాస్తవికతలా అభివృద్ధి చేయాలి.'' ఈ మాటలన్నిటికీ సోషలిష్టు వాస్తవికతలో అర్థాలువేరా ? ఏమో మరి.

పోరాటరూపం గురించీ, స్వభావం గురించీ నిర్ణయించుకోవలసింది పీడిత ప్రజలేఅయి, వారు జరిపే వివిధ పోరాటాలకూ కేవలం సాహిత్య రూపకమైన దోహదం చేయటమే రచయిత కర్తవ్యమై, రాజకీయాలతో ప్రత్యక్ష సంబంధం లేనపుడు—ఇక రచయిత వివేచన ఏమిటి, చరిత్రను తిప్పటమేమిటి? 'వారేంచేస్తే అదే ఘనకార్యం' రూపాన్ని వాళ్ళే నిర్ణయించుకున్నారు, నచ్చితే అవునను, నచ్చకపోతే ప్రత్యక్ష సంబంధంలేదు కాబట్టి ఊరుకో. ఎదురు మాట్లాడితే నీవు మార్క్సియన్ సోషలిష్టువు కావు.

మార్క్సియన్ సోషలిజం నిర్వచనం స్టాలిన్, మావో బోటి రాజకీయ నాయకుల చేతులలోనే రూపురేఖలు దిద్దుకుంది. కాని రచయితల చేతుల్లోకాదు. స్టాలిన్, మావోలు రచయితలూ, కవులూకూడా అంటారా, అది వేరే సంగతి. నాబోటి వారెన్ని నిర్వచనాలిచ్చినా, రాజకీయాధికారం చేతులలో కలిగిన స్టాలిన్, మావోలు చెప్పిందే మార్క్సిజం

★ ★ ★

మావో మాటలను జ్వాలాముఖిగారే ఉదహరించారు కాబట్టి కొన్ని ఆ సూక్తులను కూడా చూద్దాం. నేనివ్వబోయేవన్నీ ''Quotations From Chairman Mao-Tsetung''(మావో రెడ్ బుక్) 1972 పెకింగు ప్రచురణనుంచే.

మార్క్సియన్ సోషలిష్టు, మావో సోషలిష్టు రాజ్య స్వరూప మెలాంటిది?

చైనీయ విప్లవమంతా రెండుదశలు -- ప్రజాస్వామిక విప్లవం, సోషలిష్టు విప్లవం. మొదటిదాని తరువాత రెండవదానిని సాధించాలి. అంతిమాశయం ఏమిటంటే సోషలిష్టు, కమ్యూనిష్టు సమాజాన్ని స్థాపించటం. వారి రాజ్యం ప్రజాతంత్ర ప్రజాస్వామిక నియంతృత్వం (People's Democratic Dictatorship) దాని మొదటి కర్తవ్యం—సోషలిష్టు విప్లవాన్ని కాదనే అభివృద్ధి నిరోధక వర్గాన్ని (reactionaries), దోపిడీ వర్గాన్ని (exploiters) అణచివేయటం. రెండవ కర్తవ్యం— అంతర్గత, బహిర్గత శత్రువుల నుండి దేశాన్ని రక్షించడం. [3] ప్రజలలోనే అంతర్గతమైన సాంఘిక విపర్యయంలు (social contradictions) తప్పవు. సోషలిజాన్ని నిర్మించేదశలో ఎవరైతే సోషలిష్టు నిర్మాణానికి అనుకూలురో వారు ''ప్రజలు.''(the people) దానిని వ్యతిరేకించే వారు ''శత్రువులు'' (the enemy). [4]

రాజ్యం తన మొదటి కర్తవ్యాన్ని నిర్వర్తించటం ఎలా ? దాని కనేకపద్ధతులు—విప్లవ వ్యతిరేకులనూ, బ్యూరోక్రాట్—పెట్టుబడి దార్లనూ, భూస్వాములనూ అరెష్టుచేయటం, విచారించటం, శిక్షించటం. ఏమిటా శిక్షలు ? కొంతకాలం వాక్స్వాతంత్ర్యము, వోటువేసే హక్కు తీసివేయటం. [5]

ఈ ప్రజాతంత్ర ప్రజాస్వామిక నియంతృత్వము రెండు పద్ధతులను వాడుతుంది. శత్రువుల పట్ల నియంతృత్వమూ, ప్రజలపట్ల ప్రజాస్వామ్యము. ఎంతకాలం వరకు అవసరమో అంత కాలంవరకూ శత్రువులను రాజకీయాలలో పాల్గొననివ్వదు, చట్టాలను గౌరవించమని బలవంతం చేస్తుంది. వాళ్లచేత శరీరశ్రమ చేయించి తద్వారా వాళ్లని నూత్న మానవులుగా తయారు చేస్తుంది. [6] ఇదీ మార్క్సియన్ సోషలిజం.

ఇంకా సూటిగా చెప్పాలంటే నాబోటివాడు దానిని వ్యతిరేకిస్తే వాడు ప్రజా''శత్రువు'' కాబట్టి అరెష్టుచేసి, వోటు హక్కు తీసివేసి, శ్రామిక శిబిరాలకు తోలుతారు. నేను నూత్న మానవుడుగా తయారయితే మంచిదే, లేదా...అది జ్వాలాముఖిగారే శెలవివ్వాలి. ఇవన్నీ మావోయొక్క ఉద్ఘాటనలే, చారిత్రక వాస్తవాలు.

దురదృష్టవశాత్తు ఇంకా కొన్ని కటువైన వాస్తవాలున్నాయి. 1967 నుంచీ మనదేశంలో జరిగిన దానిని కొండంతలుగా ప్రచారం చేసింది చైనాయే, 1969లో జరిగిన తమ తొమ్మిదవ కాంగ్రెసుకు, ప్రజల సాయుధపోరాటం జరుగుతున్న దేశాలలో భారతదేశాన్నొకదానినిగా తమ రాజకీయ నివేదికలో చూపింది చైనా నాయకులే, 1972 జులైలో చారూముజుందార్ మరణిస్తే దానిని గురించి ఒక్క ముక్కా తమ పత్రికలలో

వేయందీ చైనా నాయకులే, 1973 ఆగష్టులో జరిగిన తమ పదవకాంగ్రెసు రాజకీయ నివేదికలో సాయుధ సమరం జరుగుతున్న దేశంగా పేర్కొన్నదీ చైనా నాయకులే. కాకపోతే 1969 కాంగ్రెసులో మహా నాయకుడుగా రాజకీయ నివేదికను సమర్పించిన లిన్–పియావో, 1971లోనే మరణించినా, 1973లో రివిజనిష్టయ్యాడు, చౌఎన్‌లాయ్ ఆ నివేదికను సమర్పించాడు.

ఇలాంటి చారిత్రక వాస్తవాలమధ్య సోషలిష్టు వాస్తవికత అంటే కొంచెం అనూహ్యంగానే ఉంది.

అధో జ్ఞాపికలు:

1. "But to regard China's Chirman as your Chairman is opposed by the Chairman. We supported you ever since the Naxalbari struggle. Our Chairman has told you that in you India has hope. This is our experience. You have shown heroism. You are aginst imperialism and revisionism. You worked in rural areas among the peasant massesand carriedon anarmed struggle. We express deep gratitude to you for supporting our cultural revolution and for your respect for Mao - se - tung thought. Your small party has not much experience; so it cannot avoid shortcomings and mistakes in policy" (page 19–"The Naxalite Movement" by Sankara Ghosh, published by Firma K. L. Mukhopadhya Calcutta, 1974.)

2. "From this very day we should tell the peasant masses about the need for building tunnels. But at this moment they will not be able to realize the importance of tunnels. Therefore, the long - term utility of the tunnels should be explained to them, that is, they should be told that the soil dug out of the tunnels may be used in making dams to solve the irrigation problem" (Charumuzumdar - "March Onward, day of victory is near", 'Liberation' Sep–December, 1970.)

3. "On the Correct Handling of Contradictions Among the People" (Feb 27, 1957) 1st pocket edition pages 6, 7 (Red Book page 38)

4. Same Book, pages 2, 3 (Red Book, page 45)

5. "For instance, to arrest, try and sentence certain counter-revolutionaries, and to deprive landlords and bureaucratic-capitalists of their right to vote and their freedom of speech for a specified period of time-all this comes within the scope of our dictatorship." (Same Book, pages 6, 7 — Red Book page 38)

6. "The people's democratic dictatorship uses two methods. Towards the enemy, it uses the method of dictatorship, that is, for as long a period of time as is necessary it does not let them take part in political activities and compels themto obey the law ofthe people's Government and to engage in labour and, through labour, transform themselves into new men ..." (Closing Speech at the Second Session of the First National Committee of the Chinese People's Political Consultative Conference (June 23, 1950 - Red Book, Page 42.)



శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రి

కాకతీయులనాడు ప్రజాధికారాలు

['భారతి' స్వర్ణోత్సవ సంచిక (1974 జనవరి) లోని 'భారతీయ రాజరిక వ్యవస్థలో ప్రజలపాత్ర' అను వ్యాసమునకు దీని ననుబంధముగా జదువుకొనగలరు]

ప్రజలు న్యాయ సమ్మతమైన పరిధులలో సుఖ జీవనము గడుపుకొనే విధముగా తమను కాపాడుకొనుటకు వలయు శక్తియే ప్రజాధికారము. ఇందుకు వ్యతిరేకముగా వచ్చే సమాజ శక్తుల నుండి గాని, రాజకీయ శక్తులనుండి గాని తమను తామే రక్షించుకొనే విధంగా ప్రాచీన కాలం నుండి మన భారతదేశంలో సంఘ మర్యాదలనే పేరుతో కొన్ని కట్టుదిట్టములు ధ్రువపడియున్నవి. అవియే ప్రజాధికారాలు. వ్యక్తుల సముదాయమే సమాజము కనుక వ్యక్తి నియమాలు సమాజ నియమాలలో అంతర్భాగమై యుండును. అవి పరస్పర విరుద్ధముగా చిరకాలం మనజాలవు. ఇంక ప్రజలకు రెండవ ప్రత్యర్థి ప్రభుత్వము 'భాషకొరకు వ్యాకరణం' పుట్టినట్లు 'ప్రజలకొరకు ప్రభుత్వం' పుడుతుంది. అంటే ప్రజారక్షణమే ప్రభుత్వకర్తవ్యము. సమాజములో ప్రబలమగు జార, చోరాది దుష్టుల నుండి ప్రజను రక్షించటం మొదటివిధి. అట్లే దైవికములగు ఉత్పాతములు, కరువుకాటకాలు వచ్చినపుడు కూడ ప్రభుత్వము తగినంత రక్షణము కల్పించవలెను. ఇట్టి అవసరములతో ప్రభుత్వము పుట్టును. ఆ బాధ్యతను నిర్వహించుటకు అధికారాన్ని సాధనముగా కల్పించారు. అధికారం లేకపోతే ప్రభుత్వానికి బలమే లేదు. ఇట్లు స్వయం ప్రాప్తమైన అధికారాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేయకుండా చూడటానికి ఆ ప్రభుత్వ వ్యవస్థను అనేక విధములుగ మార్పు చేసుకొంటూ ప్రయోగాలు చేస్తున్నారు ప్రపంచ రాజకీయ వేత్తలు. రాజరికమని, ప్రజాస్వామ్యమని, నియంతృత్వమని అనేక అవాంతర భేదాలతో ప్రయోగాలు చేసి రాజ్యాంగాన్ని సరిదిద్దుకుంటూ వస్తోంది పాలన వ్యవస్థ. ఎన్నిచేసినా 'అధికార దుర్వినియోగం ప్రభుత్వానికి తప్పదు' అనే విషయాన్ని కూడా గ్రహించారు. మరి ప్రజలను రక్షించటానికేర్పడిన ప్రభుత్వం ప్రజలను హింసిస్తుంటే చేయవలసినదేమిటి అనే విషయమును గూర్చి అన్ని ప్రాచీన నాగరిక దేశాలు చక్కగా ఆలోచించుకొన్నవి. ప్రజాశ్రేయస్సును ప్రజలే చూచుకొనవలెను అని యెన్నడో నాగరికతగల దేశాలు విడివిడిగానే నిర్ణయించుకొన్నవి. రాజ్య వ్యవస్థ యేర్పడక ముందే గ్రామీణ వ్యవస్థ యేర్పడెను గనుక గ్రామానికి సంబంధించని అంశములపైననే ప్రభుత్వానికి అధికారములు ప్రాప్తించెను. గ్రామానికి సంబంధించిన విషయము లన్ని ఆ గ్రామములోని ప్రజల శ్రేయస్సును గూర్చినవిగనే యుండును గనుక నవి సాంఘిక వ్యవహారములు. రాజకీయములే మాత్రము కాజాలవు. వీటిని ప్రజలే నిర్వహించుకొనవలెను. ఇంక ప్రభుత్వము నెరవేర్చవలసిన విధులు శత్రువులనుండి దేశమును రక్షించుట దేశవ్యాప్తముగ చోరాది కంటకులు వ్యాపించకుండ చూచుట న్యాయపర్యవేక్షణము మొదలైన కొన్ని బృహత్తర బాధ్యతలు అందుకుగాను ప్రజలపై పన్నులు విధించబడును. ఈ విధముగ ప్రభుత్వమునకు సంబంధించిన వ్యవహారములను రాజకీయము లనిరి. పన్నులు చెల్లించుట తప్ప ప్రజలకు రాజకీయములతో సంబంధముండెడిది కాదు. అట్లే గ్రామ సముదాయములను కాపాడుటయే ప్రభుత్వ కర్తవ్యము. గ్రామములోని ఆంతరంగిక వ్యవహారములలో జోక్యము చేసుకొనుటకు ప్రభుత్వమున కధికారము లేకుండ పూర్వకాలమునుండి ప్రాచీన నాగరికతగల దేశములలో కట్టుదిట్టములు చేయబడినవి. ఇట్లు రాజకీయశక్తిగల పాలక వర్గమునకు ప్రజావ్యవస్థయగు గ్రామముతో తగవులాట లేకుండ చూచుకొన్నారు. రాజునకుండు గౌరవము పురపాలకాధ్యక్షుడికి ఇందుమూలముగనే ఆచారసిద్ధమైయున్నది. అందువలననే భారత దేశ ప్రాచీన రాజ్యాంగములలో (రాజు, మంత్రి, మిత్రుడు, కోశము, రాష్ట్రము, దుర్గము, బలము) రాష్ట్రమును దేశము, దేశప్రజల నుద్దేశించి చెప్పియున్నను 'పౌరాణాం, శ్రేణమోపిచ' అని పౌర సంఘములను (శ్రేణులు, గణములు మున్నగునవి) కూడ విశేషించి చెప్పిరి. ఈ పౌరసంఘములు అధికారము కలిగియున్నట్లు అనేక శాసనముల వలన తెలియుచున్నది. అవియే ప్రజాధికారములు (Civil rights) అనబడును. వాటిని రక్షించుట రాజుయొక్క విధులలో చేర్చిపెట్టిరి.

భారతదేశములో అతి ప్రాచీనకాలమునుండి పౌర సంఘములు కలవనియు, రాజరిక వ్యవస్థ జరిగినంతకాలము గ్రామములలో ప్రజాపాలనము సాగుచునేయున్నదనియు చరిత్రవలన తెలియుచున్నది. ముసల్మానుల పాలనములోను, తర్వాత బ్రిటిషు పరిపాలనములోను వారి యధికారమును బలపరచుకొనుటకై గ్రామపాలన వ్యవస్థను పూర్తిగ తీసివేసిరి. దీనికి వేరొక కారణముకూడ కలదు. ఆర్థిక విధానములోని మార్పు. గ్రామములలో వస్తువినిమయ విధానము (borter system) తగ్గుచు ద్రవ్యవినిమయము (monetary system exchange) హెచ్చినకొలది స్థానికాధికారములు తగ్గి ప్రభుత్వాధికారము హెచ్చెను. నాణెములను ప్రజలకు ఎరజూపించి ప్రభుత్వం వస్తువు నపహరించును. ఉదాహరణకు గ్రామాల్లో ప్రస్తుతం పాలు, నెయ్యి కన్న సులభంగా డబ్బు దొరుకు

తుంది. గ్రామాలవారుకూడ వాటిని బస్తీనుండి కొనుక్కొని తెచ్చుకోవలసినదే. ఆర్థికాభివృద్ధి వాంఛనీయమైనప్పటికి, దాని వలన గ్రామీణవ్యవస్థలో ప్రజాధికారము తగ్గి ప్రభుత్వాధికారము హెచ్చగును. ఈ విధంగా విదేశీయుల పాలనములో మనదేశమునందు ప్రజాధికారమనేది పూర్తిగా నశించెను. స్వాతంత్ర్యము వచ్చిన పిదప ఢిల్లీలోని పార్లమెంటరీ (లోకసభా) ప్రభుత్వ యంత్రాంగమే ప్రజాధికారమని మనము భ్రమపడుచుంటిమి. అది ప్రజా ప్రభుత్వము మాత్రమే యగును కాని ప్రజాధికారము కాజాలదు. ప్రజాదికారము అనగా గ్రామాల్లోని ప్రజలు తాము పండించుకొనే పంటలుగాని, ఉత్పత్తిచేసుకొనే వస్తువులనుగాని తమకు చాలినంతగా వినియోగించుకొనే స్వేచ్ఛ. అట్లే తమకు వలసిన యితర వస్తువులను తామే సులభముగా లభ్యమగునట్లు చేసుకొన గలుగుట. అంటే ప్రభుత్వ యంత్రాంగముపై నాధారపడక తాము స్వయముగ మనగలుగు స్వేచ్ఛను పొందుటయే ప్రజాధికారమనబడును. పూర్వం సమాజము యొక్క బాగోగులను ప్రభుత్వమునకు ఒప్పగించక తమ నైతికాధికారమునకు ప్రభుత్వమును నామ మాత్ర పర్యవేక్షకముగ నిర్మించుకొనిరి. కాని యిప్పటి నాగరికతలో కేంద్ర ప్రజా ప్రభుత్వమే గాని గ్రామీణ ప్రజాధికారము లేదన్నను తప్పు కాదు.

ఆంధ్రదేశములో కాకతీయులనాడు ప్రభుత్వముతో నిమిత్తము లేని ప్రజాధికారమును ప్రజలు కలిగియుండినట్లు శాసనముల ద్వారా తెలియవచ్చుచున్నది. కాకతీయులకు పూర్వము చాళుక్యులు, చోళులు తెలుగు దేశమును పాలించిరి. అనగా వారి సామ్రాజ్య వ్యవస్థలో తెలుగుదేశము సామంతరాజ్య ప్రతిపత్తిలో నుండెను. ఆ సామ్రాజ్యతత్వ పరిపాలనములో తెలుగు దేశములో ప్రజాధికార మెట్లుండెడిదో సరిగా తెలియకున్నను కాకతీయుల నాడు అది కొంత స్పష్టముగా తెలుసుకొన వీలగుచున్నది. ప్రొఫెసరు దీక్షితు గారు కర్ణాటకములోని ప్రజాపాలనమును గూర్చి వ్రాయుచు [1] గ్రామ సభలే కాక, నాడు సభలు, మహానాడు సభలు అనబడు ప్రజాసభలు గ్రామము, నాడు, మహానాడులలో కూడా నుండెడివని వివరించిరి. కాకతీయుల నాడు మొదటి రెండు సభలు మాత్రమేకలవని తెలియుచున్నది. గ్రామ సభలను 'అశేషప్రజ', లేక 'సమస్త ప్రజ' అనియు పేర్కొనెడివారు. కొన్ని తావులందు 'అష్టాదశప్రజ' యనియు కూడ కనబడును. పదునెనిమిది జాతుల సంఘములు లేకున్నను గ్రామ సంఘమును ఆ పేరుతో పిలుచుట కలదు. కేవలము 'ప్రజ' అని మాత్రమే పేర్కొనుట కూడ కలదు. కొన్ని గ్రామముల సముదాయమును సంఘముగా తెలుపు నవసరమున 'స్థలసమయ' మని పేర్కొనబడును. ఈ సంఘములు జాతులను బట్టిగాని, వృత్తులనుబట్టిగాని యేర్పడినవి కాక గ్రామములోని ప్రజాసామాన్యమును అధికారముతో గూడిన సంఘముగా తెలుపుట కుద్దేశించినవిగనే స్పష్టముగ తెలియు చున్నది. జాతులను, వృత్తులను బట్టి యేర్పడిన సంఘములకు గల అధికారములు ఆయా సంఘములకు మాత్రమే పరిమితమై యుండును. ఈ సంఘముల పెద్దలే సాధారణముగ గ్రామ సంఘమునకు సభ్యులుగ నుండి యుందురు. ఇంతకుమించి గ్రామ సంఘ సభ్యుల నెన్నుకొనుటను గూర్చిన విశేష విధానము మనకు తెలియదు. వ్యక్తిగతమైన సామర్థ్యము, నిజాయితి – యివియే ఆనాటి సభ్యుని కుండవలసిన ముఖ్యమైన అర్హతలని విశేషించి చెప్పనవసరము లేదు. ప్రమాణస్వీకార పద్ధతిని గూర్చి కూడ అంతే. కాని పూర్వకాలంలో కొన్ని ఒప్పందాలు చేసుకొనునపుడు ఇరు పక్షముల వారు, సాక్షులు తాంబూల స్వీకారము చేసెడివారు. ఈ ఆచారము ప్రస్తుతము మన వివాహ సంబంధములు కుదుర్చుకొను సందర్భములో కానగును. కొండపర్తి (వరంగల్లు దగ్గర) లో నొక 8–9 శతాబ్దుల నాటి శాసనములో పొలమును అమరకానికిచ్చునపుడు ఆ కాపు చేతను, ఇతర భాగస్థుల చేతను, సాక్షులచేతను తాంబూల స్వీకారము చేయించినట్లు కలదు. [2] అట్టి పద్ధతియైనను గ్రామ సంఘ సభ్యుల నియామకములో కలదో లేదో తెలియదు.

కరీంనగరు జిల్లాలో శనిగరం అనే గ్రామంలో కాకతి మొదటి బేతరాజు పెర్గడ నారణయ్య దుద్ధమల్ల జినాలయమునకు దానము చేయదలచి ఆ గ్రామమునందున్న పెద్దగావుండు (గ్రామ సంఘాధ్యక్షుడు) అగు ముప్పడయ్యను పున్నిరడ్డిని ఒడంబడిసి యొక యేతమును దానము చేసెను.[3] అదే గ్రామములో కాకతి రెండవ ప్రోలుడు మధుపేశ్వరాలయమునకు దానముచేయుచు అచటి గావుండులను రెడ్లను ఒప్పించి భూములను, నివేశన స్థలములను దానమిచ్చెను. ప్రక్కనున్న బెజవాంకె గ్రామములోని గావుందుని రెడ్లను ప్రభువును ఒడంబడిసి అచట భూములనుకూడ నిచ్చెను.[4] ఈ కాకతీయులిరువురు మహామండలేశ్వరులైయున్నను స్థానికులగు గ్రామకూటుని యొక్కయు, రెడ్లయొక్కయు, గ్రామప్రభువు యొక్కయు అనుమతిలేనిదే ఆ గ్రామములకు చెందిన భూములను నివేశనస్థలములను, తుదకు ఏతమును కూడ దానముచేయజాలక పోయిరి. దీనినిబట్టి గ్రామములోని భూములు, నివేశన స్థలముల కొంతమేరకైనను గ్రామ సంఘముల యధీనములో నుండెడివని తెలియుచున్నది. అంతేగాక ఇట్లు దానమీయబడిన భూములను ఏతములను సరిగా నిర్వహించుచు వాటి రాబడిని ఆలయములకు వినియోగించు భాధ్యతనుగూడ వారే వహించవలయును.

భువనగిరి తాలూక, ఇంక్రియాల్ అనే గ్రామానికి వెలుపల శిథిలాలయ చిహ్నములు గల యొకచోట శకం 1214, (క్రీస్తు శకము 1292) నాటి యీ శాసనము అప్రకటితము గనుక దాని నిచట వ్రాయుచుంటిని.

1. స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శక వ –
2. రుషాలు ౧౨౧౪ అవునందన సం.
3. వత్సర చైత్ర శు 3 గు 1 నాందు స్వస్తి
4. సమధి గత పంచ మహాశబ్ద మహా
5. మండలేశ్వర కాకతియ్య ప్రతాపరుద్ర

6. దేవమహారాజులు ఓరుంగంట సుఖలీలా వినో
7. దంబులం బ్రిథ్వీరాజ్యంబు సేయుచునుండంగా
8. సు। స్వస్తి శ్రీమన్మహా మండలేశ్వర పెండ్లి
9 కొడ్కు మల్లిదేవ మహారాజుల లెంక ఎల్లు
10. రవుతు మాడూ వెనకటేవులు టేవుటేల రు—
11. ద్రపురము । మూండు ఊడ్ల కాంపులా
12. అశేషప్రజాను పిల్వంబంచి శ్రీ మల్లినాథ
13. దేవర సభామండపమందు వారికి దండము
14. వెట్టి వింనపము సేస్తేని ఆ పెక్కండ్రూను ఆ—
14. నతిచ్చిన క్రమము ఎట్లంగను మల్లినాథదేవ
16. రభోగానకు సూయన్ చంద్రులు కలంతదాం—
17. కాను చెల్లనిచ్చిన పంనుక్రమము । మూండూ
18. డ్ల నీరునేలాను మఱుత్తురు చింనము లెక్క
19 ను చెల్లనిచ్చిరి ॥ ఇధమ్మన్ము ఎవ్వరు ప్ర—
20. తి పాలంచిరి వారి శ్రీపాదధూలి మూ
21. శిరస్సుది. మిధమ్మన్ము ఎవ్వరు నిగ్రహ
22. ముసేసిరి వారి ఏకావింశతి
23. పితాడ్వాంను అధోగతిం బడుదురు
24. యిధమ్మాన్నకు సాక్షులు మల్లినాథ
25. దేవరాను భూమి దేవతాను సూ—
26. య్యాన్ చంద్రులు సాక్షి॥ మాడూ దేవర
27. దీపానకిచ్చిన అయిదు మొగవులకు
28. కోడెలు ఎన్నిపుట్టినాను దీపము పమ—
29. రునకే అమ్మేది పెయ్యలు ఎన్ని పుట్టినా —
30. దేవరి జన్నే పెట్టేది
31. దేవబ్రాహ్మణ
32. వ్రిత్తులు మొదలుగా
33. ను చెల్లనిచ్చిన పన్ను [గ ౧]

వివరణము :

కాకతి ప్రతాపరుద్ర మహారాజు ఓరుగంటిలో సుఖ రాజ్యను చేయుచుండగా శకము 1214 కు సరియగు (క్రీస్తు 1292) నందన సంవత్సరములో మహామండలేశ్వర పెండ్లికొడుకు మల్లిదేవ మహారాజుల లెంక ఎల్లు రవుతు మాడు (అనే పొలమేర కావచ్చును) వద్ద వెనక టేవుల (ఇప్పటి ఇంక్రియాల్), టేవు టేల (ఇప్పటి రావిరాల), రుద్రపురము (రుద్రవెల్లి) అను మూడు గ్రామాల కాంపులను అశేష ప్రజాను పిలిపించి వారిచేత చేయించిన దానము ఇందు చెప్పబడెను. మహామండలేశ్వర పెండ్లికొడుకు మల్లిదేవ మహారాజు పాతర్లపాడు శాసనంలో కూడ వచ్చును. అతని లెంక (విశ్వాసపాత్రుడగు సేనాధిపతి) ఎల్లురవుతు ఆ గ్రామ పెద్దలను (గ్రామసంఘ సభ్యులను) పిలిపించి దేవుని మంటపంలో సభచేయించి వారికి సవినయంగా నమస్కరించి విన్నపము చేసెనట. తన స్వామియైన మల్లిదేవ మహారాజు ప్రతిష్ఠించినది కావచ్చును. ఈ మల్లినాథదేవుని గుడి, దానికి దానముచేయుటకు మహామండలేశ్వరుడైన మల్లిదేవరాజుకి అధికారం లేని కారణమున ఆ మూడూండ్ల అశేష ప్రజను తన దేవునికి దానము చేయుమని తన అధికారియగు ఎల్లురవుతు ద్వారా దండము పెట్టించి సవినయముగ ప్రార్థించెను. ఆ పెక్కండ్రు (అశేష ప్రజ) అచట సమావేశమైయున్న కాపుల సందరికి తాము సేద్యము చేసే భూములపై మఱుత్తురు ఒకటికి చింనము వంతున దేవునికి దానము చేయవలెనని ఆనతిచ్చిరి. ఈ విధముగా ఆజ్ఞాపించు అధికారము ఆ గ్రామ సంఘాల కుండేదనిన్నీ మహామండలేశ్వరునకు కూడ కాపుల నాజ్ఞాపించు అధికారము లేదనిన్నీ ఈ శాసనము వలన స్పష్టమగుచున్నది. ఇంతే కాదు ఆ గ్రామాల్లోని దేవ బ్రాహ్మణ వృత్తులపైన కూడ ఒక గద్యాణము ఇందు నిమిత్తముగా పన్నును విధించిరి. ఇది మొత్తము వృత్తుల పై కావచ్చును. దీపానికై యిచ్చిన అయిదు ఆవుల దూడలలో కోడెలను అమ్మి నూనె కొనమన్నారు. పెయ్యలను దేవుని మందలోనే పెంచమన్నారు. ఈ చెప్పిన మూడు వూళ్ల మూసినది యెడమ

వైపుననున్న కుగ్రామాలు. కనుక మనము వాటిని ఆనాటి ఆదర్శ గ్రామాలుగా గ్రహించవచ్చును. అచటి అశేష ప్రజకున్న అధికారమెట్టిదో యీ శాసనము విశదీకరించుచున్నది. మహామండలేశ్వరుడి దొరతనము కన్న గ్రామ అశేష ప్రజాసంఘము యొక్క అధికారమెక్కువ. అంటే ప్రభుత్వముకన్న ప్రజాధికారము బలమైనది. అంతేకాదు గ్రామములోని దేవబ్రాహ్మణ వృత్తులతో సహా మొత్తము భూములపై ప్రజాసంఘమునకే అధికారమున్నదని కూడ స్పష్టమగుచున్నది. అంటే ఆ దేవాలయాలు, బ్రాహ్మలు, కాపులు నశించినను గ్రామమున్నంత మటుకు ఆ భూములపై గ్రామసంఘానికి కొంత అధికారమంటుందన్నమాట.

ఇట్టి శాసనాలింకా కలవాయందురేమో. చాలా కలవు. అశేష ప్రజ, సమస్తప్రజ, అష్టాదశప్రజ, ప్రజ అని కనిపించు శాసనములన్ని యిట్టివే. కొన్ని స్పష్టముగ నుండవు, కొన్ని ఇంక్రియాల శాసనమువలె స్పష్టముగ నుండును. హుజూరునగరు తాలూకా తాడువాయి గ్రామంలోని శాసనమొకటి ప్రస్తుతం నడిగూడెం జమీందారుగారి కోటలో భద్రపరచబడియున్నది. అందు శ్రీ మన్మహాసామంత చెఱకు జగదాళు అన్నయరడ్డి శక వర్షము 1236లో తాడువాయి గ్రామ సమస్త ప్రజ సమ్మతిని పొంది అచటి మైలారదేవునికి కొంత దాన మొసగినట్లు చెప్పబడెను. [5] మేళ్ళచెఱువులోను, [6] ఆలుగడపలోను, [7] దుప్పల్లిలోను, [8] మానుకోటలోను, [9] తంగెడలోను, [10] మాచేడులోను [11] కూడ నిట్టి శాసనములు గలవు.

అవసరము వచ్చినపుడు గ్రామ సంఘ సభ్యులు పెద్ద ప్రభుత్వాధికారినైన తిట్టి తనకు జరిగిన అన్యాయమును సరిదిద్దించెడివారు. తెనాలి తాలూకా దుగ్గిరాల దగ్గరనున్న పెనుమూళి గ్రామ శివాలయములో నొక శాసనము కలదు.[12] అది శకము 1236 (క్రీ. శ. 1314) నాటిది. ప్రతాపరుద్రుని ఓరుగంటికోట ద్వారపాలాధికారి, వాకిటి యెఱ్రయలెంక పెనుమూళి గ్రామ ప్రాంతములో 22 ఊళ్లనాయంకరము నేలుచుండెను. నాయంకరమనగా సైనిక స్థావరము. రుద్రమదేవి కాలమునుండి యిట్టి సైనిక స్థావరములద్వారా అపారమగు సైన్యమును పోషించు కేంద్రములు నేటి కంటోన్మెంట్లవలె కాకతీయ రాజ్యమంతట నెలకొల్పబడెను. అట్టివాటిలో నొకటి యీ పెనుమూళి నాయంకరము. ఇట్టి సైనికస్థావర నిర్వహణార్థమై కొన్ని ప్రత్యేకాధికారములు గల సైన్యాధిపతులు లెంకలు, నాయకులు అను ఉద్యోగులుందురు. వీరికి అదనపు పన్నులు వసూలు చేసుకొని సైనికులను పోషించుకొనే అధికారముండును. ఈ ప్రత్యేకాధికారము గల యెఱ్రయలెంక తన నాయంకర గ్రామాల్లో లోగడ సర్వ మాన్యాలుగానున్న దేవస్థాన వృత్తులపైన కూడ కానుకలు, పుట్టికోలబడులు, పన్నులు, సుంకములు మొదలగువాటి నంటిని విధించెను. ఇందుకు ప్రతీకారముగ పినపాడు గ్రామ (సంఘాధ్యక్షుడు) పెద్దయైన దొడ్డపోతి పెద్దింగారు ఈ యెఱ్రయలెంకను తిట్టి మందలించెనట. అందు మీదట ఆ సైనికాధికారి తను విధించిన పైజెప్పిన పన్నులనంటిని ఆ నాయంకర గ్రామాలన్నిటిలోను ఉపసంహరించుకొనెను. అంతే కాదు. ఇంక ముందిట్టి అవకతవకలు మరెవ్వరు చేయకుండుటకై ఆయన తనను తిట్టినట్లు, తాను సరిదిద్దుకొన్నట్లు శాసనంగా వ్రాయించారు. ఆ శాసన భాగమిట్లున్నది :

> "ఇరువయి రెండ్వాళ దేవస్థానాల వృత్తులకానిక గడ్డగ మాడలూను ఆ యూళ వృత్తులుగల మహాజనాలకు పుట్టి సహిండ్డని పుట్టికోలుపూను ఉపకృతిని సుంకమ్మూను పసుం పుల్లరీని కానికలూను సహితమైన అవనాయాలూను పినపాటిలోను ఇవి నిమిత్యమై దొడ్డపోతి పెద్దింగారు తిటితేని దోషపరిహారార్థముగాను, ప్రతాపరుద్రదేవ మహారాజులకు పుణ్యముగాను, ఆచంద్రార్కముగాను ధారవోసి పెనుంబులువు గౌరీశ్వర శ్రీ మహాదేవర గుడిముందటను శాసనగంభము ప్రతిష్ఠించిస్తిమి.. ఈ మేరకు ఓరుంగంట్టి స్వయంభునాథ దేవరసాక్షి."[13]

ప్రజాధికారమనగా ఇట్లుండును: ప్రజలు తమ కన్యాయము చేసిన సైన్యాధికారినైన ఎదుర్కొనెడు శక్తి కలిగియుండిరి. మరి యే రాజకీయోద్యోగియైనను వారు లెక్కచేయువారుకాదు. నేడు తహసిల్దారుగాని, కలెక్టరుగాని గ్రామములో నేదైన అక్రమ విధానము నవలంభించిన యెడల మన పంచాయితి సమితివారు తమకున్న అధికారముతో వారి నెదుర్కొన గలుగుచున్నారా అను విషయము ఆయా సమితి సభ్యుల నిజాయితీమీద ఆధారపడియుండును. సభ్యులు స్వార్థపరులగుచో ప్రభుత్వోద్యోగులకు, వారెన్నుకొన్న ప్రజానాయకులకు సైతము లొంగియుండక తప్పదు. దానికి కారణం తిరిగి మన ఆర్థిక విధానములోని లెవీలు, పర్మిట్లు, కోటాలు మొదలైన వెన్నో. ఈ విధంగా గ్రామజీవనం నాయకుల ప్రభుత్వాధికారాలకు లొంగిపోయింది. ఆనాడు ఇంత ఆర్థికాభివృద్ధి లేదు కనుక అవినీతి ఇంత ప్రబలలేదనిపిస్తుంది. కాకతీయులనాటి వరకు కనీసం ప్రజాసంఘములు ప్రభుత్వాధికారాలకు లొంగియుండవలసి రాలేదు.

ఈనాటి గ్రామవాసులు తనుకు న్యాయంగా కలుగవలసిన వైద్య సదుపాయాలు మొదలైనవి అందుటలేదని నెత్తిన నోరు పెట్టుకొని అనేక విధములుగా ప్రభుత్వానికి చెప్పుకొంటారు. కాని వైద్య కళాశాలల్లోని సగం సీట్లు తమ గ్రామాలనుండి పంపుకొనే విద్యార్థులకే యిప్పించుకొని వారిని తమ గ్రామాల్లోనే వైద్యులుగా నియమించుకోవచ్చు. ఇట్లా కొన్ని సంవత్సరాల్లో అనేక కుగ్రామాల్లో కూడా వైద్య సౌకర్యాలు గ్రామ సంఘాల ద్వారానే కల్పించుకోవచ్చు. అట్లాగే యితర సమస్యలు. కాని మన ఇప్పటి గ్రామ సంఘాల కీ మాత్రం స్వేచ్ఛ కూడ లేదేమో. లేక వారు కూడ నాయకుల ప్రభుత్వాధికారులతో కలసి తమ బాధ్యతలను మరచిపోయి ప్రజను మోసం చేస్తున్నారో. ఈ విధంగా నేటి ప్రభుత్వం ప్రజాప్రభుత్వ మనబడుచున్నా ప్రభుత్వ యంత్రాంగము ద్వారా గ్రామ జీవితంపై దమన నీతినే చూపుచున్నది కాని పర

దేశీయుల పాలనలో నశించిన ప్రజాధికారాలను పునరుద్ధరించుట లేదు. ప్రజాధికార సంరక్షకులుగా నుండవలసిన ప్రజాసంఘములను తమలో విలీనం చేసుకొన గలుగుట నాయకుల ప్రభుత్వాధికారానికి ఘనవిజయము. దీనిని బ్యూరోక్రసీ (Bureaucracy) యొక్క పరాకాష్ఠ యనవలెను.

ఇప్పటి సాంఘిక చరిత్ర పరిశోధకులు గమనించవలసిన మరి యొక విషయము కలదు. సాధారణంగా ప్రతి శాసనం చివర కొన్ని అభిశాసన వాక్యాలుండును. అనగా శాసనస్థ విషయమునకు అనుల్లంఘనీయమగు న్యాయాధారమును కల్పించుట అని యర్థము. ఆ వాక్యములు సాధారణముగ నిట్లుండును: 'అస్యోపరినకేనచి ద్బాధా కర్తవ్యా' (దీనిపై నెవ్వరు బాధ కల్పించకూడదు); 'స్వదత్తాం పరదత్తాంవా యోహరేత వసుంధరాం, షష్టిం వర్ష సహస్రాణి విష్ఠాయాంజాయతే క్రిమిః' (తాను చేసిన ధర్మమునుగాని, పరులు చేసిన ధర్మమునుగాని ఉల్లంఘించు అధికారి అరువది వేల యేండ్లు అమేధ్యమునందు క్రిమియై పుట్టుచుండును). ఇంకా అనేకములు. ఇవి యేవో పురాణ వాక్యాలని పరిశోధకులు త్రోసిపుచ్చుదురు. కాని పై జెప్పిన యెర్రయరెంకవంటి సైనికాధికారులను సైతము అక్రమ చర్యలనుండి మందలింపగల నైతిక శక్తి యీ వాక్యముల కున్నది. పూర్వ మెవరుచేసిన ధర్మమునైనా మార్పుచేసే అధికారం తనకు నైతికంగా లేదని గ్రహించాడు పాపమా పైన్యాధికారి. కాబట్టి అప్పటి సంఘము నీతికి కట్టుబడియున్నట్లు ప్రభుత్వాధికారానికి కట్టుబడేది కాదని తెలియవలెను. సాంఘిక చరిత్రకు ఇది కూడ ముఖ్య విషయమేకదా. ఇట్టి శాసనం నందలూరులో నొకటి కలదు. [14] ప్రతాప రుద్రుడికి ముందు కాలములోని పాలకులు నందలూరి గ్రామంలోను దానికి చెందిన అయిదు పల్లెలలోను అన్యాయముగ కొన్ని పన్నులు వసూలుచేయు చుండెడివారని విద్వాంసులు ప్రతాపరుద్రుడికి చెప్పిరి. దానికి రాజు వారికి లోగడగల అష్టభోగస్వామ్యతలను పునరుద్ధరించుచు పన్నుల నటిని పరిహరించెను. దీని కనుగుణమగు అభిశాసన మిట్లుండును: ''మద్వంశజాః పర మహీపతి పతి వంశజా వా పాపాదపేత మనసో భువి భావి భూపాః। యే పాలయంతి మమ ధర్మ మిమం సమస్తం తేషాం మయా విరచి తోంజలి రేషమూర్ధ్ని॥—''అనగా దాతయగు రాజు తన వంశము వారైనను, పరవంశము వారైనను ముందు రాబోవు భూపాలురు పాపచింత లేనివారై నా యీధర్మము నెవరు సంరక్షించెదరో వారికి నాచే శిరసు మోడ్చి యీ వందన మాచరింపబడుచున్నది. అట్లే ''శత్రు రేవహి శత్రుః స్యాత్ ధర్మః శత్రుఃన కస్యచిత్'' (వ్యక్తుల మధ్యనే శత్రుత్వముగాని, ధర్మ ప్రవృత్తిలో నెవ్వరికి శత్రుత్వ ముండదు కదా.) అని ధర్మ సంస్థల విషయమై నైతిక భద్రత నేర్పరచుచు ప్రజలకు ప్రభుత్వాలు బలము నిచ్చెడివి. విజయనగర రాజైన మొదటి దేవరాయలు క్రీస్తుశకము 1413 లో కడప తాలూకా పెండ్లిమర్రి గ్రామంలో నొక చెరువును కాపాడుటకై కొందరు స్థానికులను నియమించి వారికి వృత్తుల నిచ్చెను. దానిని దశవంద మాన్య మందురు. అందలి అభిశాసన వాక్యము తెలుగులోనే ''ఇందు పండు పంట రాజకీయ కొరారుపుకి సంబంధము లేకుండను, రెడ్డి, కరణములతో సంబంధములేకుండను, ఇట్లాంటి యితర ఆయగాండ్రతో నెట్టి అభ్యంతరాలు లేకుండా అని చెపుతూ ఎండా, వానా తప్పించి యింకే గొడవా లేకుండా మీకు సర్వ మాన్యంగా చేస్తిమి'' అని చెప్పను. [15] అంటే ప్రజోపయోగకర మగు చెఱువు భద్రముగా కాపాడబడవలెనని దాని కావలివారికి దైవి కోల్పాతములు తప్ప మరెట్టి ప్రభుత్వాధికారులకు జోక్యములేని నైతిక సంరక్షణము నిచ్చెను. ఈ యుదాహరణల వల్ల తెలియు నదే మనగ పూర్వపు రాజులు ప్రజలకు నైతికముగ కొన్ని అధికార పూర్వకమగు రక్షణములను కల్పించెడివారు.

ఈ పై చర్చవలన తేలిన యంశములేమనగా (1) ప్రభుత్వ మెప్పుడు ప్రజలపై పెత్తనము చేయుటకై అధికార దుర్వినియోగము చేయునని భారతీయులు కూడ అతి ప్రాచీన కాలమునుండి తెలుసు కొనిరి. (2) అందుకు ప్రతీకారముగ గ్రామసంఘములు స్వతంత్ర ప్రతిపత్తితో ప్రభుత్వాధికారాన్ని అవసరము వచ్చినప్పుడు ఎదుర్కొనెడివి. (3) ఈ గ్రామసంఘములు కాకతీయులనాడు అశేష ప్రజ లేక సమస్త ప్రజ అను పేరుతో మహా మండలేశ్వరుల కంటె మిన్నయగు నధికారము కలిగియుండెను. (4) ప్రభుత్వములోని ఉన్నతాధికారులనైన గట్టిగా మందలించి తమ కన్యాయము జరుగ కుండ ప్రజలు తమను కాపాడుకొనెడువారు. (5) ప్రజలకి నైతిక శక్తిని రాజులు కల్పించెడివారు. (6) విదేశీయుల పాలనలో నష్ట పోయిన ప్రజాధికారాలను ఇపుడు పునరుద్ధరించుకొనలేకపోతున్నాము.

అథోజ్ఞాపికలు

1. Dikshit G. S., Local self govt. in Medival Karnataka, Ch. II.
2. పి.వి.పి. శాస్త్రి. తెలుగు శాసనాలు ఆం. సా. పరిషత్తు ప్రచురణలు, పుట 45.
3. కరింనగరు జిల్లా శాసనాలు 14
4. ,, ,, 15
5. SII. X, 508
6. Corpus II, P. 88
7. అప్రకటితము.
8. ఎపి ఆంధ్రికా IV. పుట 131.
9. వరంగల్లు జిల్లా శాసనాలు, 84.
10. SII. X, 495
11. వరంగల్లు జిల్లా శాసనాలు 86.
12. SII. X, 509
13. ,, ,, పంక్తులు 24 నుండి 44 వరకు.
14. SII. X, 496
15. అప్రకటితము

యత్నం

శ్రీ నలిమెల భాస్కర్

ఎద్దు
గద్దకన్న
పెద్దదైనా —
గడ్డే మేస్తుంది.
గద్ద
ఎద్దుకన్న
చిన్నదైనా
దాని రక్తమాంసాల్ని
కోరుకుంటుంది.
నేనిప్పుడిప్పుడే —

నిద్రిస్తున్న ఎద్దుల్ని
నా కలం కర్రతో
పొడుస్తున్నాను.

మబ్బు - మెరుపు

శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

ఇది వర్షర్తువు కొందరి,
కిది హర్షర్తువును ప్రేయసీ ప్రియులకు; వా
రిద! హృదయాంతరమందున
మదన సుహృచ్చాప మొకటి మసకగ మసలన్.

చల్ల చల్లనైన సంజమబ్బుల వేళ
లీలందోచు — ప్రేమలేఖవోలె!
కాళిదాసు కూడ, కదలి యీ వేళనే
వ్రాసె, రామగిరి నివాసి కథను...

మెయిని సౌదామనీ లతమెరసినపుడె
మొయిలు పురుషత్వ మొక్కింత మోహనమ్ము
ఉరుము వెంటనె ఫక్కున మెరపుబాల
వెలిగి, తొలగెడు నందుకే వేడ్కతోడ—

కొమ్మ కనుబొమ్మ పల్లకిం గ్రొత్త దంప
తులను బోలెడు నేత్రాలు తూగులాడు;
బోటి కంటను పడినట్టి నాటినుండె
అతడు శివుడౌను; ఆమె పార్వతియుగాగ!

బాల చంద్రరేఖం బోలగా జాలిన
మెలత నుదుటిపైని అలకలమరు!
అలక సరిగ దీర్చి, పలుకరించెడివాడె,
ప్రియుడటన్న యోగపీఠమెక్కు!

శ్రీ సి. రామచంద్రరావ్

ఇంకోసారి తెలుగు బహువచనం

1970 జూన్ నెల 'భారతి' లో 'తెలుగులో బహువచన రూప నిష్పత్తి' అనే రామారావుగారి వ్యాసం అచ్చయింది. భాషాశాస్త్ర పద్ధతిలో తెలుగు బహువచనాల పరిశీలన చేసిన మొదటి వ్యాసం ఇదేననుకొంటాను. ఆ వ్యాసం చివర పేర్కొన్న అంశాలనుబట్టి దాన్ని గురించిన ఆలోచన వారు 1963 లోనే చేసినట్టు తెలుస్తున్నది. ఆ తర్వాత 1975 లో 'తెలుగు బహువచనం' అనే పేరుతో తెలుగు అకాడమీవారి 'తెలుగు' అనే పత్రికలో నేనొక వ్యాసం ప్రకటించాను. దీని రచనకుకూడా బీజాలు 1973 లోనే రామారావుగారి దగ్గర భాషాశాస్త్ర విద్యార్థిగా ఉన్నపుడే పడ్డాయి. దీని తొలి రచన ఢిల్లీ యూనివర్సిటీలో ఒక కోర్సు కోసం ఇంగ్లీషులో జరిగింది. ఆ రచన 1973 నవంబరులో పూర్తయింది.

రామారావుగారి వ్యాసం చాలావిపులమైంది. తెలుగు భాషను గురించి ఎన్నో విషయాలను అది వెలుగులోకి తెచ్చింది. అయితే ఆయనమీద సంప్రదాయ ప్రభావం అధికంగా ఉన్నట్టు కనిపిస్తుంది. చాలాచోట్ల ప్రాచీన వ్యాకరణాల ప్రతిపాదనల్ని యథాతథంగా అంగీకరించారు. అందులో ముఖ్యమైనది నామ బహువచన రూపాలైన 'లు—ళు' అనే రూపాలలో 'లు' నే మూలరూపంగా గ్రహించి, ప్రకృతి ప్రత్యయాల్లో వచ్చే మూర్ధన్య ళకారాన్ని సూత్రం ద్వారా నిష్పన్నం చేశారు. మూర్ధన్య పరిసరంలో అమూర్ధన్య ధ్వని మూర్ధన్యం కావటం సహజమే. అంటే 'కోడి + లు' ఉన్నప్పుడు 'కోళ్లు' అని సాధించటానికి ఎటువంటి అభ్యంతరం లేదు. కాని 'కాలు + లు = కాళ్లు' అనిగాని, 'మొసలి + లు = మొసళ్లు' అని గాని ప్రకృతి ప్రత్యయాల్లో లేని మూర్ధన్యత్వాన్ని సూత్రం ద్వారా సాధించటం చాలా వింతైన దారిలాగా నాకు కనిపించింది. అందువల్ల 'ళు' అనే ప్రత్యయరూపాన్ని మూలరూపంగా గ్రహించి అమూర్ధన్య రూపాన్ని సూత్రంద్వారా సాధించాను. మా యిద్దరి వ్యాసాల్లో ఇంకా మరికొన్ని భేదాలున్నా ప్రధానమైంది ఇదే. కొంత వరకు ఆ భేదాలు ఈ భేదంనుంచి ఉత్పన్నమైనవే. నా వ్యాసంలో ప్రతిపాదనలు అంత వివరంగాలేవు. వ్యాస విస్తరభీతివల్ల చాలా స్థూలంగా మాత్రమే వాటిని ప్రస్తావించాను. 'మరోసారి తెలుగు బహువచనం, ('భారతి' 1976 డిశంబరు) అనే వ్యాసంలో నా అభిప్రాయాలను మన్నసచేసి, సవిమర్శకంగా పరిశీలించినందుకు వారికి కృతజ్ఞతలు. అయినా శాస్త్ర విషయాల్లో అభిప్రాయ భేదాలు తప్పనిసరి కాబట్టి పూర్వం స్థూలంగా మాత్రమే చర్చించిన ప్రతిపాదనలను మరికాస్త వివరిస్తూ రామారావుగారి అభ్యంతరాలకు సమాధానాలు చెప్పటానికి ప్రయత్నిస్తాను. అంతేగాక రామారావుగారి మొదటి వ్యాసాన్ని పునఃపరిశీలించటంవల్ల తక్కిన మరికొన్ని విషయాలనుకూడా ఈ వ్యాసంలో ప్రస్తావిస్తాను. నా ఈ పరిశీలన లక్ష్యం రామారావుగారి వ్యాస ప్రాధాన్యాన్ని తగ్గించటానికి ఉద్దేశించి గాదు. ఇంతటి చర్చను ప్రేరేపించిన వ్యాసం చాలా ముఖ్యమైనదని వేరే చెప్పాల్సిన అవసరంలేదు.

తెలుగు బహువచన రూపసాధనలో రామారావుగారి ముఖ్యమైన అభ్యంతరాలు ఇవి :

1 బహువచన ప్రత్యయం 'ళు' కాదు.

2 'కొడవళి' లాంటి మూలరూపాల ప్రతిపాదన కూడదు.

ఇవిగాక నా ప్రతిపాదనల్లో బలమైన ప్రతిపాదన 'సూత్రాల సహజత్వం' గురించి విస్తారంగా చర్చించారు. సూత్రాల సహజత్వా సహజత్వాలను నిర్ణయించటం ఇంకా పూర్తిగా అంతుబట్టని విషయమే అయినప్పటికీ, వ్యాకరణాల్లో రచించబడిన సూత్రాల ప్రయోగవ్యాప్తిని బట్టి సూత్రాల సహజత్వాన్ని నిర్ణయించవచ్చు. బహువచనంలో అవసరమైన సూత్రాలు అంతవరకే పరిమితమా? లేక 'సంధి' లాంటి ఇతర కార్యాల్లోకూడా కావాల్సి ఉంటాయా? అనే ప్రశ్నలకూ, సూత్రాల్లో మార్పు కలిగించే పరిసరాలు పదాంశ విధేయాలా? వర్ణ విధేయాలా? అనే ప్రశ్నలకూ లభించే జవాబుల్నిబట్టి సూత్రాల సహజత్వాన్ని నిరూపించవచ్చు. సాధు రూపాలన్నిటినీ సాధించగలిగి, అసాధు రూపాలను సాధించలేని సూత్రాలను సహజమైనవిగా పేర్కొనవచ్చు. వర్ణనాత్మక వ్యాకరణంలో చారిత్రక ధ్వనుల మార్పుల్ని సూచించే సూత్రాలుకూడా సహజ సూత్రాలవుతై. మాండలిక రూపభేదాలను నిరూపించటానికి వీలు కలిగించినా సహజసూత్రాలే అనవచ్చు. ప్రాచీన రూపాలకు సరిపోయే మూలరూపాలను ప్రతిపాదించి, వాటివల్ల వ్యాకరణ సౌలభ్యం సాధ్యమైతే, అవి సహజ మూల రూపాలవుతై. ఈ కారణాలవల్ల 'నా ప్రతిపాదనలు సహజమైనవేనంటూ' నిరాకరించారు. ఇంకా 'శబ్ద పరిమాణా'న్ని తెలుగు క్రియల్లో చాలా సూత్రాలకు నియమంగా గుర్తించాల్సి ఉంటుందని కూడా రామారావుగారు అంటారు. ఈ మాత్రా సంఖ్యానియమం తెలుక్కి అవసరంలేదని సందర్భోచితంగా చర్చించబడుతుంది.

ప్రస్తుత వ్యాసకర్త 'తెలుగులో' (1975) ప్రకటించిన వ్యాసంలో ప్రతిపాదించబడిన కొన్ని సూత్రాలు ఇవి—

1. రెండు మూర్ధన్య వ్యంజనాల నడుమ ఉన్న ఊర్ధ్వాచ్చు నిత్యంగా లోపిస్తుంది.

2. అలఘులకార పూర్వమందున్న 'డ్, ర్, ల్' వ్యంజనాలు అలఘులకారంగా మారతాయి.

3. పూర్వపదాంత వ్యంజనం, పరపదాది వ్యంజనం ఒకే వర్గా (class) నికి చెందినా, ఉచ్చారణాస్థానం ఒకటైనా, పూర్వపదాంత వ్యంజనం మూర్ధన్యవర్ణమై, పరపదాది వ్యంజనం 'ర్, ల్, న్,'ల్లో ఏ ఒక్కటైనా, హ్రస్వస్వరం వికల్పంగా లోపిస్తుంది.

4. రెండచ్చులమధ్య అలఘు లకారం లఘు లకారమౌతుంది.

5. పదాంత వ్యంజనానికి ఉకారం చేరుతుంది.

వ్యంజనలోపం, లోపదీర్ఘత, సవ్యసమీకరణం—బహువచన రూప సాధనలో అవసరమైన మరికొన్ని సూత్రాలు. ఈ పై సూత్రాలన్నీ వర్ణవిధేయసూత్రాలు. కేవలం వర్ణాలు (ఒకటిగాని, ఎక్కువగాని) మాత్రమే రూపభేదానికి కారణంగా నిర్దేశిస్తే సరిపోతుందన్న మాట.

'భారతి' (1970 జూన్)లో రామారావుగారు ప్రతిపాదించిన సూత్రాలు, ప్రస్తుత వ్యాసంలో కావాల్సినవి ఇవి.

6. బహువచన ప్రత్యయం ముందు ఉదంత నామాల్లో చివరి వ్యంజనమైన స్వరపూర్వక లకారం, ద్విమాత్రాధిక ఇదంత శబ్దాల్లో స్వరపూర్వక లకారం, మూర్ధన్య ళ వర్ణంగా మారుతుంది.

7. బహువచన ప్రత్యయం ముందు 'ఇ, ఉ' కారాలు అంతంలో ఉండి, పూర్వంలో ఉన్న 'ర' కారం 'ల' కార మవుతుంది.

8. 'అనునాసిక వర్ణపూర్వకమయినా, కాకపోయినా, మూర్ధన్య వర్ణాలు ద్విరుక్తమయినా, కాకపోయినా (ట్, ట్ట్, డ్, డ్డ్, ళ్) ఈ వర్ణాల మీద ఉన్న 'ఉ' కారం, 'ల' కారం పరమైనప్పుడు నిత్యంగా లోపిస్తుంది.'

9. బిందు పూర్వకమయినా, కాకపోయినా, ద్విరుక్తమయినా, కాకపోయినా, మూర్ధన్య దంతమూలీయ వర్ణాల (ట్, ట్ట్, డ్, డ్డ్, ణ్, న్, న్న్, ర్, (ర్, ల్, ల్ల్) తర్వాత (మీద) ఉన్న అచ్చులకారం పరమైనప్పుడు వికల్పంగా లోపిస్తుంది. ఎనిమిదో సూత్రంలో సూచించిన పరిసరాల్లో లోపించగా ఇతర పరిసరాల్లో మిగిలిన ఉ కారమూ, మిగతా అచ్చులు ఈ సూత్రానికి విషయాలు.

రామారావుగారు పదాంశ విధేయాలనీ, వర్ణ విధేయాలనీ సూత్రాలను రెండు తెగలుగా విభజించాల్సి వచ్చింది. రూపభేదానికి కారణం పదాంశాలయితే, అట్లాంటి సూత్రాలను 'పదాంశవిధేయ' సూత్రాలంటారు. బహువచన ప్రత్యయంముందు, విభక్తిప్రత్యయం ముందు అని ఒక సూత్రానికి పరిసర నిర్దేశంచేస్తే, బహువచన ప్రత్యయం పదాంశ సంబంధి కాబట్టి, ఆ సూత్రం పదాంశవిధేయ సూత్రమవుతుంది. వర్ణ శాస్త్రంలో పదాంశ విధేయ సూత్రాల అవసరం ఉండదని చెప్పలేంగాని, వీటి ప్రవృత్తికన్నా, వర్ణవిధేయ సూత్రా ప్రవృత్తి విస్తృతంగా ఉంటుందని భాషాశాస్త్రం ఒప్పుకుంటుంది. పదాంశ విధేయ సూత్రాలు పేర్కొన్న పదాంశాలకే పరిమితమయితే, వర్ణ విధేయ సూత్రాలు భాషలో సర్వత్రా వర్తిస్తాయి

రామారావుగారు ప్రతిపాదించిన 6, 7 సూత్రాలు పదాంశ విధేయ సూత్రాలు. 8, 9 వర్ణవిధేయ సూత్రాలు బహువచన రూప సాధనలో పై రెండు వర్గాల సూత్రాల అవసరం ఉందనే వారి ప్రతిపాదనలకన్నా, అన్నీ వర్ణ సూత్రాలనే ప్రతిపాదించిన ప్రస్తుత వ్యాసకర్త విశ్లేషణ మేల్తరం.

రామారావుగారి ఆరో సూత్రాన్ని చూద్దాం. ఇది పదాంశ విధేయ సూత్రం. ఈ సూత్రంవల్ల 'కాలు—లు=కాళు—లు' అయి స్వరలోప, మూర్ధన్య సమీకరణ సూత్రాలు ప్రవర్తిల్లి 'కాళ్లు' రూపం వస్తుంది. ఇట్లాంటి ఉదాహరణల్లో మాత్రానియమ ప్రసక్తి లేకుండా మూర్ధన్య సాధన చేశారు. అంటే పూర్వ స్వర ప్రమేయం కూడా లేకుండా, పరస్వరమైన ఉకారంవల్ల 'ల్' 'ళ్' గా మారిందని అర్థం. 'ఉలి, పులి' వంటి ఉదాహరణలు ఇదంతాలయినా, ద్విమాత్ర శబ్దాలు కాబట్టి మూర్ధన్యత రాదు. పైన పూర్వ స్వర ప్రమేయం లేదనటానికి కారణం, 'ద్విమాత్రాధిక' ఇదంత శబ్దాల్లో కూడా 'స్వరపూర్వక' నియమం ఉండటం. ఒకచోట పదాంత ఉకారం, మరొకచోట మాత్రా సంఖ్య మూర్ధన్యత్వానికి కారణం అనటం అసహజం. రెండచ్చుల మధ్య అలఘు లకారం (ళ్) లఘులకారం (ల్) కావటం చారిత్రక ధ్వనిమార్పు. ఉదాహరణకు (తమిళం) 'తళిర్', తెలుగులో 'తలిరు.' అదీగాక ఉచ్చారణా సౌలభ్యంకోసమయినా మూర్ధన్య వర్ణాలు అమూర్ధన్యాలుగా మారటమే సహజం. పై రెండు కారణాలవల్ల ''రెండచ్చుల నడుమ లఘులకారం (ల్) అలఘులకారమౌతుంది'' అన్న రామారావుగారి ప్రతిపాదన అసహజమైనది అవుతుంది.

ఇక ''రెండచ్చుల మధ్య అలఘులకారం (ళ్) లఘులకారం (ల్)అవుతుంది''అని నేనుప్రతిపాదించిన నాలుగోసూత్రం చారిత్రక ధ్వని మార్పును పేర్కొనటమే కాకుండా, ఉచ్చారణా సౌలభ్యాన్ని కూడా కలిగిస్తుంది. పైగా ఇది వర్ణవిధేయ సూత్రం. ఉదాహరణకు, 'దారి + లు' స్వరసమీకరణ సూత్రం వల్ల 'దారు + లు' అయి, పై సూత్రము వల్ల 'దారు—లు' అనే బహువచన రూపం వస్తుంది. మరో ఉదాహరణ చూద్దాం. 'కాల్' అనే హలంత మూల రూపానికి బహువచన ప్రత్యయం 'లు' చేరి, హల్సమీకరణ సూత్రం వల్ల 'కాళ్లు' అవుతుంది. మూల రూపంలో ఉన్న పదాంత వ్యంజనానికి ఉకారం (ఐదో సూత్రం) చేరి, 'కాలు' అని ఏక వచనరూపం వస్తుంది. ఈ ఏకవచన రూపసాధనలో అవసరమైన 'ఉగాగమ సూత్రం' అన్యభాషా పదాల్లో కూడా కావాలి. 'కార్=కారు, పెన్=పెన్ను' ఇందుకు ఉదాహరణలు. నకారాంత

పదాల్లో నకారం ద్విత్వమైన తరవాత ఉకారం చేరుతుంది. కాని చవర్గేతర (Non-palatal) వ్యంజన వర్ణాలు అంతగా ఉన్న అన్య భాషా పదాల్లో మాత్రమే ఈ నియమం చెల్లుతుంది. చవర్గ (Palatal) వ్యంజనాలు అంతగా ఉన్న పదాల్లో ఈ కారం చేరుతుంది. 'వాచ్=వాచీ; కాలేజ్=కాలేజీ' మొదలైనవి ఉదాహరణలు. సంక్షిప్తతను దృష్టిలో పెట్టుకొని, నేటి కాలపు భాషకు రచించిన సూత్రాల ద్వారా చరిత్రను సూచించ గలిగితే, అది స్వాగతించదగిందే. వర్ణనాత్మక వ్యాకరణంలో చారిత్రకాంశాలను జోడించకూడదన్న మూఢ విశ్వాసం ఇప్పటి భాషా శాస్త్రజ్ఞులకెవరికీ లేదు ('భారతి' 1970 జూన్)' అని రామారావు గారు కూడా అంటున్నారు గాబట్టి, నాలుగో సూత్రం సహజమైందని ఒప్పుకోటానికి వారికి అభ్యంతరం ఉండదనుకొంటాను.

రామారావు గారి ఏడో సూత్రం "–ర=ల॥ – [ఇ, ఉ]" చూద్దాం. 'ఈ సూత్రం కొన్ని పదాలకు మాత్రమే వర్తిస్తుంది. శబ్ద స్వరూపాన్ని బట్టి ఏ పదంలో 'ర' 'ల' అవుతుందో, ఏ పదంలో కాదో చెప్పలేం' అంటారు. అందుకనే 'మూలార్థంలో' వేరు అన్నారు. దీనికి 'వేళ్ళు, వేర్లు' అని బహువచన రూపాలు. పృథగర్థంలో (Separate) 'వేర్లు' అని ఒకే ఒక బహువచన రూపం ఉంది. ఇట్లాగే 'ఆవిర్లు' ఉంది గాని *'ఆవిళ్లు' లేదు.

ఈ వ్యాసకర్త ప్రతిపాదనల ప్రకారం,మూలార్థంలో 'వేరు' శబ్ద మూలరూపం 'వేర్' అని హలంతంగా ఉంది. దీనికి బహువచన ప్రత్యయం చేరి; (వేర్ + ళు), వ్యంజన సవికరణ సూత్రం వల్ల *'వేళ్లు' లనే బహువచన రూపం సాధ్యమౌతుంది. పృథగర్థంలో 'వేరు' మూలరూపం 'వేరు' అనే అజంతం మాత్రమే. ఈ అజంతతే వ్యంజన సవికరణాన్ని నిరోధించేది. 'అచ్చుల మధ్య మూర్ధన్యలకారం అమూర్ధన్యం అవుతుంది' అనే సూత్రం వల్ల 'వేరు + ను' 'వేరు + లు' అయి, హల్మధ్యస్వరలోప వికల్ప (మూడో) సూత్రం వల్ల 'వేర్లు' అనే రూపం వస్తుంది. అంటే పృథగర్థంలో 'వేళ్లు' అనే అసాధురూపం రానే రాదన్న మాట. ప్రాచీన రూపాలకు సరిపోయే మూల రూపాలను వ్యాకరణ సౌలభ్యం కోసం ప్రతిపాదించటం సహజమే. చారిత్రకంగా కూడా పదాలు అజంతాలు, హలంతాలు అనటానికి ఆధారాలు అనేకం ఉన్నాయి. ఈ మూలరూపాల ప్రతిపాదన భాషాలక్షణాన్ని పట్టుకోటానికే గాని, కేవలం సూత్రరచనా సౌకర్యంకోసం కాదు.

కింది ఉదాహరణల్లో సంధి కార్యాలను పరిశీలిద్దాం.

(ఎ) కోటు + లు = * కోటులు/కోట్లు

(బి) కోటు + లో = కోటులో/కోట్లో

(సి) కొట్టు + లు = * కొట్టులు/కొట్లు

(డి) కొట్టు + లో = కొట్టులో/కొట్లో.

పై ఉదాహరణలన్నిటిలో ఉకారలోపానికి ఉన్న వర్ణ పరిసరాలు ఒకటే. రామారావుగారి ఉకారలోప నిత్య (ఎనిమిదో) సూత్రం ప్రవర్తిల్లితే 'కోట్లు, కొట్లు' అనే సాధురూపాలుమాత్రమే ఎ, సి,— ఉదాహరణల్లో వస్తాయి. అదే సూత్రం బి, డి — ఉదాహరణల్లో ప్రవర్తిల్లితే, 'కోట్లో, కొట్లో' అనే సాధురూపాలను మాత్రమే సాధించవచ్చు. 'కోటులో, కొట్టులో' అనే వికల్ప సాధురూపాలను సాధించటానికి వీలులేదు. అంటే రామారావుగారు వర్ణ సూత్రంగా పేర్కొన్న ఉకారలోప నిత్యసూత్రం (ఎనిమిది) వర్ణ విధేయ సూత్రం కాదని తెలుతుంది. అదికూడా పదాంశ విధేయ సూత్రమే అవుతుంది. ఉకారలోప వికల్ప (తొమ్మిదో) సూత్రం వల్ల బి, డి — ఉదాహరణల్లో వికల్ప సాధురూపాలను సాధించాలనుకున్నా వీలుకాదు. ఎందుకంటే ''నిత్యసూత్రంలో సూచించిన పరిసరాల్లో లోపించగా ఇతర పరిసరాల్లో మిగిలిన 'ఉ' కారం మాత్రమే వికల్ప సూత్రానికి విషయం అంటారు కాబట్టి. పోనీ అన్ని ఉదాహరణల్లోనూ వికల్ప సూత్రాన్నే ప్రవర్తింప జేసినా, ఎ, సి — ఉదాహరణల్లో '*కోటులు,* కొట్టులు' అనే అసమ్మత రూపాలు వస్తాయి. వర్ణపరిసరాలు ఒకటే అయినా, ఎ, సి —ఉదాహరణల్లో 'ఉకారలోప నిత్య (ఎనిమిదో) సూత్రం', బి, డి — ఉదాహరణల్లో 'ఉకారలోప వికల్ప (తొమ్మిదో) సూత్రం' ప్రవర్తిల్లుతుందని చెప్పుకోవాలి. దీన్ని తప్పించుకోటానికి 'ఉకారలోప వికల్ప సూత్రాన్ని' కూడా పదాంశ విధేయ సూత్రంగా గుర్తించాలి. 'బహువచన ప్రత్యయం ముందు' అని ఉకారలోప నిత్య సూత్రానికీ, 'లో — ప్రత్యయం ముందు' అని ఉకారలోప వికల్ప సూత్రానికీ పదాంశ సంబంధమైన పరిసర నిర్దేశాలు వెయ్యాలి. పదాంశ విధేయ సూత్రాలకన్నా వర్ణవిధేయ సూత్రాలు మేల్తరమని ఇంతకు ముందే చెప్పబడింది.

'ళు' ని బహువచన ప్రత్యయంగా ప్రతిపాదించటంవల్ల, చారిత్రక ధ్వని మార్పుల్ని గ్రహించటమే కాకుండా, వ్యాకరణం మొత్తంలో పదాంశ విధేయ సూత్రాల సంఖ్య తగ్గించవచ్చు. 'కోటు + ళు, కొట్టు + ళు' అనే ఉదాహరణల్లో ''రెండుమూర్ధన్య వ్యంజనాల మధ్య ఉన్న ఊర్ధ్వాచ్చు నిత్యంగా లోపిస్తుంది'' అనే ఒకటో సూత్రం వల్ల 'కోట్లు, కొట్లు' అని బహువచన రూపాలు సాధించవచ్చు. ఇక 'కోటు + లో, కొట్టు + లో' అన్న ఉదాహరణల్లో'' మూర్ధన్య వ్యంజనం, ర్, ల్, న్ వర్ణాల మధ్య ఏ హ్రస్వస్వరమైనా వికల్పంగా లోపిస్తుంది'' అనే హల్మధ్య స్వర లోప వికల్ప (మూడో) సూత్రం వల్ల 'కోటులో, కోట్లో, 'కొట్టులో, కొట్లో' అనే సమ్మత రూపాలు సాధ్యమౌతాయి. ఈ సూత్రాలవల్ల సాధురూపాలన్నిటినీ సాధించవచ్చు. అంతేగాక ఈ సూత్రాల ప్రయోగ వ్యాప్తి బహువచనానికే పరిమితం కాకుండా 'తెలుగు సంధిలో' కూడా సౌలభ్యాన్ని కలిగిస్తున్నది.

ఇంకా రెండు స్వరాలు లోపింపజెయ్యటానికి వీలున్న పద సముదాయల్లో ఏం జరుగుతుందో చూద్దాం.

(ఇ) కట్ట + లు + లేవు

(ఎఫ్) పన్ను + లు + లేవు

(జి) పసు + లు + లేవు

పై ఉదాహరణల్లో 'ట్ట్—ల్' మధ్యఉన్న అకారాన్నిగాని,' ల్—ల్, న్—ల్, న్న్—ల్' మధ్యఉన్న ఉకారాన్నిగాని, రామారావుగారి (కారం లోపింపజెయ్యవచ్చు. ముందుగా e, f — ఉదాహరణల్లో 'ట్ట్—ల్' మధ్య అకారాన్ని, 'న్న్—ల్' మధ్య ఉకారాన్ని లోపింపజేస్తే, '*కట్లు లేవు, *పన్నులేవు' అనే అసాధు రూపాలు వస్తాయి. వీటిల్లో 'వికల్పత్వమే పరసంధి కవకాశమిస్తున్నది' అని రామారావుగారు అంటారు గాబట్టి పూర్వసంధి జరక్కుండా, పరసంధి మాత్రమే జరుగుతుంది. అప్పుడు 'కట్టల్లేవు, పన్నుల్లేవు' అనే సాధురూపాలే వస్తాయి. 9— ఉదాహరణలోకూడా పరసంధి జరిగితే, 'పసుల్లేవు' అనే ఒక వ్యాకరణ సమ్మత రూపాన్ని మాత్రమే సాధించవచ్చు. కాని 'పస్లులేవు' కూడా సమ్మత రూపమే. అంటే 9— ఉదాహరణలో పూర్వాపరసంధుల్లో ఏదైనా జరగొచ్చు. వికల్పత్వం వల్ల 'పరసంధి బలీయః' అని రామారావుగారు అనటం పొసగదు. అట్లా అనటంవల్ల కొన్ని వ్యాకరణ సమ్మత రూపాలను సాధింపటానికి వీలు కలగటంలేదు. ఇందువల్ల 'వికల్పత్వమే పరసంధి కవకాశమిస్తున్నది' అన్న వారి ప్రతిపాదన సరైనదికాదు. e, f- ఉదాహరణల్లో పరసంధి బలీయమనీ, 9— ఉదాహరణలో పూర్వపరసంధుల్లో ఏదైన జరగొచ్చుననీ వారి వికల్ప సూత్రం నిర్ధారించలేదు. సమ్మత రూపాలను సాధింపలేని ఈ సూత్రాన్ని కూడా సవరించాల్సిన అవసరం ఉంది.

తెలుగు బహువచనంలో శబ్దాల రూపభేదాలను, మామూలుగా కనిపించే రూపాల (Surface forms) నుంచి సాధించటం వీలుకాదని అర్ధమవుతుంది. మామూలు రూపాలనుంచి సాధించాలనుకొన్నా, కొన్నిచోట్ల అసమ్మత రూపాలు రావటం, మరికొన్ని చోట్ల సాధురూపాలు రాకపోవటమూ జరుగుతుంది. పైగా వ్యాకరణ సౌలభ్యం ఏమాత్రం లేదు. అందువల్ల 'లు' బహువచన ప్రత్యయం అనే రామారావుగారి ప్రతిపాదన నిలవదు. 'అధికవ్యాప్తి గాని పరిసర ప్రభావ స్వతంత్రమైన రూపభేదాన్నే మూల

రూపంగా గ్రహించటం శాస్త్ర సంప్రదాయం. అందుకు విపరీతమైనది 'ళు' ప్రతిపాదన అంటారు వారు. మూలరూపాల ప్రతిపాదనకు 'పరిసర ప్రభావ స్వతంత్రత' నియమం కాదు. ఒక భాషలో వర్ణభేదంగాగాని, ధ్వనిభేదంగాగానీ గుర్తించటానికి వీలులేని వర్ణాలనుగాని, ధ్వనులనుగాని మూలరూపాల్లో ప్రతిపాదించటం మంచిదికాదు అన్నది ముఖ్యం. 'ళు'ని తెలుగులో ధ్వనిరూపంగాకూడా గుర్తించటానికి వీలుంది. దీనివల్ల, పైన చెప్పిన కారణాలవల్ల 'ళు'నే బహువచన ప్రత్యయంగా పేర్కొనాలి.

'తెలుగు క్రియల్లోనే చాలా సూత్రాలకు శబ్దపరిమాణాన్ని నియమంగా గుర్తించాల్సి ఉంటుంది' (1976) అంటారు రామారావుగారు. అందుకు ఐదు ఉదాహరణలిచ్చారు. వీటిలో మూడు తెలుగుకు, రెండు ఇతర ద్రావిడభాషలకు సంబంధించినవి. తెలుగుకు సంబంధించినంతవరకు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు చూపించవచ్చు.

మొదటిది ''తెలుగులో తకారాది ప్రత్యయాలు, అన్వాది ధాతువుల తర్వాత టకారాదిగా మారతై'' అన్నది. వారే చెప్పినట్టు ధాత్వంత నకారాన్ని మూలరూపాల్లో 'ణ్' కారంగా ప్రతిపాదించి టకారాది ప్రత్యయాలను సాధించవచ్చు. దీనికి వారి ముఖ్యమైన అభ్యంతరం ''మూర్ధన్యతకు శ్వాసవర్ణం లొంగి నాదవర్ణం ఎదురు తిరగటానికి కారణమేమిటి?'' అన్నది. కాని శ్వాసనాద వర్ణాల తేడా, ద్విరుక్తా ద్విరుక్తవర్ణాల తేడా, అగ్ర స్వరాలు ఇతర స్వరాలు అన్నతేడా సమీకరణంలో గుర్తించాల్సిన విషయాలు. 'తాడు—తాళ్లు, గుడ్డు—గుడ్లు, నాటు—నాట్లు, చెట్టు—చెట్లు, పాట—పాటలు, పట్టు—పట్టులు' మొదలైన ఉదాహరణల బహువచన రూపసాధనలో అగ్ర స్వరలోపం మాత్రమే సాధ్యమనీ, అద్విరిక్త డకారంమాత్రమే 'ళ్' కారం ముందు మూర్ధన్య ళకారమవుతుందనీ, అదేపరిసరంలోఅద్విరుక్త మూర్ధన్య శ్వాస (ట్) వర్ణం, ద్విరుక్తటకారడకారాలు సమీకరణానికి లోబడవనిస్పష్టమవుతుంది. అంటే శ్వాసవర్ణాలు మూర్ధన్య ళకారం ముందు, మూర్ధన్య డ వర్ణంలాగా, ళకారం కావటం లేదన్నమాట. నాద వర్ణమైనప్పటికీ; ద్విరుక్తమైతే మూర్ధన్య ళకారం కాదు. ఇక్కడే మరో విషయాన్ని గమనించాలి. ళకారం పూర్వ పదాంతమందుండి, డకారం పరపదాదిన ఉన్నా సమీకరణం జరగదు. 'పాలడబ్బా' 'పాల్డబ్బా' అవుతుందేతప్ప, '*పాళ్లబ్బా' కాదు. డకారం పూర్వ పదాంత మున్నప్పుడే ళకారానికి లొంగుతుందిగాని, పరపదాదిన ఉన్నప్పుడు లొంగదు. కాని మూర్ధన్య సమీకరణం మాత్రం రెండు వైపులా జరుగుతుంది. మూర్ధన్య వర్ణానికి పూర్వమందున్న వర్ణమైనా, పరమందున్న వర్ణమైనా మూర్ధన్యవర్ణంగా మారుతుంది. ఇది మూర్ధన్య సమీకరణం ప్రత్యేకత. కాబట్టి 'అణ్ + తా(ను)'లో తకారం, పూర్వంలో ఉన్న మూర్ధన్యానునాసికొన్ననుసరించి అనురూప మూర్ధన్యవర్ణం (corresponding retroflex phoneme) 'ట్'గా మారుతుంది. అదే నకారం అయితే కాదు. పైగా ఈ రకమైన మార్పు కొండ, పెంగో, కూఈ, నాయకి వంటి ఇతర ద్రావిడభాషల్లో ఉన్నదని వారే ఆధారాలు చూపిస్తున్నారు. ఇది ద్రావిడభాషలకు కొత్తాకాదు. అసహజమైందీ అంతకంటేకాదు. ఈ ప్రతిపాదనకు రామారావుగారు ఒప్పుకోనట్టయితే బహువచనరూప నిష్పత్తిలో స్వరపూర్వక డకారం మాత్రమే 'ల,న,' లుగా మారి టకారం మారకపోవటానికి కారణమేమిటి? ఇక్కడ వారు శ్వాసనాద భేదం గుర్తించారన్నమాట. తెలుగు నామాల్లో శ్వాసనాద భేదాలు గుర్తించి, తెలుగుక్రియల్లో ఒప్పుకోకపోవటానికి కారణం కనిపించదు. ణకారాన్ని కొన్ని పరిసరాల్లో నకారంగా మార్చటం అసహజమేమీగాదు.

స్వర సమీకరణంలో కూడా 'మాత్రా నియమం' అవసరం అంటారు రామారావుగారు. కోస్తా భాషలో 'ఆడు, పాడు' ధాతువుల్లో అకార సమీకరణం జరిగి, '*వాగతాడు' లాంటి చోట అది జరక్కపోవటానికి కారణమేమిటి? వీటిల్లో అకార సమీకరణం 'శబ్ద పరిమాణాన్ని' బట్టే చెప్పాలి అంటారు. దీనికి కారణం 'వ్యావహారిక వ్యాప్తి' (frequency) గాని, శబ్ద పరిమాణం కాదని చెప్పవచ్చు. 'మేడలు, మేళ్లు' అనే బహువచన రూపాల్లో అగ్రస్వర లోపానికి తోడు, అకారం కూడా లోపించి 'మేళ్లు' (Mxxllu) అనే వికల్ప రూపం వస్తుంది. అగ్రస్వర లోపం నిత్యం అయితే, అకారలోపం వికల్పం. అందువల్ల 'మేడలు, మేళ్లు' రూపాలు సాధ్యం. మూర్ధన్య వర్ణాల మధ్య స్వరలోపం అగ్రస్వరాలకే పరిమితం కాక, మిగిలిన స్వరాలకు కూడా విస్తరించింది. ఇట్లా విస్తరించిన సూత్రం వికల్పం. ఇట్లాగే హ్రస్వాచ్చులు మాత్రమే కాకుండా; ఆకారం కూడా స్వర సమీకరణానికి కారణభూతం అవుతున్నది. అంటే స్వరసమీకరణ సూత్రం కూడా విస్తరించింది. ఇది రాయలసీమ, నెల్లూరి వారి భాషలో సర్వత్రా జరుగుతుంది. కోస్తా భాషలో పదాల వ్యవహారిక వ్యాప్తిని బట్టి జరుగుతుంది. 'ఆడు, పాడు' శబ్దాల కన్నా 'వాగు' లాంటి శబ్దాల వ్యవహారిక వ్యాప్తి తక్కువ. ఇందుకు మరి కొన్ని ఉదాహరణలుకూడా ఉన్నై. 'దున్నుతాను, దుంతాను' రూపాలు సాధువులు. కాని 'పన్నుతాను,' పంతాను'లో '*పంతాను' అసాధురూపం. అట్లాగే 'చెప్తాను' సాధురూపమై '*తప్తాను' కాదు (రామారావు 1969). కోస్తా భాషలో పైన పేర్కొన్న అకార సమీకరణానికి కారణం 'వ్యావహారిక వ్యాప్తి' అని చెప్పవచ్చు. శబ్దపరిమాణ నియమం అవసరం లేదనవచ్చు.

తెలుగు క్రియల అన్నంత రూపాలను కూడా 'శబ్దపరిమాణ' నియమం ప్రసక్తిలేకుండా సాధించవచ్చు. అందుకు కావాల్సిన వర్ణసూత్రాలు ఇవి :

10. చ్=యి / $\bar{V}$ – (+) V

'దీర్ఘస్వరం, హ్రస్వస్వరం మధ్య చ కారం య కారమవుతుంది.'

11. చ్ = వ / V – (+) V

'రెండు హ్రస్వస్వరాల నడుమ ఉన్న చ కారం వ కార మవుతుంది.'

ధాతువులను హలంతాలుగా తీసుకుంటే 'తూచ్ సూ–10 తూయి', 'అరుచ్ సూ–11 అరువు' అవుతాయి. కడప మాండలికంలో 'అరచాకు' లాంటి రూపాలున్నై. అంటే వారి భాషలో పదకొండో సూత్రం లేదు. కొండ, కూ ఈ భాషల్లో శబ్ద పరిమాణ నియతి ఉందనే రామారావుగారి ప్రతిపాదన కాదనటానికి కావలసినంత విషయ సేకరణ, పరిశీలన లేనందువల్ల వాటి జోలికి పోలేదు.

'కొడవళి, రోకళి' అనే విధంగా మూల రూపాల ప్రతిపాదన చూద్దాం. బాలవ్యాకరణం (ఆచ్ఛి–12,13,14,15,16సూ॥)లో క్రింది బహువచన రూపాలు కనబడతై.

(h)	కొడవళు – లు,	కొడవలు – లు,	కొడవళ్లు
(I)	————,	కాలు – లు,	కాళ్లు
(J)	————,	పులు – లు	———

ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఒకటుంది. బహువచన ప్రత్యయం'లు' పరమైనప్పుడు, h, I – ఉదాహరణల్లో ఇచ్చిన బహువచన నామాల్లో మాత్రమే మూర్ధన్యళకారం కనుబడుతుంది. I – ఉదాహరణలో ద్విత్వరూపంలో మూర్ధన్యళకారం ఉందిగాని, అవ్యవహితంగా లేదు. అవ్యవహితంగా ఒక్క H – ఉదాహరణలో మాత్రమే కనిపిస్తుంది. I J – ఉదాహరణల్లో '*కాళు–లు, *పుళు–లు' వంటి రూపాలు లేవన్నమాట. నేను మూల రూపాల్లో మూర్ధన్యళకారాన్ని ప్రతిపాదించిన బహువచన శబ్దాల్లో, అవ్యవహితంగా, ప్రత్యయేతర పదాంత మూర్ధన్యళకారం చారిత్రకంగా కనిపిస్తుంది. మూలరూపాల్లో ళ కారాన్ని ప్రతిపాదించని బహువచన నామాల్లో కనిపించదు. ఒక్క 'హంసవింశతి' లో మాత్రం 'కాళు–లు' ప్రయోగం ఒకటి ఉన్నట్టు నిఘంటు కారులు ఉదహరించారు. 'జోలు' వంటి పదాలకు 'జోళు – లు' రూపం ఇచ్చారు గాని, ప్రయోగం లేదు. ఇవి 'కవులభాషలో' కొడవళు–లు మొదలైన పదాల సామ్యం (analogy) వల్ల ఏర్పడి ఉండవచ్చు. అంటే మూలరూపాల్లో మూర్ధన్యళకారాన్ని ప్రతిపాదించింది 'భాషా లక్షణాన్ని పట్టి చూపటానికి' మాత్రమే. మాత్రా సంఖ్యానియమం తప్పించుకోటానికీ కాదు కేవలం సూత్ర రచనా సౌకర్యం కోసమూ కాదు.

ఈ విపులమైన పరిశీలనద్వారా మూర్ధన్య ళకార ఘటితమైన బహువచన ప్రత్యయ రూపాన్నే మూలరూపంగా ప్రతిపాదించవలసి ఉంటుందనీ, 'కొడవళి' వంటి శబ్దాల్లో మూల రూపంలోనే ళకారాన్ని ప్రతిపాదించటంవల్ల ఇప్పటి భాషలో సాధించదగిన వ్యాకరణ ప్రయోజనాలున్నాయనీ, ఈ ప్రతిపాదనలకు చారిత్రకంగా కూడా బలముందనీ, రామారావుగారి సంధి సూత్రాలను యథాతథంగా అంగీకరిస్తే కొన్ని సాధురూపాలకు గతి లేకుండా పోతుందనీ, ఆ సూత్రాలు సవరణను అపేక్షిస్తున్నాయనీ తేలుతుంది.

రిఫరెన్సులు :

1 చిన్నయసూరి, పరవస్తు "బాల వ్యాకరణను"

2. రామచంద్రరావు, సి. 1975 "తెలుగు బహువచనం" తెలుగు 4.44–51.

3. రామచంద్రరావు సి. 1976 "తెలుగులో హల్మధ్య స్వరలోపం" అఖిల భారత భాషా శాస్త్రజ్ఞుల ఆరో సమావేశంలో చదివింది.

4. రామారావు, చేకూరి. 1970 "తెలుగులో బహువచన రూప నిష్పత్తి" 'భారతి' సంపుటి–47, సంచిక–6.

5. రామారావు, చేకూరి 1976 "మరోసారి తెలుగు బహువచనం" 'భారతి' సంపుటి–53,సంచిక–12.



తుఫాను బాధితులకు విరాళాలు స్వీకరించు కేంద్రాలు

ఇటీవలి తుఫానుకు గురియై బాధపడుచున్న ప్రజానీకానికి ఉపశమనం కలిగించటానికిగాను ప్రజలు రొఖ్ఖముగాను లేదా వస్తురూపముగాను విరాళాలు పంపవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తున్నది. విరాళాలు ఈ దిగువ తెలిపిన కేంద్రములకు పంపవలెను. ఉతికి, ఇస్త్రీచేసిన బట్టలుకూడ వెంటనే ఉపయోగించుటకు పంపవచ్చును. విజయవాడకు రైలుద్వారా వస్తురూపముగా విరాళాలు పంపగోరువారు ముందుగా విజయవాడ, సబ్-కలెక్టర్ వారికి తెలియబరచ గోరటమైనది. తద్వారా సకాలములో వాటిని రైల్వేస్టేషనునుండి డెలివరీ తీసుకోవటానికి ఏర్పాటుచేయుటకు వీలవుతుంది. విరాళాలు రొఖ్ఖముగా లేదా చెక్కుల ద్వారా "ముఖ్యమంత్రి తుఫాను బాధిత సహాయనిధి" పేర పంపవలెను.

వస్తు రూపముగా పంపబడు విరాళాలు స్వీకరించు కేంద్రములు

ఎ) మునిసిపల్ కమీషనర్ వారి కార్యాలయము
దారుల్ షిఫా, హైదరాబాదు, ఆం. ప్ర. — ఫోన్ నెం : 57769

బి) మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాదు, సికిందరాబాదు
డివిజన్, సర్దార్ పటేల్ రోడ్, సికిందరాబాదు ఆం. ప్ర. — ఫోన్ నెం : 72012

సి) డిస్ట్రిక్టు సప్లయి ఆఫీసర్, ఎ. సి. గార్డ్స్,
మాసబ్ ట్యాంక్ రోడ్, హైదరాబాదు, ఆం. ప్ర. — ఫోన్ నెం : 22939

డి) తుఫాను బాధితులకు విరాళాలు స్వీకరించు కేంద్రము :
c/o సబ్-కలెక్టర్, విజయవాడ, ఆం. ప్ర. — ఫోన్ నెం : 96-76063

ఇ) కలెక్టర్, గుంటూరు, ఆం. ప్ర. — ఫోన్ నెం : 97-21925

రొఖ్ఖముగా లేదా చెక్కులద్వారా పంపబడు విరాళాలు స్వీకరించు కేంద్రములు :

సెక్రటరీ టు గవర్నమెంటు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్, సెక్రటేరియట్,
హైదరాబాదు. పిన్‌కోడ్–500022.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధాలశాఖ డైరెక్టరుచే ప్రకటితము

27/77-78

శ్రీ కోడూరి శ్రీరామమూర్తి

తెలుగు కథా సాహిత్యంపై మార్క్సిజమ్ ప్రభావం

ఇరవయ్యో శతాబ్దంలో మానవుల ఆలోచనల్ని ప్రభావితం చేసిన భావాల్లో కారల్ మార్క్స్ సామ్యవాద సిద్ధాంతం ప్రముఖంగా పేర్కొనదగ్గది. ఈ సిద్ధాంత ప్రభావం ఆర్థిక, రాజకీయ, రంగాలపై మాత్రమేకాక — సాహితీ సీమపై కూడా బలమైన ముద్రను ముద్రించింది. సాహిత్యం కాలక్షేపం కోసం కాక, ఒక నిర్దుష్ట సామాజిక ప్రయోజనం కలిగి వుండాలనీ, — సామాజిక స్పృహ రచయిత ప్రథమ లక్షణమనీ చెప్పే భావాల ప్రచారం పెరుగుతున్న కొద్దీ — సాహిత్యంపై మార్క్సిజమ్ ప్రభావం అధిక మవుతూ వచ్చింది.

హద్దులు మీరి పెరిగి పోతున్న పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ —కల వారికీ, లేని వారికీ మధ్య అగాధాన్ని నానాటికీ అధికంచేస్తూ వుండడంతో, — శ్రమ, పెట్టుబడి, అనేవి రెండు వర్గాలుగా విడిపోయి వాటిమధ్య సంఘర్షణ అనివార్యం కాసాగింది. వివిధ రూపాల్లో మార్క్సిజమ్ ప్రభావం విశ్వమంతటా అలుముకోసాగింది. ఎ. సి. వార్డ్ అన్నట్లు —

"Salvation through christ and damnation through sin were the alpha and omega of John Donne and of the puritans - Salvation through marx and damnation through capitalism were the twentieth century substituter-"

హెగెల్ భావాల వలన ప్రేరితుడయిన మార్క్స్ తన కమ్యూనిస్ట్ పార్టీ మానిఫెస్టో, డాస్ కేపిటల్, రచనల ద్వారా ప్రపంచానికి ఒక క్రొత్త సందేశం యిచ్చాడు. అయితే, హెగెల్ వలె భావము (Idea), భావ వాదము (Idealism) లకు ప్రాధాన్యత నివ్వకుండా — అతని గతి తార్కిక పద్ధతిని మాత్రమే స్వీకరించి, భౌతిక శక్తులకు ప్రాధాన్యతనిస్తూ 'గతి తార్కిక భౌతిక వాదం' అనే ఒక వాదాన్ని ప్రతిపాదించాడు. మార్క్స్ సిద్ధాంతంలో గతితార్కిక భౌతిక వాదానికి అత్యంత ప్రాముఖ్యమైన స్థానం వుంది.

ప్రతి వస్తువులోనూ రెండు విరుద్ధమైన స్వభావాలున్నాయని ఈ సిద్ధాంతం చెబుతోంది. ఒకటి పాజిటివ్ లక్షణం గలది. మరొకటి నెగిటివ్ లక్షణం గలది. ఒక స్వభావం వృద్ధి చెందడానికి ప్రయత్నిస్తుంటే — మరొకటి దానిని ఆటంక పెడుతూ వుంటుంది. ఈ రెండు వ్యతిరేక శక్తులమధ్య పోరాటం తప్పనిసరి అవుతుంది. ఈ సంఘర్షణ మొదటిలో క్రమానుగతిలో జరిగి, చివరకు తీవ్రమైన సంఘర్షణతో అంతమవుతుంది. నశించిపోతున్న శక్తిమీద వృద్ధి చెందుతున్న శక్తి విజయం సాధిస్తుంది. అదే మహా విప్లవం. ఆ విప్లవం నించే ఒక నూతన వస్తువు ఆవిర్భవిస్తుంది. సంఘర్షణ పదార్థాల ప్రధాన ధర్మమని ఈ సిద్ధాంతంలో నిరూపిస్తూ మార్క్స్ — పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలోని పరస్పర విరుద్ధశక్తులు విజృంభించి — ఆ వ్యవస్థను నాశనం చేస్తాయని జోస్యం చెప్పాడు. మార్క్స్ చెప్పిన భావాలు ఆలోచించగల శక్తివున్న వారందరి ఆలోచనలను ఆకట్టుకున్నాయి కార్యోన్ముఖుల్ని చేశాయి.

'కమ్యూనిస్ట్ పార్టీ మేనిఫెస్టో' లో — మార్క్స్, ఎంగెల్స్, ముగింపు వాక్యాలుగా అన్న —

"—కమ్యూనిస్ట్‌లు తమ ఆశయాలను దాచుకోరు. ప్రస్తుతం వున్న పరిస్థితుల్ని బలవంతంగా కూలద్రోయడంవల్ల మాత్రమే తమలక్ష్యాలను సాధించగలమని వాళ్ళు బహిరంగంగా ప్రకటిస్తారు. కమ్యూనిస్ట్ విప్లవంతో పాలకవర్గం పునాదులతో కదిలి పోవును గాక —"

— అనే వాక్యాలు శ్రామికుల్ని మాత్రమేకాదు — ప్రపంచంలోని పలు మేధావుల్ని ఉత్తేజపరిచాయి. మార్క్స్ సిద్ధాంతంలో — ముఖ్యంగా 'వర్గ సంఘర్షణ' సిద్ధాంతం — చాలా మందిని ఆకట్టుకుంది.

అయితే — వర్గ సంఘర్షణను అంగీకరించిన వాళ్లలోను, అంగీకరించని వాళ్లలోనూ కూడా మేధావులున్నారు. బెర్ట్రాండ్ రస్సెల్ "రోడ్స్ టు ఫ్రీడమ్" (Roads to freedom) అనే గ్రంథంలో వివిధ రాజకీయ సిద్ధాంతాలను సమీక్షిస్తూ యిలా అంటాడు : "— ద్వేషమునుండి విశ్వజన సమైక్యమును ఉద్భవింపజేసే పరసువేది ఏమీలేదు. వర్గ సంఘర్షణవలన ప్రేరితులై కార్యాచరణలోనికి దిగినవారు ద్వేషమును ఒక అలవాటుగా మార్చుకుంటారు"—అని,*— ఏది ఏమైనా, వర్గ సంఘర్షణ సిద్ధాంతంలోని మంచి చెడ్డలను వర్ణించడం ఈ వ్యాసం లక్ష్యంకాదు.

సాహిత్యంపై మార్క్సిజమ్ ప్రభావం పడటంతో, ఏర్పాల గురించి, వాటి మధ్యగల ఘర్షణ గురించి, హృదయాలు కరిగేలా, కళ్ళు తెరిపించేలా—కథలు, కవితలు, నవలలు, వెలువడ్డం మొదలైంది. దాపరికంలేని సమకాలీన జీవిత చిత్రణలో ఒక గొప్ప ఆదర్శం ప్రతిబింబించి, విశిష్ట సాహిత్య ప్రయోజనం సమకూరడం ప్రారంభమైంది. రచయితల దృక్పథాల్లో మార్పు స్పష్టంగా కనబడసాగింది. ఈమార్పుకు ప్రధానకారకులు రష్యన్ రచయితలు. వారిలో ముఖ్యంగా పేర్కొనదగినవాడు మాగ్జిమ్ గోర్కీ.

"-నాకు 'మనిషి' కన్నా వేరుగావున్న భావనలు ఏమీలేవు. అన్ని భావాలకు, అన్ని విషయాలకు సృష్టికర్త మనిషి — మనిషి మాత్రమే నేను 'మనిషి'కి గొప్ప నివాళిఅర్పిస్తాను. ఎందుకంటే, అతని తర్క బుద్ధికీ, అతని ఆలోచనకు, అతని అస్తిత్వానికీ మూర్తిగా మాత్రమే నాకు ఈ ప్రపంచం కనబడుతుంది. 'దేముడు' అనేవాడు 'ఫొటోగ్రాఫీ' మాదిరిగానే మనిషి యొక్క కల్పన మాత్రమే. అయితే — 'ఫొటోగ్రాఫీ' అనేది వున్నదాన్ని యధాతధంగా చూపిస్తుంది. 'దేముడు' అనేవాడు మాత్రం మనిషి తన గురించి తాను ఆశించిన విషయాలకు, కనుగొన్న విషయాలకు ప్రతి రూపం అయి సర్వాంతర్యామిగా, మహోన్నత జ్ఞానవిధిగా, న్యాయమూర్తిగా రూపొందాడు. —"

(On Literature గ్రంథంలో)[1]

—అన్నగోర్కీ భగవంతుడిగురించి, అతడి భజనగాధల గురించి కాక, మనిషిగురించి, అతడి ఆకలిగురించి వాస్తవ దృక్పథంతో రచనలు చేశాడు.—అట్టడుగు సమాజంలోని ప్రజాజీవితాన్ని తన కథల్లో సమకాలిక ప్రపంచానికి తెలియజెప్పాడు.

"—వెనుకటిజీవితంలోనికుళ్ళనంతటినీ,దౌర్భాగ్యాన్నంతటినీ, కళ్ళకు కట్టినట్లుగా చిత్రించడం, ఒక నూతన జీవితాన్ని సృష్టించడంలో తోడ్పడడం మన సాహిత్యం సాధించాల్సిన ధర్మాలు...త్యాగం చెయ్యమని ప్రజలకు బోధించడం ఒట్టిదిగా—సామాన్య ప్రజత్యాగం చెయ్యాల్సింది ఏముంది?— ప్రాణం తప్పించి... ఓరిమి గాడిదల సుగుణం. ఇతరులుపెట్టేబాధలకి లొంగి, సహించి, ఓరిమితో పడి వుండటం మానవుణ్ణి నాశనం చేస్తుంది. ఓరిమినిప్పులాగేఆశ్రయం ఇచ్చిన వాళ్ళను నాశనం చేస్తుంది—" అన్నగోర్కీ మార్క్సిస్టు భావాలుగల రచయితలందరికీ ఆరాధ్యుడు. గోర్కీలాగ అట్టడుగు సమాజం గురించి రచనలుచేయాలంటే, అతనిలాగే విస్తృతమైన జీవితానుభవం వుండాలి. నాగరిక జీవితాలకు సుదూరంగా పూడ్చిపెట్టబడిన విషాదగాధల్ని త్రవ్వితెచ్చుకొని, బంగారంగా తయారు చెయ్యగల పరసువేదిని రచయిత జీవితంనుండే పుణికితెచ్చుకోవాలి దానిని దక్కించుకోలేక పోయిన నాడు — రచయిత ఎన్నిసాహిత్య సిద్ధాంతాల సారాన్ని వొంటబట్టించుకున్నా అది వృధాయే అవుతుంది. "సోవియట్‌లిటరేచర్" పత్రికలో "మాసమకాలీనులే మానాయకులు" అనే వ్యాసాన్ని వ్రాస్తూ 'అబూబేకర్' యిలా అంటాడు:

"—కాల్పనిక సాహిత్యానికి (క్రియేటివ్ రైటింగ్) సంబంధించిన సూత్రాలన్నింటినీ పరిశీలించిన రచయిత—సాహిత్య సిద్ధాంతాల గురించి కొంతవరకు తెలుసుకోవచ్చునేమో గాని,బాగా రచనలు చేయడం మటుకు జరిగే పనికాదని నా అభిప్రాయం. రచయిత యొక్క వ్యక్తిగత అనుభవం, అది ప్రజాజీవితానికి సంబంధించింది కానివ్వండి—వృత్తికి సంబంధించింది కానివ్వండి- చాలాముఖ్యమైందని నేను అంటాను—"అని,

రచయితకు జీవితానుభవం అవసరం అన్న విషయాన్ని మార్క్సిస్టుదృక్పథంగల రచయితలు మాత్రమేకాదు. అందరూ అంగీకరిస్తారు. ఒకసారి ప్రఖ్యాత రచయిత సోమర్ సెట్ మామ్ దగ్గిరకు ఒక స్త్రీ వచ్చి, తన కొడుకును రచయిత చేయాలంటే ఏం చెయ్యాలని అడిగిందట— దానికి మామ్ ఏడాదికి నూట యాభై పౌనులు ఇచ్చి ప్రపంచం అంతా అయిదేళ్లపాటు తిరిగివచ్చే ఏర్పాటు చెయ్యమని చెప్పాడట. ఏడాదికి ఇచ్చే నూట యాభైపౌనులతోప్రపంచయాత్రచెయ్యడం చాలాకష్టం. అందుచేత చాలా కష్టపడి దేశాటనంచేయవలసివస్తుంది.ఇందులోనే రచయితకు కావలసిన ముడిపదార్థం దొరుకుతుందని మామ్ అభిప్రాయం రచయిత ఎలావుండాలో చెబుతూ మామ్ యిలా అంటాడు :

—"మనుష్యం జీవితాల్లో సంభవించే నిమ్నోన్నతాల్లో ఎన్ని వీలయితే అన్నింటిని రచయిత స్వయంగా అనుభూతి పొందాలని నా అభిప్రాయం మేధావిగా,దర్జీగా, సైనికుడుగా అతడుఎన్నోవృత్తులు చెయ్యాలంటాను. ఆతణ్ణే ప్రేమించమనీ, భగ్నప్రేమకుడు అవమనీ, త్రాగమనీ, ఆకలితో అలమటించమనీ, సేన్‌ఫ్రేన్సిస్కోలోని రౌడీలతోపేకాట ఆడమనీ, న్యూమార్కెట్‌లోని గుర్రపుపందాల సమాచారగాళ్లతో పందెం కట్టమనీ, పేరిస్‌లోని రాణీలతో ప్రేమకలాపాలు సాగించమనీ, 'బాన్' లోని తత్త్వవేత్తలతో వాదించమనీ, దక్షిణ సముద్రాల్లోని ద్వీపవాసులతో ఈదులాడమనీ, —అంటాను. రచయిత తెలుసుకోవలసిన అవసరంలేని మనిషి అంటూవుండడు. అతని మిల్లులో మానవజీవితంలోని ప్రతిసంఘటనా ఆడించడానికి తగిన "పిండి" అవుతుంది—' అని,[2]

—మామూలు రచయితకే యింత జీవితానుభవం కావాల్సివచ్చినప్పుడు, అట్టడగు జీవుల కథలు రాస్తామని కంకణం కట్టుకున్న 'కమిటెడ్ రచయితల' సంగతి వేరేచెప్పనవసరంలేదు. ఎయిర్ కండిషన్డ్ గదుల ప్రేమగాధల్ని ఊహించి రాసినట్టుగా, అట్టడుగు సమాజం గురించి ఊహించి రాయలేరని నా నమ్మకం. ఒకవేళ ఊహించి రాసినా, అందులో అతిశయోక్తులో, అబద్ధాలో, కనబడతాయిగానీ,—నిజమైన జీవితం కనబడదు. అట్టటగు సమాజంలోని ప్రజల జీవితాలగురించి రచనలుచేయదలచిన వాళ్ళు సెంటిమెంట్లకు పూర్తిగా 'గుడ్‌బై' కొట్టాలి. ఎందుకంటే— వాళ్లఆకలిదారిద్ర్యాల ముందు — సగటు సెంటిమెంట్లు, సంప్రదాయపు నీతులు, ఇవేమీ నిలువవు. సంప్రదాయాన్ని, మతాన్ని, దేముణ్ణి, పట్టుకు వ్రేళ్లాడే రచయితలు ఈవిలువల్ని గౌరవించలేరు. కనీసం అర్థంచేసుకోలేరు.

చాలాకాలం క్రితం హిందీలో ప్రేమ్‌చంద్ 'కఫన్' అనేకథ వ్రాశారు. మనుషుల ఆకలి ఎంత తీవ్రమైందో— దానిముందు ఉదాత్తమని చెప్పబడే విలువలుకూడా ఎలా పటాపంచలైపోతాయో ఈ కథ గుండెలు పగిలేలా చెబుతుంది. ఇలాంటికథల్ని భారతీయ రచయితలచేత రాయించింది రష్యన్ రచయితల ప్రభావమేనని చెప్పాలి.

మార్క్సిస్టు దృక్పథం రచయితలను భౌతిక వాదులుగా చేస్తుంది. సెంటిమెంట్లకు దూరంగాతీసుకుపోయి—భౌతికసమస్యల మీద దృష్టినిలిపేలా చేస్తుంది. ''మార్క్సిజం అంటేఏమిటి?—'' అనే రచనలో—ఎమిలీబర్న్సిఇలా అంటాడు: ''భౌతిక వాద దృక్పథంపైనే మార్క్సిస్టు సూత్రాలు ఆధారపడివున్నాయి ఈదృక్పథంనించే మార్క్సిస్టులు ప్రపంచాన్ని వీక్షించుతారు. ప్రపంచపరిణామానికి, మానవ సహజ పరిణామానికి మూలసూత్రాలు తెలుసుకోడానికి ప్రయత్నించుతారు. తాము కనిపెట్టిన విషయాలను, సూత్రాలను, అన్నింటినీ వాస్తవిక అనుభవాలతో వీక్షించుతారు—''[3]

—అయితే, కొందరు దీనిని విపరీత పరిణామంగా విమర్శిస్తారు. చాలా బాధపడిపోతూంటారు కూడా. భౌతిక వాదం వల్ల ఉపయోగవాదం (utilitarianism)పెరిగి పోతుందనీ, అది వాంఛనీయం కాదని వారిగోల. దీనికి సమాధానంగా మార్క్సిస్టులు అంటారూ— ఫ్యూడల్, బూర్జువా, వర్గాలలో ఉపయోగవాదం సంకుచితమైనట్టిది. అటువంటి ఉపయోగవాదానికి మార్క్సిస్టులు ఎప్పుడూ వ్యతిరేకులే. అయితే—కార్మిక వర్గానికి చెందిన ఉపయోగ వాదం విశాలమైన దృక్పథం కలిగి నటువంటిది. ప్రజాసామాన్యం యొక్క శ్రేయస్సునే ప్రధానంగా పెట్టుకునేఉపయోగవాదం వల్ల ప్రపంచానికి మేలేగాని, కీడులేదు అని వారి వాదం.

మార్క్సిస్టు దృక్పథానికి మానవతా వాదమే ప్రాతిపదికవిషయం. అయితే— మానవతా దృక్పథంగల రచయితలందరూ మార్క్సిస్టులు కావాలనే నియమం ఏమీలేదు. హ్యూమనిజం మొదటి మెట్టయితే,—మార్క్సిజం రెండో మెట్టుఅని స్థూలంగా మనం అనుకోవచ్చు. బహుశా- ఈ విషయాన్ని ప్రాతిపదికగా చేసుకొని రచయితలను మాగ్జిమ్ గోర్కీ రెండు విధాలుగా విభజించాడు.—ఒకటి, 'సోషలిస్ట్‌రియలిజమ్' గల రచయితలు,—రెండు,— 'క్రిటికల్‌రియలిజమ్' గల రచయితలు.

19వ శతాబ్దానికి చెందిన 'క్రిటికల్‌రియలిజమ్' గల సాహిత్యం సమకాలీన పరిస్థితుల్ని తీవ్రంగా విమర్శిస్తుంది. అయితే ఆ పరిస్థితుల్నించి బయట పడాలంటే ఏం చెయ్యాలో చెప్పదు. ఈ విభజన ప్రకారం సేమ్యూల్ బట్లర్, జార్జిబెర్నార్డ్షా, మొదలయిన రచయిత లందరూ 'క్రిటికల్‌రియలిజమ్' కలిగిన రచయితలని చెప్పవచ్చు. వీళ్లసాహిత్యం ''రివల్యూషనరీ రొమాంటిసిజమ్''కు సన్నిహితమైంది అంటారు గోర్కీ. సాహిత్యపరంగా ఇవి ఎంత గొప్పవయినా, సామాజికంగా ఏటికి చెప్పుకో దగ్గ ప్రయోజనంలేదు.

''—'క్రిటికల్ రియలిజమ్' యొక్క అద్భుతమైనకృషిని ఎంతమాత్రమూకాదనకుండా సాహితీరంగంలో అదిసాధించిన విజయాలను అభినందిస్తూ,—ఒకవిషయాన్ని మాత్రం మనం గ్రహించవలసి వుంది. గతకాలపు శిథిలాలపై కాంతిని ప్రసరింపచేసేందుకు, వాటిని తొలగించేందుకు, సంఘర్షణ అనివార్యమని చెప్పేందుకు మాత్రమే ఆతరహా 'రియలిజమ్' మనకు ఉపయుక్తమవుతుంది—'' అంటాడు గోర్కీ.

ఇక—'సోషలిస్ట్‌రియలిజమ్' కలిగిన రచనలసంగతి చూద్దాం. కేవలం సామాజిక సమస్యను 'ఫోకస్' చేయటంమాత్రమే కాక,— ఆ సమస్యాపరిష్కారానికి సోషలిస్ట్ మార్గాన్ని కూడా చూపుతాయి ఈ రచనలు. ఈ రచనల్లో ''హ్యూమనిజమ్'' మాత్రమేకాక— ''ప్రోలిటేరియన్ హ్యూమనిజమ్'' కూడా తొణికిసలాడుతూ వుంటుంది. ''—మనుషులు అత్యంత సుఖసంతోషాలతో నివసించడంకోసం,వారిలోని వైయుక్తిక శక్తి సామర్థ్యాలు విశృంఖలంగా పెరగాలనే ఆశయంగల సోషలిస్ట్‌రియలిజమ్, జీవితం కార్యాచరణతోనూ, సృజనతోనూ కూడుకున్నదని ప్రకటిస్తుంది—'' అంటాడు గోర్కీ. ఇలాంటి 'సోషలిస్ట్‌రియలిజమ్' కలిగిన రచనలనే మనం ఈనాడు 'కమిటెడ్ రచనలు, గా పేర్కొంటున్నాం. పైవిధమైన 'కమిట్‌మెంట్'లేకుండా, కేవలం సమస్యలను మాత్రమే ఎత్తిచూపిస్తూనో లేదా సమస్యలకు అహింసాత్మక పరిష్కారమార్గాన్ని చూపిస్తూనో చేసే రచనలను 'బూర్జువారచనలు' అనడం తరుచుగా జరుగుతూ వుంటుంది. టాల్‌స్టాయివంటి మహారచయితలపైనే ఈ విమర్శ తప్పలేదు.... ''టాల్‌స్టాయి రచనలలోను, అభిప్రాయాలలోను, సిద్ధాంతాలలోను ఉన్న అంతర్వైరుధ్యాలు నిజంగా విస్పష్టమైనవి, ఒకవైపున పెట్టుబడిదారీ దోపిడీ మీద నిర్దాక్షిణ్యమైన విమర్శ, ప్రభుత్వ అత్యాచారాలను ప్రహసన ప్రాయపు కోర్టులను దుయ్యబట్టడమూ...మరొకవైపు 'ప్రతిఘటించకుదేన్నైనా హింసతో' అంటూ అణకువనుబోధించే ఉన్మత్తపు ఉపదేశాలూ—'' అంటూ టాల్‌స్టాయిని విమర్శిస్తాడు లెనిన్ 'సాహిత్యం మీద వ్యాసాలు' అనే చిన్నపుస్తకంలో.

ఏది ఏమైనా — సోషలిస్ట్ రియలిజమ్, క్రిటికల్ రియలిజమ్, ఈ రెండు తరహాల రచనా దృక్పథాల్లోనూ హేతువాదం, పీడితులపట్ల ఆవేదనా కనబడుతుంది. నిజానికి మార్క్సిజం ప్రభావం వలన వచ్చిన ఈ హేతువాద ధోరణే, దేముణ్ణి, మతాన్ని, మూఢాచారాల్ని అన్నింటినీ ప్రశ్నింపజేసి, ఎక్కడ 'ఎక్స్ప్లాయిటేషన్'వున్నదో అక్కడ ప్రతిఘటించే వైఖరిని ప్రసాదింపజేసింది. ఇదే రచయితల దృక్పథాన్ని కాల్పనిక ప్రపంచం నుంచి వాస్తవిక ప్రపంచానికి మళ్లించింది.

ఈ మార్పు — ఖచ్చితంగా మార్క్సిజమ్ ప్రభావం వలన అని చెప్పలేముగాని—యించుమించుగా విశ్వ సాహిత్యమంతటా కనబడ సాగింది.

"—అద్భుతమైన ఐశ్వర్యం ప్రక్కనవున్న అత్యంత బాధాకరమైన దారిద్ర్యం మానవత్వాన్ని మేల్కొలపడం మాత్రమేకాదు — శ్రమజీవుల పరిస్థితులను మెరుగు పరిచేందుకు సంఘటితమైన కృషి జరగాలనే వాంఛను కూడా రేకెత్తించింది ... ఈ రోజున బీదవాళ్లు "మనలో వుండేవాళ్లు" మాత్రమేకాదు — 'సామాజిక స్పృహ' కు వారొక సవాలుగా రూపొందారు. సంఘ సంస్కరణ చేయాలనే ఉద్దేశంతోగాని, అలాంటి భావం లేకుండాగాని, వాస్తవ దృక్పథంతో రచనలుచేసే నవలాకారు లందరికీ వీరు ముడి పదార్థమయ్యారు—" —ఈ వాక్యాలు అన్నది ఒక కమ్యూనిస్ట్ రచయిత కాదు.

1900–1950ల మధ్య ఆంగ్ల సాహిత్య ధోరణిని వివరిస్తూ ఆర్. ఏ. స్కాట్–జేమ్సుఅనే బ్రిటిష్ రచయితలు రాసినవి అని తెలుసుకుంటే కొందరికి ఆశ్చర్యం కలగవచ్చు. ఏది ఏమయినా —ముప్పాతిక పైగా ప్రపంచంలో పెచ్చు పెరిగిపోతున్న అసమానత్వాలు, ఆకలి దారిద్ర్యాలు, మానవత్వంగల రచయితలందరి హృదయాలలోనూ సహజంగానే 'స్పందన'ను తీసుకుని వచ్చాయి.

2.

రష్యాలో జరిగిన విప్లవం తర్వాత—భారతదేశంపై కమ్యూనిజమ్ ప్రభావం పడటం మొదలైంది. 30ల ప్రాంతాలకు వివిధ రంగాలపై మార్క్సిజమ్ ప్రభావం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, కనబడసాగింది. పెరిగిపోతున్న ధరలు, తరిగిపోతున్న జీవన ప్రమాణం, పాలకవర్గంలోని కపట ధోరణులు, ఈ ప్రభావాన్ని మరింతగా బలపరిచాయి. మార్క్సిజమ్ కవితా రంగాన్ని పలకరించడంతో భావకవితోద్యమానికి స్వస్తి పలకడం ప్రారంభమైంది. వ్యక్తివాదం స్థానంలో సమిష్టివాదం చోటుచేసుకోవడం ప్రారంభించింది. క్రమానుగతిలో కాల్పనిక వచన సాహిత్యంపై కూడా మార్క్సిజమ్ స్పష్టమైన ప్రభావాన్ని చూపసాగింది.

తెలుగు కాల్పనిక వచన సాహిత్యం (Fiction) పై మార్క్సిజం ప్రభావాన్ని లెక్కవేయడం ప్రారంభిస్తే — నిజానికి మన పరిశీలన 'మాలపల్లి' నుండి ప్రారంభించాలి. 1922 లో వెలువడిన ఈ నవల గాంధేయ ఉద్యమ ప్రభావంతో వెలువడినదే అయినా ఈ నవలపై రష్యన్ విప్లవ ప్రభావం కూడా కనబడుతుంది. ఈనవలలోని రామదాసు మారువేషం వేసుకున్న మహాత్మా గాంధీ అని చెప్పవచ్చు. రామదాసు కొడుకులయిన సంగదాసు, వెంకటదాసు, ఇద్దరూ రెండు మార్గాలలో మరో ప్రపంచ నిర్మాణానికి నడుం కట్టారు. సంగదాసుది గాంధీ మార్గం వెంకటదాసుది హింసా మార్గం. రామదాసు తన కళ్ల ఎదురుగానే ఇద్దరు కొడుకుల్నీ పోగొట్టుకున్నాడు. అయినా చివరకు లభించిన విజయం సంగదాసుదే. ఈ నవలకు "సంగ విజయం" అనే మరో పేరు కూడా వుంది.

ఈ నవలలో చనిపోడానికి కొద్ది క్షణాల ముందు జెయిల్లో తనతో బాటు బంధించబడివున్న రామదాసును వెంకటదాసు అడుగుతాడు—

"తెర పడబోతున్నది. నాటకం పూర్తి అవుతున్నది. నేను ఎట్లా ఆడానో చెప్పు—" అని,

"నీది చాలా క్రొత్త నాటకం. నీ నాటక నియమాలుకూడా వేరే. నేను మామూలు దారినపోయిన వాణ్ణి. నీది మార్గం కాదని చెప్పలేనుగానీ, —అంతా అవలంభిస్తే ఎలా వుంటుందో చూడాలె. నీ మార్గం నియమ బద్ధంమటుకు అవును—" అంటాడు.

లక్ష్మీనారాయణగారు ఈనవలరాసేటప్పటికి రష్యన్ మహా విప్లవం జరిగి, అయిదు సంవత్సరాలు మాత్రమే అయింది తూర్పు దిక్కున కనబడుతున్నవి కాంతిమయక్రాంతికిరణాలో, మహాగ్ని జ్వాలలో, తేల్చుకోలేని సంధియుగపు సంఘర్షణలో–చివరకు గాంధీ పథంపైపు మొగ్గు ఈ నవలలో దృశ్యా దృశ్యంగా మనకుకనబడతాయి. ఈనవల 23వ అధ్యాయంలో ("సంఘనిర్మాణం")వెంకటరెడ్డిగారి ఉపన్యాసంలో "—ఋష్యాదేశంలో పంచాయితీ (సోవియట్) ప్రభుత్వం స్థాపించబడ్డది. వీరిఉద్యమానికి బోల్షివిజమునిపేరు. బోల్షివిజమనగా విశేషజనుల యొక్క అభిప్రాయం అనిఅర్థం... అందరూ పనిచేసి అనుభవించవలసిందనీ, కొందరు అన్న వస్త్రాలు లేక మలమల మాడుతూంటే మరికొందరు భోగమాలలోనూ, దుర్వ్యసనములలోనూ మునిగి తేలడం న్యాయంకాదనీ వీరి ముఖ్యసిద్ధాంతాలు. వీరి సిద్ధాంతాలు తప్పనడానికి ఎవరికీ సాధ్యం కాదుగానీ ఆచరణలో పెట్టడం అసాధ్యమని కొందరి సందేహం..... జనులీ పద్ధతికి అలవాటుపడి జరుపుకుంటారో, తిరిగీ విప్లవంవచ్చి పాతపద్ధతులే అమలులోకి వస్తవో చెప్పలేము—" (పేజీలు 152–154) అనే వాక్యాలు ఓ విధంగా లక్ష్మీనారాయణగారి భావాలే అయితే–యిదే ఉపన్యాసంలో "ఆంగ్లధనిక వర్గం ఈ భావాలను రాకుండా కొట్టవలసిందని ఉద్ఘోషిస్తున్నది. భావాలను ఫిరంగులు ఎట్లా కొట్టగలవని ప్రభుత్వం వారంటున్నారు—" (పేజీ 154) అనే వాక్యాలు రచయిత పురోగామిదృక్పథానికి తార్కాణం. ఓవిధంగా చెప్పాలంటే గోర్కీ విభజన ప్రకారం అటు "క్రిటికల్ రియలిజమ్"కూ, "సోషలిస్ట్ రియలిజమ్"కు, కూడా చెందని 'గాంధియన్ రియలిజమ్' మానవతా కాంతి కిరణాలతో ఈనవలలో కనబడుతుంది.

ఇక, కథాసాహిత్యం విషయానికి వస్తే— తెలుగులో అటు క్రిటికల్ రియలిజమ్‌కు, ఇటుసోషలిస్ట్ రియలిజమ్‌కు, చెందినకథలు అనేకం కనబడతాయి. స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తర్వాతాకూడా, చాలాకథల్ని ప్రచురించిన కరుణ కుమార, మా. గోఖలే, వంటి వారిని మనం 'క్రిటికల్‌రియలిజమ్' కు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. కథలు కేవలం కాలక్షేపానికి మాత్రమే కాదనే సత్యాన్ని గుర్తించి— కష్టజీవుల కన్నీటిగాథల్ని కథావస్తువులుగా తీసుకున్న తొలితరం కథకుల్లో వీరు పేర్కొనదగినవారు.

''కరుణకుమార'' అనే కలం పేరుతో కథలు వ్రాసిన కందుకూరి అనంతంగారు స్వాతంత్ర్యం వచ్చిన తొలిసంవత్సరాల్లో పాఠకులకు సుపరిచితులు.''—'కరుణకుమార' ముందు తెలుగు సాహిత్యములో గ్రామీణుల కష్టనష్టాలను చిత్రీకరించిన వారు లేరు. గ్రామాలలో పెత్తందార్లు చేసే దారుణకృత్యాలను, ధనికుల దౌష్ట్యాలు, జమీందార్ల జబరదస్తీలు, మోసాలు,— అగ్రజాతుల అక్రమాలు హృదయాలకు హత్తుకొనేలా 'కరుణ కుమార' చెప్పెను. ఆయన కథల్లో ద్వేషమును పురిగొల్పుటగానీ, విప్లవమును రేకెత్తించుటగానీ వుండదు. హృదయ పరివర్తనానికి అవి ఉనికి పట్టులై వుండును — ''[4] వీరి కథల్లో 'ఆకలిమంటలు' 'క్రొత్తచెప్పులు' 'బిళ్లల మొలత్రాడు' మొదలయినవి సుప్రసిద్ధాలు. 'క్రొత్తచెప్పులు' కథలోచిన్నపరెడ్డి అనేమోతుబరిఆసామీ—ఆలస్యంగా చెప్పులుకుట్టితెచ్చినందుకు 'నరిసి' అనె మాదిగవ్యక్తిని చావగొడితె ఆ ప్రాణికాస్తా 'హరీ'అంది. చిన్నప్పరెడ్డి మోతుబరితనం పోలీసుల నోళ్లను నోట్లతో మూయించగలిగిందికానీ— కొత్త చెప్పుల ప్రతీకార జ్వాలను ఆపలేకపోయింది. చెప్పులు తొడుక్కున్న రెడ్డికాలుకు పుండుపడి పెద్దదికావటం, నరిసి కలల్లో కనబడితే మనోవ్యాధితో చిన్నపరెడ్డి చావటం— కథకుడు చెప్పిన కథలో కనబడతాయి. ''సన్మానం'' అనేకథలో రచయిత బీద బడిపంతుళ్ల కష్టాలను అతిదయనీయంగా చెబుతాడు. మరో కథలో ఒకపాత్రచేత కూరగాయలబేరం అధికంగాచేసి చవుకగా కొందామని తాపత్రయపడ్డం తప్పని చెప్పిస్తాడు.

''—ప్రొద్దున్న నీవుచేసిన కూరగాయల బేరం నీకు ఇప్పుడే మన్నాజ్ఞాపకం వుందా?— అడుక్కొని తినడం యిష్టంలేక, పెద్ద వ్యాపారాలు చేసుకోడానికి వీలులేక— ఏకూరో ఆకో అలమో కష్టపడి మోసుకుని నీయింటికాడకి అమ్ముకొనవస్తే ఆ బేరాలేమిటి?— ఎన్నిదమ్మిడీలు ఈ ప్రకారం మిగల్చి నీమెడలోని నాలుగువేల రూపాయల బంగారం బరువును మరింత వృద్ధిచేయదలుచుకున్నావు?—'' అంటాడు ఈ కథలోని ఒకభర్త తన భార్యతో.

—ఇలా చెప్పుకుంటూపోతే, కరుణకుమారకథలన్నింటిలోనూ మానవత్వపుధోరణి పుష్కలంగా కనబడుతుంది. అయితే—ముందే చెప్పుకున్నట్టుగా ఎక్కడా 'కరుణ కుమార' తిరగబడమని సందేశం యివ్వడు.

ఇదేవిధంగా మా గోఖలే గారి కథల్లోకూడా శ్రమజీవులకథలు హృదయవిదారకంగా కనబడతాయి.తెలుగుకథల యితివృత్తాల్నిపాఠక జనం జీవితాలకు అతిసన్నిహితంగా తీసుకు రావడం మాత్రమేగాక— వాళ్లమాండలిక భాషలో చెప్పిన గొప్పకథకులు వీరు. 'బల్లకట్టు పాపయ్య' 'కిష్టమ్మగారి పెద్దజీతగాడు' 'శివరాత్రితిరణాళ 'వంటి కథల్లో గోఖలేగారు ఎన్నుకున్న కథావస్తువులోని కఠోరవాస్తవికత, కథనంలోని మాండలిక భాష, మనల్ని నిజంగా ముగ్ధుల్ని చేస్తాయి. అయితే- మనం అనుకున్న ''సోషలిస్టురియలిజమ్'' వీరిరచనల్లో మృగ్యం.

ప్రఖ్యాత కథకుడు బాలగంగాధర తిలక్ ధోరణికూడా యిలాంటిదే. కవిత్వం విషయంలోనేకాదు— కథల విషయంలోకూడా అతని అక్షరాలు 'కన్నీటి జటలలో తడిసిన దయా పారావతాలు'— వీరికథల్లో మానవతా దృక్పథంతోబాటు హేతువాద దృక్పథం కూడా కనబడుతుంది. 'నల్లజర్లరోడ్డు' కథలో సంఘంలో పెద్దమనుషులుగా చెలామణీ అయ్యేవారినీ— అడవుల్లో అనాగరికుల్లా బ్రతికేవారినీ సరిపోల్చిచూపిస్తూ— పెద్దమనుషుల ఇరుకుగుండెల్ని వేలెత్తి చూపించి గేలిచేస్తాడు. 'దేవుణ్ణిచూసినవాడు'కథలో నిత్యం పూజలుచేసే కుసంస్కారులకన్నా మానవత్వంగల నాస్తికుడే నిజంగా 'దేముణ్ణిచూసినవాడు' అంటాడు. ఇక—'ఆశాకిరణం' కథచదివితే వొళ్ళు జలదరిస్తుంది. ఆకలిమనుషుల బ్రతుకుల్ని ఎంత దిగజారుస్తుందో దయనీయంగా చెబుతుంది ఈకథ— ఈకథలన్నింటిలోనూ విప్లవ ధోరణిలేని మానవతావాదమేకనబడుతుంది—రెండు విభిన్న దృక్పథాలకు మధ్యవారధి శ్రీ బాలగంగాధరతిలక్,— కవిత్వంలోనేకాదు, కథల విషయంలోకూడా.

త్రిపురనేని గోపీచంద్ కథల్లోకూడా గోర్కీచెప్పిన' క్రిటికల్ రియలిజమ్' కనబడుతుంది 'బీదవాళ్లంతా ఒక్కటి' కథలోగోపీచంద్ సమ్మెచేస్తున్న శ్రామికులపై తుపాకీగుళ్ల వర్షాన్నికురిపించి చివరికి— తానుకూడా వాళ్లలో ఒకడినే కదా— తాను చేసింది, ఏం న్యాయం?— అనివ్యథచెందే పోలీసుకాన్‌స్టేబుల్ కథచెబుతాడు.— 'ఇలాజరిగేను' కథలో సామ్యవాదసిద్ధాంతాలవల్ల ప్రేరితుడయిన ఒక యువకుడు వ్యవసాయకూలీల నందరినీ పోగుచేసి ఖామందులమీద విప్లవం తీసుకోద్దామనుకుంటాడు. కాని—చివరికొచ్చేసరికి వాళ్ళు ఖామందు చెప్పినట్టల్లా బుద్ధిగావిని సామ్యవాదిని హోతాశుణ్ణిచేస్తారు ఇలానడిచే కథల్లో గోపీచంద్‌గారు చెప్పదలచింది డైరెక్ట్‌గాచెప్పడం జరగదు. కథాశిల్పవిషయకంగా యిది బాగానే వుంటుంది. కాని ఇది ''సోషలిస్టురియలిజమ్'' కాదంటారు మార్క్సిస్టులు.

తెలుగు కథాసాహిత్యంలో ''సోషలిస్టురియలిజమ్'' గురించి చెప్పేటప్పుడు కొడవటిగంటి కుటుంబరావు గారి గురించి చెప్పాలి. మార్క్సిజమ్ వలన ప్రభావితులయిన తొలితెలుగు కథారచయితల్లో కుంటుంబరావు గారు ఒకరు. నిజానికి— కుటుంబరావుగారి రచనల్లో మార్క్సిజమ్ ఛాయలు లేనివి కూడా చాలావున్నాయి. అయితే-- ఆ తరహా తమ రచనలపట్ల కుటుంబరావుగారు చాలా అసంతృప్తిని వ్యక్తంచేస్తారు.''—మార్క్స్ 'కేపిటల్'చదవటంతో సహా మార్క్సిజమ్ చదవడం నాకు చాలా మేలుచేసింది...సంఘం వ్యాధిగురించి నేను కొంచెం అర్థంచేసుకోగలిగాను... ఈ పాటి జ్ఞానం కలుగ గానే నేను చేసిన మొదటి రచన 'కులంగాడి అంత్య క్రియలు' అటుతర్వాత రాసిన కథల్లో మనస్తత్వం గురించి గాలి కబుర్లు రాయడంమాని ఆ మనస్తత్వాన్నిఆడించే సాంఘిక శక్తుల గురించి రాయడం ప్రారంభించాను—''[5] అంటారు ఆయన తన కథలగురించి చెబుతూ— కుటుంబరావుగారికి దేశంలో వున్న ప్రజల

కష్టాలు హృదయవిదారకంగా వర్ణించి — ఆపైన ఏం చెయ్యాలో చెప్పకుండా వదిలేసేవైఖరి నచ్చదు.

'' — రచయిత అజ్ఞానం కళా రూపంలో ఎంతగా ప్రచారమవుతున్నదో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఇలాంటి కథల్లో హీరో ఎంత అసమర్థుడో రచయిత కూడా అంత అసమర్థుడే ... కీకారణ్యంలో సిమెంటు రోడ్లూ, విద్యుద్దీపాలూ, కూల్ డ్రింకు షాపులూ వుండవు. ... ధనస్వామ్యం తొలగడానికి ఏం చెయ్యాలో ఆలోచించలేక దాని దుష్ఫలితాల గురించి అశ్రువులురాల్చి, పాఠకుల చేత అశ్రువులు రాల్పించాలని ప్రయత్నిస్తూ చేసే రచనలు విరాకు పుట్టిస్తున్నాయి'' అంటారాయన.[6]

వర్గ సంఘర్షణను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని కుటుంబరావుగారు రసవత్తరమైన కథలనెన్నింటినో రాశారు. వీరి కథల్లో సింబాలిస్టు ధోరణి అధికంగా కనబడుతుంది. పెట్టుబడిదారీ సమాజాల్లో రచయితలు సింబాలిస్టుధోరణిలో కథలురాసి, విప్లవానికి ప్రజల్ని ప్రేరేపించడం మంచిది అని మావోగారు చెప్పిన సలహాను మిగతా రచయితల కన్నా కుటుంబరావుగారే అధికంగా పాటిస్తున్నట్టుంది.

'' — ప్రజాపీడన అన్నది వయస్సు ఉడిగినదిగానూ, పత్వారంతో కూడుకున్నదిగానూ, స్వలహాగా దుర్బలమైనదిగానూ కనిపిస్తుంది. దాని అసలు శక్తి ప్రజల అజ్ఞానం — ప్రజల భీతి — ప్రజా శత్రువులు దాని బలాన్ని పెంచడానికి ప్రజల అజ్ఞానాన్ని, భీతిని, రెచ్చగొడతారు—''[7] అన్న కుటుంబరావుగారు, ముసలి ఒరుగయిపోయి, ఏకచక్రపురం పొలిమేరల్లో కూలబడివున్న 'బకాసురుడు' అనే రాక్షసుడి గురించి ఓ కథలో చెబుతూ — అలనాటి భారతకథకు రంగులుమార్చి యిలనాటి వర్గపోరాటం కథగా చెప్పడం చదివితే తమాషాగా వుంటుంది. ఈ కథలో బకాసురుడు కూలిపోడానికి సిద్ధంగావున్న పెట్టుబడిదారీ వ్యవస్థకు, ప్రజాపీడనకు ప్రతీక. ఏకచక్రపురం రాజు, మంత్రి, ఆ వ్యవస్థకు ఏజెంట్లు. ముసలి రాక్షసుడికి భయపడి ప్రాణాలు వదులుకున్న ఏకచక్రపుర వాసులు సమకాలీనప్రపంచానికి ప్రతిబింబాలు, ధైర్యంగల బాలుడు భీముడులో మనకు మరో ప్రపంచపు మరో లెనిన్ కనబడతాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రసాదించిన ధనస్వాముల అధికారం మనం భయపడినంతవరకు మాత్రమే వుంటుందని, రమణీయంగా చెబుతారు కుటుంబరావుగారు ఈ కథలో. అయితే — యిందులోని తమాషా ఏమిటంటే — పెట్టుబడిదారీ వ్యవస్థకు 'సెటైరు' ఫ్యూడల్ వ్యవస్థకు చెందిన కథ కావడం.

ఇలాగే — 'గ్రహశకలం' అనే కథలో మనల్ని గతకాలంనుండి భవిష్యత్తుకాలంలోనికి తీసుకుపోయి, మనుషులు చైతన్యరహితంగా వున్నంతకాలం భూత వర్తమాన భవిష్యత్కాలా లన్నింటిలోనూ ఈ 'ప్రజాపీడన' అనేది వుండి తీరుతుందని చెబుతారు. ఈ కథలోని వెలుతురు ప్రాంతం, చీకటి ప్రాంతం, సోషలిజమ్‌కు, కేపిటలిజమ్‌కు, సంకేతాలు.

ఇదే విధమయిన సింబాలిక్ ధోరణి కుటుంబరావుగారి 'దిబ్బ పుష్టిక', 'అహింసా ప్రయోగం' మొదలయిన కథల్లో కూడా కనబడుతుంది. దిరుగుండాన్ని ఏలుతున్న దిబ్బరాజుగారు పరిపాలన చేస్తున్న కాలంలో —దారిద్ర్యం పెచ్చు పెరిగిపోయిందట—ఆయనకు దరిద్రులంటే వల్లమాలిన మంట. ఈ దారిద్ర్యసమస్యను పరిష్కరించడం ఎలాగో అర్థం అయిచావక ఆయన అవస్థ పడుతూంటే —ఓ మహా మేధావి వచ్చి, ఈ దరిద్రులను చంపిపారేస్తే పోలేదా? అని సలహా యిస్తాడు. ఆ సలహా ప్రకారం దిబ్బరాజుగారు దరిద్రులను ఉరితీయించగా, చిట్టచివరకు దరిద్రులు లేకపోవడంవల్ల ధనికులు గొప్ప చిక్కులో పడిపోతారు. తాము ఇన్నాళ్లూ బతికింది వాళ్ల శ్రమమీదనే అని అప్పటికిగానీ తెలుసుకోలేకపోయారు. తీరా తెలుసుకునే సమయానికి దేశం స్మశానమై, ధనికులతో సహా అందరూ చచ్చిపోతారు.

ఇక — 'అహింసా ప్రయోగం' కథలో డాక్టర్ జీవకారుణ్యం అనే అహింసావాది మరియు సైంటిస్టు కథను వేళాకోళంగా చెబుతారు. విశ్వశాంతికి ఆయన చేసిన ప్రయోగం బెడిసికొట్టి పెద్ద ప్రేలుడు జరుగుతుంది. అందులో అనేక వేల మంది మరణించగా, తాను కూడా గాయపడిన డాక్టర్ జీవకారుణ్యం ఇలా అంటాడు:— ''నేను చేసింది చాలా నిరపాయకరమైన ప్రయోగం. ఒక తులం భాషా రాష్ట్ర సమస్య, అర్ధశేరు అసత్యం, అర్ధశేరు అహింస, వెచ్చబెట్టి కలపడానికిప్రయత్నించాను. మొత్తంపేలింది. సత్యంలో పరమాణు శక్తికన్నా ఎక్కువశక్తి వుందని నాకుతెలుసు. కాని — ఛైయిన్ రియాక్షన్ రాకుండా 'రిటార్ట్' చెయ్యడానికి 'అహింస' వేశాను. అయినా — పేలింది జనం చచ్చినందుకు నాకు విచారం లేదు. ప్రేలుడు జరిగినప్పుడు సమీపంలో వుండే వాళ్లు ఒక్కొక్కప్పుడు ఛస్తారు. నేను ఎంతో దూరంలో వుండి కూడా గాయపడ్డాను. — వచ్చే ఎన్నికల మాటేమిటని ?—''

'అహింస'పై మార్క్సిస్టుల 'క్రూయల్ జోక్' ఈ కథలో మనకు కనబడుతుంది. ఇలా కుటుంబరావుగారి కథ లెన్నయినా చెప్పవచ్చు. పైకి చూడ్డానికి ఈ కథలు పిల్లల కథల్లాగా కనబడినా — కాస్త ఆలోచిస్తే, మరికొంత ఆలోచించడానికి చాలా గ్రంథం కనబడుతుంది.

రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి కథల్లోనూ అక్కడక్కడా యిలాంటి సింబాలిజమ్ తొంగి చూస్తూ వుంటుంది. కుటుంబరావుగారి 'బకాసుర' కథ వర్గ సంఘర్షణ కథగా చెబితే — రామాయణంలో వున్నదీ అదే అంటారు రా. వి. శాస్త్రిగారు. వీరి 'బెదురు' కథలో రాముడు శ్రామిక వర్గానికీ, రావణాసురుడు పెట్టుబడిదారీ వర్గానికీ సంకేతాలుగా కనబడతారు.

'' — వాణ్ణి నువ్వు కాదు — నిన్ను పుట్టించిన జేజెమ్మ వచ్చినా ఏం చెయ్యలేదు. మిమ్మల్ని తన్ని తగిలెయ్యడానికి ఆ బాబు దిగి రానక్కరలేదు. ఓ బోడిముండ నెవర్నైనో పంపించి, మిమ్మల్ని

దాన్నేత ఓ పాతు పాతించీగల్దు—అంతకన్నా ఎక్కువ శ్రమ అక్కర లేదు ఆ బాబుకి—''

(రా. వి. శాస్త్రి కథలు—పేజీ 100)

''—కొండవాళ్లనీ, కోయవాళ్లనీ వెంటబెట్టుకుని దౌర్జన్యానికి దిగాడుగానీ,ససేమిరా అహింసాత్మకంగా సంప్రదింపులకు వెళ్లినన్నాడు.

... వాడి పేరు రాముడట — వెళ్లి పది రోజులయింది. — ఏమయిందో ఏమిటో యింకా సమాచారం రాలేదు...ఏమవుతుందిలే — రావణ బ్రహ్మ మీద తిరుగుబాటు లేవదీసి ప్రాణాల్తో పైకి వస్తాడా ?—'' (పేజీ 103)

ఈ విధంగా రావణాసురుడనే లక్షాధికారి తైనాతీగాడి స్వగతంలా ప్రారంభమై — స్వగతంలాగానే అంతమవుతుంది కథ— ఈ కథ ముగింపు ఏమిటో అందరికీ తెలిసిందే. అయితే మరి, — రావణాసురుడంటే భయం ఎందుకు అంటారాయన.

రా. వి. శాస్త్రిగారి ''పువ్వులు'' కథలోనూ ఇలాంటి సింబాలిజమ్ వుంది. పైకి అది ఛేయిల్డు సైకాలజీకి సంబంధించిన కథలాగా కనబడుతుంది. మేడ యింటి అవుట్ హవుస్‌లో అద్దె కుంటున్న వారి చిన్నపాప ఎంతో ఆప్యాయంగా, కష్టపడి గులాబీ మొక్కల్ని పెంచుకుంటే — హఠాత్తుగా కారులో వచ్చిన యింటి వారి పాప సునాయాసంగా ఆ పువ్వులన్నీ కోసుకుపోయినప్పుడు — ఔట్ హవుస్ పాప బాధ ఎలాంటిది? — ఔట్ హవుస్ పాపకు ''యింటి యజమాని'' హక్కును కాదనగల ధైర్యం ఎలా వుంటుంది ? —

'' — మేడ యింటిమీద, మేడ అంచు ఎగువకి వచ్చిన చందమామ, చక్కనివి చిన్న చిన్నవి ఎన్నో పువ్వులు పారేస్తూనే వున్నాడు. కాని — కమల బాల

కళ్లు తుడుచుకుంది.

కళ్లు తుడుచుకుంటూనే వుంది—''

(రా. వి. శాస్త్రి కథలు, పేజీ 195)

— యింత చిన్న కథలో ఎన్ని లోతయిన ఆలోచనలు వున్నాయి ? —

యిలాంటి సింబాలిజమ్ మనకు రా.వి. శాస్త్రిగారి 'ఇద్దరు పిల్లలు', 'వర్షం' మొదలయిన కథల్లో కూడా కనబడుతుంది.

అయితే — రా. వి. శాస్త్రిగారిని గొప్ప రచయితగా నిలబెట్టిన కథలు యివి కానేకావు. విశ్వనాథ శాస్త్రిగారి పేరు చెప్పే సరికల్లా మనకు ''ఆరు సారా కథలు'' జ్ఞాపకం వస్తాయి. అట్టడుగు ప్రజా జీవితాలకు సన్నిహితంగా వచ్చి వీరు వ్రాసిన ఈకథలు నిజంగా అద్భుతమైనవి.

సారాకంపు కొట్టుకుంటూ, కోర్టు జీవితపు ఛలోక్తులతో పలుకరిస్తూ, అభాగినుల కథలను, అభాగ్యుల ఆవేదనలను దయనీయంగా చెప్పే ఈ ఆరు 'సారా' సారో కథల్లో ఉన్నది ఏరసమో చెప్పగల సాహసికులు లేరనుకుంటాను. సారా కథల్లో కనబడే ముత్యాలమ్మ, నూకాలమ్మ, పోలమ్మ, రాకెట్ అప్పారావు, నీలయ్యగాడు, మొదలయిన సారా వ్యాపారస్తులు — సారా స్మగ్లర్లు, డాఫర్ వెధవలు, ప్రొహిబిషన్ ఉన్న రోజుల్లోనూ, లేని రోజుల్లోనూకూడా వుంటారు. 'చట్టం' అన్నది ఏ తరహాలో వుండనివ్వండి — దానికీ, వీళ్లకీ, సంబంధంలేదు.

సెక్స్ ఆకలి కొద్దీ పదిమంది మీద పడినప్పుడు బాధ తీర్చుకోడానికి సారా త్రాగిన నూకరాజు కంపెనీ సానిపాప ఆవేదనా ... ''నా మొగుధు సారా పాలై పోనాడు. నా యాపారం పోలీసోళ్ల పాలై పోనాది. నా కూతురు కుక్కలపాలై పోనాది. — సీ ! ఏటీ బదుకు ?—'' అని గోలపెట్టే సారాపాక ప్రొప్రయిటరిణి నూకాలమ్మ ఏడుపు, — వీటన్నింటి వెనకాల ''సారా అమ్మట తప్పు. త్రాగుట తప్పు'' — అంటూ తీర్పు చెప్పడానికి పెద్ద పీఠం వేసుక్కూర్చున్న జడ్జీలు ప్లీడర్లు — వీళ్లందరూ కలగా బులగంగా కనబడి మనం మరచిపోలేని కథల్ని మనముందు వుంచుతాయి.

కవిత్వ రంగానికి శ్రీశ్రీ లాగా—వచన సాహిత్యానికి సంబంధించి రా. వి. శాస్త్రిగారు మార్క్సిస్టు దృక్పథంగల రచయితగా, ఓ విధమైన 'లీడర్ షిప్' గల వ్యక్తి. రా. వి. శాస్త్రికి ఒక ప్రత్యేకమైన శైలి వుంది. అది అవశ్యం వుండవలసిందే. అయితే — అతని రచనల్లో కనబడే శైలి రచనా వస్తువును మింగేసేటంత అధిక ప్రాధాన్యతతో కనబడుతుంది. పేజీలు తరబడి మితిమీరిపోయిన వర్ణనలు, సిమిలీలు, మాత్రమేకాక — పాత్రలచేత అతిగా మాట్లాడించడం కూడా ఈయన రచనల్లో తరుచూ కనబడుతూ వుంటుంది. నవలల విషయమేమోగాని— కథల్లో యిలాంటి ధోరణి బాధాకరంగా వుంటుంది. '' — A story should contain nothing that is superfluous. Evey thing that has no relation to it must be ruthlessly thrown away—' అన్న చెకోవ్ వాక్యాలు ఈ సంధర్భంగా మనం గుర్తుతెచ్చుకోవాలి.

ఇది యిట్లావుండగా—వ్యంగ్యంపేరిట రా.వి.శాస్త్రి పెట్టుబడిదారీ వ్యవస్థను పొగుడుతూ, సామ్యవాద వ్యవస్థను తిడుతూ చేయించే ప్రసంగాలు సాధారణ పాఠకులకు ఏదినిజమో, ఏది వ్యంగ్యమో తెలియని భ్రాంతి కలిగిస్తాయనీ కొందరు విమర్శకుల బాధ.

పైనచెప్పబడిన విమర్శలు రా. వి. శాస్త్రిగారు ప్రచురించిన ''బుక్కులు'' కథాసంపుటానికి కొంతవరకూ వర్తిస్తాయని నా అభిప్రాయం! 'మహాప్రస్థానం' లోని శ్రీ శ్రీ ''బుక్కులు'' గేయం అత్యంత ప్రసిద్ధం. అందులో శ్రీ శ్రీ ''కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ల, హీనంగా చూడకు దేన్నీ — కవితా మయమే

నోయ్ అన్నీ—'' అనిచెబుతూ, ''—గొట్టెముక్కా, అరటితొక్కా, బల్లచెక్కా, తలుపు గొళ్ళెం, హారతిపళ్ళెం, గుర్రపుకళ్ళెం, కాదేదీ కవిత కనర్హం—'' అనిఅన్నాడు. విషయాన్ని చెప్పడానికి శ్రీ శ్రీ ఇన్ని ఉదాహరణలు యిచ్చాడు గానీ—ఆ తరువాత ఇవన్నీ నిజంగా కథా వస్తువులు అవుతాయని అప్పట్లో అతను అనుకొని వుండడు. శ్రీ శ్రీ ఈ గేయం రాసిన చాలా కాలానికి రా. వి. శాస్త్రి ''బుక్కులు'' అనేపేరుతో ఒక కథాసంపుటిని వెలువరించి —అక్షరాలా ఇవే మకుటాలతో కథలు వ్రాసి, శ్రీ శ్రీకి అంకితంఇచ్చారు. మార్క్సిజమ్ ప్రభావం వలన మారుతున్న రచయితల దృక్పథాలకు దీన్ని ఒకఉదాహరణగా చెప్పుకోవచ్చు. అయితే—మకుటానికి తగ్గకథ సర్దుబాటు చెయ్యడానికి ప్రయత్నించడం,— కథాంశం దాదాపుగా లేకపోయినా 'సెటైర్ల'తో కథల్నిఅనవసరంగా పొడిగించడం వలనా రా.వి. శాస్త్రి గారి ''బుక్కులు''వారి యితర కథలకు గల ప్రత్యేకమైన స్థాయిని అందుకో లేకపోయింది—అనిపిస్తుంది.

ధనస్వాములు, పేదవాళ్ళు అనే వారు రెండువర్గాలనీ— ఈ వర్గాలమధ్యఅంతరంతొలగిపోవాలంటే క్రిందవాళ్ళపైకిరావాలేగాని, పైవాళ్ళు వారంతట వారు క్రిందకి దిగుతారంటే అది కేవలం ఒట్టి భ్రమ మాత్రమే అంటారు రా. వి. శాస్త్రిగారు ''షోకు పిల్ల'' (బాకీ కథలు) కథలో.

విదేశాలకు వ్యాపారపు పనిమీదవెళ్ళి, కొన్నాళ్ళువుండివచ్చిన రావుగారు స్వదేశం తిరిగి రాగానే అతని భార్య, కుమార్తె— డైనింగు టేబుల్ దగ్గిర చాలా అభియోగాలు తెచ్చారు. వీటిల్లో చాలభాగం 'నందూబేబీ' అనగా రావుగారి కుమారరత్నం మీదే— అనగా నందూబేబీ ఈమధ్య పిచ్చి ఎత్తినవాడిలా ''క్రేజీ'' గా సంచరిస్తున్నాడు. పతితులూ, భ్రష్టులూ, బాధాసర్ప సో అండ్ సో అంటున్నాడు. ''నెవర్ హెర్డ్ సచ్ ఎ రిగ్మరాల్ యిన్ మై లైఫ్''అంది మిసెస్ రావుగారు, భర్తతో— 'హాపెనీ టపెనీ ఫెలోస్' అందరూ కలిసి మీటింగు పెడితే నందూబేబీ వాళ్ళు వాడుకోడానికి రెండు కార్లు యిచ్చాడు. వాళ్ళతోబాటు సోషలిజమ్, ఈక్వాలిటీ, ఇలాంటి తప్పుడు మాటలంటున్నాడు. అంతటితో వూరుకున్నాడా— రావుగారు ప్రేమతో పెంచుకుంటున్న పిల్లిని రచయితల సభకు తీసుకు వెళ్ళాడు. తను చెడిందికాక— పిల్లిని కూడా చెడగొట్టాడు. ఆ పిల్లికాస్తా శాకాహారి అయికూర్చుంది. ఈ కారణా లన్నింటివల్లనూ నందూ బేబీ ప్రవర్తన హై సొసైటీలో తిరిగే వాళ్ళకు తలకొట్టేసుకున్నట్టుగా అయిపోయింది.

అయితే—పిల్లి నిజంగా శాకాహారి అయిపోయిందా?—నందూ బేబీ అచ్చంగా సోషలిస్ట్ అయిపోయాడా? — అబ్బే — ఏంలేదు సార్—రావుగారి కారు డ్రయివర్ సహాయంతో అన్నీ చక్కబెట్టేశారుగా, — నందూబేబీ మంచి మార్గానికి వచ్చేశాడు. పిల్లి మళ్ళీ మాంసాహారి అయిపోయింది. మైనగోరును వేటాడిమరీ తింటోంది. ఇదిచూచి రావుగారు చాలా సంతోషించారు. —''ఎంత శీవి!— ఎంత దర్జా! — వ్వాట్ ఎ టెరిబుల్ బ్యూటీ—ఆఫ్‌కోర్సు—పిట్టను చూచి బాధపడాలనుకోండి—'' అన్నారు రావుగారు. ఈ కథలోని సెటైరు గురించి మళ్ళీ వేరే చెప్పనవసరంలేదు.

—ఇలాంటి 'షుగర్ కోటెడ్ పిల్స్' రా. వి. శాస్త్రిగారి కథలన్నింటిలోనూ కనబడతాయి. మార్క్సిస్టు కథారచయితగా రా. వి. శాస్త్రికి తెలుగు సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానంవుంది. సమకాలీన తెలుగు కథా సాహిత్యంపై రా. వి. శాస్త్రి ముద్ర కనబడుతూ వుండడమే ఇందుకు తార్కాణం.

3

బీనాదేవిగారు రా వి. శాస్త్రికి నకలలాగా కనబడతారు స్థూలదృష్టికి. ఇద్దరి కథాంశాలూ ఒక్కటేకావడం, ఇద్దరూ రచనల్లో హాస్యాన్ని జోడిస్తూ సుదీర్ఘమైన వర్ణనలు చెయ్యడం ఇందుకు కారణం అనుకుంటాను.

''—ఆ వరండాలో గుండ్రబల్ల పెను పువ్వు బొడ్డులా వుంది. కాని, చుట్టూవున్న ఎర్ర ప్లాస్టిక్ కుర్చీలు ఆ పువ్వు రేకుల్లా వున్నాయి. దానిమీదవున్న నల్లగాజు కుండీ తెగబలిసిన తుమ్మెదలావుంది. —ఆ వరండా చివరని నిద్రబోతున్న బంట్రోతు బానిసలా వున్నాడు. నేలని హాలంతా పరిచివున్న రెడ్ కార్పెట్ రక్తపు మడుగులా వుంది—'' (థేంక్స్ ఫర్ ది పే. యస్. కథలో) అంటూ బీనాదేవిగారు చేసే వర్ణనలూ,

''—రాయీ, రప్పా, దుమ్మూ ధూళీ చెత్తా చెదారం మలం, మూత్రం, వీటన్నింటితోనూ రోడ్డంతా చాలా అసహ్యంగా వుంది. జబ్బులుపడి, చావులుచూసి, నెత్తుటితో తడిసి, యమ బాధలెన్నో భరించి, మరింత ప్రళయం వస్తేగాని విముక్తి లేదనుకొని, నిరాశచేసుకొని నీరసంగా, నిస్సత్తువుగా పడున్నట్టుంది ఆరోడ్డు. ఆరోడ్డు కిరుప్రక్కలావున్న ఇరుకుటిళ్ళన్నీ ఏనాడో చచ్చినట్టుగా వున్నాయి. ఆ యిళ్ళు ఆ తెల్లవారు ఝామున పాలిపోయిన ఆ చచ్చు వెలుగులో ''పంచభూతాల్లోమేమూ కలిసిపోతాం! దయచేసి పుణ్యాత్ములారా! మాకు నిప్పెట్టండి. లేదా— మమ్మల్ని కప్పెట్టండి—'' అంటూ, బిగుసుకుపోయిన చచ్చు కళ్ళు విప్పలేక ఏడుస్తున్నట్టుగావున్నాయి—'' ('రాజు—మహిషి' నవలలో) అంటూ రా. వి. శాస్త్రిగారు చేసే వర్ణనలూ, పాఠకులకు ఒకే విధమైన అనుభూతిని కలిగిస్తాయి

బీనాదేవి కథల్లో కొంతమందికి తెలియని—తెలిసినా పట్టించుకోని ప్రపంచం దర్శనమిస్తుంది. చావడానికి సిద్ధంగావున్న రోగుల దగ్గిరనుంచి డబ్బులు గుంజే 'ఉచిత' ఆస్పత్రి వైద్యులూ, వ్యభిచారానికి రక్షకులుగావున్న ప్రభుత్వ అధికారులు,— ఇంకా లారీ డ్రయివర్లు, క్లీనర్లు, కడుపు నింపుకోవడంకోసం మానాన్ని అమ్ముకునే బజారు బిడ్డలు.— కోర్టులు, పోలీస్టేషనులు, బార్లు— ''ఈ పాలికి పేసనుకి ఎల్లి తొంగోరా—'' అంటే హెడ్డుగారి

మాట కొట్టెయ్యలేక కేసుల్లెక్కకోసం జెయిలుకు పోయే ''వైరు'' గాడిలాంటి రౌడీలు— ''నీకేటన్నా నాయంగా వుందీ ? — ఊసులకీ నాగుంటలే, కేసులకీ నాగుంటలే — ఎదవముండకాడ ఎదురుబేరం గాడివి నీతో నాకేటి ఎల్లెల్లు—'' అంటూ 'ఎడ్డు' గారితో సరసాలాడే కంపెనీ ప్రొప్రయిటరిణి ముత్యాలమ్మ... ''ఈ రేతిరి సొకల్ది కోక ఎత్తుకుపోద్ది. కంసాలోడు సెవులివి తెంపుకు పోతాడు. డాట్రు దగ్గిరకెళ్లడానికి రేపుకూడా రెండు రూపాయలుండవు—'' అంటూ బాధపడే 'కంపెనీ సరుకు' ఆవేదనా... ఈమె కథల్లో మనల్ని పలకరిస్తాయి.

''డబ్బున్నవాడు ఖూనీచేస్తే డిఫెన్సుకి పోలీసువాడే పునాది వేస్తాడు—శవంమీద దెబ్బలే లేవంటాడు శవం డాక్టరు—'' అనే బీనాదేవిగారు —''సెడ్డోడి దవడపళ్ళు రాలగొట్టి — నేకపోతే ఆడు నిన్ను బతకనీడు. ఆడికాడ మంచికి నాబంనేదు. ఆడిఊదుతుడు! అదే నీమీద కెత్తుతాడు. —కాని, సెప్పే ముందు నువ్వే ఎత్తు — నీకు గులాం అవుతాడు—'' అంటూ ఈమె రచనల్లో మనకిచ్చే సందేశం మార్క్సిస్టు ఫిలాసఫీనుంచి పుట్టుకొచ్చిందే అని వేరే చెప్పనవసరంలేదు. అయితే—కొందరు 'ప్రాపగాండా' రచయితల్లాగా బీనాదేవిగారు తమసందేశాన్ని వాచ్యం చెయ్యరు.

అట్టడుగు సమాజంలోని జీవుల భుజంతట్టి మంచి రచనలు చేసిన రచయితల పేర్లు చెప్పేటప్పుడు కాళీపట్నం రామారావుగారి పేరు చెప్పకపోతే ఆ లిస్టు అసమగ్రం అవుతుంది. వీరి ''యజ్ఞం'', ''ఆర్తి'' కథలు చాలాకాలం జ్ఞాపకం వుంటాయి. ఏది న్యాయం ? ఏది అన్యాయం ? అనే విషయాలమీద మన ఆలోచనలను చాలాదూరం తీసుకుపోతుంది ''యజ్ఞం'' కథ ఒక దివాళా కొట్టిన షావుకారుకు వడ్డీలపై వడ్డీలు పెరిగిన బాకీకి ఒక బక్కరైతు చెల్లించ వలసివుంటే — న్యాయం బక్కరైతు పక్షాన్న వుండాలా ? దివాళాకొట్టి ఆర్థికంగా యిబ్బంది పడుతున్న షావుకారు పక్షాన్న వుండాలా ? అనే చిక్కు ప్రశ్నకు కథారూపం ఇందులో కనబడుతుంది. షావుకారు దయనీయమైన స్థితిలో వున్నాడు. నిజమే. అయితే, అతడికి రావలసిన వడ్డీలమీద వడ్డీని సమర్థించేది మానవత్వానికి చెందిన న్యాయంకాదు. పెట్టుబడిదారీ సమాజానికి చెందిన న్యాయం మాత్రమే అవుతుంది. పెట్టుబడిదారీ సమాజపు పతన కారణం ఆ సమాజంలోనే వుందన్న మార్క్స్ సిద్ధాంతాన్ని కళాత్మకంగా చెబుతారు ఈకథలో.

రామారావుగారి ''ఆర్తి'' కథకూడా బాగుంటుంది. అట్టడుగు సమాజానికి చెందిన ఒక అత్తా కోడలి తగువులో — ఆకలి కళ్లకు డబ్బుమాత్రమే ఎలా ముఖ్యమో మనకు తెలియబరుస్తారు రచయిత. ఆడకూలీలకు డిమాండు ఉండే సమయంలో కోడలిని తన యింట ఉంచుకోవాలని అత్త — పుట్టింటికి తీసుకుపోవాలని తల్లి, తగువు పెట్టుకుంటారు. ఇద్దరి ఆశా—ఆ మనిషి వల్లవచ్చే కూలిడబ్బులుమీద మాత్రమే. పేదరికం మనషుల హృదయాలమీదవేసే అవాంఛనీయమైన ముద్రను హృద్యంగా చెబుతుంది ఈ కథ. మన రచయితలు సెంటిమెంట్ల నుండి బయటపడుతున్నారనడానికి యిదొక ఉదాహరణ.

మార్క్సిజం ప్రభావం రచయితలను సెంటిమెంటల్ ధోరణి నించి తప్పించిందని యిదివరకే రాశాను. ఈ కారణం వల్లనే ఈ తరహా రచనల్లో భౌతిక వాద ధోరణులు అధికంగా కనబడతాయి. చాగంటి సోమయాజులుగారి ''ఎండ'' కథ గురించి ఈ సందర్భంలో చెప్పాలి.

ఎర్రి ఒక ముష్టిది. ఆమె అందం వగయిరాల గురించి ప్రస్తావన అనవసరం. వయస్సులోవుంది దానిని కొన్నాళ్ళు జట్కావాడు ఉంచుకుని వదిలేశాడు. వీధుల్లో అడుక్కుంటూ అప్పుడప్పుడు ''డబ్బులికి'' ముష్టివాళ్లకు శరీరాన్ని అప్పగిస్తూ కుష్ఠురోగి అయిన తండ్రికి వండిపెడుతోంది. కుంటివాడు ఎర్రిమీద కన్నేశాడు. పెర్మనెంటుగా అది తనతో వుండిపోతే బాగుండుననుకున్నాడు. ఎర్రికి కుంటివాడి మీద మనసే. అయితే—కుష్ఠురోగి తన కూతురు కుంటివాణ్ణికాక, గుడ్డివాణ్ణి చేసుకుంటే బాగుంటుందని అభిప్రాయ పడ్డాడు. ఈ విషయాన్ని ఖచ్చితంగా కూతురుతో చెప్పాడు కూడా.

''—సొట్టోడు ఏ గుమ్మ మెక్కినా మొహంమీద ఫెడీమని తలుపేసుకుంటారు. ఆడి మొకంచూస్తే ముష్టిపలకదు. ఆడు నిన్నట్టుకు తిరుగుతాడు. నిన్నాడికీ ఈడికీ కుదిరిసి ఆడు బతుకుతాడు —

—గుడ్డోడు మారాజు. ఆడి జనమకదేశాన. ఆణ్ణిచూస్తే జాలి పుడతాది... ఏ అమ్మ అయినా యిన్ని గింజలేస్తాది. ఇక నువ్వెక్కడికెళ్లినా ఆడు అడిగే వోడుకాడు. సూడరాడు ! — నీకు మనసయిందీ, యిష్టమొచ్చినట్టు తిరుగు — తఖరనేదు — ఏటంటావు ? —'' అన్నాడు తన 'సెలక్షన్' లోని ఆంతర్యాన్ని వివరిస్తూ —

''నానేటంటాను ?—'' అంది ఎర్రి.

'లైలా మజ్నూ' కథ కాదు — 'దేవదాసు' కథ అంతకన్నా కాదు — రోడ్డు ప్రక్క నికృష్ట జీవితాన్ని గడుపుతున్న ముష్టివాళ్ల వాస్తవ ప్రేమగాథ — పోతే, సెంటిమెంట్లులేని ప్రేమగాథ. వీరి 'బండపాట' కథలోకూడా ఇలాంటి దృక్పథమే కనబడుతుంది. ఒకప్పుడు ఇదే రచయిత రచించిన ''వాయులీనం'' వంటి కథలకు, వీటికీ వున్న తేడాసుచూస్తే రచయిత సెంటిమెంటలిజమ్‌నుంచి ఎంతగా బయటపడ్డాడో అర్థం అవుతుంది. ఈ విషయం రా. వి. శాస్త్రిగారి కథల విషయంలోకూడా వర్తిస్తుంది. ఆయన తొలి రోజుల్లో రాసిన ''జరీ అంచు తెల్లచీర'' వంటి కథలకూ నేడు వ్రాస్తున్న రచనలకూ మధ్యవున్న తేడాను గమనిస్తే ఇది అర్థం అవుతుంది.

మార్క్సిజం ప్రభావంవల్ల సాహిత్యంలో భౌతికవాద ధోరణి బాగా చోటు చేసుకుంటున్నదన్నమాట వాస్తవమే. అయితే—భౌతిక

వాద ధోరణి కనబడే రచనలన్నీ మార్క్సిస్టు రచనలు అనుకోడానికి కూడా వీలులేదు. ఉదాత్తమైన, శాశ్వతమైన, విలువలకు సాహిత్యంలో స్థానం తగ్గిపోతున్నదన్న 'గొణుగుడు' ఇవాళ సాహితీ ప్రపంచం అంతటా కనబడుతోంది. ''డిరెక్టర్స్ రెస్పాన్సిబిలిటీ'' అనే రచనలో ''జె. డొనాల్డ్ ఏడమ్స్'' అనే ఆయన—

''— మన యువ రచయితలు ప్రేమ, గౌరవం, దేశభక్తి, ప్రభుభక్తి మొదలయిన నమ్మకాలను ప్రశ్నించడం ఆరోగ్యకరమైన విషయమే—కాని, వాళ్ళు నాటిపై అపనమ్మకాన్ని వ్యక్తంచేసి, ఆ లక్షణాలనే త్రోసి రాజంటున్నారు—'' అని అన్నారు.

ఈ విధమైన ధోరణిలో గాక, ఒక నిర్దుష్ట ప్రయోజనంతో మార్క్సిస్టు సాహిత్యంలోని భౌతికవాద దృక్పథం పీడితులకు, తాడితులకు, ఆశాజ్యోతి అవుతున్నది. అందువలన దీనిగురించి బాధపడవలసిన అవసరంలేదు.

సాహిత్యంలో భౌతికవాద ధోరణుల గురించి అభిప్రాయాలు ఎలా వున్నప్పటికీ—మార్క్సిజమ్ ప్రభావంవల్ల సాహిత్యంలో చోటు సంపాదించుకున్న అట్టడుగు సమాజం అవాస్తవికమైంది అనగల శక్తి ఎవ్వరికీ వుండదనుకుంటాను. పిచ్చేశ్వరరావు, భూషణం, బొల్లిముంత శివరామకృష్ణ, అవసరాల సూర్యారావు, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, నగ్నముని మొదలయిన వారందరి రచనల్లోనూ ఈ వాస్తవికత ఒక్కో కోణంలో కనబడుతుంది.

''నగ్నముని'' బీదల దయనీయ గాథల్ని మండే గుండెల్తో హృదయాలు కదిలించేలా చెబుతారు. వీరి కథల్లో ఆకలితీరక అర్ధరూపాయికి, ఒక్క రొట్టె ముక్కకి మానాన్ని అమ్ముకునే అభాగినులు కనబడతారు. సంసారం గడుపుకోలేక కాబూలీల విష వలయాల్లో చిక్కుకుని, వాళ్ళ బాకీలు తీర్చలేక భయంతో బిక్కచచ్చిపోతున్న సాధారణ మధ్య తరగతి జీవులు కనబడతారు. అడుక్కుతినే ముష్టివాళ్ళు, వాళ్ళపై యాజమాన్యం చేసే రౌడీలు కనబడతారు.

''బస్సుల్లో ఎలకలు—సినిమాహాళ్ల ముందు ఎలకలు—పంది కొక్కులు — చుంచెలకలు — చిట్టెలకలు — బజారునిండా 'ప్లేగ్' ఎలకలు'' (ఎలక్కన్నం కథలో) అంటూ ఈ కుళ్ళు వ్యవస్థపై తిరగబడలేని ప్రజలమీద కసిని, చికాకును ప్రదర్శిస్తారు రచయిత ఈ కథల్లో.

ఆవేశం పాలు ఎక్కువ కావడంవల్ల రచయిత రచనా శిల్పం పట్ల, మర్యాదలపట్ల, ఎక్కువ శ్రద్ధ చూపరు —

''ఇన్నేళ్ళుగా పొట్టల్ని బానల్లాగా పెంచుకున్న వాళ్ళు ప్రజలందర్నీ ఇది ప్రజల ఉత్సవమని నమ్మించడానికి నానాయాతనలు—పడుతున్నారు. రేడియోలోసందేశాలు వాంతులు చేసుకుంటున్నారు. సాధించిన అభ్యుదయాన్ని వర్ణిస్తూ పత్రికల్లో వుచ్చలు పోసుకుంటున్నారు—'' ('సంఘ విద్రోహక శక్తులు' కథలో) అంటూ రచయిత స్వాతంత్ర్య దినోత్సవాన్ని వర్ణించినా,

''— ముష్టిముండలకి మానం వుండదు కాబట్టి, చళ్ళు వుండవు కాబట్టి, వాటిమీద బట్టలు వుండవలసిన అవసరంకూడా లేదు కాబట్టి — వాళ్ళ వంటిమీద గుడ్డ అనుకునేదేమీ లేదు—'' అంటూ ముష్టివాళ్ళను వర్ణించినా, (ముష్టివెధవలు కథలో)

— రచయిత ఆవేశమే మనకు కనబడుతుంది.

''— పొట్టల్లో కసిక్కున కత్తులు దింపితే
పేగులు బయటకు రావాలి
శతాబ్దాలుగా కన్నీళ్లతో తడిసిన నేలంతా
రక్తం చిమ్మాలి—'' ('తూర్పుగాలి' కవితా సంపుటిలో)

— అనే నగ్నముని కథల్లో నిహిలిస్ట్ ధోరణులు ఎక్కువగా వుంటాయి.

'బూతు' అనేది దగాపడిన తమ్ముళ్ళకు ఈ దోపిడీ వ్యవస్థ సాంస్కృతికంగా యిచ్చిన వారసత్వం —''[8] అని ఆయన అంటారు కాబట్టి—ఇందులో 'సభ్యత' 'అసభ్యత'అనే దాన్నిగురించి ఆలోచించడం అనవసర ప్రయాస.

ఇక—పిచ్చేశ్వరరావుగారు గొప్ప తెలుగు కథకుల్లో ఒకరు. వీరు రాసిన కథలు తక్కువ. వాటి నిడివి కూడా బాగా తక్కువ అయితేనేం—వాటి సాహిత్య విలువలు ఎంత మాత్రమూ తక్కువ కావు. పిచ్చేశ్వరరావుగారు రచించిన ''నెత్తురుకథ'', ''బ్రతకడం తెలియనివాడు'', ''ఆగస్ట్ 15'' మొదలయిన కథలన్నీ కమ్యూనిస్ట్ ఉద్యమ ప్రభావంగా వచ్చినవే. ''ఆగస్ట్ 15'' నిజమైన స్వాతంత్ర్యం అంటే ఏమిటో దానికోసం పోరాటం ఎలా జరగాలో చెబుతుంది.

ఇతని కథలు అర్థం కావడం కొంచెం కష్టం. 'నెరేషన్' చాలా తక్కువగా వుంటుంది. కుటుంబరావుగారు వీరి 'నెత్తురు కథ' గురించి చెబుతూ— ''—అయిదు పేజీలు పూర్తిగాలేని ఈ కథలో ఒక జీవితమే కాదు, ఎంతో చరిత్ర లిఖించి వున్నది —'' అన్నమాట, పిచ్చేశ్వరరావుగారి ఈ కథకు మాత్రమే కాదు—అన్ని కథలకూ వర్తిస్తుంది. '47 — '50 ప్రాంతాల్లో పోలీసుల ''అహింసా'' తుపాకులు కమ్యూనిస్ట్ ఉద్యమాన్ని ఎంత క్రూరంగా అణచివేశాయో ఈ కథలు చదివితే తెలుస్తుంది.

మార్క్సిస్టు దృక్పథంగల కథా రచయితగా బొల్లిముంత శివరామకృష్ణగారు ఒక తరం పాఠకులకు సుపరిచితులు. వీరు రచించిన ''ప్రతిఫలం'' ''పేదరికం'' ''పాలేరు'' మొదలయిన కథలన్నింటి వెనుకా వున్నది వర్గసంఘర్షణే. అయితే, ఈ సంఘర్షణ కథను పాఠకుల ముందుంచడంలో కొన్ని సందర్భాలలో ప్రాపగాండా ధోరణికి వెళ్లిపోవడం కూడా ఈ రచయితలో మనకి కనిపిస్తుంది. 'ఎర్ర దెయ్యాలు' అనే కథలో 'ఎర్ర దెయ్యం' గురించి ఒకమంత్రి వర్యుడిచేత ఇలాంటి ఉపన్యాసం ఇప్పిస్తారు —

“— ఎర్రదెయ్యం చాలా గడుగ్గాయి. మొండిది. వాయు వేగ మనోవేగాల కంటే జోరుగా ప్రపంచాన్ని అల్లుకుపోతుంది ... ఇది ప్రవేశించిన వెంటనే సరసరానా అల్లుకుపోతుంది...ఆ తర్వాత తుపాకులకు కూడా లొంగదని బుజువయిపోయింది. అందుకే అమెరికావాళ్ళు ఆటంబాంబు నల్లా అట్టేపెట్టుకుని మార్షల్ ప్రణాళికను ప్రయోగిస్తున్నారు. — ఇది ముఖ్యంగా బక్కచిక్కిన వాళ్ళల్లోను, రక్తంలేని బలహీనుల్లోనూ త్వరగా ప్రవేశిస్తుంది — వాళ్ళల్లో ఈ భూతాన్ని ఎదిరించగల దార్ఢ్యత వుండదు —” ఇట్లాంటి సెటైర్లకు వీరి రచనలో కొదవలేదు.

ఇక—“భూషణం”గారి విషయం తీసుకుంటే వీరి “అడివి అంటుకుంది” కథా సంపుటంలో చాలా మంటలు కనబడతాయి అమాయకులయిన కొండవాళ్ళమీద దౌర్జన్యాలు, పోలీసులు, పోలీసుల వేషాల్లో వచ్చిన నకిలీ పోలీసులు చేసే రాక్షస కృత్యాలు, జలగల్లాంటి షావుకార్లు, వాళ్ళ వడ్డీలు, గిరిజన కార్పొరేషన్‌లో జరిగే అక్రమాలు—ఇవన్నీ ఈ కథల్లో శ్రీకాకుళంజిల్లా మాండలికంలో రాశారు భూషణంగారు “అడ్డెడు ఉప్పు అప్పుగాయిచ్చి పల్లపుభూముల్ని రాయించేసుకున్నారు. పాయిదాల క్రింద జొన్నలు, కందులు, చింతపండు, మొదలయిన అడివి దినుసంతా పల్లానికి దించి, పట్నాలకి పంపి పెద్దగా లాభాలు పోగుచేశాడు —”అంటూ రచయిత యిందులో చెప్పే షావుకారి కథ — శ్రీకాకుళం జిల్లాలో **పచ్చి నిజం.**

ఇలా చూసుకుంటూపోతే ఎంత లిస్టయినా కనబడుతుంది. అయితే — ఈ సందర్భంగా కొన్ని మాటలు చెప్పవలసి వస్తుంది. పైన చెప్పబడిన లిస్టు ఓ విధంగా అసమగ్రం. ఈనాడు ఎంతో మంది ‘కమిటెడ్’ దృక్పథంతో రచనలు చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం — సాహిత్యంపై ముఖ్యంగా యువ రచయితల రచనలపై మార్క్సిజమ్ ప్రభావం పెరుగుతున్నది. అయితే, ఈరచయితల్లో చాలామందికి అటు మార్క్సిజమ్ గురించి సరియైన అవగాహన గాని, ఇటు ప్రపంచ జ్ఞానంగాని చెప్పుకోదగ్గవిగా వుండటంలేదు. అందుచేతనే, ఈ తరహా రచయితలు అట్టడుగు సమాజాన్ని చూపిద్దామని ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ — ఆ రచనలు కృతకంగానూ, పేలవంగానూ, కనబడుతున్నవి. ప్రాపగాండా ధోరణిలో చేయబడిన ఈ రచనలు పాఠకులను చైతన్యవంతం చేయలేవు సరి కదా విసుగును కూడా కలిగిస్తాయని నా అభిప్రాయం. ప్రపంచంలో నేడు మారుతున్న పరిస్థితులదృష్ట్యా సాహిత్యంపై మార్క్సిజమ్ ప్రభావం నిర్మాణాత్మకంగా వుండాల్సిన అవసరం వుంది. ఆ పని జరగాలంటే రచయితలు అతి సామాన్యుడికథను ఇంకా సునిశితంగా పరిశీలించాల్సి వుంది —

“—జీవితంలో విప్లవ వాస్తవికతను పరిశీలించడం విప్లవ రచయితల పని. అది శ్రీకాకుళంలో గిరిజనులకు కనిపించినంత స్పష్టంగా అందరికీ అందదు. కాని—శాస్త్రవేత్తలు విలువయిన ఖనిజాలను,మణులను, అన్వేషించినట్టుగా రచయితలు తమచుట్టూ వుండే జీవితాల్లోని వాస్తవికతను అన్వేషించాలి. వజ్రాలకన్న విలువ గలది ఈ విప్లవ వాస్తవికత. దాని అన్వేషణ సాగినకొద్దీ బలమైన విప్లవ సాహిత్యం వస్తుంది. అన్వేషకులు ఈ వాస్తవికతను అది పుష్కలంగా లభించే చోటునే—అట్టడుగు జీవితాల్లో అన్వేషించాలని వేరే చెప్పనవసరం లేదు. మణుల కోసం ఎడారుల్లో వెదుకరు—” 9

— ఆ మణులను చేత బుచ్చుకున్న తర్వాత, —

“— చలిచే ఆ
కలిచే
విలపించే
ముష్టివాని రెక్కల మీదికి సం
తుష్టి కొరకు చింకిగుడ్డ
జీవన హేమంతపు చలి క్రాగగ
కప్పుటకు ఒక గీతం—”10

— కవులు రచిస్తే, — కథకులు కూడా చలిమంటకు వం కొన్ని సమిధలు చేరుస్తారు.

— శుభం —

అథోజ్ఞాపికలు

1 On Literature—Maskm Gorky
2. Writer's Note book.
3. అనువాదం—శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు.
4. అక్షరాభిషేకం—శ్రీ గొల్లపాటి వెంకట సుబ్బయ్య.
5. తెలుగు స్వతంత్ర—1949, సెప్టెంబరు 9.
6. రచయిత,—విలువలు, బాధ్యతలు, దృక్పధాలు.
7. ‘భూతభవిష్యత్తులు’ కధాసంకలనం ముందు మాటలో
8. — ‘భారతి’, జూన్ ‘70.
9. ‘విప్లవవాస్తవికత’ అను వ్యాసంలో (సృజన) కుటుంబ రావుగారు.
10. — నారాయణ బాబు గీతం.

తుఫాను బాధితులకు సహాయము - కృష్ణాజిల్లా

ఒక విజ్ఞప్తి

కృష్ణాజిల్లా తుఫాను బాధితుల సహాయార్థము దుస్తులు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, మందులు, ఆహార పదార్థములు, గృహోపకరణములు, గృహనిర్మాణ సామగ్రి, టార్పాలిన్లు మొదలైనవానిని వ్యక్తిగతంగాను, స్వచ్ఛందంగాను, సంస్థాపరంగాను ఉదారముగా యివ్వదలచిన వారు, సరియైన సూచనలకు, సక్రమ పంపిణీ జరిగేందుకు గాను విజయవాడ సబ్‌కలెక్టరు వారి కార్యాలయంలో మకాంచేసియున్న, తుఫాను రిలీఫ్ సప్లయిస్ ప్రత్యేకాధికారిని సంప్రదించ వలసిందిగా కోరబడుచున్నారు.

సామగ్రి మొదలైనవానిని వ్యక్తిగతంగాను, సంస్థలద్వారాను బాధితులకు స్వయంగా పంపిణీ చేయదలచినవారుకూడా ఈ క్రింది సంతకపుదారుని సంప్రదించిన యెడల పంపిణీ కార్యక్రమంలో పునరుక్తిని నివారించడమే గాక ఒకే ప్రాంతంలో యిది కేంద్రీకరింపబడకుండా చూడబడి, బాధితులందరికి అన్ని ప్రాంతములలో సమానంగా పంపిణీచేయుటకు అవకాశం వుంటుంది.

స్వచ్ఛంద సేవాసంస్థలను ప్రత్యేకంగా కోరేదేమనగా వారు ఈ క్రింది సంతకపుదారుని సంప్రదించి ఒకటి రెండు గ్రామాలను దత్తత స్వీకరించి, తుఫాను బాధితులకు వెంటనే నివాస వసతికి తాత్కాలికచర్యగా కమ్యూనిటిహాల్సు నిర్మించవలసిందిగా కోరడమైనది.

ఉ. 8-30 నుండి రా. 8-30 గం. మధ్య ఫోన్ నెంబరు 62290 తోనూ
ఇతర సమయములలో ఫోన్ నెంబరు 61152 తో సంప్రదించగలరు.

బి. దానం, I. A. S.,
స్పెషల్ ఆఫీసర్, సైక్లోన్ రిలీఫ్ సప్లయిస్.

విజయవాడ.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధశాఖ డైరెక్టరుచే ప్రకటితము.

No. A 28/77-78

కలగూరగంప

దక్షిణకోరియా ప్రజాకవి కిమ్ ఛీహా :

''ఈ సజీవమైన అగ్నిపర్వతం ప్రేలుతుంది ఒకరోజు— విప్లవ సమారంభంలో...'' అని ప్రజాకవి కిమ్ ఛీహా దక్షిణ కోరియా నియంత పార్క్ ఛుంగ్ హీని హెచ్చరించి తన దేశంలోని ప్రజాపోరాటానికి స్వరంగా నిలిచాడు. తన 600 పంక్తుల పెద్ద కవితద్వారా ''ప్రజాఘోష''ను ప్రతిధ్వనించి యావజ్జీవ కారాగార శిక్షకింద గోడల వెనక ఊపిరి పీలుస్తున్నాడు. విప్లవ క్యాథలిక్ కవిగా పేరు పొందిన కిమ్‌ను కమ్యూనిస్టులతో కుట్రపన్ని రాజ ద్రోహానికి పాల్పడ్డాడనీ తొలుత మరణదండన విధించారు. ఆ తర్వాత అంతర్జాతీయమైన రాజకీయ వొత్తిడికి, మేధావుల విజ్ఞప్తులను పురస్కరించుకొని ప్రభుత్వం విడుదల చేసింది.

కాని మరుసటి నెలలోనే కిమ్‌ను తిరిగి నిర్బంధించారు. అతను 'సియోల్' వార్తాపత్రికలో ప్రభుత్వ వ్యతిరేకమైన వ్యాసం ప్రచురించాడని, కమ్యూనిస్టులు,—క్యాథలిక్‌లు కలసిపన్నిన కుట్రలో భాగస్వామి అని 1974నుంచి విచారణ తంతు జరుపుతూవుంది పార్క్ ఛుంగ్ హీ ప్రభుత్వం.

కిమ్ రచించిన కవితలు అతని నిజాయితీని, ఆవేదనను వ్యక్తం చేస్తాయి. అతని మానసిక సంఘర్షణను మన ముందుకు ఈ కవిత ఇలా తీసుకవస్తుంది.

చంద్రుడు మునిగి తేలుతూ :

నిద్రలేచి బయలుదేరాను
చంద్రుడు మునిగి తేలుతూవుండే
అంతులేని మబ్బుతునకలా.

హఠాత్తుగా ఉదయమే లేచిన
మంచుతెర గుండా
కళ్లు తెరచి బయలు దేరాను
ఆకాశంలో ధగధగ మంటున్న
దూరపు మబ్బుతునకలా !

కాని ఈ చీకటి కొట్టంలో నేను
ఒకటి—రెండు అనేక బంధనాలమధ్య
జీవిస్తూనే వున్నాను నేను
జీవితానికి బందీనై
డబ్బుకు — భార్యా పిల్లలకు,
కొండల మధ్యనున్న చీకటి సందులకు
కిందుగా ప్రవహించే నీటికి
బందీనై బతుకుతున్నాను...

మబ్బులు—ఎన్నో మబ్బులు
రాత్రి ఆకాశంలో మబ్బులు.

కిమ్ విచారణ తంతు మరీ విచిత్రంగా వుందన్న విషయాన్ని గత సంవత్సరం వార్తాపత్రికలు ప్రకటించాయి. సియోల్ జిల్లా కోర్టులో ముగ్గురు జడ్జీల ఎదుట కిమ్ తరపు న్యాయవాది, అతని తల్లి—భార్యలను మాత్రమే అనుమతించి సాక్షులను ప్రశ్నిస్తున్నారు.

35 సం. ల వయస్సుగల కిమ్ ఉత్తర కోరియా కమ్యూనిస్టు ప్రభుత్వానికి సహాయపడ్డాడని, వందమంది మతగురువులు, మేధావులు, రచయితలను కలిపి కుట్రకేసు బనాయించింది. అయినా ''మట్టిని తన్నే ఈ చేతులకిందుగా, అవిరామంగా నిశ్శబ్దంగా క్రోధాగ్నిని విరజిమ్మే సముద్రం ఒకరోజు హఠాత్తుగా విరుచుక పడుతుంది '' అనే ఆత్మవిశ్వాసంతో జైల్లోనే కవితలు రచించాడు. అతను వైవిధ్యంగల కవితలు రచించాడు—నిదర్శనంగా—

రేపటి వధువు :

ఒంటరితన మనిపించినపుడు
ఒక్కసారి అరచిచూడు
బాధల్లో మాత్రం
కన్నీళ్లు రానేరావు !
రేపటి వధువు
ఫ్యాక్టరీనుంచి రాత్రి తిరిగివస్తున్నది
కన్నీళ్లలోంచి—నిట్టూర్పులలోంచి.

నీ గొంతు విప్పుకోనీ!
పాటలు మార్మోగనీ!
నువ్వు పద్దెనిమిది సంవత్సరాల యువతివి
వెడల్పాటి అరచేతులు
మొరటైన నోరు—లావైన నడుము
నువ్వే రేపటి వధువువు.

సైనిక నియంతల పాలనలో కవులు—రచయితలు, ప్రజాస్వామిక విలువలను కోరే పౌరులు ఎన్ని హింసలకు గురవుతున్నారో కిమ్ చరిత్ర కళ్లముందు నిలుపుతుంది. విద్యార్థులను, యువకులను, క్రైస్తవులను పార్క్ నియంత పాలనకు వ్యతిరేకంగా సమీకరించాడనే నేరం ఒకటి వుంది. దానితోబాటు అతను జైల్లో రచించిన కవితలు కూడా సైనికాధికారులకు సాక్ష్యాధారాలయినాయి తిరిగి మరణదండన విధించాలనే ప్రయత్నం కనపడుతూ వుంది.

తన స్వంతకాళ్లపై భూమిపై నిలుచోవాలనే నేరానికి, దారిద్ర్యంలోంచి దూసుకుని అందరికివినపడాలనే నేరానికి, ఆలోచనల్లో

కాలాన్ని వ్యర్థం చేసిన నేరానికి, నిర్భయంగా ఆకాశంవైపు చూస్తున్నాడనే నేరానికి, స్వేచ్ఛగా గాలిపీల్చి తన బొమ్మ విరిచాడనే నేరానికి కిమ్‌లాంటి విప్లవ ప్రజాకవులు నియంతల పాలనకింద శిక్షలు అనుభవిస్తూనే వున్నారు. అయినా ఆ కవుల కలం ఆగదు—కొన ఊపిరిదాకా ఎలుగెత్తి ఇలా ఘోషిస్తూనే వుంటుంది.

గదిలో చావు ఎదుట :

ఇంటికి తిరిగిపోయే మాటేలేదు
ఒక్కసారి కాస్సేపు
ఈ తెల్లని మత్తు నిద్రలాంటి గదిలో
ఒక్కసారి జోగినా
అది అంతంలోకి మత్తులోకి
బరువైన చీకటి నిద్రలోకి
వెళ్లిపోడమే
ప్రతి ఎముకను కొరికే మత్తులోకి !

ఒక్కసారి నువ్వు జోగినా...
మరు భూములగుండా
పయనించే యాత్రికుడిలా...
గదిపై కప్పుపై రాత్రంతా
భారంగా అడుగుల చప్పుడు.

వెనక్కీ—ముందుకీ—
గుర్తులేని ముఖంలేని నవ్వు
పైనుంచి వెక్కిరిస్తూ గీరగా !

ఆ తెల్లని గది
అడుగులేని జోగే గది
చేతిగోళ్ళు వొలిచేసినప్పటి యాతన
పగిలిన కండరాల జివ్వుమనే బాధ—
యాతన—బాధ—నొప్పి—వేదన
అన్నీ జీవితాంతం జీవిస్తున్నాయి
అది అంతంలేకుండా !

రూపుమాసి ఎక్కడికో ఎగిరిపోయిన
కామ్రేడ్స్,
తన్నులు తిని, అవమానం చెంది
యమయాతనలు అనుభవించి
నిద్రలోకి జారిపోయిన కామ్రేడ్స్
జీవించినపుడు ప్రాణాలు పోసిన నవ్వులు
జీవితంతో వీరోచితమైన పిలుపు

—నిఖిల్

కవి - విమర్శకుడు

బండి నాగరాజువారి లేఖ, శ్రీ పాకల వెంకట కృష్ణయ్యగారి వ్యాసం చదివిన తరువాత, నా అభిప్రాయాలను స్పష్టపఱచేటందుకు ఈ లేఖ వ్రాయుచున్నాను. అహంకారమన్నది ఒక దుర్గుణమని, అది ఉభయత్రా పరిత్యజనీయమని, శ్రీ వెంకటకృష్ణయ్యగారంటే, కవిలో అది శోభాయమానమని శ్రీ నాగరాజుగారు అభిప్రాయ పడుతున్నారు. ఇది వివాదాస్పదమైన అంశం. విజ్ఞులు తమ అభిప్రాయాలను వెల్లడించగలరని ఆశిస్తున్నాను.

అయితే కవి అన్నవాడు రజోగుణ సమన్వితుడే కావాలా ? సాత్త్విక గుణసంపన్నులు కవులు కాలేరా ? కవికి ఒక్క అహంకారమే సరిపోతుందా ? ఆత్మసమన్వయము, ద్వంద్వాతీతరహితము, నిర్గుణోపాసకత్వము గల మహాకవులు లేరా ? ఒట్టి రజోగుణ సంభూతమై అహంకారత్వాన్ని వెల్లడించేవి, తన స్వంత డబ్బా వాయించుకోవడం వంటివి కవిత్వాలైతే, పరస్పర నిందారోపణలు చేసిన పాతకాలపు చాటువులు, తమ్ము తాము పొగుడుకొంటూ రచించిన శతకాలు, మున్నగునవి మహా కావ్యాలు కావాలి. అందుకు, ఫలాని కంపెని వారి సబ్బునే వాడండి వంటి ప్రకటనలు కూడా, కవిత్వంలోనికి తీసుకొని రావాలి. (ఎన్నో ప్రకటనలలో, సుందరమైన భాష కూడా వుంటుంది. నేరోలాక్స్ రంగు ప్రకటన చదవండి.) అయితే ఇవి ఎ.ది కాలాలబాటు నిలిచే వంటి కవిత్వాలు కావు. కవిలో ఆత్మవిశ్వాసం వుండాలి కానీ అహంకారం అతనికి ముప్ప తేగలదు.

విమర్శకునిలో అహంకారం వుండి తీరాలని నేను చెప్పలేను. విమర్శకునిలో వుండినా భరించవొచ్చేమోగాని, కవిలో వుంటే, అది అతని పురోగమనానికి అడ్డువాటిల్లుతుందని నేను భయపడుతున్నాను. కవి మహా తేజస్వి. ముందు రాబోయే తరాలకు దీవిటి వంటివాడు. జ్ఞానాన్ని, సత్యాన్ని నిరంతరంగా అన్వేషించేవాడు. సమాజంనుండి ఏ ప్రతిఫలాన్ని ఆశించక, కేవలం కవితా వ్యాసంగమే తన ధ్యేయంగా, నిరంతర జ్ఞాన సముపార్జనలోను, ఆ జ్ఞానాన్ని పదిమందికి పంచిపెట్టే మహత్తరమైన కృషిలో మునిగి వుండేవాడు. అటువంటి మహా తేజస్వి, అహంకారానికి బలియై, 'నన్ను మించిన కవి ఎవడు' వంటి వ్రాతలు మొదలు పెడితే, జరిగే సంక్షోభం మీరే వూహించుకోండి.

విమర్శకుని నేను సమర్థించి, కవిని నిరాకరిస్తున్నానని ఒక ఆరోపణ. బహుశా నేను ముందువ్రాసిన లేఖలో నా అభిప్రాయాన్ని స్పష్టపఱుపలేకపోయాను. కవి, విమర్శకుడు ఇరువురూ పూజ్యులే. ఇందులో కవి పూజ్యుడేకాక, మహత్తరమైన బాధ్యత గల వ్యక్తి. అటువంటి వ్యక్తి సోత్కర్షలోబడి, తన బాధ్యత మరచిపోరాదనే, ఆవేదనే, నన్ను కవిని అహంకారి కాకూడదని హెచ్చరింపజేసింది.

అంతేకాక, కవి ఒకడు. విమర్శకులు వేనవేలు. ఒక్క కవిత్వానికి వందల వ్యాఖ్యానాలు. ఒక్క రామాయణం. దానికి వచ్చిన

వ్యాఖ్యలు, విమర్శలు లెక్కలేవు. దీన్నిబట్టి చెప్పేదేమంటే, ఏదో ఒక్క విమర్శకుడు పొరబడో, కావాలనో, అహంకారంగా ప్రవర్తించి ''కవి మనసును గాయపరచి'' తన ''బాధ్యత'' విస్మరించినా, కవి యొక్క నిజమైన 'సత్తాను' మరో విమర్శకుడు ప్రదర్శింపగలడు. తద్వారా సాహితీ సమరాంగణంలో చర్చ జనిస్తుంది. ఇది సాహిత్యానికి తోడ్పడుతుంది. కానీ ప్రథమంగా కవే అహంకారియై కూర్చొంటే, అది పురిటిలోనే సంధి కొట్టడం వంటిది కదా!

ఇటీవల ఎంతోమంది యువకవులు, ఈ పంథాలో పడ్డారు. తమను విమర్శించే వారంతా అభివృద్ధి నిరోధకులని, సంఘ విద్రోహులని జమ కడ్తారు. సిద్ధాంత రీత్యా ఇది సహజమని సరిపుచ్చుకొన్నా, తమ అసమర్థతను ఈ కవులు, విమర్శకునికి ఏవో పదాలు అంటపెట్టడం ద్వారా కప్పిపుచ్చుకోవచ్చు. కాబట్టి సత్కవితకు విమర్శ అవసరం. కాని విమర్శ ఈ పంథాలోనే వుండాలి. విమర్శకుడు విధిగా కవి సిద్ధాంతాలను, కవి పద్ధతులను, కవి వాడిన రీతులను సమర్థించాలి. లేకపోతే, ప్రజాకవితకు ద్రోహంచేసే వ్యక్తి ''పాతకాలపు రాతలకు సమర్థించేవాడు'' అన్న సిద్ధాంతం తెలుగు సాహిత్యానికి దారుణ నష్టం వాటిల్లజేస్తుంది.

[అప్రస్తుతం అనుకోకపోతే ఒక సంఘటన మనవిజేస్తాను. ఇటీవల మా విశ్వ విద్యాలయంలో జరిగిన సదస్సులో ''మావో సిద్ధాంతాలను'' గురించి ఒక విద్యార్థి వ్యాసం చదివాడు ఆ వ్యాసంలో ''ఎన్నో తప్పులేకాక, మావోను గురించిన స్పష్టమైన అవగాహన లేమితనం స్పష్టంగా గోచరించింది. ఎంతసేపు మావోను ఒక దేవుడుగా పొగడడం మినహాయించి, మావో విధానాలపై సిద్ధాంతిక చర్చ లేకపోయింది. నేను ఆ వ్యాసాన్ని విమర్శిస్తూ మావో సిద్ధాంతంపై చర్చలేవడానికి యత్నించాను. ఆ విద్యార్థి కోపంగా మీరూ మావోను ''విమర్శిస్తున్నారే'', ''కమ్యూనిష్టు వ్యతిరేకులు''. యువకులకు శత్రువులు, అని ఏమేమో పల్కి సభాత్యాగం చేసాడు. మన సాహిత్యంలో యిటువంటి చిన్న పిల్లల మనస్తత్వంకల యువ కవులు ప్రవేశిస్తే అది ఎవరికి శోభ. అటువంటప్పుడు విమర్శ కొద్దిగా ఘాటుగావుంటే తప్పు లేదనుకొంటా.]

ఇకపోతే భాషపై చర్చ. ఈనాడు కవిత్వంలో వాడబడే భాషకు పాతకాలపునాటి వ్యాకరణ సూత్రాలు పనికిరావని. ఇది ఒక అభిప్రాయమే కాని, సర్వాంగీకృతమైన సిద్ధాంతం కాదు కదా! దీనికి విరుద్ధమైన భావం కలవారు ఛంధస్సు ముఖ్యమైనదన్న అభిప్రాయమున్నవారు వున్నారు. వారు తమ అభిప్రాయాలను వెల్లడిస్తారు. దానికి వారిని ద్వేషించలేము కదా!

ఎప్పుడిదో చిన్నయ సూరి వ్యాకరణ సూత్రాలు మాకెందు కంటగడ్తారనే వారు, ఏనాటిదో అయిన రామాయణాన్ని ఈకాలపు మార్క్సిష్టు దృష్టిలో చూడటంలేదా! దానికి వారిని విమర్శించడమూ తప్పే. ఎవరెవరి అభిప్రాయాలు వారి వారివి. ఈ అభిప్రాయ భేదం సాహిత్య పురోగమనానికే దారి తీస్తుంది. కాని దేనికైనా ఒక స్థాయి అన్నది అవసరం. స్థాయిలో లేకపోతే ఎవరూ ఖాతర్ చేయరు అన్నారు నాగరాజు. అది తప్పు, విమర్శకాని ప్రతి విమర్శ కాని ఒక స్థాయి నుండి దిగజారరాదనే ఆవేదన కలవారు చాలామంది వున్నారు. కీ॥ శే॥ విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షంపై విమర్శ, పునర్విమర్శ ఎంత క్రింది స్థాయికి చేరిందో అందరికీ తెలుసు. అప్పటి సంపాదకులే, దీనిపై తమ ఆవేదనను వ్యక్తపరచారు. సాహిత్యంలో 'స్థాయి'ని పెంచడానికి అటు కవి, యిటు విమర్శకుడు యిద్దరూ పాటుపడాలి.

నా లేఖలో కొన్ని తప్పులు శ్రీ నాగరాజు సరిదిద్దారు. దానికి కృతజ్ఞుడను.

---

1. ఈ 'బాధ్యత' అన్న పదం కొద్దిగ తికమకపెడుతుంది. విమర్శకుడు కవి మనస్సు నొప్పింపరాదా? అంటే, కవి వ్రాసినవన్నీ మెచ్చుకొంటూ పోవాలా? ఏ సమయంలో కవి మనస్సు నొప్పింపబడుతుంది అనడానికి ఏదైనా మంత్రముందా? నీవువ్రాసిన పరిశోధన వ్యాసం గ్రంథచౌర్యం అంటే విన్నబుచ్చుకొనే విద్యార్థులున్నారు. అటువంటి వారి మనస్సు 'గాయ' పడకుండా, వారిని సమర్థించాలా. అది వారి పురోగమనానికి అడ్డుకదా? ఇటువంటి సందర్భాలు కవిత్వంలో రావొచ్చు. కాబట్టి కవి పూర్తి ఆత్మ విశ్వాసంతో నేటికి కాకపోతే రేపు, నా నిజమైన కృషి, సాహిత్యంలో నిలబడి తీరుతుంది అని వుండాలే కాని, విమర్శకులను 'నైతిక బాధ్యత' మానవతా కల్యాణం, వంటి పదాలతో, తమ విధ్యుక్త ధర్మం నుండి తప్పించేటందుకు యత్నించరాదు.

డా॥ మురళీధర

అనుకరణ - ఒక వివరణ

సెప్టెంబరు నెల 'భారతి'లో డా॥ వాయని కృష్ణకుమారి గారు 'శేషేంద్రజాలం'పై నేను రాసిన లేఖకు చర్చ ప్రారంభించేరు.

నా లేఖలోని అంశాన్ని ఉటంకిస్తూ ''ఎప్పుడో అనుకరించిన వాయని కృష్ణకుమారి దాకా ఎందుకు...'' అన్నందుకు కృష్ణకుమారిగారు — జవాబు చెప్పకుండా ఊరుకోవడం తన కవిత్వానికి తనే అన్యాయం చేసినట్టుగా అవుతుందని బాధపడుతూ రాసారు.

ఇక్కడ ముఖ్యంగా చెప్పేదేమంటే — శ్రీ శేషేంద్రగారు—

'నేను చెమట బిందువుని
కండల కొండల్లో ఉదయించే లోక బంధువుని' అని రాయగా కృష్ణకుమారిగారు —

'నేను కాంతి బిందువును
అశాంతికి ఆత్మబంధువును' అనీ రాసేరు.

ఈ రెండింటిమధ్య అనుకరణకు తావులేదన్నట్టుగా కృష్ణకుమారిగారు అంత రాయడం వింతగా వుంది! కాగా, ఆమె కవిత్వమంతా అనుకరణని నేను గానీ, శ్రీ సోమసుందర్‌గారు కానీ ఎక్కడా అనలేదే! పోతే, అక్కడ ఆ రెండింటికి సమన్వయం కుదిరిందని--దాంతో అది అనుకరణని సోమసుందర్ గారన్నారు.

దీనిని గమనించండి. శేషేంద్రజాలంలో.

'చెట్లకు వ్రేలాడిన శిరసులు పూస్తున్నై కొమ్మల్లో పూలై' అన్న శ్రీ శేషేంద్ర వాక్యాన్ని 'ఈ గడ్డమీద రాలిన శిరసులు ఎర్ర రక్తంపూలు పూస్తున్నై' అని శ్రీ చెరబండరాజుగారు అనుకరించారని (పి. 24) శ్రీ సోమసుందర్ గారన్నారు. నిజమే అది నిస్సంశయంగా అనుకరణే—కాదనలేం! ఐతే, యిక్కడో విషయం గమనించాలి. శ్రీ శేషేంద్ర భావుకుడు. శ్రీ చెరబండరాజు విప్లవకవి. దిగంబర కవుల్లో ఒకరు కూడా!

శ్రీ శేషేంద్ర కవితకు శ్రీ చెరబండరాజు కవిత పోలిందంటే నిజానికి నింగిని నేలకు అనించిన పంచమే అవుతుంది! (ఇక్కడ, నింగి ఏదీ, నేల ఏదీ అన్న ప్రశ్న దయచేసి లేవనెత్తకండి!) కనుక శ్రీ చెరబండ రాజు అనుకరించాడంటే అది ఆ రెండు వాక్యాలననేగా అనుకోవాలి. అలాగే మీ విషయంలోనూ ఆ రెండు వాక్యాలకి మాత్రమే జరిగిందనుకోవాలి.

తర్వాత—మరో ఉదాహరణ. ఫిబ్రవరి 'భారతి'లో శ్రీ వై. శ్రీరాములుగారి కవితనే తీసుకుందాం. నేను చెప్పిన కొన్ని వాక్యాలు తప్పించి మిగతాది వారి స్వతంత్ర రచనే కదా? వారి కవిత్వమంతా శ్రీ శేషేంద్ర కవితకు అనుకరణని అనగలమా? అనే సాహసం ఎవరి కుంటుందంటారు? అలాగే మీదీనూ...!

అవగాహనలో అవకతవకలు :

తరువాత – నాయని వారు మండే సూర్యుణ్ణి పూర్తిగా అవగాహన చేసుకోలేదేమోననిపిస్తోంది--వారి మండే సూర్యుడి విశ్లేషణా పాఠన సారాన్ని పరిశీలిస్తే...కనుక కృష్ణకుమారి గారూ మండే సూర్యుడినీ, దానికి గైడ్‌లాంటిదయిన శేషేంద్రజాలాన్ని ఒకమారు దగ్గర పెట్టుకొని చదివి, శేషేంద్ర కవితావగాహనలోని లోతుపాతుల్ని పునఃపరిశీలించుకోండనిమాత్రం మనవి చేస్తున్నాను. స్థలాభావంచేత ఆ వివరణలు యివ్వడం లేదు.

— శ్రీ యన్నంరెడ్డి వెంకటరెడ్డి

అసమగ్ర దర్శనం

''స్వాతంత్ర్యానంతరం వెలువడిన స్వేచ్ఛాకవిత్వంలో అగ్రస్థానంలో నిలచే కవితా సంపుటి''గా 'పునర్నవం'ను కీర్తిస్తూ మాదిరాజు రంగారావుగారు – యిజాలూ, తత్వాలనుంచి మనలను దూరంగా ప్రయాణింపజేసే కావ్యంగా దానిని పేర్కొని – ఆరంభంలోనే తప్పుతోవ పట్టారు. (సెప్టెంబర్ 1977 సంచిక)

'అనంత సంగ్రామం' మరియు 'జ్యోతిశ్చక్రం' కవితల్లోని ఎక్కువ భాగాలు తప్ప మిగతా 'పునర్నవ'మంతా అయోమయంతో కూడినదీ, సామాజిక స్పృహకు దూరమైనదీను. ఈ రెండు కవితలనైనా- దాశరథియొక్క ఈనాటి కవితాదర్శపు గీటురాయిమీద పరీక్షించకుండానే చేసిన ' 'దాశరథి కవితా దర్శనం'' సమగ్రం కానేరదు.

రుగ్వేద కాలంనుంచి, 'పునర్నవం'నుంచి, 'తిమిరంతో సమరం' దాకా—యింకా పైదాకా—పడివస్తున్న పదాలే: చీకటి, వెలుగులు. అయితే—ఈ పదాలను కవులు ఏ ఆలోచనా లోచనాల వెనుకనుంచి చూస్తున్నా రనేదే కావలసింది. ముఖ్యంగా—పాత కావ్యాల పరామర్శలో యిది అవసరం. రంగారావుగారి పరిశీలనలో యిది లోపించింది. అందుకే ఆనాడు 'గోలకొండ పత్రిక'లో (6–11–60) పి. వి. రత్నంగారి వ్యాసానికీ, నేటి రంగారావుగారి వ్యాసానికీ పెద్ద భేదం లేకుండాపోయింది.

కాకపోతే – ''ఉన్నదాన్ని ఉన్నవాళ్ళందరిలో పంచి ఉన్నంతలో అందరం కలిసి భోం'' చేయడంలో రత్నంగారికి సోషలిజం అనే యిజం కనిపించింది; (''అంతకంటె సామ్యవాదం ఏమిటి? అంతకన్న ప్రజాస్వామ్యం ఎక్కడ ?'' అని దాశరథి కూడా అడిగాడు. పు. 15); కాని రంగారావుగారికి మాత్రం—''ఏ ఇజాల బరువూ మనపై దించకుండా'' 'పునర్నవం' కనిపించింది.

''ఎవడైనా మానవుడే
ఎందుకు ద్వేషించడాలు?
రాక్షసినైనా మైత్రికి
రానిత్తును,......'' (పు. 25)

''మెత్తని హృదయం దాడికి
తుత్తునియలు కానిదెవడు?'' [పు. 26]

''శాంతి పుష్ప బాణాల్తో
సంసిద్ధులు కండర్రా;
''శిశిర మనే రాక్షసిని
కసి తీరగ నరుకుటకు
అంతకన్న నిశితమైన
ఆయుధ మక్కరలేదు.
మానవతా మలయ వాయు
సంచారములే చాలును.'' (పు. 12)

పై పాదాల్లోని యిజము ఏమిటో కనిపిస్తూ లేదా? కవి తాననుకునే సామ్యవాదం ఎలా వస్తుందో చెప్పడం లేదా ?

''రావణా సురుణ్ణి నరుడు
రణాన ఓడించాడె!''— (పు. 63)

అని అధికృత హింసను ఎదుర్కోవడం ప్రతిహింస ద్వారానే సాధ్యమని చెప్తూనే — వెనువెంటనే —

"దానవతను ఓడించదె
మానవతా మహాయుధం!" (పు. 63)

అని మళ్ళీ — తాను నమ్మిన పాత యిజానికే వచ్చాడు కవి. అయోమయం! అర్థంకాని తనం! అర్థమై కూడా, తప్పుదారిపట్టించే ప్రయత్నమూ కావచ్చు.

'బాల్యం' కవితలో—మనిషి ఏమేం చేస్తే మంచిదో చాటుగా (Indirect) చెప్పి, "ఇవన్నీ దేవుడు కానీ చేయలేడు" (పు. 17) అని థీయిజమ్ (Theism)ను ప్రతిపాదించాడు కవి. "ముక్కోటి దేవతల చక్కని / పుణ్యానుభవ శోభ"(పు.43) లాంటి ప్రయోగాలనేక చోట్ల కూడా 'దేవుడు' ప్రత్యక్షమైతాడు 'పునర్నవం' లో. "అన్ని ఇజాల వాళ్ళూ చాపకూడు కుడిచే దేవాలయ ప్రాంగణం" (మననం : పు. 10) అని కవిత్వాన్ని నిర్వచించే దాకా తీసుకుపోయింది కవిని ఇదే యిజం.

"శవం బతకడం ఎంత విచిత్రమో
మనం మేలుకోవడం అంత చిత్రమే"— (పు. 83)

అంటూ — కవి నిరాశావాదానికి కూడా తావిచ్చిన విషయం రంగారావుగారికి కనిపించలేదు. ఈ నిరాశావాదానికి వెనుక కూడా థీయిజమే వున్నది; మనిషి యొక్క శక్తిని తక్కువగా అంచనా కట్టడం వున్నది.

ఇక —

"జాతీయత కొందరికే
పేదల కేం జాతీయత ?
విశాల విశ్వం నిండ
పేదల దొకటే జాతి" (పు. 1 4)

"కర్షకులు, కార్మికులు
మధన పడే మేధావులు
తమ శ్రమలకు తగిన ఫలం
ఇమ్మంటే 'తిరుగుబాటు'

"షావుకారు వడ్డీలకు
జమీందార్ల హింసలకు
వేగలేక ఆగలేక
తిరగబడితె 'అతివాదం' "— (పు. 78)

అని — పైన చెప్పిన యిజాలకు భిన్నమైన — కొత్త యిజాన్ని చెప్పాడు కవి. ఈ యిజం ద్వారానే కవికి ఈ క్రింది నిజాలు కనిపించాయి.

"ఇవాళ :

రూపాయిల మోతలేక
రోజంటూ గడవదు;
తుపాకీలు లేకుండా
దొరతనం సాగదు." (పు. 66)

"కూలి యెక్కు విమ్మంటే
పేదల రక్తం రంగుతో
పోలీసుల హోళీ పండుగ" (పు. 102)

"కొందరి లాభాల దృష్ట్యా శాస్త్రం రచించి
తీర్పు చెప్పే న్యాయశాలలు" (పు. 123)

"కరకు శాసనాల నీడ
కార్మికునికి శాంతి ! శాంతి!" (పు. 103)

"ఇంకా అక్కడక్కడ ఎత్తైన గడీ గోడ నీడలు
చిని చిన్ని గుడిసెల్ని పెరగనీయడం లేదు" (పు. 73)

"అర్థంలేని సృష్టి కార్యంలో ఏదో/ అర్థం వుందని జనం వెతుకుతారని" (పు. 14) సృష్టి కార్యాన్ని వెక్కిరిస్తూ —

"అపవిత్ర కార్యం ఏదీ చేయకుండానే
... ... సంతానం నిరాటంకంగా కలగడం
... ...
మనం మళ్ళీ అలవరచుకోగలమా ?" (పు. 17) — అని

అనడంలో — కవికున్న 'శాస్త్రీయమైన' (పవిత్రమైన ?) అవగాహన రంగారావుగారు ప్రతిపాదిస్తున్నదేనా ?

"అతడు లేని తెలంగాణ
అలంకరణ లేని జాణ" (పు. 34) —

అని సురవరం ప్రతాపరెడ్డిని కీర్తించినట్టా ? అలంకరణలేని జాణకు విలువలేదని, అసహ్యించుకొని, తృణీకరించినట్టా?

"అమాయకుల శిరస్సులను ఛేదించి
తలయెత్తిన రాజ కరవాలము" నూ, (పు. 122)

"ప్రతి పక్షాల్ని నరికి నిరంకుశ
రాజ్యం చేసే ఏక పక్ష పతాకము" నూ, (పు. 122)

మొన్నటి అత్యవసర పరిస్థితి (Emergency) లోని అత్యాచారాలకు మూలకారణాలుగ యివాళైనా పత్రికలూ, ప్రజలూగుర్తిస్తున్నాయి. మరి — ఆ కుదుపును —

"మారణహోమాన్ని నిరసించే
మహా ప్రజావళికి ... గెలుపు" —

అనీ, ఆ దుష్టశక్తుల రాణిని గూర్చి —

"ప్రజావళిని హత మార్చే
భయంకర విషవాయువును

బంధించే ఆదిశక్తి
పట్ల — ప్రజకు కలదు భక్తి'' — 2

అని, కీర్తించిన దాశరథిని ఆనాడు 'పునర్నవం' దగ్గరే తప్పుగా అంచనాకట్టి వుంటారన్న ఆలోచనే లేదే కొత్తవిమర్శనా వ్యాసంలో! ''డిరెయిల్ అవుతోన్న (అయిన?) పొగబండి'' ని (పు. 115) చూస్తూ ''అవును! ఎటొచ్చాం మనం దారితప్పి?'' (పు. 115) అని మందలించే మాటే లేదే!

'పునర్నవం'లో నిలచిపోయే కవిత ''అనంత సంగ్రామం''— ఒక్కటే. అది నాటి దాశరథిలోని అభ్యుదయ భావానికి వంకర టింకరలు లేని రూపకల్పన. ఇక—నేడు—పదహారేళ్ళు దాటి వచ్చి -- దాశరథిని చూస్తే — ఆయన 'జ్యోతిశ్చక్రం' కవితలోని క్రింది పాదాలు మాత్రమే గుర్తొస్తాయి :—

''నిన్న రాజుల్ని ఎదిరించినవారు
నేడు రాజులకి బహు దగ్గరివారు
అయితేం, జనం గ్రహిస్తోంది నిజం,
కాలం సాగుతోంది గజం, గజం,'' (పు. 97)

''ఇంకా సాగొ జగాన కుట్రలు
విప్లవం పాకింది పొలాలు పుట్రలు'' (పు. 98)

సూచికలు

(వ్యాసంలో సూచించిన పుటలసంఖ్యలు పునర్నవం (రెండవ ముద్రణ) లోనివి.

1. 'దీక్ష' కవితా సంకలనం : ఆం. ప్ర. ప్రభుత్వ ప్రచురణ : అక్టోబర్ 1975
2. ibid

శ్రీ ర వి బా బు

విప్లవ రచయితల సంఘంమీద శ్రీ సోమసుందర్ అభాండాలు

'కరపత్రాల భాగోతం — తెరవెనుక దుమారం' గ్రంథసమీక్షను వీలుచేసుకొని శ్రీ సోమసుందర్ విప్లవ రచయితల సంఘం (వి. ర. సం.) మీద వేసిన అభాండం ఒకటికాదు. శ్రీ శ్రీ షష్ఠిపూర్తి మొదలు జ్వాలాముఖిమీదనూ, వి. ర. సం. పుట్టింది మొదలు దానిమీదనూ, ఆయన కత్తులు ఝుళిపిస్తూనే వస్తున్నారు. ఇది అవ్యాజంకాదు,సవ్యాజమే. జ్వాలాముఖి పరుషవాక్కు చేసిన గుండెగాయం సోమ సుందర్‌లో ఇంకా సెలవేస్తూనే ఉంది. 'అతివాద దుందుడుకు వాదులు'గా వి. ర. సం. సభ్యులను ఆయన స్తిమిత బుద్ధితో 1970 మొదలు విమర్శనీమీదుగా నేటిదాకా వర్ణిస్తూ వచ్చారు.

పై గ్రంథం రచించినవారి అపరాధం సమస్తం, శ్రీ సోమసుందర్ దృష్టిలో. దిగంబరులూ విశాఖ విద్యార్థులూ వి. ర. సం. వారూ వేసిన కరపత్రాలకు ''ఏకపక్ష ప్రాధాన్యత'' కల్పించడమే. ఇలా చెయ్యడం, ''జాతి మరచిపోయిన ఒక పీడకలను'' కెలికి జ్ఞాపకం చెయ్యడమేనట. పీడకలో సుందర స్వప్నమో ఏదైతేనేం, గతాన్ని జ్ఞాపకం చెయ్యడం, కనీసం గ్రంథస్థం చేసిపెట్టడం, చారిత్రిక దృష్టికి విహితమే. పైగా, అవి వట్టి కరపత్రాలేమీకావు. చారిత్రిక పత్రాలకుగల 'ప్రాధాన్యత' పై సంస్థల స్థాయిలోనైనా వాటికి ఉంది. దాని నటుంచి, మరుపు పాలయ్యే ఏ జాతీ మహితం కాజాలదు. మరిచిపోదా మనుకుంటుంది తానైతే కావచ్చు, తన లాంటి కొందరైనా కావచ్చుగాని, జాతి సమస్తమూకాదు. అలా అనుకోవడం తన పరిమితులకు జాతిని తగ్గించడమే. దివాస్వప్నాలే మిగిలి ''పీడకలలు'' మరపునపడితే, చరిత్ర ముఖానికే వెల్లవేసినట్టు—కలల కళ్లల తెల్లని వెల్లతో మీదుమిక్కిలి, సదరు ''పీడకల'' వ్యక్తి మాత్రుడి లది మాత్రమే అయినప్పుడు, ఆవశ్యంగా దాన్ని అవతలి వాళ్లేవళ్లైనా ''కెలికి'' గుర్తు చేస్తారు.

శ్రీ సోమసుందర్‌కు సి. పి. ఐ. నచ్చడం వింతకాదు. నచ్చకుంటేనే వింత. సి. పి. ఐ. తప్ప తక్కిన కమ్యూనిస్టులంతా ఆయనకు మార్క్సిస్టులుగా కనిపించరు. అంతేనా? ''చిత్తశుద్ధి ఉండె దిటవూ'' లేనివారుగా సైతం కనిపిస్తారు. ఇది శ్రీ సోమసుందర్‌లో విపరీతమేమీ కాదు. అది అంతే. ఎవరైనా తమకు ఏదైతే లోపిస్తుందో దాన్ని ఇతరులనుంచి అపేక్షిస్తారు. సోమసుందర్‌కు ఆ రెండు దినుసులూ కావలసినట్టుంది. అయితే అవి సరుకులు కావు, తెచ్చిపెట్టుకుంటే నిలవవు. ఏం సాధనం మరి?

మార్క్సిజం భారతదేశంలో ''అపభ్రంశం'' పాలైందని అనడం, యాభై యేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాన్నంతటినీ ఒక్క మాటతో కొట్టివెయ్యడమే. ఇది విమర్శకు డెవడూ చెయ్య సాహసించని పని ఇటలీలో గ్రామ్సీలాగా, ఆస్ట్రియాలో ఫిషర్‌లాగా, హంగరీలో లూకాజ్‌లాగా, అమెరికాలో బ్రౌడర్‌లాగా, వీరందరికీ మూలపురుషులైన జర్మన్ సోషల్—డెమోక్రాట్లు కౌట్స్కీ, బెరన్‌స్టీన్‌లు, వారి తాజా సంతానమైన కృశ్చెఫ్, బ్రెజ్నెఫ్‌లు, మార్క్సిజాన్ని 'సృజనాత్మకంగా' తిరగదోడి రివిజనిజంగా రూపొందించడం శ్రీ సోమసుందర్ ఆమోదం పొందినట్టే. మరి, నాతిని చెయ్యబోయి కోతిని చెయ్యడానికీ సుసంస్కృతమూ సుసంపన్నమూ చెయ్యబూని అపభ్రంశం చెయ్యడానికీ తేడా లేదా? అపభ్రంశాన్నే సమాదరిస్తూన్న వారికి నచ్చనిదల్లా 'పిడివాదం' (డాగ్మాటిజం) పేరిటి మౌలిక సిద్ధాంత విధేయతే. పి. సి. జోషీలాంటి పూర్వసువాసినీ కమ్యూనిస్టుల్లాగే శ్రీ సోమసుందర్ భారతదేశంలో మార్క్సిజానికి ఏదో అపచారం జరిగిందని అంటున్నారు. సోమసుందర్ మదికెక్కిన మార్క్సిజం భారతదేశంలో సి. పి. ఐ.లోనే గూడుకట్టుకొని ఉండడం, మార్క్సిజానికే ఘనమైన దాఖలా. ''రష్యా రుష్యాశ్రమమున'' (అబ్బూరి) సంచరించే హరిణ శాబకాలకైనా 'నాటు' — కేటు కమ్యూనిస్టులకంటె ఎక్కువ స్వేచ్ఛ

ఉంటుందేమో! మరొకరు చైనాను వేలెత్తి చూపవచ్చు; అభ్యంతరంలేదు. ఏ దేశంలో మార్క్సిజానికి విహితమైన కార్యాచరణ సాగుతూందో లోకన్ను పెట్టుకు చూడాలి. అలాగే భారతదేశంలో కార్యాచరణనుబట్టి మాత్రమే ఏ మార్క్సిస్టునైనా పరీక్షించాలి. ''జాతి''కి ఇప్పటికే ఇది స్వానుభవంగా తెలిసివచ్చి ఉండాలి. వర్గపోరాటం, జనతా ప్రజాస్వామ్యం, శ్రామికవర్గ నియంతృత్వంవంటి విషయాలు ఎన్నో అభిప్రాయభేదాలకు దేశదేశాంతరాలలో తావిస్తున్నట్టు శాంటియాగో కేరిల్లో 'యూరో కమ్యూనిజం'వంటి ధోరణులనుబట్టి తెలుసుకోవచ్చు. ఇన్నిటిని చూచి తేల్చవలసి ఉండగా, తన ప్రవృత్తికి అనుకూలమైన ఒకానొక అల్పాంశాన్నే ఆధారం చేసుకుని, సిద్ధాంతస్థాపన చెయ్యబోవడం, తలకు మించినపనే.

తన కవితలో తనకు కనిపించని ''మార్మిక కవిత్వం'' శ్రీ జ్వాలాముఖి కవితలో కనిపించడం, శ్రీ సోమసుందర్ వస్తుపరమైన దృష్టికి ఏంతమాత్రమూ నిరూపించదు. 'మార్మికకవిత్వం' తనకు కూసువిద్య కాగా, కొత్తగా అందులోకి దిగిన [కనీసం, విమర్శకుని అలా అనిపించిన] జ్వాలాముఖిని తప్పెన్నడం ఎంత సొగసు! మత తాత్విక కవితకు కిరీటం తొడుగుతూన్న శ్రీ ఆర్. యస్. సుదర్శనం మాత్రం ఫర్వాలేదుగాని జ్వాలాముఖిదే తప్పంతా! మరి నిఖిలేశ్వర్ ప్రభృతుల రచనలే తనకు కానరావడం లేదంటారు సోమసుందర్. తనకు కానరావడమూ అవి ఉండకపోవడమూ ఒక్కటేనా? దుర్భిణీ అక్కర్లేదే వాటిని కనుగోడానికి? ఎన్నో పత్రికలలో వెలువడుతూనే ఉన్నాయి. తనవీ తన మిత్రులవీ తప్ప తక్కిన వారి రచనలను, మెచ్చుకుంటే మానె, చూడకనే పోవడం చూడలేకపోవడమే, పర్యవసానంలో. దృష్టివర్తులత్వం' అంటే ఇదేనేమో? దృష్టి నిండుకుంటేనే ఇది సాధ్యమేమో?

వి ర. సం.లో ''ముఠాల'' గురించి పనిలేని శుంఠలకు తీవ్రమైన ఆసక్తి ఉంటే సరేగాని శ్రీ సోమసుందర్‌లాంటి విజ్ఞులకు ఉండడం విచారకరం. సంస్థ అన్నప్పుడు భిన్నాభిప్రాయాలు తప్పవు. అవి వ్యక్తుల నాశ్రయించుకుంటాయి. వ్యక్తులు తమలాంటి వ్యక్తులతో కలుస్తారు. ఇలా బృందాలేర్పడుతాయి. బృందమంటేనే ముఠా అయితే చెప్పలేంగాని, బృందాలు ఒక సంస్థ చట్రానికి ఒదిగి ఉండినంతకాలం ఒదిగిఉండి, తమ అభిప్రాయాలకు సరైన గుర్తింపు లేదనుకొంటేనో, అధిక సంఖ్యాకబృందం తాలూకు అభిప్రాయాలను పాటించడం సమ్మతం కాదనుకొంటేనో, చీలిపోతుంది. 1974 జనవరిలో అనంతపురంలో జరిగిన వి. ర. సం. మహాసభ సందర్భంగా జ్వాలాముఖీ త్యాదు లిలా చీలిపోయారు. ఇప్పుడు వి. ర. సం.లో ఎవరిదే ముఠాయో శ్రీ సోమసుందర్‌గారు తమకు చెప్పమంటున్నారు. ఎందుకో? ముద్రలు కొట్టడానికా ఏలినవారి కింకరుల పనిభారం తగ్గించడానికా? వి ర. సం. ప్రణాళికను ఆమోదించి సభ్యత్వం పొందిఉన్న రచయితలమధ్య ముఠాలులేవు. మార్క్సిజం—లెనినిజం మావో ఆలోచనా విధానం వెలుగులో ప్రజానీకం సాగించే సకల విధాలైన పోరాటాలకు సాంస్కృతిక దోహదంచేస్తూ, జనతా ప్రజాస్వామిక విప్లవ సాధనలో సంస్కృతిక్షేత్రాన్ని తన కార్యరంగంగా ఎంచుకునే రచయితలమధ్య అభిప్రాయభేదాలైతే ఉండవచ్చు. వాటికి స్వాగతం భేదాలే లేనివిధంగా రెజిమెంటేషన్ ఉండడం స్వేచ్ఛాప్రియులైన శ్రీ సోమసుందర్ ప్రభృతులకు రుచించదుగదా.

శ్రీ జలగం వారికిన్నీ వారి పోలీసు బలగానికిన్నీ, జెయిళ్లకున్నూ నిర్బంధాలకున్నూ జడిసి ''తోకలు ముడిచి'' వి.ర.సం.లోని ''ప్రముఖులంతా'' ''అండర్ టేకింగ్‌లు'' ఇచ్చారనిన్నీ ఇచ్చే బయట పడ్డారనిన్నీ శ్రీ సోమసుందర్‌కు తెలిసిపోయింది. వీరిది యోగదృష్టి అయి ఉండాలి. దేనికి కళ్లతో ఏం అక్కర? చెవి చాలు. అదీ పుచ్చి ఉండాలి. అప్పుడే 'కర్ణాకర్ణి'గా విన్న ఏ విషయమైనా సత్యమై కూచుంటుంది. అయ్యా, సోమసుందర్ మహాశయా! తమరూ పూర్వాశ్రమంలో బాల్యచాపల్యవశాత్తో యువ్వన హృదయ సహజోద్రేకవశాత్తో ఒకానొక చట్టబద్ధ రైతాంగపోరాట క్రమంలో కొన్నాళ్లే అయినా తుని జైల్లో ఉండిన విషయం [''పీడకల'' కాకుంటే] గుర్తుకు తెచ్చుకొండి. అప్పుడేమైనా ఇలాంటి 'అండర్ టేకింగులూ' గట్రా రాసిచ్చారా? ఇచ్చిఉండరు. అప్పట్లో మీరు ''చిత్తశుద్ధీ దిటవూ'' కలిగి ఉండేవారు. మరి, ఇప్పుడు, ఇరవై నెలలకాలం 'జైలు జీవితం గడిపిన వి. ర. సం. ''ప్రముఖులంతా'' అండర్ టేకింగులు రాసిచ్చి తము 'స్వేచ్ఛ'ను కొనుక్కొన్నారని ఎలా, ఏ ఆధారబలంతో, అంటున్నారు తమరు? ఇవ్విధంబైన ప్రసంగంబులు తమ బోంట్లకు తగునా? ఇప్పటికీ మామీద రెండు పెద్ద 'కుట్ర' కేసులు నడుస్తూ ఉన్నాయి. నడుపుతూ ఉన్నది శ్రీ జలగంవారూ, శ్రీవారి తిరుబలగమూనని తమకు తెలియదా? తమ కట్టుకథకు కాళ్లలాగూ లేవు, కళ్లూలేవా? ఒక్క దాఖలా చూపండి. ఎవరి ఠవాఖా ఏమిటో లోకంముందు [డిఫమేషన్ సూట్‌తో కోర్టుముందుకాదు] తేల్చుకుందాం. అక్కసు మనుష్యుల్ని పశువుల్నిగా మారుస్తుంది కాబోలు!

నెత్తురు బొట్టు చిందకుండా పువ్వైనా నలగకుండా 'విప్లవం' పెళ్ళికూతుర్లా ముస్తాబై శోభనం గదికి వచ్చేస్తే ఎంత బాగుణ్ణు! ఆత్మ త్యాగాలో క్లేశాలో కష్టనష్టాలో ఏవీ లేకుండా 'లోకాస్స మస్తా సుఖినో భవంతు' బాపలుగా వస్తుందది కవిగాడి వూహలోనే వాడికి కళే కాదు జీవితమూ ఒక కేళి — మధ్యే మధ్యే కందర్పకేళి కూడా. సోమసుందర్ ఒకనాడు 'వజ్రాయుధం' చేదాల్చిన యువ వర్షా మేఘ సన్నిభుడైన కవి కాబట్టి జనగామలో సూర్యాపేటలో బాలేములలో, ఇలా ఎన్నో చోట్ల, ఎందరెందరు వీరులై పోరాడి, పోరాట గతిలో అమరులయ్యారో ఆయన హృదయానికి గుర్తు ఉండాలి. (ఇది ''పీడకల'' అయి ఉండదు.) అప్పట్లో (1941–51) నేడు సోమసుందర్ లాగే నారపరెడ్డి ఈ నిష్ఫల రక్తపాతం, వృధా ఆత్మత్యాగం గురించి ఆవేదన చెందుతూ గేయాలు రాశారు. ఆవేదన ఉద్యమం నుంచే దూరం చేసి శత్రు శిబిరంలోకి తీసుకెళ్లింది. అలనాటి 'వజ్రాయుధ' కవి ఇప్పుడు ఏ శిబిరంలో నిల్చుని మామీద నోరు చేసుకుంటున్నట్టు? ఎవరివో తలలు నరికి పొగులు పెట్టడం విప్లవమని ఎవరన్నారు?

'వర్గ శత్రు నిర్మూలన' పేరుతో జరిగిన చర్యలు టెర్రరిస్టు చర్యలూ కావు. సాయుధ పోరాట క్రమంలో అలాంటివి కొన్ని జరిగాయి. అంతమాత్రాన విప్లవ కార్యక్రమమంతా ఆపేనని మేమను కోవడం లేదు. విప్లవ విజ్ఞతను మాకు మే మాపాదించుకొని పాప పుణ్యాలను నిర్ధారణ చెయ్యడమూలేదు. ఇవి నీతికీ అవినీతికీ సంబంధించిన అంశా లనడం కంటె యుక్తా యుక్తాలకు సంబంధించినవని అనడం మేలు. శ్రీ సోమసుందర్‌కు యివేవీ పట్టవు. ఆయనకు వయస్సుతోబాటు మనస్సూ ముదిరి బిరుసెక్కింది. తాను సరసుడై కూడా విరసుని కంటె విసురుగా విప్లవ రచయితల మీద బండీ తోలుతున్నాడు. తిట్టడం, నిందించడం, దుష్ప్రచారం చెయ్యడం, సాహిత్య లోకంలోకి విప్లవ రచయితల ద్వారా చొరబారి వస్తున్నాయో, మరొకరి ద్వారా వస్తున్నాయో 'భారతి' పాఠకులు చెప్పాలి. కలిసి రమ్మంటారు మమ్మల్ని, కలిసిపోరాడుదామంటారు, కౌగిలించుకుందామంటారు — అది కత్తుల కౌగిలి అయితే? 'ధృతరాష్ట్ర కౌగిలి' అయితే? తల బిరుసూ నోటి దురుసూ ఎంతటి వారికైనా గొప్పదనాన్ని కలిగించవు.

శ్రీ కె. వి. రమణారెడ్డి,
విప్లవ రచయితల సంఘం, కార్యదర్శి.

తెరవెనుక భాగోతం - విమర్శనా దుమారం

'భారతి' (అక్టోబర్ 1977)లో శ్రీ సోమసుందర్‌గారు ''కరపత్రాల భాగోతం—తెరవెనుక దుమారం;'' గ్రంథాన్ని విమర్శిస్తూ వెలిబుచ్చిన అభిప్రాయాలపై ఇలా వ్రాస్తున్నారు:

సోమసుందర్‌గారు విప్లవ రచయితలకొక సలహానిస్తూ మీ దుందుడుకు చర్యలవల్ల, అసంగత అసంబద్ధ కుహనా సిద్ధాంత కార్యక్రమాలవల్లా యిప్పటికే ఎన్ని క్యూసెక్కుల నెత్తురూ కన్నీరూ అనంతవాహినిగా ప్రవహించిందో గమనించండి! అన్నారు. కుహనా సిద్ధాంతాలన్నారు. ఇవేం రాజకీయ నాయకులు పలికే ప్రగల్భాల ప్రతిజ్ఞ లనుకున్నారా? కాంగ్రెసు, కమ్యూనిస్టుపార్టీల నామకార్థపు సిద్ధాంతా లనుకున్నారా? ఒకేసారి కుహనా సిద్ధాంతా లనేశారే? అసలు సిద్ధాంతాలు పరిశీలించడమనే దెన్నడైనా చేశారా? లేక మీ ఊహల్లో తేలియాడేవన్నీ సిద్ధాంతాలని మిగతావన్నీ కుహనా లనుకున్నారా? రాజకీయ పార్టీలవారు వ్యతిరేక పార్టీవారివి కువానా సిద్ధాంతాలని ఉపన్యాసాలిచ్చినట్లు, తాపట్టిన కుందేటికి మూడే కాళ్ళని వెనకటి కెవడో అన్నట్లుంది మీ విమర్శనా పద్ధతి. సిద్ధాంతాలు దేశ కాల పరిస్థితులతో మారుతూ ఉంటాయి. అలా మారనపుడు దెబ్బతింటాయి. విరసం సిద్ధాంతాల్ని ఎన్నడైనా పరిశీలించారా ఎన్నడైనా? ఈ దేశంలో నక్సలిజం ప్రయోజనాన్ని సాధించలేకపోయిందని, అందువల్ల ఎంతో ప్రాణనష్టం జరిగిందని అందరికీ తెలుసు. కాని విప్లవ రచయితలవల్ల యిప్పటికే ఎన్ని క్యూసెక్కుల నెత్తురూ కన్నీరూ అనంతవాహినిగా ప్రవహించిందో గమనించ మంటున్నారు. ఎక్కడండీ ఒక్క క్యూసెక్కు నెత్తురైనా ప్రవహించినచోటు చూపగలరా? లేక నక్సలిజం, విరసం రెండూ ఒకటేనని భావించారా? ఎంతోమంది విద్యార్థులు—సమాజానికెంతో ఉపయోగపడవలసినవాళ్ళు నిష్ప్రయోజక మహత్తర త్యాగాలకు (ఒక ఆశయం కొరకు మహత్తరత్యాగం చేస్తే అది నిష్ప్రయోజనం అయితే అది సమాజం తప్పే! నిష్ప్రయోజనం అయినాక అది మహత్తర త్యాగమెలా అవుతుంది.) పాల్పడి ప్రాణాలర్పించారో పరిశీలించమంటున్నారు. ఒక్క ఉదాహరణ నివ్వగలరా? ఎందరు మానవతుల బ్రతుకులు బద్ధలయ్యాయో అంటున్నారు. ఎక్కడండీ? ఎక్కడ జరిగిన సంఘటనలవి. (ఏ గుంటూరి అస్పష్టతా, అవాస్తవికతా లోకపు కవిత్వాన్ని పరిస్తూ ఏ ప్రేమసి ఊహల్లో తేలిపోతున్నపుడో లేక ఆర్. యస్. (నిశాంతం) (నిశసాంతంలో మునిగిపోయినప్పుడో నెత్తురులు ప్రవహించినట్లు, ప్రాణాలు బద్ధలౌతున్నట్లు కలగన్నారా? భీరువు దయ్యాన్ని తలిస్తేనే వణికిపోయినట్లు విరసం అనగానే మీరు నెత్తుటేరులు అగుపించాయా?) ఇక దోపిడీ సమాజము పెరిగిపోవడానికి అన్యాయాన్ని ఎదిరించాలనే ఆలోచనలేని పిరికి పందలైన ప్రజలే కారణము. మీలాంటి రచయితలు కూడా వారిలో ధైర్యాన్ని నూరిపోయక పోవడము శోచనీయము. ఎదిరించగలిగే శక్తిలేక ఎదిరిద్దామనే ఆలోచన వచ్చిన వారిని వెనక్కు లాగాలని చూచే బుద్ధిమంతు లెక్కువైనాక విప్లవోద్యమాలు విఫలముకాక ఏమౌతాయి? ప్రత్యేక తెలంగాణ, ప్రత్యేక ఆంధ్ర ఉద్యమాల్లో వందలాది ప్రజలు మరణించారే వాటిని ఈ అంధేరా రాష్ట్రాన్ని ఏలుతున్న ప్రజాకోర్కెల్ని మన్నించలేని (వి)నాయకవర్యులు అణచలేదూ? స్వతంత్ర భారతదేశము కావడానికి ఎందరు, ఎన్నాళ్ళు ఎన్ని ఎదురు దెబ్బలుతింటూ ప్రాణార్పించారో తెలియదా? అది విప్లవపు టాలోచన అని ఆనాటి తెల్లదొరలూ మొత్తు కోలేదూ? తెల్ల దొరల బెదిరింపులకే ఆనాటి ప్రజలు ముక్కుమూసుక ఎక్కడైనా మూలకు కూర్చుంటే, తమ స్వార్థమే తాను చూసుకుంటే ఈనాటివరకూ మనము బానిసపు జీవితాన్నే అనుభవించేవారమే? వర్గశత్రువుల కూటనీతి పెరిగిందంటున్నారు కాని దాన్ని దునుమాడాలనే ఊహన్నా మీలో ఎన్నడైనా ప్రతిష్ఠించుకున్నారా? నలుగురిలో ప్రతిష్ఠించగలగారా?

ఏ విప్లవోద్యమంవల్ల పీడితవర్గం ఉజ్వల భవిష్యత్తు పొందుతుందని మనమంతా ఆశిస్తున్నామో—ఆ శ్రామికవర్గం చిన్న చిన్న వాగ్దానాలకు మోసపోయే నిస్సహాయ స్థితికి దిగజారిందంటున్నారు. ఒక విప్లవం సాగేటప్పుడు దానికి చేయూతగా పీడిత శ్రామిక వర్గాన్ని ఏకంచేసి విప్లవాన్ని శక్తివంతముచేసి విజయవంతము గావిద్దామనే ఆలోచనలేక విప్లవాలణగిపోయాక, శ్రామికవర్గాన్ని సుసంఘటితంచేసి చైతన్యవంతం గావించి, మిత్రశ్రేణుల నన్నిటినీ ఏకోన్ముఖం చేయడం రచయితల బాధ్యతయని ఇపుడు గుర్తుకొచ్చిందా మీకు, సోమసుందర్‌గారూ?

ఏ విప్లవమైనా ఆరంభములో పిల్లసమేరీయే, పిచిక పితూరీయే. అదిఎదిగేందుకు దోహదకార్లుగా రచయితలు మారకపోవడను శోచనీయము కాగా అది వర్గశత్రువుల కూటనీతికి అణగిపోవడానికి ఈ రచయితలే కారకులు కారా? అపుడు వెలుగులోనున్న మీలాంటి రచయితలే విరసానికి ప్రోత్సాహమివ్వక కూలదోసే ప్రయత్నాలు చేస్తే ఇక విప్లవాలు అణగారిపోక ఏమైపోతాయి ? ఇదంతా గ్రంధాన్ని విమర్శించడము మానుకొని సంస్థలపై దాడులు ప్రారంభిస్తే పట్టినగతి? అసలు మీరు గ్రంధ విమర్శ నిష్కర్షగా చేశారా ? (ఏ గుంటూరి గ్రంథాలో, ఆర్. యస్. నిశాంతం పట్టుకపొగుడు కుంటూ కూర్చోక మీ కెందుకండీ ఈ అవస్థలన్నీ?) పార్టీల గొడవలో మునిగిపోయారేం? అయినా మీకు ఇన్ని మార్క్సిస్టు గ్రూపుల్లోను, పార్టీల్లోను చేసిన తప్పుల్ని బహిరంగంగా ఒప్పుకొని లెంపలు వాయించుకోవడంలో గుడ్డిలో మెల్లగా సి. పి. ఐ. య్యే నయమనిపిస్తుందా? (జనతావాళ్ళు బాహాటంగా ఒప్పుకుంటున్నారే తప్పుల్ని?) అత్యవసర పరిస్థితి కాలంలో కుటిల రాజనీతి సంస్థ కాంగ్రెసుకు, అది జరిపిన అరాచకాలకు డబ్బా కొట్టినందుకు సి. పి. ఐ. నయమనిపిస్తుందా? ఇందిరను పొగడి, సంజయ్‌ను తెగడినందుకా? ఎందుకోమరి ? ఇలాంటి అరాచక సంస్థను సమర్థించనందుకే సి. పి. యం. నయమనిపించడము లేదా? ఇది ఏ రాజకీయ విజ్ఞుడైనా అంగీకరిస్తాడే? ఎక్కడివో బూజు భావాల్ని పట్టుక పాకులాడేవారు (డబ్బుకై ఆత్మనైనా అమ్ముకునే వారు) ఇలాంటి విమర్శలకు ఎందుకు దిగారసలు ?

భారతదేశంలో మార్క్సిజం నేతినేతి వ్యవహారంగా బ్రహ్మపదార్థంగా అగుపిస్తుందా? ఎవడి మగ్గానికి వాడే సేనాధిపతిగా కానవస్తున్నాడా? ఏ పార్టీయైనా ఈ దేశంలో ఇంతకన్నా సుసంఘటితంగా ఉందా? కాంగ్రేసా, జనతానా, సి. పి. ఐయా? దేశరాజకీయాల్నొకమారు పరిశీలిస్తే మీకే అవగాహన అవుతాయి పరిస్థితులు.

జ్వాలాముఖిలో మార్పుకు, నిఖిలేశ్వర్ ప్రభృతులు ఏంరాస్తున్నారో తెలియకుండా పోవడానికి కారణము; అత్యవసర పరిస్థితులంటూ వారి అవసర పరిస్థితులకై ఇష్టారీతి సెన్సార్‌ల నేర్పరచి అందరినీ జైళ్లలోకి నెట్టిన కాంగ్రెసు ప్రభుత్వానికి జేజేలు కొట్టిన రచయితలే కారకులనే నగ్నసత్యాన్ని తెలియక వి. ర. స. పు కవుల్ని దులపడం ఎంతవరకు సమంజసమనుకున్నారు ? న్యాయాన్యాయ విచక్షణను విడనాడడం ఒక గద్దెపై ఆసీనులైన మీలాంటి కవులకు భావ్యమేనా ?

శ్రీశ్రీని కిడ్నాప్‌చేసి నాయకత్వాన్ని అంటగట్టారా? సోమసుందర్‌గారూ! బలవంతపు బ్రాహ్మణార్థము ఎన్నాళ్ళునిలుస్తుంది? బరిమికి లింగము కడితే శ్రీశ్రీ లాంటి మహారచయిత భక్తుడైనాడా ? అలాంటప్పుడు శ్రీశ్రీ కంటే ఏ అనామకుడో మెరుగనిపించుకుంటాడే ? శ్యాండిల్యాదులు ముప్పయివేలు కాజేసి, ఆహ్వానితులైన రచయిత లందరికీ రాను పోను ఖర్చుల నిమిత్తం దొంగ చెక్కులిచ్చారా ? అయితే దొంగ చెక్కు లంటగట్టిననాడు విరసాన్ని దులపలేకపోయారా ? శ్యాండిల్యాదులు ముప్పయివేలు కాజేస్తే అడగలేకపోయారా? ఇన్నాళ్ళకు మీకు విరసాన్ని దులిపేంతటి తాహతువచ్చిందా? ఇన్నాళ్ళూ చేతులు ముడుచుక కూర్చున్నారేం ? శ్రీశ్రీని కిడ్నాప్‌చేసి నాయకత్వం అంటగట్టినట్టు శ్రీశ్రీ గూడా తన స్వీయ చరిత్రలో తెలపలేదే? మీరెలా పసిగట్టారు? ఊహించుకున్నారా ?

గతాన్ని గమనిస్తూ గతంలో జరిగిన అరాచకాలు మళ్ళీ జరుగకుండా భావిపౌరులు జాగ్రత్త పడగలరనే ఉద్దేశ్యంతోనేగా అనంతం లక్ష్మీకాంతంగారలు "కరపత్రాల భాగోతం – తెర వెనుక దుమారం" ను బైటకు లాగింది. ఏకాలపు చరిత్రనో అచ్చొత్తించి పట్టి పట్టి చదివిస్తోందే మన ప్రభుత్వము, అంటే సాంఘిక శాస్త్రములోని చరిత్రను కూలదోద్దామంటారా ? కాల్చి వేద్దామంటారా ?

గత చరిత్రలో కలిసిపోయిన ఒక పీడకలను పదే పదే జ్ఞప్తి చేస్తూ భవితవ్యంలో అలాంటివి జరుగకుండా చూచుకొమ్మని నయబోధ చేసేదే "కరపత్రాల భాగోతం – తెర వెనుక దుమారం" అలాంటి పనిని ఎన్నో కష్టనష్టాల కోర్చి ప్రచురించిన అనంతం లక్ష్మీకాంతంగార్లను ప్రశంసించేదిపోయి తూలనాడడం తగేదేనా ? నిన్న ప్రచండ కాళరాత్రుల సృష్టించిన ఇందిర, నేటిఉపన్యాసాల్లో మీరూ నల్కడం మీ గొప్పదనమనుకోవాలా సోమసుందర్‌గారూ ?

శ్రీ కె. అంజయ్య

గ్రంథ విమర్శలు

'ఇఖ్బాల్ కవితలు'

[అనువాదకులు : డా॥ బెజవాడ గోపాలరెడ్డి. ప్రకాశకులు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, సైఫాబాద్–హైదరాబాద్–4. పుటలు : వేయలేదు. అయినా 100+28+8 పుటలు. వెల: ఆరు రూపాయిలు].

నిజాంను 'నైజాం' అనటం సరికాదు. అట్లే 'ఎఖ్బాల్'ను 'ఇఖ్బాల్'అనటం కూడా సరికాదు. ఒక్కొక్క పుటలో ఎఖ్బాల్ కవిత (ద్విపద) ఒకటి ఉర్దూలిపిలోను, దేవనాగర లిపిలోను వేసి, కింద దాని తెలుగు అనువాదం వేసినారు. ఉర్దూ నస్తాలీఖ్ తెలుగు టైపు పెద్దదిగా వాడినారు. సాధారణ టైపు వాడి ఉంటే పాఠకులకు మరో వంద కవితలు అందచేయ కలిగేవారు. లేదా సగం ధరకు ఇయ్యకలిగేవారు. పుస్తకానికి అట్ట బైండు. పైన జాకెట్. జాకెట్‌మీద ఇఖ్బాల్ కవితలు (తెలుగు అనువాదము) అని వుండగా లోపలి టైటిలుమీద 'ఇఖ్బాల్ కవిత–తెలుగుసేత' అని వున్నది. మరో వైపుఉర్దూలో 'ఎఖ్బాల్ కే షేర్' అని వుండగా లోపలి టైటిలుమీద 'ఎఖ్బాల్ కే సౌ షేర్' అని అని వున్నది. ఇక పుస్తకం పేరువలెనే ప్రచురణకర్తల పేరులో గూడా వ్యత్యాసమున్నది.

ఈ పుస్తకాన్ని తమ మిత్రులు, హితచింతకులు, విశాల హృదయుడు, దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త అయిన కీ. శే. దోస్త్ మహమ్మద్ అల్లాదీన్ గారికి (ఇంగ్లీషులో) అంకితమీయటం జరిగింది. అయితే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణలను గ్రంథకర్త తానెవరికైనా అంకిత మీయవచ్చునా? ఇది అకాడమి నిర్ణయించుకోవలసిన విషయం.

సాహిత్య అకాడమి (ఉర్దూ విభాగం) సభ్యులైన ఆబిదలీ ఖాన్('సియాసత్' దినపత్రిక సంపాదకులు)గారు ఉర్దూలో పరిచయ వాక్యాలు రాస్తూ–బె. గోపాలరెడ్డిగారి ఉర్దూ సేవను ప్రశంసించి నారు. డా॥ దాశరథిగారు 'ఆత్మావిష్కారము' అనే శీర్షికతో 8 పేజీల చక్కని తొలిపలుకు రాసినారు.

ఈ పుస్తకంలో నూరు కవితలుగాక, గోపాలరెడ్డిగారు అప్పుడప్పుడు అనువదించిన ఎఖ్బాల్ పది గీతాలను, ఉర్దూమూలం వేయకనే–చిన్న టైపులో–చేర్చటం జరిగింది. అందులో మత సామరస్యాన్ని ప్రబోధించే 'కొత్త శివాలయము' దేశభక్తిపూరిత మైన 'సారెజహాఁసే అచ్ఛా' అనే గీతాలు ముఖ్యమైనవి. మొన్న 23 అక్టోబరునాడు దూరదర్శిని ఆరంభ సందర్భంలో గూడా ''సారెజహాన్సె అచ్ఛా'' గీతాలాపన చేయటం చెప్పుకోదగ్గ విషయం. బహుశః హిందీ ప్రభావంవల్ల వారు దీనికి 'రాష్ట్రగీతము' అనే శీర్షిక పెట్టివుంటారు. అంతేగాదు ఎఖ్బాల్ ''ఖౌం'' అన్న చోటల్లా గోపాలరెడ్డిగారు ''రాష్ట్ర''మని వాడినారు. ఒక్కొక్క భాషలో కొన్ని పదాలు ప్రత్యేకార్థంలో వాడబడుతవి. కాబట్టి ఆయా పదాలను ఆ భాషలలోని ప్రచలిత అర్థంలోనే వాడుకోవటం సబబు. తెలుగులో రాష్ట్రమంటె ప్రాంతం. మరాఠీలో జాతీయ అంటే 'కమ్యూనల్'. తెలుగులో రాష్ట్రగీతము అంటే దానిస్థాయి తగ్గి ప్రాంతానికి సంకుచిత మవుతుంది. 1951లోనే ప్రకటించిన 'యువజన విజ్ఞానం'లో 'నేషనల్ సాంగ్స్'ను జాతీయగీతములన్నారు కీ॥ శే॥ సు. ప్రతాపరెడ్డిగారు. స్వయంగా, ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వారె 1973లో గురజాడ రాఘవశర్మగారు బహుశ్రమతో సేకరించిన 600 పేజీల ''జాతీయగీతాలు'' ప్రచురించినారు. దానికి శ్రీ గోపాలరెడ్డిగారే తొలిపలుకు వ్రాసినారు. కాబట్టి 'సారె జహాన్సె అచ్ఛా అనే' గీతానికి 'జాతీయగీతము' అనే శీర్షిక ఒప్పు తుంది. ఇకపోతే ఏ దేశానికైనా ఒకేఒక'నేషనల్'ఆంథం ఉంటుంది. నేషనల్ సాంగ్స్ వేరు. నేషనల్ ఆంథం వేరు. ఇన్ని సంవత్సరా లైనా మనం. ఆంథంకు సరితూగు పదం సృష్టించుకోలేక పోయి నాము. 'జనగణమన'ను జాతీయగీతమనే అంటున్నాం. దేశభక్తి పూరితమైనట్టి రాఘవశర్మగారి గ్రంథంలోని గీతాలన్నిటిని,జాతీయ గీతాలు' అని ముద్రవేసినాము. సాహిత్య అకాడమివంటి సంస్థ ఇందుకు పూనుకొని 'ఆంథం'కు సరిపోను శబ్దసృష్టి చేయాలె. పూర్వంజాతీయఉద్యమకాలంలో'సారె జహాఁసెఅచ్ఛా' ఎలుగెత్తి పాడు తుంటే ఒళ్లు గగుర్పొడిచేది. అందులో ఆ 'ఫోర్స్' ఉన్నది. కాని అనువాదం చదువుతుంటే అట్టి ఉద్వేగముగాని, స్ఫూర్తిగాని రావటంలేదు.

ఇక ఎఖ్బాల్ నూరు కవితలలో కొన్నింటిని ఇందులో 7 ఫార్సీ కవితలున్నవి 71 నుండి 100 వరకు 30 'ఖుదీ'ని గూర్చిన కవితలున్నవి. ఉర్దూలో అక్కడక్కడ అచ్చు తప్పులున్నవి. కాని నాగర లిపిలో మాత్రము అచ్చు తప్పులు చాలా ఉన్నవి.

మహాకవుల కవితలు అనువదించేటప్పుడు, గంభీరమైన, సున్నితమైన భావాలను విపులంగా, విశదంగా తెలియచేయటానికి వచనమే అనుకూలంగా ఉంటుంది. గోపాలరెడ్డిగారు వచనమే వాడి నారు కాని పద్యపు ఫక్కీ ఉన్నది. ఇటువంటి అనువాదాల్లో సంక్షిప్తంకన్న విపులీకరణ మంచిది.

14వది ఎఖ్బాల్ ప్రసిద్ధ కవిత. పూర్వ పాదంలో 'జలాలే బాదుషా మీహో' అంటె రాజుల దర్పముకాని, అని అంటు ''జంహూరి తమాషా'' హో అంటే 'ప్రజాస్వామ్యపు తమాషాకాని' అని ఎఖ్బాల్ వంటి మహాకవి ప్రజాస్వామ్యాన్ని అవహేళన పరచి నాడు. నయా 'శివాలా' రాసినవాడు, బీదల ఆకలి దీర్చలేని పంట చేనుల కాల్చివేయమన్న ఎఖ్బాలేనా ఇది రాసింది అని ఆశ్చర్యమవు తుంది.

ఉత్తరపాదంలో ''జుదాహోవేఁ సియాసత్‌సే'' కాని తెలుగు సేతలో ''రాజకీయాలనుండి ధర్మము వేరైతే'' అని ఉన్నది. మూలంలో ధర్మము [దీన్] అనే శబ్దమేలేదు. రాచరికపు దర్పము కాని, ప్రజాస్వామ్య వ్యవస్థ కాని ''రాజకీయాల నుండి వేరైతే హింసాకాండ మిగులుతుంది. అంటె రాజుగాని, ఎన్నుకొనబడిన నాయకులుగాని ప్రజాపరిపాలన లక్ష్యంగా పెట్టుకోవాలె. లక్ష్యం నుండి 'జుదా' అంటే దూరమైతే, వ్యక్తిగత కక్షల సాధింపుగాని, కుల మత దురహంకారాలకు గురి అయితే, 'చెంగేజ్' అంటెమీదట చంగీజ్‌ఖాన్ జరిపినటువంటి దాడులు,హత్యాకాండ మిగిలిపోతుంది. తత్ఫలితంగా పరిపాలనా యంత్రాంగం కూలిపోతుంది అనే భావం ఈ కవితలో నిబిడీకృతమై వున్నది కాబట్టి వచన రూపంలో బాగా విపులీకరిస్తేనేగాని కవితలోని గాంభీర్యము, లోతు, తెలియదు.

'ఖౌం'అన్నప్పుడల్లా రాష్ట్రమని, 'మిల్లత్‌కు'దేశమని అనువదించినారు. 'ఖౌం' అంటె జాతి అనవలె. మిల్లత్ అంటె దేశము కాదు ఒక మతానికి చెందిన వారి సముదాయం. అదిగాక 'ఖౌం, మిల్లత్' ఈ రెండూ మానవ సమాజ పరంగా వాడబడే పదాలు. అనువాదంలోని 'రాష్ట్రము—దేశము'—భౌగోళికంగా నిర్దేశింపబడే భూభాగాలు.

25వ కవితలో 'రజా'కు సంతోషము అని వాడి, 100వ కవితలో 'ఇష్టము'అని వాడినారు. రాజౌ, రజాకార్—రజామంద్—అనే శబ్దాలలో ఇష్టము అనే భావమె ఉన్నది.

49వ కవితలో షాహీన్‌ను గరుత్మంతునిగాను, బుల్‌బుల్‌ను కోకిలగాను అనువదించుట బాగా వున్నది కాని, సారే జహాఁ సె అచ్ఛా అనే గీతంలో ''హంబుల్ బులేఁ హైఁ ఇస్కీ'' అన్నదానికి ''మనము దీని బుల్ బుల్‌లము'' అని; దాగ్ అనే గీతంలో ''ఢిల్లీ బుల్ బుల్ — ఆ నందన వనమున కట్టుకొనెను గూటిని'' అని— వాడినారే గాని, కోకిల అని వాడలేదు.

67వ కవితలో అనువాదము సరిగాలేదు. రాజు, ఫకీరుల (రాగి, విరాగి) రహస్యము తెలుపుతాను. పేదరికంలో ''నిగెఃచాని ఖుదీకి'' అంటె 'ఆత్మస్థయిర్యమె రక్షిస్తుంది' అని భావం. ఔన్నత్యము అనే పదం మూలంలో లేదు. మూలంలోఉన్న 'ఫకీర్' అనువాదంలో లేదు. గరీబీ అంటె నిస్సహాయత కాదు.

చివరకు 'ఖుదీ'ని గూర్చి రెండు మాటలు: ఖుదీని; అహం, అహంభావం, తనతనం, అభిమానం, ఆత్మ, వ్యక్తిత్వం, స్వత్వంఅని సందర్భానుసారంగా వాడుకోవలె. శ్రీ కాళోజి రామేశ్వరరావుగారి వంటి ఉర్దూ భాషావేత్తలు ఖుదీని 'స్వత్వం'అన్నారు. ఖుదీని ఆత్మ అంటె మరి 'రూః' (Soul) ను ఏమనాలె? ఆత్మచావదు. రూః కూడా చావదు. 92లో ఆత్మ చచ్చిపోతే అని, 93లో ఆత్మచావగా అని అనువదించినారు. అక్కడ 'వాని అహం', స్వత్వం, లేక అభిమానం దెబ్బ తింటె, జాగృతం కాకపోతే, స్తబ్దత వస్తే, స్తంభించిపోతే'' అన్నమాట.

స్వయంగా గోపాలరెడ్డిగారే 96 కవితలో 'ఖుదీ మె డూబాహైఁ' అన్నదానికి అహం లో మునుగుతున్నారు' అని అనువదించినారు. ఇక్కడ సరిగా అన్వయించింది.

శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు

మూడు నవలలు - రెండు నవలికలు

[1. 'ఆటబొమ్మలు', 2. 'బాంధవ్య బంధితులు', 3. 'పయనించే పడవ': ఈ మూడు నవలల రచయిత్రి శ్రీమతి చెరుకూరి రమాదేవి, ప్రచురణ: న్యూస్టూడెంట్స్ బుక్ సెంటర్ విజయవాడ—2; 4 'బంగారుతల్లి', రచన: చిట్టిబాబు, ప్రచురణ : కవితా పబ్లికేషన్స్, విజయవాడ—2; ఒక్కొక్క పుస్తకం వెల రూ. 7—50.]

ఈ నాల్గు పుస్తకాలనూ చదివితే నేటి తెలుగు నవలలు చాలా వరకు కాలక్షేపానికి ఉపయోగపడే రచనలే కాని ఇతివృత్తం, దాని నిర్మాణం, ముగింపు, సందేశం, తత్త్వం, పాత్రపోషణ, శిల్పం, శైలివంటి విషయాలలో రచయితలు పరిణతి, విశిష్టత చూపలేకపోతున్నారనేది విస్పష్టం. వీటిలో మొదటి నవల ఇతివృత్తంలో కొంత ప్రత్యేకత, వైశిష్ట్యం ఉన్నాయి కాని పాత్రకు మించిన ముగింపు జరిగింది. పర్యవసానంగా అందులో విశ్వసనీయత లేకుండా పోయింది. తక్కిన వాటిని ఒకమారు చదివి మరచిపోతాము.

''ఆటబొమ్మలు'' తెలుగులో ఉన్న కొద్దిపాటి ఉత్తమ మనస్తత్వ సంబంధమైన నవలల శ్రేణిలో చేరుతుంది. ఒకానొక వ్యక్తి ఎదుర్కొంటున్న మానసిక సమస్యను కేంద్రంగా తీసుకొని, ఆ సమస్య కారణంగా ఆ వ్యక్తి జీవితం, అతనితో సంబంధం కల వారి అదృష్టాలు ఎటువంటి అవస్థల పాలవుతాయో చిత్రించిన నవల.

ఈ నవలలో కథానాయకుడు శ్రీధర్ మానసిక సమస్యవల్ల పీడితుడైన వ్యక్తి. ఇతను మంచివంశంలో పుట్టాడు. విద్యాధికుడు. ఆధునిక వ్యాపార పద్ధతిలో నిపుణుడు. పేరు, ప్రతిష్ఠ, డబ్బు, హోదా, స్నేహితాలు, పరిచయాలు అన్నీ సంపాదించాడు. కాని మానసికంగా ఘోరమైన దురవస్థలో ఉన్నాడు. అతనికి ఊహ తెలిసినప్పటినుంచీ తను ఎప్పుడో పిచ్చివాడైపోతానేమోనన్న భయం పీడిస్తోంది. అతని పూర్వీకులలో కొందరు ఉన్మాదులున్నారు. ఆ విషయం అతనికి చిన్నప్పుడే తెలిసింది. అదే మనస్సులో అజ్ఞాతంగాఉండి పెరిగేకొద్దీ పైకి వచ్చింది. అసలు పెళ్లే చేసుకోకూడదన్న నిర్ణయాని కొచ్చాడు. కాని అనుకోకుండా ఒంటరిగా ఉన్న పట్టభద్రురాలైన యువతిని ఒక్క క్షణికోద్రేకంలో దగ్గిరకు హత్తుకొని ఇంటికి తిరిగి వస్తూఉండగా చిన్నకారు ప్రమాదంలో చిక్కుకుని బైటపడ్డాడు. అతనికి శారీరకంగా ఏమీ జరగలేదు కాని, ఆ ప్రమాదానికి కొద్దిసేపు క్రితమే జరిగిన సంఘ

టనలో పూర్తిగా ఏమి జరిగిందీ జ్ఞాపకం తెచ్చుకోలేకపోయాడు. తాను ఆమెను చెరిచానేమోనని బాధపడ్డాడు. అక్కడ అతని జ్ఞాపకశక్తి దెబ్బతిన్నది. సరే, జరిగిన అన్యాయాన్ని నివారించాలనుకొని ఆమె పేదకుటుంబానికి చెందినదైనా పెళ్ళిచేసుకున్నాడు. అలా ఆ సమస్యను పరిష్కరించుకున్నానని అనుకున్నాడు కాని, అది అతని సమస్యను పెంచడానికే తోడ్పడింది. భార్య గర్భిణి అని తెలసింది. తనకు సంతతి కలుగకూడదని అతని దృఢ నిర్ణయం. తన రక్తం మోసుకొస్తూవున్న లోపాలు, భయాలు అన్నీ తనతో అంతరించి తనతో ఆగిపోవాలి. తనతోపాటు తరువాతివాళ్ళు వ్యధలపాలు కాకూడదు. గర్భవిచ్ఛిత్తికి భార్య వసుంధర అంగీకరించలేదు. పైగా అతని వైఖరి అర్థంకాక మరోలా కూడా అనుకుంది. అతని భయం సంగతి ఆమెకు తెలీదు. అతను చెప్పలేదు. స్త్రీ మగవాడిలో పిరికితనాన్ని సహించదని అతని భావం. బాబు పుట్టాడు. ఇక బంధాలు తెగకొట్టుకోవాలని నిర్ణయించుకున్నాడు. పసివాడితో అనుబంధమేర్పడి వాణ్ణి ప్రేమగా పెంచితే రేపు తను పిచ్చివాడైతే బాబుకు వ్యధ. లేక వాడు పిచ్చివాడైతే తాను భరించలేడు. ఈ దృష్టితో ఆలోచించి బాబును చేతిలోకి తీసుకోలేదు, సరికదా వాణ్ణి దగ్గరగానైనా చూడకుండా ఆమెకు దూరంగా వెళ్ళిపోయి మరోచోట జీవితం శూన్యంగా గడుపుతున్నాడు. భార్యకు అన్యాయం చేస్తున్నానన్న స్పృహ అతన్ని బాధిస్తోంది. తాను బంధించుకుపోయాననుకొని దూరంగానైతే వెళ్ళాడు కాని, అనుక్షణం భార్య బాబు మనసులో మెదులుతూనే ఉన్నారు. తాను బాధపడుతూనే ఉన్నాడు. భార్యను క్షోభపెడుతూనే ఉన్నాడు. ఒంటరితనం దుర్భరమైంది. వ్యాపారం వదల్చుకొని దేశంమీదపడి అశాంతితో తిరిగాడు. అటు భార్య అతను తన అనుమానాలను వదిలించుకొని, భవిష్యత్తుకు భయపడకుండా వాస్తవంతో రాజీపడి జీవించగలిగే మనస్థైర్యం కలిగినప్పుడే తిరిగివస్తాడని నిశ్చలత్వం ఏర్పరచుకొని ఉన్నతవిద్య పూర్తిచేసుకొని వేరొక ఊరిలో కాలేజీ లెక్చరర్‌గా చేరింది. ప్రశాంతికోసం వచ్చిన తాను పరిచయస్తులకు మనశ్శాంతి లేకుండా చేశానని త్వరలోనే తెలుసుకుంది. అతను తపనతో తిరిగి తిరిగి రైల్లో ఫస్ట్‌క్లాస్ పెట్టెలో బాగా ముసలివాడైనా ఏదో తేజస్సుకల ఒక స్వాములవారిని కలుసుకున్నాడు. అతని అశాంతిని గ్రహించిన స్వామీజీ సంగతేమిటని శాంతంగా అడిగారు. తన సమస్య నివేదించుకున్నాడు. ఆయన ''నీకు మతిభ్రమణం ఇప్పటికే కలిగింది. ఇక కలుగవలసిందేమీలేదు. అష్టైశ్వర్యాలు పెట్టుకొని అనుభవించలేకపోతున్నావు. అమాయకత్వమే నీ మతిభ్రమణం. మనమంతా భగవంతుడు చల్లిన విత్తులం. ఎవరు ఏవిధంగా రూపొందుతామో ఎవరికీ తెలియదు. జరగనిదాన్ని గూర్చికాక జరుగుతున్న దాన్ని గూర్చి ఆలోచించాలి. నీ కొడుక్కి ఎప్పుడో పిచ్చెక్కి దూరమవుతాడన్నది అప్రస్తుతం తండ్రి ఉండీ కూడా పెరుగుతూఉన్న పసివాడి అవస్థను గూర్చి ఆలోచించు'' అని నిద్రపోయారు. అతను మేల్కొన్నాడు. అతనికి ఉషోదయం అయింది. వెళ్ళి భార్యాపుత్రులను స్వీకరించి వారితో సహజీవన మారంభించాడు.

నవలలో ఏ సంఘటన విషయంలోనూ, ఏ ఘట్టం సందర్భంలోనూ సంశయం కలుగదు. కాని ముగింపు విషయమే చర్చనీయాంశ మవుతోంది. స్వామీజీ చెప్పిన మాటలతో అతని అనుమానాలు, భయాలు తొలగి అతన్ని వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం లభించిందా? ''శంఖంలో తీర్థంలా పరిపూర్ణత చెందిన స్వామీజీ మాటలు మూసుకున్న తలుపులు తెరిచాయి. వేయిరెట్లు బలం చేకూరింది. మరి మాట లేకుండా నిశ్చేష్టుడయ్యాడు''అని రచయిత్రి వ్రాశారు. శంఖంలో తీర్థంలా అన్న సామెతను ఇక్కడ ఎందుకు ప్రయోగించారో విశదీకరణలేదు. అయితే ఇక స్వామీజీ మాటలవల్ల ఇటువంటి మానసిక రుగ్మత తొలగిపోతుందా అన్న ప్రశ్న రావచ్చు. ఇటువంటి సమస్యలు, రుగ్మతల విషయంలో రెండు రకాల పరిష్కారాలే ఉంటాయి. ఒకటి — ఆ రుగ్మత దాని గమనంలో పరాకాష్ఠకు చేరుకొని వ్యక్తి విచ్ఛిన్నం కావడమో, లేక పరాకాష్ట దశలో భౌతికమైన చికిత్సవల్ల కర్మఫలాన నయమై సాధారణ మానసిక స్థితికి రావడం. రెండవది ఒకానొక మహత్తర పారమార్థిక లేక లౌకికాతీత ప్రభావంవల్ల మనస్సు జయింపబడి వ్యక్తి ఆలోచనలో ప్రవర్తనలో పరివర్తనం రావడం. ఇక్కడ రచయిత్రి రెండవ దానిని అతనికి లభ్యమైన పరిష్కార మార్గంగా చూపెట్టారు. ఇది ఆమోదయోగ్యమే. అయితే అలా కలిగిన పరిణామం క్రమానుసారంగా లేక ఈ కథలో ఆకస్మికంగా సంభవించినట్లున్నది. ఈ నవల 1977 జూన్‌లో మొదట పుస్తకంగా వెలువడింది. ఈ సందర్భంలో ఈ తరహాకే చెందిన శ్రీ ఆర్. ఎస్. సుదర్శనంగారి 'సంసార వృక్షం' నవల జ్ఞాపక మొస్తున్నది. అది 1976 జులైలో ప్రచురితమైంది. అందులో భార్యప్రవర్తనపై కలిగిన అనుమానం, తత్ఫలితమైన మానసికావస్థ కథానాయకుని ఎదుర్కొన్న సమస్య. అయితే అందులో ఒక కథానాయకునికి తగిన పూర్వరంగం ఉంది. అతను మేధోపజీవి. హేతువాదంపై అభిమానం కలవాడు. సమదర్శిత్వం అలవరచుకోవడానికి సాధన చేస్తున్నవాడు. ఇటువంటి ప్రాతిపదికను ఏర్పరచడమేకాక రచయిత కథానాయకుణ్ణి ముగ్గురు స్వాములవార్ల దగ్గరకు తీసుకువెళ్ళి పారలౌకికమైన ఆధ్యాత్మికమైన చర్చల ద్వారా, వాటివల్ల కలిగే అనుభవాల ద్వారా నవలను అస్తిత్వవాద — వేదాంత ధోరణితో ఒక సమున్నత తాత్త్వక స్థాయికి తీసుకువెళ్ళారు. కాబట్టే పాఠకుడు అతనికి కలిగిన పరివర్తన విషయమై సందేహం వెలిబుచ్చజాలడు కాని ప్రస్తుత నవలలో రచయిత్రి కథానాయకుని ఒక బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌గా చూపారేకాని అతనికి ఆధ్యాత్మికమైన తాత్త్వికమైన పూర్వ రంగం ఉన్నట్లు ఏమీ చెప్పనేలేదు. కథాగమనంలో అతని మానసికావస్థనూ, ఆ అవస్థతో దాంపత్య జీవితంలో అతని వైఖరినీ బాగా చిత్రించారేకాని, ఆ అవస్థను అధిగమించడానికి కారకమైన హేతువును (ఏదో చివర కొంతగా చెప్పి అతను ఆ విధంగా దశా పరిణామం చెందినట్లు వ్రాశారు తప్ప) కథా శరీరంలో ప్రబలమైన అంశంగా చూపలేదు. సాహిత్య విషయకంగా చూస్తే ఇది పెద్ద లోపమే. ఒక మహా పరిణామాన్ని గూర్చి చెప్పినప్పుడు దానికి తగిన ప్రాతిపదిక రచనలో లేనప్పుడు అది ఒప్పింప

దగినదిగా ఉండదు. కాకపోతే కేవలం తిరుపతి వేంకటేశ్వరస్వామి దివ్య విగ్రహ సందర్శనం వల్లనే నాలో ఏదో మార్పు వచ్చేసింది' అని ఎవరైనా అంటే నమ్మవలసి ఉన్నట్లే ఏదోఒక దివ్యతేజస్సూ వర్చస్సూ ఉన్న స్వాములవారి హితోపదేశంవల్ల అతనికి తెలిసి వచ్చిందంటే అవును కాబోలు అనుకోవాలి.

సహజమైన రచనా శైలి. కథను ఎక్కడా సాగదీయడం లేదు తాను పెట్టుకున్న లక్ష్యంపైనే రచయిత్రి దృష్టిని కేంద్రీకరించి కథాంశాన్ని సందర్భోచితంగా సముంజసమైన వ్యాఖ్యలతో ముగించారు. 89వ పేజీ క్రింద వడ్డిస్తున్నది ఎవరో తెలుపలేదు. పాఠకుడు కొంచెం తికమకపడి తర్వాత భావించుకోవాలి. ప్రచురణకర్తలు ఇటువంటివి చూచుకోవాలి.

''బాంధవ్య బంధితులు'' నవల విశిష్టమైన రచన కావడానికి అవసరమైన కథా సామగ్రి ఉండికూడా నిర్మాణలోపంవల్ల (దీనినే మనలో కొందరు శిల్పం లేకపోవడం అంటారేమో) ఏ మాత్రం ప్రత్యేకించి చెప్పుకోదగ్గ నవల కాలేకపోయింది. రచయిత్రి కేవలం ఒక కథ పూర్తిచేసి ఇదిగో ఒక నవల అని పాఠకులముందు ఉంచారేమో అనిపిస్తుంది. ఈ నవలలో రెండు కథా వస్తువులు విశేషించి పేర్కొనదగ్గవిఉన్నాయి. ఒకటి కథానాయకుడు మెడిసిన్ చదివికూడా అతని మనఃప్రవృత్తికారణంగా ఆ వృత్తికిపనికిరాకుండా పోయి, చివరకు ఎక్కడో ఏదో మరో వృత్తిలో స్థిరపడిపోవడం. రెండవది అతని జన్మ రహస్యం తెలిసిన తర్వాత అతని ప్రవర్తన, అసలైన తల్లిదండ్రులతో అతని సంబంధ బాంధవ్యాలు. నిజానికి ఇందులో ఏ ఒక్కటైనా చాలు; ఒక ప్రత్యేక ధోరణికల నవలను సృష్టించడానికి తగినంత అవకాశమున్నది. సరే, రచయిత్రి రెండిటినీ ఒకే దానిలో ఇమిడ్చారు. స్వీకారయోగ్యమే. అయితే అటువంటప్పుడు ఏదో ఒకదానికి మాత్రమే ప్రాధాన్యమిచ్చి ఆ అంశంపైననే కేంద్రీకరించినట్లయితే ఇదొక విశిష్టమైన రచనఅయ్యేది. ఇప్పుడు రెండింటిలో ఏదీ ప్రత్యేకత సంతరించుకోకుండా కథ ముగిసిందనిపించారు.

నవల ప్రథమ భాగం నడక చాలా మందగమనంగా ఉంది. 240 పేజీల నవలలో 95వ పేజీ వరకూ అసలు శ్రీనివాస్ మెడిసిన్ చదివాడా లేదా అన్నది అతనికి ప్రియురాలు, తరువాత భార్య అయిన అనూరాధకు ప్రశ్నగానే ఉండిపోయింది. వారిద్దరి పరిచయానికీ, ప్రేమకూ అన్ని పేజీలు ఖర్చు చేయడం వ్యర్థం. సరే, వైద్యశాస్త్ర పట్టభద్రుడని ఎట్టకేలకు తేల్చారు. కాని శ్రీనివాస్ డాక్టరుగా వృత్తిలో స్థిరపడలేకపోతాడు. అతనికి మొదటి నుంచీ చావును గూర్చి విపరీత భావాలున్నాయి. అతనికి ఏడెనిమిదేళ్ల వయస్సులో చాలా మరణాలు చూచాడు. తాను డాక్టరుగా పనికిరాను అన్న నిర్ణయానికి రావడానికి రచయిత్రి కొన్ని కారణాలు చెప్పారు. శ్రీనివాస్ హౌస్ సర్జన్‌గా చేస్తున్నప్పుడు పిల్లలతల్లి అయిన ఒక రోగికి ఒక రాత్రి చాలాప్రమాదించి కోమా వచ్చి అలాగే ప్రాణం పోయింది. అంతకు ముందు తనకు చెయ్యాలని తోచిన వన్నీ చేశాడు. సీనియర్ డాక్టరుకు కబురు కూడా చేశాడు. ఈ లోపల రోగి మరణించేసరికి బెడ్ దగ్గరికి వెళ్ళి ఆమెను చూచే ధైర్యం కూడా అతనికి లేకపోయింది. చివరి సమయంలో రోగిదగ్గిర ఉండకుండా వెళ్ళిపోవడం డాక్టరు చేయవలసిన పని కాదని సీనియర్ చీవాట్లు పెట్టాడు. రెండవది అతని నాన్నగారి మరణం. అది గుండెపోటువల్ల. తనే ప్రథమ చికిత్సచేశాడు. తనపై తనకు నమ్మకం పోయింది. ప్రాక్టీసు పెట్టిన తర్వాత మరొక రోగి చావు అతనికి మూడో పరీక్ష. ఈ సందర్భంలో అతని బలహీనత అతన్ని మానవత్వమున్న మనిషిలా కూడా ప్రవర్తించకుండా చేసింది. దీనికంతటికీ తనమానసికమైన బలహీనత అని తెలిసిపోయినా దానిని అధిగమించలేకపోయాడు. ఈ స్థితిలో అతను ప్రేమించిన అనూరాధ కేవలం అతని ఉన్నతిని వాంఛించి అతన్ని వైద్య వృత్తికే అంటిపెట్టుకొని ఉండి అందులో పేరు తెచ్చుకోవలసిందని ప్రోత్సహించింది. పేరుపడ్డ సర్జన్ డాక్టర్ కృష్ణమూర్తిగారు కూడా నచ్చచెప్పి తగు విధంగా అతనికి సహాయపడ్డారు. కాని మరొకమారు ప్రయత్నించి విఫలుడయ్యాడు శ్రీనివాస్. తన భార్యకు కావలసింది ఒక డాక్టర్ కాని తనున్న స్థితిలో తాను కాదని భావించి విడాకుల వరకూ వస్తాడు. నిజానికి రచయిత్రి అతని వైఫల్యానికి అతనిలో కలిగిన మానసిక సంఘర్షణను చాలా బాగా చిత్రించారు. అంతగా విషమ స్థితిని పతాకస్థాయికి తీసుకువెళ్ళి కూడా ఆ తరువాత కథను దాని సహజమైన ముగింపుకు తీసుకుపోయి, అతను అంతగా ప్రేమించి పెళ్ళిచేసుకున్న అనూరాధ ప్రోత్సాహంవల్ల రెండవసారి హౌస్‌సర్జన్‌గా చేరినప్పుడైనా తన బలహీనతను జయించి వృత్తిలో కృతకృత్యుడైనట్లూ, అందులోనే స్థిరపడినట్లూ, అది జరిగిన వైనాన్నీ చూపి ఉంటే నవలకొక ప్రయోజకత్వం పరిపూర్ణత సిద్ధించి ఉండేవి. ఆ సూచనలు అతనిలో కన్పించాయి : ఇల్లు కాలినప్పుడు పసిపిల్లను అతను శస్త్ర చికిత్సతో రక్షించడం. కాని రెండవ కథ అయిన అతని జన్మ రహస్యం బైటపడటంతో ఆ వృత్తాంతం, దానివల్ల కలిగిన మనఃక్లేశం అడ్డువచ్చి అతను తిరిగి వెంటనే భార్య కౌగిలిలోకే వచ్చి పడేట్టు చేశాయి. దారికొచ్చాడు, అంతేచాలు కదా అని చెప్పి అనురాధ కూడా అతని వైద్యవృత్తి విషయం అతనితోపాటే పూర్తిగా అంతటితో వదిలేసింది. అంతే, అతను జీవితంలో ఎన్నటికీ డాక్టరు కాలేకపోయాడు. అతని వైఫల్యాలను, వాటికి గల కారణాలను అంత విశదంగా రచించి కూడా ప్రయోజనం లేకుండా పోయింది! ఈ అంశంతో ఉదాత్తమైన కథను నిర్మించి మహోదాత్తమైన పాత్రల నిర్మాణానికి గల అవకాశాలను రచయిత్రి వినియోగించుకోలేకపోయారు.

ఇక రెండవది శ్రీనివాస్ జన్మరహస్యం. నవలలో ఒకచోట చర్చ జరిగినట్లే భారతంలో కర్ణుడికి తెలిసినట్లు ఇతనికి కూడా ఎప్పుడో చాలాకాలం తరువాత తెలిసిందిది. శ్రీనివాస్ తల్లి సావిత్రే కాని, తండ్రి 'నాన్నగారు'కాదు. బ్రహ్మచారి డా.కృష్ణమూర్తిగారికే ఆయన మరదలు పెళ్ళికాని పదహారేళ్ళ బాలిక సావిత్రికీ ఒక్క

పొరపాటువల్ల పుట్టినవాడు శ్రీనివాస్. ఆ సంగతి కృష్ణమూర్తి గారికి కూడా శ్రీనివాస్ ఇల్లు వదిలివెళ్ళి అనూరాధవద్దకు చేరిన తర్వాత—అదీ సావిత్రి పనిగట్టుకొని వచ్చి చెబితే కాని తెలియలేదు. అంతవరకూ తనకు పిల్లలే లేరని ఆయన అనుకుంటున్నాడు. సరే, పరిస్థితులు అలావచ్చాయి. సావిత్రి, కృష్ణమూర్తిగారట అతనికి విడివిడిగా వ్రాసిన వ్యక్తిగత లేఖలవల్ల ఏ పరిస్థితిలో అతనుపుట్టిందీ విశదమైంది. అతను అసలే మృదుహృదయుడు. చాలా సున్నితమైన స్వభావం కలవాడు. ఈ నిజం అతనికి మానసికంగా మరొక విపరీతస్థితిని తెచ్చిపెట్టింది. అతని మనస్సు అసహ్యంతో నిండి పోయింది. తల్లికి పెళ్ళి కాకమునుపే తను పుట్టాడు. దేనికైతే వెలలేని విలువ ఇస్తామో దాన్ని కోల్పోయిన స్త్రీ తన తల్లి! పైగా తాను వినలేని విషయాన్ని చెప్పి తనతల్లి తన విలువ పోగొట్టిందని బాధ పడ్డాడు. ఆడదాన్ని అనుభవించడంతప్ప తరువాత అతీగతీ పట్టించుకోనివాడు తనకు తండ్రి! తనజన్మకు పవిత్రతలేదనీ, తన బతుక్కి అర్థంలేదనీ నిస్పృహ చెందాడు. సావిత్రి కొడుకును తనను ప్రేమించకపోతే పోయావు, ద్వేషించవద్దు అని ప్రాధేయపడుతుంది. ఆమెకు కట్టుకున్న భర్తకూడా పోయాడు. ఆమె రోగి. అయినా ఆమెను క్షమించే ఔదార్యం అతనికి లేకపోయింది. అయితే ఇక్కడ అతని ప్రవర్తనను పూర్తిగా ఖండించలేము. అభిమానధనుడు అని కూడా సరిపెట్టుకోవచ్చు. కొందరికి మానసికంగా ఈ విషయంలో గట్టి పట్టింపులుండటం కద్దు. కృష్ణమూర్తిగారు కూడా అతన్ని కేవలం తన శ్రేయోభిలాషిగానైనా మన్నించమని బ్రతిమాలారు. అతనికోసం ఉద్యోగం వదిలి ఊరు వదిలి దూరంగా వెళ్ళిపోయారు. ఇదిగో ఇక్కడ ఏ నవలా రచయితకైనా చాలా మంచి అవకాశమిచ్చే కథా సందర్భం ఉంది. ఒకవైపు కన్నతల్లి. కాని మరొకరికి భార్య. రెండవవైపు కన్నతండ్రి. కాని ఆయన తనను పెంచి పెద్దచేయలేదు. స్నేహితులుగా పరిచయమయ్యారు. మరొకవైపు జీవితంలో ఎదురు దెబ్బలు తిన్న మరీ సున్నిత హృదయుడైన తాను ప్రతిభావంతుడైన రచయితకు ఈ త్రయం చాలు, మానవ సంబంధాలలోని సంకీర్ణ, సంక్లిష్ట అవస్థలను చూపి, బాంధవ్య బంధితులైన వారి హృదయాల రోదనను పాఠకులకు హృదయ విదారకంగా చిత్రించి రక్త సంబంధంలోని చిక్కును కళాత్మకంగా చెప్పడానికి రచయిత్రి వారి ఈ అవస్థలో రచనకు ఎట్టి అవకాశముందో పట్టించుకోనట్లు కన్పిస్తుంది. అసలు ఆ సమస్య లోతులకే వెళ్ళలేదు. ఆ స్థితిలో ఉన్న ఆ ముగ్గురు జీవులకూ ఎటువంటి సమస్యలు ఉత్పన్నమవుతాయో, వాటితో ఎంతగా విలవిలలాడిపోతారో, మానవాత్మ అనేది సాంఘికమైన పరిస్థితికి ఎంత అతీతమైనదో, అది వారిని ఎలా ఏకం చేయగలదో, స్పృశించి చూడలేకపోయారు. తల్లికి ప్రమాదంగా ఉన్నదని టెలిగ్రాము వస్తే హుటాహుటి శ్రీనివాస్ భార్యతో ఆమె దగ్గరికి వెళ్ళడమూ, ఆమెకు ఆపరేషన్ అవసరమంటే కృష్ణమూర్తిగారు వచ్చి చేయడమూ, తిరిగి వెళ్ళిపోవడమూ శ్రీనివాస్‌కు ఆయనపై సద్భావం ఏర్పడటమూ చూపారు. అంతే. ద్వేషాన్ని ప్రేమ జయించడాన్ని సంఘటనలద్వారా సాహిత్యకంగా గాఢమైన చిత్రణతో చూపెట్టి ఈ రచనను మరుపరానిదిగా చేయలేకపోయారు.

"పయనించే పడవ" నవలలో రెండుకథలు సమాంతరంగా నడిచాయి. ఒకటి కృష్ణారావు కథ. రెండవది భాస్కర్ కథ. కనకదుర్గను పెళ్ళిచేసుకొని ఆమెను గాఢంగా ప్రేమించి, కొన్నాళ్ళు వైవాహిక జీవితం గడపి డాక్టర్‌గా విశేషానుభవంకోసం అమెరికా వెళ్ళి అక్కడ భార్య దుర్గ ప్లేన్‌లో రాబోతోందని తెలిసి ఎనిమిది నెలల ఎడబాటు తర్వాత తమ సమాగమంకోసం ఎంతో ఆత్రంతో ఎదురు చూస్తున్న కృష్ణారావు దుర్గ ప్రయాణంచేసే విమానం ఆల్ప్స్ పర్వతాలలో ప్రమాదానికి గురి అయి కూలిపోయిందన్న వార్త తెలిసి ఘోరమైన విషాదానికి లోనవుతాడు. తర్వాత భాస్కర్‌తో మద్రాసులో పరిచయం పెంపొంది, ఆతని చెల్లెలు పద్మ భర్తచే విడాకులివ్వబడ్డ అచుంబితమైన కన్య అని తెలిసి ఆమెకు సన్నిహితుడై జరిగినదాన్ని మరచిపోలేకుండా బాధపడుతూన్న పద్మతో 'జీవితమనేది బయలుదేరబోయే నావలాంటిది. ప్రయాణానికి అవసరమైనవి ఉన్నాయికదా అని ఒంటరిగా పయనించడం అనేది ఎవరికీ సాధ్యం కానిది. అందులోకి కావలసినవి ఎవరికివారే సమకూర్చుకోవాలి. ఎదురైనవి చేయిజార్చుకొని, చేయిజారినవాటిని గూర్చి విచారించడంతో నుగియని ప్రయాణానికి తోడు ఎంతైనా అవసరం'' అని చెప్పి ఆమెను ఒప్పించి తన సహధర్మచారిణిగా స్వీకరిస్తాడు కృష్ణారావు. ఇక భాస్కర్ పెళ్ళిచూపులకు వెళ్ళి విజయను చూచి ఇష్టపడతాడు. కాని పిల్లనివ్వబోయే మామగారికి అతనిపై ఒక అపోహ కలగడంతో ఆ పెళ్ళి ఆగిపోతుంది. కొంత కాలం తర్వాత ఆ విజయతోనే భాస్కర్ పెళ్ళి జరుగుతుంది. ఇట్లా ఇద్దరు మిత్రులూ తిరిగి జీవితంలో పునరావాసం పొంది గృహస్థు లవుతారు. అంతకుమించి ఈ కథకు వేరే పెద్దగమ్యం, ప్రాముఖ్యం లేవు. అసలు కొన్నిచోట్ల కథ సముద్రమధ్యంలో పయనించే పడవలాగా దారీ దిక్కూ లేనట్లుగా నడుస్తుంది. చివరకు శుభాంతమవుతుంది.

భార్యపోయి ఇంకా ఎంతో జీవితం ముందున్న యువకునికి, అందులోనూ జీవితమంతా ఒంటరిగా గడిపేయాలన్న వాంఛ, ఓపిక రెండూలేని వ్యక్తికి ఈ నవల కృష్ణారావు జీవితం ద్వారా ఒక మంచి సలహా చెప్పింది. అదేమిటంటే— భార్య పోయిన తర్వాత మళ్ళీ పెళ్ళి చేసుకోదలచితే బాగా పరిచయమై నిన్ను కొంతైనా అర్థం చేసుకోగలదనుకున్న పిల్లను పెళ్ళాడు. అంతేకాని ముక్కూ మొహం తెలియని అమ్మాయిని వివాహం చేసుకోవద్దు, అని. అలా చేసుకుంటే రెండో పెళ్ళి భర్త అని ఆ పిల్ల జీవితాంతం అనుకుంటుందనా ?

కొత్తగా అమెరికా వెళ్ళేవారు ఈ నవల చదువుకొని వెడితే కొంతఉపయోగంగానే వుంటుందనిచెప్పాలి. అక్కడి న్యూయార్కు, డెట్రాయిట్ నగరాల ఈషద్దర్శనం ఈ నవల కలిగించడమేకాక,

అమెరికనుల జీవితాన్ని కొంత చూపింది. ముఖ్యంగా అక్కడివారు ప్రయోగిస్తూ వుండే కొన్ని మాటలు యిందులో పుష్కలంగా ఉన్నాయి. వారి నిత్య వ్యవహారం ఈ నవల కొంతవరకు తెలిపింది.

ఈ నవలలో రచయిత్రి రచనాశైలి ఇంతకు మునుపటి రెండు నవలలకన్నా కొంత భిన్నంగా ఉంది. ఇది చదువుతూఉంటే ఆ రచయిత్రే ఇది వ్రాసిందా అని ఒక్క క్షణం ఆశ్చర్యపోతాము. దీనిలో రచన అంత ప్రౌఢంగా, కుదురుగా, మగరాయుడిలా నిస్సంకోచంగా సాగింది. కొన్నిచోట్ల వర్ణనలు, ఉపమానాలు హృదయంగమంగా సందర్భ శుద్ధితో కూడిన ఔచిత్యంతో నిండి ఉన్నాయి. ఉదాహరణకు : ''నిండుగా ప్రవహించి ఎండిపోయిన నదిలా అతని కళ్లు తడారిపోయాయి. పొంగి పొరలిన నదిమీద మట్టి బీట వేసి సట్లు, మమతలు ఉద్రేకాలు పొంగిన అతనిమనసుపై వైరాగ్యంతో గాంభీర్యపు పొడ పడింది'' వంటివి. కాని ''విదియ చంద్రుడు వెన్నెల కురిపిస్తున్నాడు'' అనడం ప్రశ్నలకు తావిస్తుంది. ఏ విదియ ? పౌర్ణమి ముందు విదియా ? తరువాతి విదియా?

ఈ నవలలో భారత దేశీయులు ఆలోచించవలసిన ఒకవాక్యం ఉంది. ఒక పీస్‌కోర్ వలంటీరు ఇండియా నుండి ఇండియాను గూర్చి అమెరికాలోఉన్న తనకు కాబోయే భార్యకు వ్రాస్తూ ''దేశంలో చేయవలసిన పని ఉంది చేసేందుకు మనుషులూ ఉన్నారు. కాని ఎక్కడ చూచినా నిరుద్యోగమే'' అని వ్రాశాడు. ఈ సమస్య పీస్‌కోర్ ఉన్నప్పటి భారతదేశంలోనేకాక నేటికీ జటిలమైన సమస్యగానే ఉంది.

''బంగారు తల్లి'' అనే పుస్తకం ఒక నవల కాదు, రెండు నవలికల సంపుటి. డాక్టరు కృష్ణమూర్తి, రాజేశ్వరి దంపతుల ఏకైక కుమార్తె బంగారుతల్లి; అసలు పేరు సుమతి. ఇల్లరికం వచ్చిన ఆమె భర్త నిర్దయగా ఆమెను వదిలి స్వగ్రామం వెళ్ళిపోతే ఆమె భర్తకోసం అత్తగారింటికివెళ్ళి అకాల మరణం చెందింది. డా. కృష్ణమూర్తిగారు కూతురి మరణం సంగతి భార్యకిమూడేళ్ళ దాకా తెలియనీయలేదు; గుండెనొప్పి జబ్బుకల ఆమె చనిపోతుందేమోనని. భార్య బ్రతికి ఉండాలంటే ఆయనకు మరి అదొక్కటే మార్గం కన్పించింది కరుణామయమైన గాథ. డా.కృష్ణమూర్తిగారిని మరీ అమాయక వైతుగా, బస్తీలో పెద్ద ప్రాక్టీషనర్ అయి లక్షలు గడించిన తర్వాత కూడా చిత్రించడం విడ్డూరంగా ఉంది. ఆ పాత్ర బస్తీకి వెళ్ళి చదువుకునేదాకా, లేదా చదువు ముగిసేదాకా అలా వుంటే కొంత సహజత్వం ఉండేది. తన కూతురికి 20ఏళ్ళ వయస్సు అయితే ఆయన 15, 16 ఏళ్ళు ఉండవూ? అంటాడు భార్యతో. హాస్యం పట్టించినట్టుగా (Caricature) వుందీపాత్ర. ఈ నవలలో ప్రస్ఫుటంగా కన్పించేది సందర్భ శుద్ధిలేని సెక్సు ప్రస్తావన. 45వ పేజీలో పెద్దవాళ్ళయిన భార్యాభర్తల సంభోగాన్ని సూచించే సంభాషణలు జుగుప్సాకరంగా ఉన్నాయి. కథకు ఏ మాత్రం అవసరంలేని సన్నివేశం అది. అసలు రచయిత కలం ఉండి ఉండి పక్కోజాలకేసి పోతూ ఉంటుందా అనిపిస్తుంది కొన్నిచోట్ల రచన చదువుతూ ఉంటే ! ఈ ధోరణి ఈ రెండు నవలికల్లోనూ అక్కడక్కడా కన్పిస్తుంది : ''రాజేశ్వరి చిన్ని వక్షం జల్లుమన్నది, పులకరింపుకి పై స్థితిగా దాన్ని ఊహించుకోవచ్చు'' వగైరా. అలాగే విడిదింట్లో ఆడపిల్లల్ని వర్ణిస్తూ ''చిలిపిగాలి అల్లరిచేస్తూ పొటకరించిన చిన్ని వక్షాల మీది పైటని దిగజార్చుతున్నది,'' అని వ్రాయడం రచయిత దృష్టిని సూచిస్తుందిగాని ఆ సందర్భం అందుకు తగినదని అనుకోలేము. ఈ నవల పల్లెటూరిలో పుట్టి పెరిగిన వ్యక్తుల జీవితాలకు సంబంధించినది. ఇందులో అంతగా ఆంగ్లపదాలువాడటం అనవసరం. కాని రచయిత వాటిని యథేచ్ఛగా ప్రయోగించి ఆంగ్లంరాని పల్లీయులు దేశీయత కల ఈ కథను చదువుకొని ఆనందించకుండా చేశారు. తెనాలి పట్టణం వ్యభిచారానికి ఆంధ్రప్యారిస్‌గా పేరుమోసినదని వ్రాశారు. రచయితకు లభించిన సమాచారం సరికాదు. ఆ పట్టణం ఒకప్పుడు రచయితలకూ, కళాకారులకూ కేంద్రం కాబట్టి దానికా ఖ్యాతి వచ్చింది. అయినా ఇటువంటి విషయాల ప్రస్తావనలో కొంత నిగ్రహం అవసరం.

''ఏమిటిది? చిట్టిబాబు'' అనే నవలిక ముఖ్యంగా శ్యామల అనే యువతి భగ్నప్రేమకు సంబంధించిన కథ. మొదట ఆమెను ఆమె అందానికి ప్రేమించి, డబ్బు అవసరంవల్ల సావిత్రిని చేసుకున్నాడు కాబట్టి ఇది శేషు భగ్నప్రేమగాథ కూడా. ప్రేమగాథ సంతతాసక్తిదాయకమైనదికదా! అయితే రచనలో కొంత సవ్యత్వం ఉంది. వాస్తవికత ఉంది. ఆదర్శం ఉంది విపరన.

— డి రా

రామాయణ సుధాలహరి

(వివిధ వాఙ్మయ రామాయణాలపై వేర్వేరు విద్వద్విమర్శకుల ఉపన్యాసాలు. డెమ్మీసైజు 20+23+18+14+22+28+21+30+32 పుటలు. వెల 8 రూ. ప్రకాశకులు — యువభారతి, 5. కింగ్స్‌వే, సికిందరాబాదు—3.)

రామాయణాన్ని గురించి తెలియని తెలుగువారు ఉండరు. చాలామందికి సంస్కృతంలోని రామాయణాలను గురించీ, తెలుగు వాఙ్మయంలోని రామాయణాలనుగురించీ తెలియును. కొందరుతెలుగు రామాయణాలను గురించిమాత్రం ఎరుగుదురు. సంస్కృతాంధ్రాలలో వలెనే హిందీ మొదలైన ఉత్తరదేశీయ భాషల్లోనూ, తమిళం మొదలైన దక్షిణ దేశీయ భాషల్లోనూ కూడా రామాయణాలు సుప్రసిద్ధంగా ఉన్నవి. ఇవన్నీ కొన్ని కొన్ని మార్పులు కలిగిఉండడం సహజం. భారతీయులందరికీ ఎంతో ప్రధానమైన ఈ రామాయణాన్ని గురించి సమగ్రంగా తెలుసుకోవాలనే కోరిక చాలామందికి ఉండవచ్చును. కాని భాషాంతరాలతోడి పరిచయంలేని వారి కోరిక సఫలం కావడం అసాధ్యం. అసాధ్యమైన ఆ కోరికను సాధ్యమైనదిగా చేయడానికి పూనుకొని అవిచ్ఛిన్నంగా భాషా వాఙ్మయసేవ

చేస్తున్న 'యువభారతి' సంస్థవారు ఈ ''రామాయణ సుధా లహరి''ని ప్రకటిస్తున్నారు.

ఇందులో రెండు సంస్కృత రామాయణాలపైని, తమిళ మలయాళ కన్నడ హిందీ రామాయణాలపైని, జానపద రామాయణాలపైని, తెలుగు రామాయణాలపైని, ప్రత్యేకించి శ్రీ మద్రామాయణ కల్పవృక్షంపైని ప్రసిద్ధాంధ్ర సాహిత్య విమర్శకు లిచ్చిన ఉపన్యాసాలు పొందుపరచబడిఉన్నవి.

ప్రప్రథమంగా సంస్కృతంలో వాఙ్మయరూపం పొందిన వాల్మీకి రామాయణాన్ని పరిశీలిస్తూ డాక్టర్ దివాకర్ల వేంకటావధానిగారు శ్రీరాముని అవతారమూర్తిత్వాన్నీ, ఆదర్శ శీలాన్నీ వివరిస్తూ, దాని ఆదికావ్యత్వాన్ని సమర్థించారు. వాల్మీకి కవితాశక్తిని ప్రశంసించారు. రామాయణంలో ఎన్నదగిన కొన్ని ఉత్తమ శ్లోకాలనూ, వాని అభిప్రాయాలనూ వివరించారు.

డాక్టర్ ధూళిపాళ శ్రీరామమూర్తిగారు పురారికృతమైన అధ్యాత్మ రామాయణాన్ని గురించి వివరిస్తూ శ్రీరాముడు సృష్టిస్థితిలయాలకు కారణభూతుడు, మాయాశ్రయుడూ, మాయాతీతుడూ అయిన పరబ్రహ్మస్వరూపుడని సహేతుకంగా చెప్పారు.

డాక్టర్ చల్లా రాధాకృష్ణశర్మగారు తమిళ, మళయాళ రామాయణాలను గురించి ఎన్నో విషయాలు తెలియజేశారు. కంబ రామాయణంఅని పేరుపడిన కంబమహాకవి రచన పేరు రామావతారమనీ, రామకథై, కంబనాటకం అనేవి నామాంతరాలనీ చెప్పారు. మలయాళంలో తుంజత్తు ఎళుత్తచ్చన్ మహాకవి రచించిన అధ్యాత్మ రామాయణం మిక్కిలి ప్రఖ్యాతి కెక్కిందన్నారు తమిళంలో అతిప్రాచీనమైన సంగయుగంలోనే రామకథ ప్రసిద్ధంగా ఉన్నదన్నారు. పెరియ వాచ్చాన్ పిళ్ళై అనే వైష్ణవాచార్యుడు పాశురప్పడి రామాయణాన్నీ, ఒక జైనకవి కూడా ఈ గ్రంథాన్నీ రచించినారట! శ్రీరాముని ప్రశంసా పూర్వకాలైన కీర్తనలు ఎన్నో ఆ వాఙ్మయంలో కానవస్తున్నాయి.

నవశకం ప్రారంభమయ్యేవరకూ మలయాళంలో తమిళ భాషాప్రభావమే కానవస్తూ ఉండేదట! ఎళుత్తచ్చన్ రచనలో దానికి బిగి, బిగి కలిగి ఒక విశిష్టత, ప్రత్యేకత ఏర్పడినవి. ఇతని రామాయణం పండిత పామర రంజకమై ఉన్నందున, అంతకు ముందు ఉండిన రామాయణాలకు ప్రచారం లేకపోయిందని డాక్టర్ శర్మగారంటున్నారు.

కన్నడ రామాయణాలను గురించి చెప్తూ డాక్టర్ బాడాల రామయ్యగారు కన్నడ ప్రాంతంలోని అన్ని మతాల వారికీ రామాయణంపైని ఆదరం ఉన్నదన్నారు. జైనులు, బ్రాహ్మణులు, భక్తులు తమకు తోచినట్లు రామకథలను వ్రాశారట ! జైనరామాయణాల్లోని కథాభేదాలను ఆయన వివరించారు. తోర వెనరహరి రచించిన రామాయణమే సుప్రసిద్ధమైనదట! అందలి విశేషములిందు వివరించబడినవి.

హిందీ రామాయణాలను గురించి తెలుపుతూ వార్ధణాసి రామమూర్తిగారు హిందీలో చాలా రామాయణా లున్నవనీ, వాటిలో గోస్వామి తులసీదాసు రచించిన 'రామచరితమానస'కే ప్రఖ్యాతి లభించినదనీ చెపుతూ అందలి విశేషాలనూ విపులీకరించారు.

జానపద వాఙ్మయంలో ప్రత్యేక కృషిచేసిన డాక్టర్ బి. రామరాజుగారు ఆ వాఙ్మయంలోని రామాయణ కథలను గురించి వివరించారు. ఆయా కథా విశేషాలను తెలిపే భాగాలను ఉదాహరించారు కూడా.

కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు తెలుగు వాఙ్మయంలో ఉన్న రామాయణాలన్నింటిని గురించీ సంగ్రహంగా తెలియజేశారు. రంగనాథ రామాయణం, దాని కర్తృత్వ చర్చ, భాస్కర రామాయణం, మొల్లరామాయణం, రామాభ్యుదయం, కట్టా వరదరాజు రామాయణం, రఘునాథ రామాయణం, అచ్చతెలుగు రామాయణం, గోపీనాథ రామాయణం, ఆంధ్రవాల్మీకి రామాయణం, శ్రీ మద్రామాయణం, ధర్మసార రామాయణం, శ్రీరామ కథామృతం, శ్రీకృష్ణరామాయణం, గోవిందరామాయణం, సుభద్రా రామాయణం, సరస్వతీ రామాయణం, మానికొండ రామాయణం, యోగానంద రామాయణం, జగన్నాథ రామాయణం, దాశరథి విలాసం, రామోదయం, శ్రీమద్రామాయణకల్పవృక్షం, ఉత్తరరామాయణం, భారత, భాగవతాల్లోని ఉపాఖ్యాన రూప రామాయణాలు, చంపూరామాయణం, అధ్యాత్మ రామాయణం, ఆనంద రామాయణం, యథాశ్లోక తాత్పర్య రామాయణం, మౌక్తికారామాయణం, వచన రామాయణాలు (గ్రాంథికభాషలోనూ, వ్యావహారిక భాషలోనూ కూడా ఉన్నవి). తులసీ రామాయణం, విచిత్ర రామాయణం, కంబ రామాయణం అనే గ్రంథాలను గురించి వివరించడమే కాకుండా, మరికొన్ని రామాయణాలను గురించి కూడా తెలిపారు. ఆంధ్ర రామాయణ గ్రంథపరిశీలనలో వీరి ఓపికను మెచ్చుకోవాలి.

ఇక, చివర ప్రత్యేకంగా విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షాన్ని గురించి డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యంగారు విపులంగా చెప్పారు. దీన్నిగురించి జంధ్యాలవారు తమ వ్యాసంలో వివరించే ఉన్నారు. డాక్టర్ సుబ్రహ్మణ్యంగారు దీని విశిష్టతను గురించీ, విశ్వనాథ వారి రచనా సౌష్ఠవాన్ని గురించీ విశేషంగా ఉదాహరణలతో చూపడం గమనింపదగినది.

ఈ రీతిగా ఈ గ్రంథం సకల రామాయణాల సారాన్ని ఆంధ్రులకు అందచెయ్యడం ప్రశంసనీయం. దీనిని ప్రకటించిన యువభారతివారి సాహితీసేవ మెచ్చుకోదగినది.

ఇది 'రామాయణ సుధాలహరి' అగుటవల్ల 'రామాయణ విషవృక్షా'ది అధిక్షేప కృతుల ప్రసక్తి దీనిలో లేదు.

"అంగీరస"

గ్రంథ స్వీకారము

* సాయిస్తవము [శ్రీ షిరిడీసాయిబాబాని భక్తితోస్తుతిస్తూ రాసిన 116 పద్యాలు]. రచన : శ్రీ దేవత సుబ్బారావు, పేజీలు . 24, వెల : ఒక రూపాయి. ప్రకాశకులు : ఆధ్యాత్మ సాధక సమితి, 661 ఎ, ఎన్ హెచ్ 4, బి. హెచ్. ఇ.యల్; రామచంద్రపురం; హైదరాబాదు–500 032.

* హేలాంబలీలలు (పెద్దచెప్పల్లి ఎల్లమ్మ శతకము) రచన : శ్రీ చెప్పల్లి సుబ్బాశాస్త్రి, పేజీలు : 50, వెల : రు. 2, ప్రతులకు : రచయిత; యల్లారెడ్డిపల్లె అగ్రహారము, పెద్ద చెప్పల్లి పోష్టు; కడపజిల్లా.

* శ్రీ సర్వేశ్వరస్తవము (భక్తిరస బంధురములు, ఆధ్యాత్మికాశ్రయములు, వైరాగ్యభావవిలసితములు అగు పద్యములు) కృతికర్త : శ్రీ కొండేపూడి సుబ్బారావు, పేజీలు : 25, వెల : రు. 1–50; ప్రాప్తిస్థానము : గ్రంథకర్త, 47–10–5, ద్వారకానగరు; విశాఖపట్న[illegible]–16.

(I) అక్షరాక్షతలు, పేజీలు : 82, వెల : రు. 4.

(II) క్రీస్తు ప్రబంధము, పేజీలు : 63, వెల : రు. 5.

(III) వెలుగుబాట, పేజీలు : 61, వెల : రు. 5.

(IV) నా జీవిత గాథ, పేజీలు : 122, వెల : రు. 5.

పై నాలుగు పుస్తకములకు రచయిత డా.సురగాలి తిమోతి జ్ఞానానందము. ప్రతులకు : డా. జ్ఞానానందకవి, కాకినాడ.

* సంస్కృత ప్రతిభ (6 నెలల కొకసారి వెలువడే పత్రిక) ఎడిటర్ : డా॥ వి. రాఘవన్, ఒక కాపీ వెల : రు. 3, ప్రతులకు : సాహిత్య అకాడమీ; రవీంద్ర భవన్; 35, ఫెరోజ్ షా రోడ్డు; న్యూ ఢిల్లీ–1.

* దివ్యమునిత్రయము (కావ్య సంపుటి) రచయితలు : కీ. శే. శ్రీ పుత్తిరుమలై నల్లాన్ చక్రవర్తి సంపత్కుమార జగన్నాథ తిరువేంకటాచార్యర్, కీ. శే. శ్రీమాన్ బూరుగడ్డ కందాళ రంగ రాజాచార్యులు; పేజీలు : 248; వెల : రు. 10. ప్రకాశకులు: శ్రీ గోదా గ్రంథమాల, ముసునూరు, కృష్ణాజిల్లా

* పూర్ణాహుతి (ఆర్యవైశ్య దంపతుల ఆత్మార్పణ గాథ) రచన : శ్రీ ముదివర్తి కొండమాచార్యులు, పేజీలు:100. వెల : రు. 6. ప్రతులకు : గ్రంథకర్త, గూడూరు, నెల్లూరు జిల్లా.

* మల్లికార్జున ! జేజే !! (పద్యకావ్యం) రచయిత : శ్రీ ము[illegible] మూడి లక్ష్మినరసింహారావు, పేజీలు : 8, ఉచితప్రతులకు శ్రీ ఎమ్. ఎమ్. ఎల్. నరసింహారావు; తురిమెర్ల (పోస్టు) గండవరం (ఎస్. ఒ) నెల్లూరుజిల్లా – 524 317.

* సృజన [మాస పత్రిక] పరిటాల శ్రీరాములు సంస్మర[illegible] సంచికగా 25 నెలల తరువాత మళ్ళీ ఆగస్టు 197[illegible] సంచికతో వెలువడింది. ఎడిటర్ : శ్రీమతి పి. హేమల[illegible] వర్కింగ్ ఎడిటర్ : శ్రీ వరవరరావు; నిర్వహణ : 'సాహి[illegible] మిత్రులు' సంవత్సర చందా : రు. 15. చిరునామా[illegible] ఎడిటర్, సృజన; వెంకట్రమణముద్రణాలయం; వరంగల్

* వాణీ విహారము (పద్యకావ్యం) : రచన : శ్రీ బూరా[illegible] గున్నేశ్వరశాస్త్రి, పేజీలు : 115, వెల : రు. 3. ప్ర[illegible]లకు : రచయిత, గుప్తావీధి, భీమునిపట్టణం; విశాఖపట్న[illegible] జిల్లా.

* సీతారామ శతకము : రచన : శ్రీ అన్నావజ్ఝల [illegible] రమణయ్య, పేజీలు : 22, వెల : ఒక రూపాయి. ప్ర[illegible]లకు : రచయిత; తెలుగు పండితులు, ప్రభుత్వ జూని[illegible] కళాశాల; టంగుటూరు, ప్రకాశంజిల్లా.

* శ్రీ యతిరాజవైభవము: (భక్తిరసపూరితమైన [illegible]ము) రచన : శ్రీ మాడభూషి వేంకట శేషాచా[illegible] పేజీలు : 74, వెల : రు. 2–50. ప్రా[illegible] రచయిత, అడ్వకేట్, 2/7 బ్రాడీపేట, గు[illegible] 522 0[illegible]2.

* మార్పు (సాహిత్య కరపత్రిక) : రెండవ బ[illegible] పావలా. పేజీలు : 12. చిరునామా : 1–4–168, న్యూటౌన్, మహబూబ్‌నగర్-

* Drems colony (ఇంగ్లీషు) రచన : [illegible] పేజీలు : 43, వెల: 10 కాపీలు రు. 1[illegible] సాహిత్య నవపంథా; 7.7.7., గుట్టలబజార్; [illegible]

* గీతామృతము. రచన : శ్రీ కుంటిమద్ది శేషశర్మ 200. వెల: రు. 10. ప్రతులకు : రచయిత; 4వ అడ్డరోడ్డు; రెండవరోడ్డు; అనంతపురం.

* శంభూ నక్షత్ర మాలిక, (పద్యకావ్యం) ర[illegible] శ్రీ కస్తూరి విశ్వేశ్వరరావు; పేజీలు: 8, వెల : ఉ[illegible] ప్రతులకు : రచయిత; స్టాటిస్టికల్ ఆఫీసర్–కృష్ణా[illegible] మచిలీపట్నం 521002.

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Pa[illegible]ik Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 7522[illegible].